కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం
అస్తిత్వములో ఉన్న పరిస్థితులన్నింటినీ బలప్రయోగంతో కూలదోయడం ద్వారానే
తమ లక్ష్యాలను సాధించుకోగలమని వారు బహిరంగంగానే ప్రకటిస్తారు
కమ్యునిష్టు విప్లవమంటే పాలక వర్గాలు గజగజ వణకనీ..
కార్మికులు పోగొట్టుకొనే దేమీ లేదు, తమ సంకెళ్ళు తప్ప
వారికి..

# జయించేందుకో ప్రపంచం ఉంది



ప్రకాష్ కరత్
ఐజాజ్ అహమ్మద్
ప్రభాత్ పట్నాయక్
ఇర్ఫాన్ హబీబ్

83332

# జయించేందుకో
# ప్రపంచం ఉంది

For

*E.M.S. NAMBOODRIPAD*

English Title : **A World to Win**

Essays on Communist Manifesto

Publisher : Left Word Books

Individual essays©1999, respective authors
This collection ©1999, Left Word Books
Telugu publication©Prajasakti Book House

# జయించేందుకో ప్రపంచం ఉంది

## కమ్యూనిస్టు ప్రణాళికపై వ్యాసాలు


రచన

ఐజాజ్ అహమ్మద్

ఇర్ఫాన్ హబీబ్

ప్రభాత్ పట్నాయక్

సంపాదకులు : ప్రకాష్‌కరత్



ప్రచురణ

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-298/4, స్ట్రీట్ నెం.1

అశోక్‌నగర్, హైదరాబాద్-20

వెల : రు. 45/-
ప్రచురణ నెం. : 583
ప్రచురణ కాలం : మే 2000
ప్రతులు : 2000

తెలుగుసేత : వి. శ్రీహరి
రాచమల్లు రామచంద్రారెడ్డి

335.4
ఆర్థశాస్త్రం

ప్రతులకు:

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

కారల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ-520002 ఫోన్: 432792
1-8-52/2, శ్రీరామాకాంప్లెక్స్, చిక్కడపల్లి, హైదరాబాద్-20, ఫోన్: 7608117
షాప్ నెం.13, పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్, కె.జి.హెచ్.డౌన్, విశాఖపట్నం-2.
సుందరయ్యభవన్, బాలాజీనగర్, ఖమ్మం-507001.
5, ఎ.జి.కె.కాంప్లెక్స్, గాంధీరోడ్డు, తిరుపతి-517501.
6-2-250, విజయటాకీస్ రోడ్డు, చౌరస్తా, హన్మకొండ-506011.
సుందరయ్యభవన్, సుభాష్ విగ్రహం (ఎదుట), నల్గొండ.

C14679

సుందరయ్య గ్రంథాలయ
AC 83332
హైదరాబాద్-500 044

# విషయ సూచిక


1. ప్రవేశిక 1
   – ప్రకాష్‌కరత్

2. తన కాలంలోనూ, మన కాలంలోనూ కమ్యూనిస్టు ప్రణాళిక 13
   – ఐజాజ్ అహమ్మద్

3. కమ్యూనిస్టు ప్రణాళికలో చరిత్ర అధ్యయనం 46
   – ఇర్ఫాన్ హబీబ్

4. 150 సంవత్సరాల అనంతరం కమ్యూనిస్టు ప్రణాళిక 63
   – ప్రభాత్ పట్నాయక్

5. కమ్యూనిస్టు ప్రణాళిక 81
   – కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్
   అనువాదం : రాచమల్లు రామచంద్రారెడ్డి

6. భారతదేశంలో ప్రణాళిక ప్రచురణ చరిత్ర 136

ప్రకాష్‌కరత్

# ప్రవేశిక

కమ్యూనిస్టు ప్రణాళిక ప్రచురించి నూటయాభై సంవత్సరాలైంది. ఆ వార్షికోత్సవ ముగింపు సందర్భంగానే *ప్రణాళిక*పై ఈ పుస్తకం ప్రచురిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా 1998 ఫిబ్రవరి నుండి ఈ వార్షికోత్సవం జరుగుతోంది. ఎంతో ప్రాముఖ్యత కల్గింది ఈ పత్రం. దాని చారిత్రక ప్రాముఖ్యతను పునరంచనా కట్టేందుకు ఈ సందర్భాన్ని ప్రపంచమంతా వినియోగించుకుంటున్నది. ఆ పునస్సమీక్షలో ఈనాటి మార్క్సిస్టు సిద్ధాంతపుస్థితిని విమర్శనాత్మకంగా అంచనా వేస్తున్నారు. 21వ శతాబ్దిలోకి అడుగిడబోతున్న సమయంలో కార్యవర్గ ఉద్యమం చేపట్టవలసిన నూతన మార్గాల అన్వేషణ జరుగుతోంది.

*ప్రణాళిక* కార్యక్రమానికి సంబంధించిన మొదటి కమ్యూనిస్టు పత్రం. మార్క్స్-ఏంగెల్స్‌ల ఆలోచనల పరిణామక్రమంలో చారిత్రక భౌతికవాదాన్ని పరిణిత రూపంలో వివరించిన గ్రంథం అది. దాని ప్రాధాన్యతను లెనిన్ ఈ విధంగా క్రోడీకరించారు:

"ఒక మహామేధావికి గల స్పష్టతతో, మేధాశక్తితో ఒక నూతన ప్రపంచ దృక్పథాన్ని - నికరమైన భౌతికవాదాన్ని ఈ రచన వివరిస్తుంది. అది సామాజిక జీవితాన్ని ఇముడ్చుకుంది. సంపూర్ణమైన, అత్యంత ప్రభావంగల అభివృద్ధి సిద్ధాంతంగా గతి తర్కాన్ని వివరిస్తుంది. వర్గపోరాట సిద్ధాంతాన్ని, ఒక నూతన కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించే కార్మికవర్గపు ప్రపంచవ్యాప్త చారిత్రక పాత్రను విశదీకరిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యతిరేక విప్లవానికి రూపొందించిన విప్లవాత్మక కోర్కెల పత్రం "*ప్రణాళిక*". కార్మికవర్గ సమాజంలోని ఇతర పీడితవర్గాలను సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజమనే ప్రత్యామ్నాయ దృక్పథంతో అది శక్తివంతులను చేస్తుంది. అంతవరకు ప్రపంచంలో వున్న ఊహాజనిత, పెటీబూర్జువా సోషలిజంలు ప్రవచించిన కార్యక్రమాలకు భిన్నంగా సమాజంలోని వాస్తవ పరిస్థితులు, చారిత్రకాభివృద్ధి ఆధారంగా పెట్టుబడిదారీ విధానాన్ని కూలద్రోసి, సోషలిజం సాధించే మార్గాన్ని "ప్రణాళిక" రూపొందించింది. బూర్జువా వర్గ గోరీని త్రవ్వగల ఏకైక విప్లవకరవర్గంగా కార్మికవర్గాన్ని కేంద్రపాత్రలో నిలబెడుతుంది '*ప్రణాళిక*', 'దోపిడీనుండి మొత్తం సమాజాన్ని విముక్తి చేయకుండా' 'కార్మికవర్గం ఇక ఏమాత్రం తనను తాను విముక్తి చేసుకోలేదని' అది ప్రకటిస్తుంది.

---

1 లెనిన్- కలెక్టెడ్ వర్క్స్, 21 పుట 48

శాస్త్రీయమైన సిద్ధాంతశక్తితో, విప్లవకర ఉద్యమ మౌలిక వ్యూహం జతగూడడంలోనే 'ప్రణాళిక' యొక్క నిత్య నూతనత్వం ఇమిడివుంది. సంక్లిష్టమైన సిద్ధాంతాన్ని స్పష్టంగా, సూక్ష్మీకరించి సాధారణ కార్మికునికి సహితం అర్థమయ్యేలా వివరిస్తుంది. కమ్యూనిస్టు ఉద్యమ రచనలో అత్యంత శక్తివంతమైన రచనగా కలకాలం నిలుస్తుంది 'ప్రణాళిక'.

ఫ్రెంచి కార్మికుల ఫిబ్రవరి తిరుగుబాటుతో మొదలైన చారిత్రక కాలానికి సంబంధించింది 'ప్రణాళిక'. విఫలమైన విప్లవం తరువాత రెండు దశాబ్దాలకు పారిస్ నగర కష్టజీవులు 1871లో పారిస్ కమ్యూన్‌ను ఏర్పర్చారు. అది కొద్దికాలమే నిలిచింది. కార్మికోద్యమంలోని ఈ రెండు చారిత్రక ఘట్టాలమధ్యకాలంలో మార్క్స్-ఏంగెల్స్‌లు శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి పరిపూర్ణ రూపం యిచ్చారు. పెట్టుబడి (ఒకటవ భాగం) 1867లో దర్శనమిచ్చింది. పెట్టుబడిదారీ విధానాన్ని పరిపక్వంగా విశ్లేషించడంలో అది ప్రాధాన్యత నొందింది. 1864లో శ్రమజీవుల అంతర్జాతీయ అసోసియేషన్ ఏర్పాటైంది. వర్గచైతన్యపూరితమైనశక్తిగా కార్మికవర్గాన్ని సంఘటిత పరిచే విషయంలో మార్క్స్, ఏంగెల్స్‌ల బావాలు అత్యంత వేగంగా అభివృద్ధి అయి వ్యాప్తి చెందాయి. ఈ పరిణామాలు ఈకాలంలోనే జరిగాయి. ఇదేకాలంలో 'ప్రణాళిక'లో కనిపించీ, కనిపించకుండా వున్న వలససమస్యపట్ల, భారతదేశంతో సహా వారిలో ఆసక్తి పెంపొందింది గూడా ఈ కాలంలోనే.

ప్యారిస్ కమ్యూన్ ఓటమి అనంతరం ఆ తరువాతి విప్లవ వెల్లువకోసం మార్క్స్, ఏంగెల్స్‌లు రష్యావైపు చూడసాగారు. 1882లో 'ప్రణాళిక' రష్యన్ ముద్రణ వెలువడింది. మార్క్స్, ఏంగెల్స్‌లు సంయుక్తంగా ఆ ముద్రణకు ముందుమాట రాశారు. 'పశ్చిమంలో జరిగే కార్మికవర్గ విప్లవ చిహ్నంగా' రష్యన్ విప్లవాన్ని వారు చూపారు.

పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి సిద్ధాంతంలో లెనిన్ వివరించిన సామ్రాజ్యవాద భావం ప్రధానమైన ముందడుగు. 1917 రష్యన్ విప్లవానికి రంగం సిద్ధం చేసిన సమీకృత సిద్ధాంతపు ద్వితీయ శిఖరంగా దానిని ప్రభాత్‌పట్నాయక్ తన వ్యాసంలో అభివర్ణించారు. రష్యాలో నూతన యుగాన్ని సృష్టించిన ఘటన ఆవిష్కరించిన పరిణామ క్రమాలతో ప్రణాళిక సందేశం నిజంగానే ప్రపంచవ్యాప్త సిద్ధాంతమైంది.

1948లో 'ప్రణాళిక' శతవార్షికోత్సవం జరిగినపుడు ప్రపంచం మరొక విధంగా వుండింది. సోవియట్ యూనియన్ అనేక వీరోచిత త్యాగాలతో ఫాసిజం ఓటమికి సాధనమైంది. చైనా విప్లవ విజయాన్ని ఆహ్వానించేందుకు ప్రపంచం సిద్ధమైవుండింది. వియత్నాం, కొరియా విప్లవాల పురోగమనం చూసింది. తూర్పు యూరోప్‌లో 'జనతా ప్రజాస్వామికాలు' ఏర్పడ్డాయి. జాతీయ విముక్తి ఉద్యమాలు వెల్లువెత్తాయి. ఇవన్నీ రెండవ ప్రపంచ యుద్ధ అనంతర యుగంలో భాగాలే. సోవియట్ యూనియన్‌లో సోషలిస్టు ప్రయోగం ముగియడం ఆయుగాంతానికి చిహ్నం. ప్రపంచ వ్యాప్త ప్రతీఘాతం తలెత్తడంతో ప్రగతిశీల పరిణామాల క్రమం నిలిచిపోయింది. 80వదశకం చివరినాటికి తన ఉనికికి అత్యంత గొప్ప సవాలు ఎదురైంది మార్క్సిజానికి. సైద్ధాంతిక - ఆచరణాత్మక రాజకీయ రంగాలు రెండింటిలో దాని ప్రాధాన్యతకు సవాలు ఏర్పడింది.

సోవియట్ పతనమయ్యాక గత ఏడు సంవత్సరాలలో సోషలిజపు అస్తమయం గురించి, మార్క్సిజానికి కాలం చెల్లిందని సామ్రాజ్యవాద శక్తులు. వారి సిద్ధాంతవేత్తలు ఈకాలమంతా విడవకుండా ప్రచారం సాగిస్తున్నారు. ఈ సైద్ధాంతిక దాడితోపాటు, ప్రపంచంలో ప్రతిప్రాంతంలో చొరబడేందుకు, తన ప్రభావాన్ని పరిపుష్టం చేసుకునేందుకు అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి కృతనిశ్చయంతో సాగించిన తీవ్ర ప్రయత్నమూ జరిగింది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలన్నిటా గల కార్మికవర్గంపై సాగుతున్న తీవ్రదాడికి 'ప్రపంచీకరణ' అని పేరు పెట్టారు. కొన్ని కమ్యూనిస్టు పార్టీలు దిగజారిపోయి తమ సిద్ధాంత మార్గదర్శిగా మార్క్సిజాన్ని వదిలేసే క్రమంగా ఈ రెండు ఘటనల ప్రభావం పరాకాష్టకు చేరింది.

ఇలాంటి స్థితిలో ప్రణాళిక నూట యాభై సంవత్సరాల వుత్సవం కొద్దిపాటి సమకాలీన ప్రాధాన్యతకలిగివున్న ఒక చారిత్రక పత్ర సంస్మరణగా జరిగి వుండాలి. లేదా శాస్త్రీయ సోషలిజంలో ఆ మహత్తర పత్రం ఎలా, ఎక్కడ పొరబడిందో శవపరీక్షకు పూనుకునేవిధంగానైనా జరిగి వుండాలి. కాని జరుగుతున్నది వేరు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని దెబ్బతీసేందుకు అనువైన లొసుగులు ఏమిటి? ప్రపంచీకరణ చెందిన పెట్టుబడిదారీ విధానం గురించి మార్క్స్ విశ్లేషణ ఈనాటికీ ఎంత ఖచ్చితమైన, స్పష్టమైన అవగాహన కలిగిస్తుంది అనే విషయాలపైన ఈ సందర్భంలోగా కేంద్రీకరణ సాగుతున్నది. ఆగ్నేయాసియా ద్రవ్య వ్యవస్థ కూలిపోవడంతో ప్రారంభమైన సంక్షోభపు వ్యాప్తికి 1998 సాక్షీభూతమైంది. అది అతి త్వరలోనే తూర్పు ఆసియాకు విస్తరించింది. దక్షిణ కొరియాను దెబ్బతీసింది. ప్రపంచంలోనే రెండవ శక్తివంతమైన ఆర్థిక విధానం జపాన్‌ది. అంతటి ఆ దేశం ద్రవ్య యిబ్బందులలో, ఉత్పత్తి మాంద్యపు ఊబిలో కూరుకపోయింది. రష్యాలో ఆర్థికరంగం కూలిపోయింది. దానివెనకే బ్రెజిల్‌లో అస్థిరత వచ్చింది.

ఈ విషాదకర చిత్రం ఏర్పడడంతో పెట్టుబడిదారీ వర్గాలలో దిగ్విజయభావం ఆవిరైపోయింది. ప్రపంచీకరణను గట్టిగా ప్రబోధించిన వారిలోనే సందేహాలు తలెత్తాయి. అంతర్జాతీయ ద్రవ్యసంస్థ అనుసరిస్తున్న విధానాలపట్ల నింద, విమర్శలు తలెత్తాయి. "స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం ఎదుర్కొంటున్న నేటి విమర్శల పరంపర ప్రచ్ఛన్న యుద్ధానంతరంఆ సిద్ధాంతం ఎదుర్కొన్న అతిపెద్ద సవాలు" అని "వాల్ స్ట్రీట్ జర్నల్" పేర్కొంది.[2] ఇందుకు భిన్నంగా 90వ దశకం మధ్యనుండి కార్మికవర్గ పోరాటాలు నూతన జవసత్వాలు సంతరించుకున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలన్నిటా కార్మికవర్గం దీర్ఘకాలం దాడులను ఎదుర్కొన్నది. అయితే కార్మికవర్గం ప్రతిఘటనా శక్తిని పెంపొందించుకునేక్రమంలో 1995 ఫ్రెంచి కార్మికుల సమ్మె ఒక మూల మలుపు.

'ప్రణాళిక' నూట యాభయ్యవ వార్షిక సభలు ఈ పూర్వరంగంలో జరిగాయి. వందలాదిగా సభలు, చర్చాగోష్టులు, ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా, 1998 మేలో పారిస్‌లో జరిగిన సభ వీటిలో ప్రత్యేకంగా పేర్కొనదగింది. ఆ సభలో వివిధ రాజకీయ పార్టీలు,

---

2. 1998 సెప్టెంబరు 4 న్యూలెఫ్ట్ రివ్యూలో ప్రచురించిన "ది బాటిల్ ఓవర్ కాపిటల్స్" అనే వ్యాసాన్ని రాబర్ట్ లీడ్, ఫ్రాంక్ వెనరోసోలు ఉల్లేఖించారు

ట్రేడ్ యూనియన్లు, సామాజిక ఉద్యమాల నుండి ఆహ్వానించిన 1500 మందిప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ అంశాలపై మూడు వందలకు పైగా పత్రాలు ప్రవేశపెట్టారు. ఆ పత్రాలలోని వివిధ అంశాలను వివరించడం ఇక్కడ అసాధ్యం వివిధ సభలలో సమావేశాలలో, గోష్టులలో జరిగిన చర్చల సారాంశాన్ని వ్యక్తిమైన అభిప్రాయాలను, వాటిని వ్యక్తీకరించిన తీరును 1999 ఫిబ్రవరిలో ఒక్కసారి విశదంగా పరిశీలిస్తే ప్రత్యేకంగా పేర్కొనదగిన లక్షణం ఒకటి కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. 1991 నుండి మార్క్సిజం అనుయాయులలో ఆవరించిన నిస్సహాయత రేఖామాత్రంగా కూడా లేకుండాపోయిందనేదే ఆ ప్రత్యేక లక్షణం. ఆత్మ విమర్శ వీటన్నిటి మౌలిక సారాంశం. అయినా సిద్ధాంతం పునరుద్భవం, ఆచరణాత్మక కృషిపై విశ్వాసం అంతకంతకూ పెరుగుతోంది అనే విషయం స్పష్టమైంది.

ఈ వార్షికోత్సవ సందర్భంగా భారతదేశంలోనూ సాగిన మేధోకృషి, జరిగిన చర్చలను పరిశీలించేందుకు ముగ్గురు మార్క్సిస్టు మేధావులను ఈ పుస్తకానికి తమ రచనలను అందించ వలసిందిగా కోరాము. (అ) మార్క్స్ ఏంగెల్స్‌ల ఆలోచనా స్రవంతిలో 'ప్రణాళిక'స్థానం (ఆ) మార్క్సిస్టు సిద్ధాంతంలో ఆ పత్రం ప్రాధాన్యత (ఇ) భవిష్యత్ సిద్ధాంత, కార్యాచరణలకు మార్గదర్శకంగా 'ప్రణాళిక' పాత్ర పట్ల గల ఆలోచనలు అనే కోణంనుంచి ఈ మూడు వ్యాసాలు రూపొందాయి. 'ప్రణాళిక'లో చరిత్రను గురించిన అవగాహన, ఆ తరువాత దాని పరిణామాలను ఇర్ఫాన్ హబీబ్ వివరించారు నూతన శిఖరాలను అధిరోహించే విధంగా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పునరావిష్కరించి నిర్మించాల్సిన కర్తవ్యాన్ని ప్రభాత్ పట్నాయక్ వక్కాణిస్తారు. అందుకోసం ఆయన ఈనాటి ప్రపంచ ఆర్థికరంగంలో నూతన పరిణామాలను విశ్లేషించారు. వాటిని శ్రద్ధగా పరిశీలించవలసిన అవసరాన్ని వివరించారు. 'ప్రణాళిక'లో పొందుపరిచిన సంక్లిష్టమైన విప్లవకర భావాలను సుబోధకంగా వివరించారు అయిజాజ్ అహమ్మద్. ఆర్థిక నిర్మాణం, దానితో కలిసివుండే రాజకీయ, సాంస్కృతిక రంగాలపై ఆ విప్లవ భావాల ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేశారు.

మార్క్స్ స్వయంగా పూర్తిచేసిన 'పెట్టుబడి' గ్రంథపు మొదటిభాగం వరకు పెట్టుబడిదారీ అభివృద్ధి సిద్ధాంతపు వివరణలో వలసవాదం గురించిన వివరణ తగినంతగాలేదనే విషయం ఎంతో ఆలోచనాస్ఫోరకమైన ఈ మూడు వ్యాసాలు మనదృష్టికి తెస్తాయి. సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణంలో ఎదురైన అనుభవాలను ఆకళింపు చేసేకునే సమస్యను ఈ పుస్తకంలోని వ్యాసాలు చేపట్టలేదు. . మార్క్సిస్టు సిద్ధాంత, ఆచరణలను పరిశీలించి, వాటికి నూతన జవసత్వాలను కలిగించే కృషిలో అది తప్పక జరగాల్సినభాగం. ఇందుకు ప్రత్యేకమైన, విస్తృతమైన కృషి అవసరం.

## II

'ప్రణాళిక'లో వివరించిన పెట్టుబడిదారీ విధానం ఈనాటి పెట్టుబడిదారీ విధానంతో ఆశ్చర్యకరమైన పోలిక కలిగివుంది. ఈ లక్షణాన్ని మార్క్సిస్టులు, మార్క్సిస్టేతరులు కూడా గమనించారు. 'ప్రణాళిక'లో పెట్టుబడిదారీ సంబంధాల విస్తరణకు సంబంధించిన భాగాలు,

20వ శతాబ్దపు చివర భాగంలో ఎదురౌతున్న 'ప్రపంచీకరణ చెందిన పెట్టుబడి'ని ఎంతో వివేకవంతంగా స్పష్టంగా పేర్కొన్నాయి. ఈ మార్పును సందర్శించాయి. 'తన ఉత్పత్తులకు నిరంతరం మార్కెట్ విస్తరించవలసిన అవసరం, బూర్జువా వర్గాన్ని భూమి నలుమూలలకూ తరుముతుంది. అది ప్రతి చోటా గూడుకట్టుకోవాలి. ప్రతిచోటా స్థిరపడాలి. ప్రతిచోటా సంబంధాలను ఏర్పర్చుకోవాలి' అని ప్రణాళిక చెప్పింది.

1848నాటి రచనలో పెట్టుబడిదారీ విధానం గురించిన విశ్లేషణ పూర్తి కాలేదు. ఆ విశ్లేషణ ముందుకుసాగి 'పెట్టుబడి'లో పరిపక్వత చెందింది. ఆ తరువాత కాలంలో లెనిన్ రచన 'సామ్రాజ్యవాదం' కమ్యూనిస్టు ఉద్యమానికి నూతన చొరవలను అందించింది. సామ్రాజ్యవాద వ్యవస్థలో ఆనాటినుండి వచ్చిన పరిణామాలు, ఈ శతాబ్దపు చివరి రెండు దశకాలలో ప్రత్యేకించి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి చట్టా విధానం పెరిగిన తీరు, మార్క్సిస్టు సిద్ధాంతానికి, ప్రపంచవ్యాప్తంగా గల కార్మికోద్యమాలకు ఆందోళనకరమైన ఒక ప్రధానాంశం.

ప్రపంచీకృత సామ్రాజ్యవాద విధానంలో జాతీయ రాజ్యపు పాత్ర ఏమిటనే నిర్దిష్ట సమస్యను ఈ పరిస్థితి ముందుకు తెచ్చింది. కార్మిక వర్గ పోరాటాలపై ఈ సమస్య ప్రత్యక్ష ప్రభావం చూపిస్తుంది. చట్టా ద్రవ్య పెట్టుబడి అవధులు లేకుండా సరిహద్దులను అధిగమిస్తోంది. కనుమూసి తెరిచేలోగా కనపడి, తప్పిపోవడం దాని లక్షణాలు. ఆ పెట్టుబడి దేశాలపై తెచ్చే డిమాండ్ల దృష్ట్యా చట్టా ద్రవ్య పెట్టుబడిని క్రమబద్ధీకరించే చర్యలను ఏ జాతీయ రాజ్యము చేపట్టలేని నిస్సహాయస్థితి ఎదురవుతున్నది. తమ సార్వభౌమాధికారం క్రమేపీ తరిగిపోతున్నది. ఈ విధమైన ద్రవ్యపెట్టుబడి స్వభావం, దాని అపూర్వ పెరుగుదల విషయాలలో మనం ఇక్కడ కూరుకుపోనవసరం లేదు. అయితే అలాంటి ద్రవ్య పెట్టుబడుల రాకపోకల మూలంగా జాతీయ రాజ్యాంగాలు ఎదుర్కొంటున్న అపారమైన ఇబ్బందులను గుర్తించడం అత్యవసరం. ఈ దోపిడీ పూరిత నిధుల చొరబాటును అవి అడ్డుకోలేకుండా వున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యసంస్థ, ప్రపంచబ్యాంక్ కూటమి ప్రపంచవాణిజ్య సంస్థద్వారా ఆ నిధులు రుద్దుతున్న విధానాలను అవి తిప్పికొట్టలేకపోతున్నాయి. జాతీయ రాజ్యం అనే ఆ వ్యవస్థ ద్వారా, వర్గ పోరాటానికి జాతీయ రాజ్యాంగాన్ని కేంద్ర బిందువు చేయడం ద్వారా పైపెట్టుబడి తెచ్చిపెడుతున్న ప్రమాదకరధోరణులను ఎదుర్కోగలమా అనేది కీలకమైన ప్రశ్న.

ఇందుకు, వర్గ పోరాట రంగంగా జాతీయ రాజ్యాంగపు పాత్రను సరిగా అంచనా వేయడం అవసరం. పెట్టుబడిదారీ కార్యకలాపాల అంతర్జాతీయస్వభావాన్ని వివరించిన 'ప్రణాళిక' అదే సమయంలో దేశాలలో అంతర్గతంగా సాగవలసిన వర్గ పోరాటాల ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. 'సారాంశంలో కాకున్నా, రూపంలో కార్మికవర్గం బూర్జువా వర్గంతో సాగించే పోరాటం మొదట జాతీయ పోరాటమే. ప్రతి దేశపు కార్మికవర్గము తన స్వంత బూర్జువా వర్గంతో తన తగాదాలను ముందుగా పరిష్కరించుకోవలసి వుంటుందనేది సహజమే' అని ప్రణాళిక పేర్కొంది. నూటయాభై సంవత్సరాల అనంతరం కూడా పెట్టుబడి అంతకంతకూ ఎక్కువగా అంతర్జాతీయ స్వభావం పొందిన ఈనాటికి సహితం ఈ సూత్రం వర్తిస్తుంది.

ఈ సందర్భంగా తక్కువగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల పాలకవర్గాల పాత్రను అవగాహన చేసుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం. ఇలాంటి అత్యధిక దేశాలలో బూర్జువా–భూస్వామ్య వర్గాలు, సాపేక్షికంగా స్వీయమార్గాన పెట్టుబడిదారీ విధానాన్ని తమ తమ దేశాలలో అభివద్ధి చేసుకోవాలనే ఆకాంక్షను విసర్జించి, స్వేచ్ఛా మార్కెట్ పరిష్కారాలను ఆలింగనం చేసుకున్నాయి. ఒక ప్రత్యర్థిశక్తిగా సోవియట్ యూనియన్ లేకుండాపోయినందున, తమ వర్గ అభివృద్ధికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి యొక్క ప్రపంచ వ్యవస్థతో మిళితం కావడం ఒక్కటే మార్గంగా పాలకవర్గాలు భావిస్తున్నాయి. అయితే ఇది శాశ్వతమైన ధోరణిగా వుండజాలదు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో వైరుధ్యాలు, తీవ్రతరమయ్యే కొద్దీ, స్థానిక పాలకవర్గాల వైఖరిలో మార్పులు వస్తాయి.

అంతర్జాతీయ పెట్టుబడుల రాకతో జాతీయ రాజ్యాలు దెబ్బతినే అవకాశాలు గణనీయంగానే వుంటాయి. అయితే ఈ పరిస్థితిని ఆయా జాతీయ రాజ్యాలు నిస్సహాయమైపోయాయి అనేంత అతిశయోక్తిగా చిత్రించకూడదు. పెట్టుబడి స్వేచ్ఛాప్రవేశానికి ద్వారాలు తెరవకుండా ఏ దేశమూ మనలేదని, అభివృద్ధి చెందదని అంతర్జాతీయ ద్రవ్యసంస్థ–ప్రపంచబ్యాంకులు సిద్ధాంతీకరిస్తున్నాయి. కాని అన్నిటినీమించి ఆగ్నేయాసియా సంక్షోభం, అలాంటి అవధులు లేని పెట్టుబడుల ప్రవాహం ఎంత పొరపాటో తెలిపే నిదర్శనంగా నిలిచింది. ద్రవ్య పెట్టుబడి స్వైరవిహారాలను క్రమబద్ధీకరించేందుకు, ఆ దోపిడీని అంతర్జాతీయ వేదికలలో చర్చనీయాంశంగా తెచ్చేందుకు ఈనాటికి అందుబాటులో వున్న సాధనం జాతీయ రాజ్యాంగమేనని కూడా ఆ సంక్షోభం రుజువు చేసింది. మలేషియాలో మహాతిర్ ప్రభుత్వం నగ్నమైన పెట్టుబడిదారీ పాలనే. అయినా ఆ దేశం పెట్టుబడిపై ఆంక్షలు విధించి, ఫండ్–బ్యాంకుల సనాతనత్వాన్ని సవాలుచేసింది. ఇది ఒక ఉదాహరణ.

అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ఆదేశాలను అమలు జరిపేందుకై జాతీయ రాజ్యాన్ని, దాని యంత్రాన్ని వినియోగించుకునేందుకు స్థానిక పాలకవర్గాలకు అవకాశం ఇవ్వరాదు.[3] శ్రామిక ప్రజల తక్షణ ప్రయోజనాల పరిరక్షణకు, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రభుత్వ విధానాల మార్గాన్ని మరోదారి పట్టించేందుకు కృతనిశ్చయంతో పోరాడాలి. ఈ పోరాటంలో ప్రజలందరికీ కార్మికవర్గం నాయకత్వం వహించాలి. తన రాజకీయాధిక్యతను సాధించుకోవాలంటే కార్మికవర్గం జాతినేతవర్గంగా తలెత్తాలని, తనను తాను జాతిగా రూపొందించుకోవాలని ప్రణాళిక చేసిన ప్రబోధాలలో ఇమిడివున్నది ఈ అంశమే. దేశాలను లొంగదీసుకోవాలనే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వాన సాగే

---

3 ప్రభాత్ పట్నాయక్, అయిజాజ్ అహమ్మద్‌లు ఇద్దరూ జాతీయ రాజ్యాంగాలు–ప్రపంచీకరణల గురించి రాశారు. 1996 నవంబరు–డిసెంబరు నెలల 'సోషల్ సైంటిస్టు' పత్రికలో ప్రచురించిన 'పెట్టుబడి ప్రపంచీకరణ–సామ్రాజ్యవాద సిద్ధాంతం' అనే వ్యాసం 1996 జనవరి 'సెమినార్' పత్రిక 437లో ప్రచురించిన అయిజాజ్ అహమ్మద్ 'ప్రపంచీకరణ–జాతీయ రాజ్యాంగము' అనే వ్యాసాన్ని చూడండి

ప్రజాతంత్ర ఉద్యమ బలం పెరిగే కొలదీ జాతీయ శక్తుల బలాబలాల పొందికలో మార్పువస్తుంది స్థానిక పాలకవర్గాల సామ్రాజ్యవాద అనుకూల మార్పును అదుపుచేసి, ఎదురించేందుకు మార్గం సుగమమౌతుంది.

వర్గపోరాటం ప్రధానంగా జాతీయ రాజ్యపు పరిధిలోనే సాగుతుంది. అది అంతర్జాతీయతకు విరుద్ధంకాదు. ఆ భావాన్ని నిరాకరించదమూకాదు. స్థానికవర్గాల, ప్రజల ప్రాధాన్యతలననుసరించి చర్యలు తీసుకునేందుకు పాలకవర్గాలను అనుమతించకుండా, తన విధానాలను అమలు జరిపేలాగా జాతీయ రాజ్యాంగంపై అది తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నది ఈనాటి సామ్రాజ్యవాదం. జాతీయ సార్వభౌమాధికారం నష్టపోవడం, ప్రజలు తమ సార్వభౌమాధికారం కోల్పోయేందుకు ప్రత్యక్షంగా దారితీస్తుంది. వారి హక్కులన్నీ నష్టపోతారు. ప్రజల సార్వభౌమాధికారం జాతీయ రాజ్యం– దాని ప్రజల ప్రజాస్వామిక సంస్థల ద్వారా వ్యక్తీకరింపబడుతుంది నష్టపోయే సార్వభౌమాధికారం ఆర్థికరంగానికి మాత్రమే పరిమితంకాదు. అది రాజకీయ సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని కూడా వమ్ము చేస్తుంది. విద్య, ఆరోగ్య, సామాజిక భద్రతా రంగాలలో ప్రజాహక్కులను హరించి కుదిస్తుంది.

ఈనాడు భారతదేశంలో ఎదురయ్యే సమస్య సరిగ్గా ఇదే. మూడవ ప్రపంచ రాజ్యాలలో, సాపేక్షికంగా బాగా అభివృద్ధి చెందిన బూర్జువావర్గం భారతదేశంలో వుంది. ఒక రిపబ్లికన్ రాజ్యాంగం వుంది. లోప భూయిష్టమైనదే అయినా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కొనసాగేందుకు ఈ రాజ్యాంగం హామీ కలిగిస్తోంది. 1990లలో భారత పాలకవర్గాలు ఆలింగనం చేసుకున్న "ప్రపంచీకరణ" అంశం ఈ ప్రజాస్వామ్యం పద్ధతి తీరుపై ప్రత్యక్షదాడులకు ద్వారాలు తెరిచింది.

మనదేశంలో ప్రజాస్వామ్య రూపాలుగల రాజకీయ విధానం అసమానత, నిరంకుశత్వాలకు నిలయమైన ఆర్థిక నిర్మాణం కూడా వున్నాయి. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలకు విలక్షణంగా వుండే అంశాలవి. ఈ రెంటి మధ్య అంతరం అనే నిరంతరం వెంటాడే లక్షణం కూడా భారతదేశంలో వుంది.[4] ఈ పరిధిలోనే మరొక అంతరం గూడా ఆవిర్భవించింది. ప్రజలతీర్పుకు – ప్రభుత్వ నిర్ణయాల రూపకల్పనకు మధ్య ఏర్పడిన విరుద్ధ ప్రకంపనే ఈ కొత్త అంతరం. ఏ బూర్జువా పార్టీ అధికారంలోకి వచ్చిందనే దానితో సంబంధం లేకుండా, అన్నీ అవే మౌలిక విధానాలను అవలంభించేందుకు పూనుకుంటున్నాయి. 1991 తరువాత విభిన్న రాజకీయ సమీకరణలతో ఏర్పడిన మూడు ప్రభుత్వాలు అదే పద్ధతి కొనసాగించాయి. మూడవ ప్రపంచదేశాల పాలకపార్టీల మధ్య ఈనాదున్న ఏకీభావం నయా ఉదారవాద విధానాలను, ప్రభుత్వ జోక్యాన్ని తిరోగమనం పట్టించే విధానాలను ఎదిరించి పోరాడేందుకు ఒక పెద్ద అవరోధం.

వామపక్షాలు పాలకవర్గాల ఏకీభావంలో భాగస్వాములు కావడానికి నిరాకరిస్తున్నాయి. సామ్రాజ్యవాద ఒత్తిడులకు వ్యతిరేకంగా ప్రతిఘటన నిర్మించడం కొనసాగిస్తున్నాయి అనేది

4. పెట్టుబడిదారీ విధానంలో రాజకీయ – ఆర్థిక రంగాలు వేరుపడే ఈ అంశాన్ని ఎలెన్ మెయిక్సిన్స్ నొక్కి చెప్పారు ఆమె రచన "డెమోక్రసీ అగైనెస్ట్ కాపిటలిజం – రెన్యూయింగ్ హిస్టారికల్ మెటీరియలిజం"కేంబ్రిడ్జి 1995

నిజమే. ఆర్థిక విధానాల మార్పులకు సంబంధించి మాత్రమే నిజమైన ప్రత్యామ్నాయాన్ని అందించలేము. అవి కీలకమే కాని సరిపోవడం లేదు అనేది కూడా అంతేనిజం. సార్వభౌమాధికారం కోసం, ప్రజాస్వామ్యం కొరకు, ప్రజల సమైక్యతా సాధనకు జరిగే పోరాటానికి రాజకీయ – సైద్ధాంతిక అంశం కూడా చేరాల్సి వుంది. వర్గపోరాటం అంతస్సారంలో రాజకీయ పోరాటమే అని ప్రణాళిక నొక్కి చెపుతుంది. ప్రపంచీకరణ చెందిన సామ్రాజ్యవాద విధానం ఆధిపత్యం వున్న జాతీయ రాజ్యాంగంతో వర్గపోరాటాన్ని అనుసంధానించే విధానాన్ని శక్తివంతంగా పరిష్కరించే విషయంపైనే మూడవ ప్రపంచంలో మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణల పురోగతి ఆధారపడుతుంది.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం విజయవంతంగా పురోగమిస్తుందని "ప్రణాళిక" సరిగానే ఊహించింది. కానీ జాతీయ సరిహద్దులను బద్దలు చేయగల దాని శక్తి పట్ల మాత్రం అత్యాశావహత ప్రదర్శించింది. బూర్జువా అభివృద్ధి, వాణిజ్యానికి స్వేచ్ఛ. ప్రపంచ మార్కెట్‌కు స్వాతంత్ర్యం, ఉత్పత్తి విధానంలో ఏకత్వాలు అభివృద్ధి కావడంతో జాతీయ విభేదాలు జాతుల మధ్య వైమనస్యాలు రోజురోజుకు అంతకంతకూ అదృశ్యమవుతున్నాయి అని ప్రణాళిక పేర్కొంది. అయితే సామ్రాజ్యవాద యుగంలో సామ్రాజ్యవాదం ప్రోద్భలపరిచిన జాతుల మధ్య ఘర్షణలు 20వ శతాబ్దంలో రెండు ప్రపంచయుద్ధాలు, మనవాళి సంహారకారణమైన అనేక జాతుల ఘర్షణలు జరిగాయి. బూర్జువావర్గ ఆవిర్భావం జాతుల మధ్య హింసాయుత ఘర్షణలను పెంచుతుందనీ, దాని ఫలితాలు పెట్టుబడిదారీ విధానం నుండి వ్యాప్తిచెందుతాయని ఈనాడు స్పష్టమవుతున్నది.

ఈనాడు మూడవ ప్రపంచంలోను, ఒకనాటి సోషలిస్టు రాజ్యాలలోనూ తలెత్తిన అనేక తెగ – జాతి – మత సమస్యలు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని అడ్డుకుంటూ, ఆ పోరాటాన్ని క్లిష్టతరం చేస్తున్నాయి. స్వేచ్ఛా మార్కెట్ సూత్రాలను పాదుకొల్పడం, సోషలిజం ప్రభావం వెనుకపట్టుపట్టడం, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రపంచీకరణ నెరిపిన వినాశకర ప్రభావం మూలంగా తెగ – జాతి, మతాలతో ప్రాతిపదికపై గుర్తింపుతో, ప్రేరేపించడం, తీవ్రతరం చేయడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఏకజాతి రాజ్యాలు, బహుళజాతి రాజ్యాలు ఎదుర్కొంటున్న ఈనాటి సంక్షోభానికి విప్లవ ప్రతీఘాత ప్రతిస్పందనగానే మత మౌఢ్య ఉద్యమాలు, తెగ– కుల తగాదాలు పెరుగుతున్నాయి. అలాంటి శక్తులతో సర్దుబాటు చేసుకుని, చేతులు కలిపే శక్తి సామ్రాజ్యవాదానికి వుంది. దక్షిణాసియాలోని ఆఫ్ఘనిస్థాన్‌లో తాలీబాన్‌తో, పాకిస్తాన్‌లో ఇస్లామిక్ మతమౌఢ్యంతో, భారతదేశంలో హిందూ దురహంకారులతో అమెరికన్ సామ్రాజ్యవాదం షరీకు కాగలుగుతున్నది. మైనారిటీలపట్ల పాలకవర్గాలు అనుసరిస్తున్న దురహంకారపూరిత, అప్రజాస్వామిక వైఖరిమూలంగా, తరచూ సామ్రాజ్యవాద మద్దతు పొందుతున్న విచ్ఛిన్నకర ఒంటెత్తు శక్తుల పెరుగుదల వల్లా, ప్రజాసమైక్యత భగ్నమయ్యే స్థితి కార్మికవర్గ ఉద్యమమూ, వామపక్షాలకు ఎదురవుతున్నది. ఈ స్థితిని కూడా ఎదిరించవలసి వుంది.

తెగల – మతమైనారిటీల హక్కులను స్పష్టీకరించి, వాటి అమలుకు గ్యారంటీలు యివ్వగల ప్రజాతంత్ర ఉద్యమాన్ని ఎడతెగకుండా, పట్టువిడవకుండా నిర్మిస్తే తప్ప, వామపక్షాలు

జాతీయ నాయకత్వాన్ని ఆశించలేవు. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదానికి కార్మికవర్గం నాయకత్వం వహించదలచుకుంటే 'పెద్ద' 'చిన్న' దురహంకారాలు రెంటినీ అది ప్రతిఘటించాలి మైనారిటీల ప్రజాస్వామిక ఆశలను తీర్చేందుకు, విచ్ఛిన్నవాదాలను ఎదుర్కొనేందుకు ఫెడరిలిజం, ప్రాంతీయ స్వాతంత్ర్యాలను వామపక్షాలు మరింతగా నొక్కి చెప్పాల్సి వుంటుంది. దక్షిణాసియా దేశాల అనుభవం నేర్పేది అదే. ఆర్థిక, పాలనారంగాలలో నిర్ణయాలు చేసే అధికారం వికేంద్రీకరించాలనే పోరాటంలో ప్రజలు ప్రజాతంత్ర హక్కులకై సాగించే పోరాటం ఈనాడు కొంతమేరకు ప్రతిబింబిస్తున్నది.

సోవియట్ యూనియన్, యుగోస్లోవియా వంటి బహుళజాతి సమాజాల విచ్ఛిన్నం తరువాత ఈ రంగంలో మార్క్సిస్టు సిద్ధాంత ఆచరణలను మరొకసారి కొత్తగా పరిశీలించాల్సిన అవసరమేర్పడుతుంది.

## III

సమాజపు విప్లవకర పరివర్తనలో కార్మికవర్గానికి కేంద్ర స్థానం యిచ్చింది 'ప్రణాళిక' కాని ప్రణాళిక సందేశాన్ని పూర్వపక్షం చేయదలచుకున్నవారు, కార్మికవర్గం పట్ల గల ఈ ప్రత్యేకదృష్టిని నిరాకరించడంపై తమ దృష్టిని, కృషిని కేంద్రీకరిస్తున్నారు. మార్క్సిస్టు సిద్ధాంతంలోని ఈ భాగాన్ని తిరగదోడాలనే ధోరణి, సోషలిజం పొందిన పరాజయాలతో, మరింత శక్తి పుంజుకున్నది. అయితే ఈ తిరగదోడే ధోరణికి భిన్నంగా, ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సాగే పోరాటాలలో కార్మికవర్గం యొక్క కేంద్రపాత్రను మరింత దృఢపరచేందుకు ఈమధ్యకాలపు అనుభవం అవకాశం కలిగించింది. అది ఎంత ఆత్మరక్షణా పోరాటమైనా కావచ్చు. కానీ ఈ వర్గం మాత్రమే సామ్రాజ్యవాదదాడికి నికరమైన, నిరంతర ప్రతిఘటనను యిచ్చింది. 1995లో ఫ్రెంచి కార్మికుల సమ్మె, 1996లో దక్షిణకొరియా కార్మికులు వీరోచితంగా సాగించిన నెలరోజుల సమ్మె, యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న గుత్తాధిపతుల అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, ప్రారంభదశలోనే వున్నా నూతన పద్ధతుల ద్వారా యూరోపియన్ కార్మికులు సమైక్యంగా, సమన్వయంతో సాగిస్తున్న పోరాటాలు, రానున్న కాలంలో కార్మికులు వహించనున్న కీలకపాత్రకు నిదర్శనంగా వున్నాయి. ఆ పాత్రను ధృవపరుస్తున్నాయి.

ఈనాడు కార్మికవర్గం అదృశ్యం కావడంలేదు. సంఖ్యలో కుదించుకుపోవడమూలేదు. ఈ విషయం అయ్‌జాద్ అహమ్మద్ తన వ్యాసంలో మనదృష్టికి తెచ్చారు. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో కూడా ఇదే విషయం కనిపిస్తుంది.[5] అయితే వివిధ తరగతి కార్మికుల కలయిక, వారి అంతర్గత నిర్మాణం మారింది. భారతదేశంలో కార్మికవర్గ చైతన్యంలో కుల, తెగల ప్రాతిపదికగా ఏర్పడే విభజన మొండిగా కొనసాగుతోంది. రాజకీయ – నిర్మాణ కార్యకలాపాలకు అనుబంధంగా సైద్ధాంతిక, సాంస్కృతిక జోక్యం ద్వారా వర్గచైతన్య రూపకల్పన

5. మొత్తం అభివృద్ధిచెందిన పారిశ్రామిక (ఒ.ఇ.సి.డి) దేశాలలో 1973లో 11కోట్ల 20లక్షల మంది 'పరిశ్రమల' లో నియమితులు కాగా 1994లో ఈ సంఖ్య 11కోట్ల 50లక్షలకు పెరిగింది. (కిమ్‌మోడీ, 'వర్కర్స్ ఇన్ ఎలీన్ వరల్డ్'. లండన్ – 1997

పట్ల అతితక్కువ దృష్టి కేంద్రీకరించారు. దీనితో పాటు ట్రేడ్ యూనియన్లకు, మొత్తంమీద కార్మికవర్గ ఉద్యమానికి ఎంతో ప్రాముఖ్యంగల అంశం మహిళా కార్మికుల పాత్ర. పారిశ్రామిక శ్రామికశక్తిలో అంతకంతకూ ఎక్కువగా మహిళలు ప్రవేశపెట్టబడతారని "ప్రణాళిక" ముందుగానే భావించింది. "ఆధునిక పరిశ్రమ అభివృద్ధి చెందే కొద్దీ. స్త్రీల శ్రమ పురుషుల శ్రమను అధిగమిస్తుంది". అంతకంతకూ పెరిగే పారిశ్రామిక కార్మికవర్గంలో, చౌకగా శ్రమను అందించే వనరుగా స్త్రీలు పారిశ్రామిక కార్మికులవుతారు. 20వ శతాబ్దపు చివరకు బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల శ్రామికశక్తిలో సరాసరి 60శాతం మహిళలే.[6] సేవారంగంలో పాక్షిక ఉద్యోగాలలో అతితక్కువ వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులుగా చాలా ఎక్కువగా మహిళలను నియమిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. భారతదేశంలో 12 కోట్ల 70 లక్షల మంది మహిళా శ్రామికులు వున్నారు. వారు శ్రామిక వర్గంలో ఒక కీలక భాగమనే గుర్తింపు తగినంతగా లేదు. వారు ఎదుర్కొనే వర్గదోపిడీ సమస్యలతో పాటు, మహిళలుగా ఆ కార్మికులు ఎదుర్కొంటున్న నిర్దిష్ట సమస్యలు కార్మిక వర్గ పార్టీకి అత్యవసరం. ప్రజాస్వామ్య సమరంలో కార్మికవర్గ నాయకత్వాన అత్యధిక మెజారిటీ విజయం సాధించాలనే 'ప్రణాళిక' లక్ష్యం శ్రామిక మహిళలు ఉద్యమంలో భాగస్వాములు కాకుండా జరగడం ఊహాతీతమైంది.

'ప్రణాళిక' కమ్యూనిస్టు లీగ్ కోసం రాసిన పత్రం. జర్మన్ కార్మికుల పార్టీ అది. చాలా చిన్న పార్టీ. అందువల్ల ఆపత్రం కమ్యూనిస్టులు అవలంభించాల్సిన వ్యూహం. ఎత్తుగడలను వివరిస్తుంది. ఉద్యమం అవలంభించాల్సిన భవిష్యత్ పద్ధతులను వివరిస్తుంది. కార్మిక వర్గం ఒక పార్టీగా నిర్మాణయుతం కావలసిన అవసరాన్ని సహితం "ప్రణాళిక" వివరిస్తుంది. "కార్మికవర్గం ఒక వర్గంగానూ, పర్యవసానంగా ఒక రాజకీయ పార్టీగాను నిర్మాణమవడం' అన్న బీజరూపంలోవున్న భావాన్ని ఆ తరువాతకాలంలో ఒక విప్లవ పార్టీ అనే పరిపూర్ణ భావనగా లెనిన్ అభివృద్ధి చేశారు. కొంతమంది నిరాకరిస్తున్నా, అగ్రగామిదళం భావం 'ప్రణాళిక' లో నిక్షిప్తమైవుంది. "ప్రతిదేశంలోనూ ఏర్పడే కార్మికవర్గ పార్టీలలో అత్యంత పురోగామి శక్తిగా, కృతనిశ్చయంగల వారుగా కమ్యూనిస్టుల పాత్ర" 'ప్రణాళిక'లో అంతర్భాగంగా వుంది. అదే సమయంలో మార్క్స్ - ఏంగెల్స్‌లు అనేక కార్మిక వర్గ పార్టీలు ఏర్పడతాయని భావించారు. ఆస్తిపరుల పార్టీలకు - శ్రామిక వర్గ పార్టీలకు మధ్య మౌలిక తేడాను స్పష్టీకరించారు.[7]

---

6 ఓ.ఇ.సి డి.దేశాల శ్రామికశక్తిలో 15-64 సంవత్సరాల మధ్య వయస్సుగల మహిళలు 1980లో 53శాతం నుండి 1990లో 60శాతానికి పెరిగారు. ఇ.ఎల్.ఒ. వరల్డ్ ఎంప్లాయిమెంట్ రిపోర్టు 1994 పేజీ 29

7 ఆస్తి పరవర్గాల సమిష్టి శక్తికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో తనను తాను ఒక రాజకీయ పార్టీగా నిర్మించుకొని రూపొందించుకొనక పోతే కార్మికవర్గ ఒక వర్గంగా కృషి చేయలేదు. అలాంటి రాజకీయ పార్టీ ఆస్తిపరుల వర్గాలు ఏర్పర్చిన అన్ని పాత రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా వాటికి భిన్నమైన రీతిలో వుంటుంది. హేగ్‌లో 1872 సెప్టెంబరులో జరిగిన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ జనరల్ కాంగ్రెస్ తీర్మానం - మార్క్స్ - ఏంగెల్స్ - కలెక్టెడ్ వర్క్స్ 23వ సంపుటం పేజీ 243

అలాంటి విప్లవకర పార్టీకి సైద్ధాంతిక పునాదిని సమకూర్చేందుకే 'ప్రణాళిక' మూడవ భాగంపూర్తిగా కేటాయించారు. సోషలిజం గురించిన తప్పుడు భావాలను ఖండించేందుకు దాన్ని వినియోగించారు. శాస్త్రీయ సోషలిజంతో ఆ భావాలు ఎలా పొసగవో వివరించారు. వివిధ చారిత్రక కాలాల్లో 'సోషలిజం' పేరిట అనేక తరహాలు తలెత్తుతాయి. అవన్నీ కార్మికేతర వర్గ సిద్ధాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఈ ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటపు అవసరం నిరంతరం వుంటుందని ఈ అధ్యాయం మనలను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తుంటుంది.

యూరప్‌లోని వివిధ దేశాలలో వుండే ప్రతిపక్ష పార్టీలతో ఏర్పడే సంబంధాలలో కమ్యూనిస్టుల వైఖరి గురించిన అధ్యాయం "ప్రణాళిక" చివరి భాగం. కార్మికవర్గ తక్షణ ప్రయోజనాల సాధనకు అవలంభించవలసిన ఎత్తుగడలవి. ఐక్యసంఘటన పరిస్థితిలో మార్పురాగానే, వాటిని వదిలివేయాలి. అలాంటి ఎత్తుగడలకు సంబంధించి వున్న భాగాలకు కాలం చెల్లిందని మార్క్స్ – ఏంగెల్స్‌లే ఆ తరువాత ప్రచురణకు రాసిన పీఠికలో పేర్కొన్నారు. పార్టీ పాత్ర, దానికి వర్గానికి గల సంబంధం, బూర్జువా రాజ్యాంగ యంత్రపు స్వభావం, విప్లవోద్యమ వ్యూహం ఎత్తుగడలను వివరించే 'ప్రణాళిక' రాజకీయ భాగం భావాలకు సంపన్నమైన వనరు. పార్టీలలో, అంతర్జాతీయ సంస్థలలో ఆ తరువాత కాలంలో ఏర్పడిన పరిణామాల దృష్ట్యా వీటిని పరిశీలించి, ఆలోచించి మననం చేసుకోవలసిన అవసరం వుంది, 20వ శతాబ్దంలో ఏర్పడిన సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాల అనుభవం తరువాత పార్టీ, వర్గము, రాజ్యాంగ యంత్రాలకు సంబంధించిన అనేక సమస్యలు ఇంకా పరిష్కరింపబడవలసే వున్నాయి.

## IV

భారతదేశ పరిస్థితులు పుస్తకం పొడుగునా కనపడుతున్నా ఇందులోని రచనలన్నీ సాధారణరీతిలో మార్క్సిస్టు సిద్ధాంత ఆచరణలను గురించి ఆలోచించినవి. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి 70 సంవత్సరాలు. ఆ ఉద్యమం పోరాటాల, అనుభవాల సంపన్నవంతమైన చరిత్ర కలిగి వుంది. వాటిని అధ్యయనం చేయాలి. విశ్లేషించాలి. సిద్ధాంతీకరించాలి 1991–తరువాత కాలంలో ఇతర దేశాలలోగా కాకుండా భారత దేశంలో ప్రజాపునాది కలిగి మార్క్సిజంకు కట్టుబడి వున్న పార్టీలు కొనసాగుతున్నాయి. కమ్యూనిస్టు పార్టీల, గ్రూపుల సభ్యత్వం దాదాపు 15 లక్షలు వుంటుంది. వామపక్షభావాలుగల వర్గ, ప్రజాసంఘాల సభ్యత్వం ఐదున్నర, ఆరుకోట్ల వరకు వుంటుంది.

ఈ ప్రభావంతో పోలిస్తే సిద్ధాంత విషయాలలో నిర్లక్ష్యం జరుగుతున్నది. సైద్ధాంతిక కార్యకలాపాలను శక్తివంతం చేసేందుకు ఉపయోగపడగల వనరుల పట్ల తగినంత శ్రద్ధలేదు. ఇంగ్లీషు ద్వారా తప్ప, భారతీయ భాషలలోని మార్క్సిస్టు రచనలమధ్య అనుసంధానం సాధ్యం కావడంలేదు. పెద్ద బలహీనతలలో ఇదొకటి. ఈ పుస్తకం తయారు చేసేటప్పుడు మాకు ఒక విషయం తెలిసింది. భారత ఉప ఖండపు ప్రధానభాషల్లో 'ప్రణాళిక' చరిత్ర గురించిన సమాచారం

లభ్యం కావడం లేదు. ఈ విషయంలో కొంత సమాచారాన్ని ఒక చోట చేర్చాము. దాన్ని ఒక నోట్‌గా దీనితో జత చేశాము. భారత దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, సాంఘిక ఉద్యమాలలో పనిచేసిన అత్యుత్తమ మేధావులను 1920లలోనే 'ప్రణాళిక' ఆకర్షించింది.

ప్రఖ్యాత జాతీయోద్యమ నాయకుడు, ఇస్లామిక్ పండితుడు అయిన అబ్దుల్ కలాం అజాద్ నుండి ప్రఖ్యాత సంఘ సంస్కర్త, ద్రవిడ ఉద్యమ అగ్రగామి అయిన ఈ.వి. రామస్వామి నాయకర్‌నుండి ఆ తరువాత కమ్యూనిస్టు నాయకులైన పి. సుందరయ్య, ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ వరకు అలా ఆకర్షితులైన వారిలో వున్నారు. వీరంతా 'ప్రణాళిక' అనువాదం, ప్రచురణలలో పాల్గొన్నారు. విభిన్న రాజకీయ పూర్వరంగాలు వీరివి. ఈ విషయం గమనిస్తే, స్వాతంత్ర్యోద్యమ కాలంలో మార్క్సిస్టు భావాలు ఎంత విస్తృత ప్రభావం కలిగి వుండేవో, ఎంతటి ప్రభావం కలిగించాయో మనకు అర్థమౌతుంది.

'కమ్యూనిస్టు ప్రణాళిక' గురించిన పుస్తక ప్రచురణతో లెఫ్ట్‌వర్డ్ బుక్స్ ప్రారంభమౌతోంది. ఇది చాలా శుభప్రారంభం. మార్క్సిస్టు సిద్ధాంత, ప్రచురణలను పరిపుష్టం చేసే కర్తవ్యంలో, మనం అనుసరించవలసిన పురోగమన విధానం' ఏమిటో అవగాహన చేసుకునేందుకు 'ప్రణాళిక' నిత్య సహకారిగా వుంటుంది.

ఈ పుస్తక ప్రచురణకు 1998 ప్రారంభంలో ప్రయత్నం ప్రారంభించాము. దీనికి పీఠిక రాయమని ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ గారిని అడిగాము. ప్రచురణ పథకం పట్ల ఆయన ఎంతో ఆసక్తి కనపరచారు. పీఠిక రచనకు అంగీకరించారు కాని అది జరగలేదు. కొన్ని వారాల తరువాత ఆయన కన్నుమూశారు. ఆయన స్మృతికి ఈ పుస్తకం అంకితం చేస్తున్నాము.

## అయ్‌జాజ్ అహమ్మద్

# తన కాలంలోనూ, మన కాలంలోనూ కమ్యూనిస్టు ప్రణాళిక

బైబిలు, ఖురాను రెండు పుస్తకాలు మాత్రమే "కమ్యూనిస్టు 'ప్రణాళిక' కన్నా ఎక్కువ ముద్రణలు పొంది, మరింత విస్తృతంగా వ్యాప్తిచెందాయి. సంక్షిప్త, సౌందర్యవంతమైన ఈ గ్రంధం లౌకిక సాహిత్యంలో అసమానమైన స్థానం పొందింది. బోల్షివిక్ విప్లవానికి ముందే, 35 భాషల్లో 544 ముద్రణలలో వెలువడింది ఈ పుస్తకం. ఈ పుస్తకం విస్తృతవ్యాప్తిని, ప్రభావాన్ని దీనిని బట్టి అవగాహన చేసుకోవచ్చు మరొక విషయం కూడ చెప్పాలి. అలా ప్రచురించిన ముద్రణలన్నీ ఐరోపా భాషల్లోనే ప్రచురించారు. ఇంకా అనేక భాషల్లో అంతులేనన్ని సంఖ్యలలో ఈ పుస్తకం ప్రచురింపబడి వుండాలి. అవి మనకు తెలియదు. 1917 విప్లవానంతరం యూరోప్, యూరోపేతర భాషల్లో అనంతమైన ముద్రణలు పొంది వుండాలి. ఇంకొక విషయం కూడా ఇక్కడ నొక్కి చెప్పాలి. పైన పేర్కొన్న రెండు మత గ్రంథాలవలెగాక 'ప్రణాళిక' ప్రచురించి కేవలం నూట యాభై సంవత్సరాలు మాత్రమే అయింది. ఈ అన్ని విషయాల దృష్ట్యా ఆలోచిస్తే అతి చిన్న వయసు పుస్తకం. అందువల్ల ఈ చిన్న పుస్తకం గతంలో నెరపిన ప్రభావం గాని, భవిష్యత్‌లో నెరపగలిగిన ప్రభావాన్ని గాని పూర్తిగా అంచనా వేయడానికి అప్పుడే తగిన సమయం రాలేదు.

మరొక విషయం గూడా మనంచెప్పుకోవచ్చు. రూసో మహాశయుని రచన 'సోషల్ కాంట్రాక్ట్'కన్నా, అమెరికా రాజ్యాంగము, బిల్ ఆఫ్ రైట్స్ కన్నా, 'మనిషి, పౌరుని హక్కుల' గురించి ఫ్రెంచి ప్రకటకన్నా మరేయితర రాజకీయ రచనకన్నా గూడా ఆధునిక ప్రపంచపు ఆచరణా యుత రూపకల్పనలో 'ప్రణాళిక' ప్రభావం చాలా ఎక్కువ. ఈ విషయాన్ని ఎవరైనా నిరాకరించగలరని మనం భావించనవసరంలేదు. ఇందుకు మొదటికారణం అందులో వున్న రాజకీయ సందేశం. అది ప్రపంచమంతటా ప్రతిధ్వనించింది. గత 150 సంవత్సరాలుగా మానవాళిలోని విభిన్నవర్గాల భవితవ్యాన్ని నిర్దేశించింది. ఇక దాని రచనా తీరే ఎంతో ప్రభావితం చేసింది. అంతగా ఆస్వాదించదగిన, సౌందర్యపూరితమైన, స్వచ్ఛమైన భాషలో సాయుధ

పోరాటానికి పిలుపునిచ్చిన ఉదంతం అంతకుముందుగాని, ఆ తరువాతగాని లేదు. మూడవ విషయం అందులో పరిస్థితుల విశ్లేషణ, భవిష్యత్ గురించిన ప్రబోధం కలగలిసిన విధానం మనలను ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. మార్క్స్ తనకాలం నాటి పెట్టబడి దారీ విధానాన్ని వివరిస్తారు. వివిధ శక్తుల కార్యకలాపాలతో తెలియని భవిష్యత్‌లో ఆ విధానం ఎలాంటి రూపం తీసుకుంటుందో స్పష్టీకరిస్తారు. ఇది ఎంత శక్తివంతంగా చెప్పారంటే, ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలలో, ఆ తరువాత వచ్చిన ప్రతి తరంగూడా, తమతమ కాలాన్ని 'ప్రణాళిక'లో అభివర్ణించిన పెట్టుబడిదారీ విధానాన్ని, అది కలిగించనున్న భయానక పరిస్థితుల ప్రతిబింబాన్ని చూస్తున్నది. హెగెల్, ఫ్యూయర్ బా, ప్రాధాన్, స్టిర్ నెర్, బూగ్రోబావర్, సిస్మాంజీ వంటి ఎంతోమంది తాత్వికులు ఆనాటి జర్మనీలో ఎంతో ప్రభావం కలిగి వుండేవారు. "నిజమైన సోషలిస్టు"లు సహితం ఇలాంటి ప్రభావమే నెరపుతుండేవారు 'రానున్న కాలపు విశ్వ సంస్కర్తలు'

---

1. 'కమ్యూనిస్టు ప్రణాళిక' మార్క్స్-ఏంగెల్స్‌ల సమిష్టి కృషిగా ఎప్పుడూ పేర్కొంటారు ఇది అసంబద్ధం కాదు. అయితే ఈ వ్యాసంలో నేను మార్క్స్‌ను మాత్రమే నేను పేర్కొంటున్నాను ఇందుకు వివరణ అవసరం. ప్రతిసారీ ఇద్దరిని పేర్కొనడం కన్నా ఒకరిని పేర్కొనడం రచనాశైలికి తోడ్పడుతుంది రెండువిధాల చారిత్రక స్పష్టత సమస్య గూడా ఇందులో ఇమిడి వుంది సంప్రదించేందుకు ఏంగెల్స్ అందుబాటులో లేరు అందువల్ల తుది ముసాయిదాను మార్క్స్ మాత్రమే తయారు చేసినట్లు మనకు తెలుసు కమ్యూనిస్టు లీగ్ 'పౌరుడు మార్క్స్'పై చర్య తీసుకుంటానని బెదిరిస్తోంది తుది ముసాయిదాకు ఆయనదే బాధ్యత అది అలాగే భావించబడింది. ఏంగెల్స్ కొద్దిమాసాలు ముందుగా రెండు ముసాయిదాలు తయారు చేశారు 'ఒక కమ్యూనిస్టు విశ్వాస వ్యక్తీకరణ ముసాయిదా' 'కమ్యూనిజం సూత్రాలు' అనేవి ఆ ముసాయిదాలు, ఈ ముసాయిదాలతో 'ప్రణాళిక'ను పోల్చి చూస్తే ముందుగా తయారు చేసుకున్న విషయాల నుండి మార్క్స్ ఎంతగా మార్పులు చేశారో అర్థమౌతుంది వాటిలోని విషయాలతో ఇది చాలా తీవ్రంగా విభేధించిన విషయం అలా వుండగా, 'బూర్జువా వర్గము - కార్మిక వర్గము' అనే కీలకమైన మొదటిభాగంలో దాదాపు ప్రతివాక్యంలో అనుకరించడం అసాధ్యమైన మార్క్స్ రచనా పద్ధతి దర్శనమిస్తుంది అది 19వ శతాబ్దపు వచన రచనలో గొప్ప ముద్రవేసిన వారిలో మార్క్స్ ఒకరనే విషయం ఆయన రచనలన్నిటా సర్వ సాధారణమైన విషయాన్ని ఈ వ్యాక్యాలు అతిస్పష్టంగా తెలియజేస్తాయి. ఈ రచనకు ఏంగెల్స్ భాగస్వామ్యం గణనీయమైంది. కాని అది పరోక్ష భాగస్వామ్యం. ప్రణాళికలో ప్రతిభావంతంగా సంక్షిప్తంగా వ్యక్తీకరించిన చారిత్రక భౌతికవాద భావాన్ని వారిద్దరూ కలసి అభివృద్ధి చేశారు ప్రత్యేకించి 'జర్మన్ తత్వశాస్త్రం'లో ఈ సమిష్టి కృషి వ్యక్తమైంది. అభావాలు ఈ రచనలోనూ వ్యక్తమైన దృష్ట్యా ఏంగెల్స్ భాగస్వామ్యం వ్యక్తమౌతుంది ఈ భావపు ఛాయలు అంతకుముందు రచనలలోనూ కనిపిస్తాయి ఉదాహరణకు 'ఎకనామిక్ అండ్ ఫిలాసిఫికల్ మాన్‌స్క్రిప్టు'లో ఇది కనపడుతుంది ఇది మార్క్స్ ఒక్కరే రచించిన పుస్తకం, కాగా హోలీ ఫామిలీ' అనే రచన ఏంగెల్స్ ఒక 15 పేజీల కరపత్రంగా ప్రారంభించగా మార్క్స్ దానిని పూర్తి పుస్తకంగానే పెంపొందించారు. వారే అత్యంత హాస్యభరితంగా పేర్కొన్న వారి 'జాయింట్ ఫారం'లో మార్క్స్ సీనియర్ భాగస్వామి. ఈ విషయం ఏంగెల్స్ స్వయంగా గుర్తించేవారు.

అని ఎంతో సాహసంతో 'ప్రణాళిక' చిత్రించిన రచయితలూ పలుకుబడి గలవారే. వీరందరితో మార్క్స్, ఏంగెల్స్‌లు తాత్విక రంగంలో అనేకమార్లు ఘర్షణ పడ్డారు. ఆ ఆలోచనల ఘర్షణ నుండి బహుముఖంగా వుండే తాత్విక అవగాహనను వారు రూపొందించుకున్నారు.[1] అటువంటి క్లిష్టభావాలు వడగట్టినట్లు తిన్నని సరళమైన వచన రచనలో వ్యక్తం కావడం ఇందులోని నాల్గవ ప్రత్యేకత. 'దర్జీ శ్రమ కోటుగా అదృశ్యమైనట్లు'[2] క్లిష్టమైన భావాలు, సరళ వాక్యాలరూపం తీసుకుంటాయి.

మేథాపరమైన, రాజకీయమైన పరివర్తనా పారంగావడమే 'ప్రణాళిక' రచనలోని సంపన్నతకు మూలం. 'ప్రణాళిక' ముసాయిదా రచించే నాటికే మార్క్స్ ఒక్కడిగాను, – తర్వాత కాలంలో అంతకంతకూ ఎక్కువగా ఏంగెల్స్‌తో కలిసి – ఎన్నో ఎక్కువ రచనలు చేశారు. వాటన్నిటినీ చూచినవారు 'ప్రణాళిక' రచయిత ఎంత చిన్న వయస్సువాడో (ఆయనకు ఆనాటికి నిండా ముప్పై సంవత్సరాలు గూడా లేవు) మరచిపోతుంటారు. అతి పిన్నవయసు వ్యక్తి రాసిన అతి పరిపక్వ రచన ఇది. ది క్రిటిక్ ఆఫ్ హెగెల్స్ డాక్ట్రిన్ అఫ్ స్టేట్' ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ అఫ్ హెగెల్స్ ఫిసాసఫీ ఆఫ్ రైట్ : యాన్ ఇంట్రొడక్షన్ : ఆ తరువాత 'ది జీవిష్ క్వొశ్చన్', 'ఎకనామిక్ అండ్ ఫిలసాఫికల్ మాన్ స్క్రిప్ట్' ('పారిస్ మాన్‌స్క్రిప్ట్స్'గా గూడా పిలిచేవారు) ప్రఖ్యాత 'థీసిస్ అన్ ఫ్యూయిర్‌బా', 'జర్మన్ ఐడియాలజీ' వంటి రచనలలో క్రమేపి పరిమాణం చెందుతున్న వాదనలను ఈ రచనలో నిర్ధారించారు', వీటిలో 'క్రిటిక్', 'జ్యూవిష్ క్వశ్చన్' అనే గ్రంధాలను మాత్రమే మార్క్స్ జీవించి వున్న కాలంలో ప్రచురించారు. – స్వీయభావాలు నిర్ధారించేందుకు రాసిన రచనలు మిగతావి. ఆ తరువాత 'విసర్జించబడ్డాయి' – వీటిని 'చిట్టెలుక నిశిత విమర్శ'కు వదిలివేసినట్లు 'జర్మన్ ఐడియాలజీ'లో హాస్యంగా రాశారు. అయితే ఈ రచనలన్నీ – 'హోలీ ఫామిలీ' 'ది పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ, ఇతర అనేక చిన్న తరహా ఆనాటి రచనలు, రచనలతో కలిసి, ఈనాటి 'ప్రణాళిక'లో మనకెంతో సుపరిచితమైన నిర్ధారణలకు మొదటి అడుగులుగా ఉపయోగించాయి. అంతేగాదు మార్క్స్ ఆలోచించడం ప్రారంభించిన సమయంలో తాత్విక, ఆర్థిక, రాజకీయ రంగాలలో బాగా వ్యాప్తి చెంది వుండిన మేధావుల ఆలోచనలతో, వాటి ప్రభావంతో వరుసగా సాగిన ముఖాముఖి ఘర్షణలుగా మనం అవగాహన చేసుకునేందుకు తోడ్పడతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే అవి ఇతరుల వాదనలను ఎదుర్కొనే రచనలు. తమ భావాలన్ని విప్పి చెప్పేందుకు జంకు, నత్తర్లు కొట్టడం, ఇతరుల భావాలను నిరాకరించడం కనిపిస్తాయి. స్వంతభావాల రూపకల్పనకు, స్వీయభావాల ఆధారాలను నిర్ధారించుకునేందుకు చేసిన ప్రయత్నాలు, ఎన్‌లైటెన్ మెంట్, పోస్టు ఎన్‌లైటెన్‌మెంట్, రొమాంటిసిజం, అనార్కిజం, ఊహాజనిత సోషలిజం, అన్నిటినీ మించి, హక్కుల చర్చ, మార్కెట్‌ను, రాజ్యాంగ యంత్రాన్ని అనుపమానమైనవిగా ఆరాధించడం వంటివి ఈనాడు మనకూ సంక్రమించిన భావాలు ఆనాడు మరింత శక్తివంతంగా వుండేవి. వాటి భారాలు, బంధాల నుండి బయటపడే ప్రయత్నాలు వారి తొలి రచనలు.

---

2 ఈ ఆహ్లాదకరమైన వాక్యం మరొక సందర్భంలో లూయిస్ ఆల్ థస్సర్ వాడారు

ఆ తొలి రచనలలో గూడా స్వయంగా రూపొందించిన భావాలతో నిండిన గొప్పభాగాలు, మొత్తం అధ్యాయాలూ కనిపిస్తాయి ఏమైనా అవన్నీ ఎవరో ఒక రచయితలను లేదా ధోరణులను వ్యతిరేకించేందుకు రాసినవే. ఇంతకుముందు వివరించినట్లు హెగెల్ తదితరుల ధోరణుల ఖండనలు అవి. ఇలా ఒక విషయంపై దృష్టి కేంద్రీకరించి విమర్శ చేయడం 'ప్రణాళిక' చివరి భాగంలోనూ కొనసాగుతుంది. కాని అత్యంత ఆసక్తికరమైన మొదటిభాగం మాత్రం ఈ తాత్వికునికో, ఆ తాత్వికునికో లేదా ఈ భావానికో, ఆ భావానికో వ్యతిరేకంగా రాసిన రచనగాగాక, మొత్తంగా బూర్జువా సమాజానికి వ్యతిరేకంగా స్పష్టంగా చేసిన ప్రకటనలలో మార్క్స్ మొదటి రచనగా మనకు కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఆనాటి వరకు ఐరోపా ఆలోచనా ధోరణులను వెంటాడిన భూతాలను తరిమి వేసేందుకు కఠోర సాధనానంతరం చేసింది ఈ రచన. ద్వంద్వ ఉద్యమం ద్వారా తాత్విక చింతనా లక్ష్యాలు సాధించాలనే తపనతో, రాజకీయ అర్థశాస్త్రానికి, చరిత్రకు, తాత్విక భావాలకు మధ్య ఒక నూతన అనుసంధానాన్ని నిర్వచించేందుకు రూపొందిన మహత్ గ్రంథం, ఈ ద్వంద్వ ఉద్యమంలో మొదటిది చరిత్ర సిద్ధాంతం. సార్వత్రిక రూపంలో భౌతిక ప్రపంచపు గమనానికి సంబంధించిన మౌలిక అంశాన్ని వివరించడం ద్వారా, తాత్విక రంగపు మేథో ప్రణాళికను నిర్దిష్ట రూపం ఇవ్వడం, దీనినీ ఉత్పత్తి విధానాల వర్ణన'గా ఈనాటి పోస్ట్ మోడరనిస్టులు కొట్టి పారేస్తున్నారు. నైతికంగా సహించరానిదిగా వున్న ప్రపంచాన్ని విప్లవకరంగా మార్చి, తాను ప్రవచించే నైతిక ప్రణాళికకు నమూనాగా రూపుదిద్దే పనిని తత్వశాస్త్రం చేపట్టాలని మరొకవైపు డిమాండ్ చేస్తున్నది. 'ప్రగతి శీలతా మాయ'గా ఈనాడు పోస్ట్ మోడరనిజం కొట్టి పారేస్తున్నది.

ప్రపంచ ఆర్థిక విధానంపై ప్రత్యేకించి పెట్టుబడిదారీ ఆర్థిక విధాన సూత్రాలపై మార్క్స్ సాగించిన పరిపక్వమైన అధ్యయనాలు 'ప్రణాళికా రచన అనంతర కాలంలో సాగినవనేది నిజం (అయితే ఈ విషయాల పట్ల మార్క్స్ మధన చాలా ముందుగానే ప్రారంభమైంది. క్రమబద్ధంగాను, అంతకంతకూ మెరుగైన రూపంలో ఈ విషయాలను ఆయన తన రచనలలో వ్యక్తం చేశారు. ఇలాంటి కృషి ఎకనామిక్ అండ్ ఫిలాసఫిక్ మాన్‌స్క్రిప్ట్' 'జర్మన్ ఐడియాలజీ' (వీటిని ఆయన సజీవంగా వుండగా ప్రచురించలేదు) 'పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ, (ఆయన జీవితకాలంలోనే దీన్ని ప్రచురించారు) లోనూ కనిపిస్తుంది ప్రారంభంలోనే ఆయన ఒక అంశాన్ని ప్రత్యేకంగా గమనించారు పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి శక్తుల సంబంధాల చారిత్రక మార్పురేటులోనూ, పరిమాణంలోనూ కూడా అత్యంత వేగంగా వుంటుంది. తరం తరువాత తరంలో అది మరింత వేగవంతమౌతుంది. అంతకుముందుగల ఉత్పత్తి విధానాలలో ఉత్పత్తి సంబంధాల మార్పు సాపేక్షికంగా చాలా నెమ్మదిగా సాగేది" మార్పు చెంద'వని అక్కడక్కడా తొందరపాటుగా చెప్పినప్పటికీ, మొత్తం మీద గడ్డకట్టినంత నెమ్మదిగా సాగేది. పెట్టుబడిదారీ విధానాన్ని మార్పులేని వాస్తవికతగానూ, లేదా ఒకానొక సమయంలో అతిస్పష్టంగా కనిపించేవి రూపంలో ప్రధానంగానో అధ్యయనం చేస్తే పెట్టుబడిదారీ విధానపు సారాంశాన్ని మనం

కరతామలకం చేసుకోలేమనే దృక్పథాన్ని మార్క్స్ అనుసరించారు. ఇది ఒక మౌలికమైన పరిశీలనాసూత్రంగా ఆయన రూపొందించారు. అందుకు భిన్నంగా ఈ ఉత్పత్తి విధానంలోని మార్పును వేగాన్ని ఒక క్రమంగా అధ్యయనం చేయడం అవసరం. ఆ క్రమం యొక్క గతాన్ని చారిత్రకంగా అవగాహన చేసుకోవాలి. దాని గతాన్ని, వర్తమానాన్నిబట్టి అది భవిష్యత్‌లో చెందబోయే రూపాంతరాన్ని అవగాహన చేసుకోవాలి. అన్ని వివరాలతో కాకున్నా, మొత్తంమీద దాని నిర్మాణ వ్యవస్థలో రానున్న మార్పులను సహేతుకమైన స్థాయిలో సరిగా స్పష్టం చేయవచ్చు. అందువల్లనే 'ప్రణాళిక'లో పెట్టుబడిదారీ విధానాన్ని చిత్రించిన తీరు, ఆయన కాలంలో దాని స్వరూపం గురించి చాలా తక్కువగా తెలియజేస్తుంది. కాని అది ఒకనాడు ఎలా వుండేదో, ముందుముందు అది ఏ రూపం తీసుకునే అవకాశముందో చాలా వివరంగా తెలియజేస్తుంది.

అయినప్పటికీ, మార్క్స్ రచనా సందోహంలో, 'ప్రణాళిక'ను ఏదో తుది దృశ్యాన్ని చూపే రచనగా భావించరాదు ముందే పేర్కొన్నట్లు అది ఒక పరివర్తనా భావాల రచన. ఒక యువకుని పరిపక్వ రచన. ఆ రచన అంతకుముందు రచనల నుండి పురోగమించడమే గాదు, ఆ తరువాత చాలా సంవత్సరాలపాటు ప్రచురించిన మరింత పరిపూర్ణమైన రచనల వైపు దారి వెతుక్కుంటున్న రచన గూడా, ఆయన రచనా వ్యాసాంగపు విస్తృతి మనకు ఊపిరి సలపనీయదు. అయితే ఈ రచనా వ్యాసాంగపు కృషి అంతటితోనూ మూడు ప్రధానమైన ఆలోచనలు అతి ముఖ్యంగా కనిపిస్తాయి. ఒక ఉత్పత్తి విధానంగా పెట్టుబడిదారీ విధానాన్ని నఖశిఖ పర్యంతం విశ్లేషించి, వివరమైన దాని స్వరూపాన్ని మనముందు వుంచే ప్రయత్నం మొదటిది. శ్రమ, ఉత్పత్తి, వర్గపోరాటాల దృక్కోణాలలోని ఆధునిక ప్రపంచాన్ని ఒక మొత్తంగా వివరించేందుకు సూత్రాలను, ప్రథమ భూమికను ఆవిష్కరించే తొలి ప్రయత్నం, తన స్వీయ సందేహాల నివృత్తికి అతి విస్తారమైన 'గుందుసే' గ్రంథాన్ని 1857-58లో మార్క్స్ రచించారు. 'పెట్టుబడి' మూడు భాగాలు', థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూ' అనేవి ఈ చారిత్రక పథకంలో కీలకమైన పుస్తకాలు.

తనచుట్టూ ప్రపంచంలో ఆవిష్కృతమౌతున్న తన కాలంనాటి చరిత్ర, రాజకీయాలలో విస్తారంగా మిళితమై, అధ్యాయనం చేసి రాసిన రచనలే "ఫ్రాన్సులో వర్గపోరాటాలు" ఎయిటీంత్ బ్రూమెయర్ ఆఫ్ లూయిస్ బోనపార్టే' అనేవి అత్యంత అధికార పూర్వకమైన రచనలు. మొదటిది 1850లో వ్యాసపరంపరగా ప్రచురించారు. రెండేళ్ళ తర్వాత రెండు వ్యాసాల కూర్పు వెలువడింది. ఎక్కడో సకృత్తుగా తప్ప అసలు జరిగివుంటే, పత్రికా రచన అంతటి విశ్లేషణ, సైద్ధాంతిక ఔన్నత్యపు శిఖరాలను అందుకోలేదు. కార్మికోద్యమం మిలిటెంట్‌గా మార్క్సు అంతటి పెద్ద సంఖ్యలో రాసినవి గూడా ఈ గ్రంథావళిలో వున్నాయి. 'ప్రణాళిక' అనంతరం ముప్పై సంవత్సరాలకు అత్యంత శక్తివంతంగా 'గోథాకార్యక్రమ విమర్శ' రాశారు. పారిస్ కమ్యూన్ అనుభవ పాఠాలతో, ఆ అనుభవాలసారంగా భవిష్యత్ కమ్యూనిస్టు సమాజం ఎలా వుండేందుకు కృషి చేయాలో రేఖామాత్రంగానైనా చెప్పడానికి ప్రయత్నించారు ఈ గ్రంథంలో అవి ఎంత

ప్రాథమిక రూపంలోనైనా ప్రత్యక్ష పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక, చారిత్రక రంగాలు, పాలకపక్షాల పునాదులు అనే మూడు అంశాలు మార్క్స్ ఆ తరువాత జీవితంలో ఎదురైన ఎదుర్కొన్న విషయాలు వాటి నీడలు, 'ప్రణాళిక'లోనే ముందుగా మనకు కనపడతాయి. 'జర్మన్ ఐడియాలజీ' గ్రంధరచన వరకు స్పష్టీకరించిన మేరకు చారిత్రక భౌతికవాద భావానికి అందులో మెరుగులు దిద్దారు. పెట్టుబడిదారీ విధాన ఆర్థికసూత్రాలపై ఆ రచనలో గల శక్తివంతమైన దాడి, పెట్టుబడి గ్రంథ రచనకు మార్క్స్ పూనుకున్న సమయానికి అసాధారణంగా అభివృద్ధి అయింది. 'ప్రణాళిక' కేంద్ర మూలంగా నిర్మించబడిన ఈ మహాసౌధం పునాదిగానే ఆ తరువాతకాలంలో మార్క్సిజంలో ప్రతిభావంతులైన లెనిన్, రోజా లగ్జంబర్గ్ వంటి నాయకులు మొత్తంగా మార్క్సిస్టు సిద్ధాంతానికి అసమానమైన విప్లవకర అభివృద్ధిని పెంపొందించడమేగాక, తమ సమకాలీన పరిస్థితుల అవగాహనకు, ఆచరణకు కొత్త విప్లవకర ఆయుధాలను సంతరించి పెట్టారు. సామ్రాజ్యవాద సమస్య, కార్మికోద్యమ వ్యూహం, ఎత్తుగడలకు వారందించిన ఆయుధాగారం అత్యంత గొప్పగా పేర్కొనదగినది.

## 'ప్రణాళిక'ను పరిశీలించే తీరు

'ప్రణాళిక'ను అనేక దృక్పధాల నుండి పరిశీలించవచ్చు. ఆ రచనలోని ప్రతి ప్రాముఖ్యతగల సూత్రమూ అంతకుముందు రచనలో కొన్ని సందర్భాలలో కొంత తేలికపాటిగానైనా వివరంగా పరిశీలించారు. అవే తిరిగి మరింత సూటిగా, సంపన్నమైన పద్ధతులలో ఆ తరువాత కాలపు రచనలలో తిరిగి తలెత్తుతాయి. 'ప్రణాళిక'లో రాజ్యాంగ యంత్రపు నిర్వాహక వర్గాన్ని "మొత్తం బూర్జువా వర్గపు మేనేజింగ్ కమిటీ" అంటూ శక్తివంతంగా చిత్రించారు. అదే సమస్యను 'క్రిటిక్ ఆఫ్ హెగెల్స్ డ్రాక్టిన్ ఆఫ్ స్టేట్ అనే గ్రంథం జూయిష్ క్వొశ్చన్' అనే గ్రంథం, ఆ తరువాత కాలంలో మరింత పరిపక్వత చెందిన 'ఘైటీంత్ బ్రూమెయిర్' రచనలలో వివరంగా పరిశీలించిన దృక్పధం నుండి చూస్తే, అదే విషయం సూక్ష్మమైన తేడాతో, గతితార్కిక పద్ధతిలో అవగాహన ఔతుంది. ఇది ఒక ఉదాహరణ 'మనిషి భావాలు, ఆలోచనలు, అవగాహన, ఒక మాటలో మానవచైతన్యం, తన భౌతిక ఉనికి పరిస్థితుల్లో తన సామాజిక సంబంధాలలో సామాజిక జీవితంలో వచ్చే ప్రతి మార్పుతో మారుతుంటుంది అని అర్థం చేసుకునేందుకు చాలా లోతైన పరిశీలన అవసరమా' అంటూ రాశారు. 'ప్రణాళిక' రెండవ అధ్యాయంలో చైతన్య స్వభావం గురించి చేసిన సూక్ష్మ ప్రకటనను, 12 సంవత్సరాల అనంతరం "క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి"కి రాసిన ఉపోద్ఘాతం'లో మరింత సూటిగా రూపొందిన సూత్రంతో పోల్చుకుంటే ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది 'మానవుల ఉనికిని వారి చైతన్యం నిర్ణయించదు. అందుకు భిన్నంగా వారి సామాజిక ఉనికి వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అని తరువాత రచనలోని సూత్రం సూటిగా వుంది. తమ యూనివర్శిటీ విద్యను పూర్తి చేసుకున్న అనంతరం ఆయన హెగెల్ భావవాదం పట్ల తన స్వంత విమర్శను అభివృద్ధి చేసుకున్నారు.

అప్పటినుండి మార్క్స్ రచనలన్నింటా ఈ విషయం నిరంతరం వ్యక్తమవుతుంటుంది. ఇలా సంక్షిప్తీకరించిన సూత్రాలను "జర్మన్ ఐడియాలజీలో చదివితే మరింత సంపన్నవంతమైన అవగాహనకు తోడ్పడతాయి చైతన్యం వర్గ సమాజంలోనే రూపుదిద్దుకుంటుంది అనే అర్థంలో అన్ని రకాల చైతన్యాలు అనుశ్రితంగానే వర్గ చైతన్యమనే మౌలిక అంశాన్ని మార్క్స్ ఆ గ్రంథంలో రూపుదిద్దారు. అలా చైతన్యం రూపొందడం పుట్టిన మరుక్షణంలోనే ప్రారంభమౌతుంది. ఆ విధంగా తాను పుట్టిన వర్గ చైతన్యాన్నే అతను పుణికి పుచ్చుకుంటారు. లేదా మరొకవర్గం యొక్క చైతన్యాన్ని అలవర్చుకోవచ్చు (ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానం ప్రచారం చేసిన చైతన్యాన్ని కార్మికవర్గం తన వంటబట్టించుకోవచ్చు) అంతే తప్ప వర్గరహిత చైతన్యం అనేది లేనేలేదు అనే అవగాహన మనకు కలిగిస్తుంది. ఎంతో లోతైన ఈ భావాన్ని అంటోనియోగ్రామ్‌స్కీ బాగా ఉపయోగించారు. సమాజంలో విభిన్నమైన, ఘర్షణాయుత భాగాల నుండి ఒకానొకరు తమ చైతన్యాన్ని సంతరించుకుంటారు. కనుక అలాంటి వైరుధ్యాలతో స్పష్టతలేని చైతన్యంగానే ఆయా వ్యక్తుల చైతన్యం వుండి తీరాలి వారిని విజ్ఞానవంతులను చేసే మహత్తర కృషి, అనుభవాల నుండి ఉత్పన్నమయ్యే ఆలోచనలు ఒకే పోరాటంలో సహ కామ్రేడ్స్‌తో ఆచరణ మూలంగా ఏర్పడే సంబంధాల ద్వారానే అస్పష్ట చైతన్యం స్పష్టత సంతరించుకుంటుంది అని ఆయన పేర్కొనడం ఇందుకు ఒక ఉదాహరణ. 'ప్రణాళిక'లో వ్యక్తమైన అవే ఆలోచనాంశాలను అంతకుముందు లేదా తరువాత మరింత స్పష్టతతో వ్యక్తం చేసిన రచనలను, అలాగే ఆ తరువాత కాలంలో మార్క్సిస్టుల ఆలోచనా పరంపరలను శ్రద్ధగా అధ్యయనం చేస్తే 'ప్రణాళిక' పట్ల ఫలవంతమైన దృక్పథాన్ని ఏర్పర్చుకునే మార్గమౌతుంది. వాటంతట అవే ఏ వాక్యానికి వాక్యంగా చూస్తే మార్క్స్ ఎంగెల్స్ ఏమి ఆలోచించారనే విషయంలో మనలను తప్పుదోవ పట్టించవచ్చు.

'ప్రణాళిక'ను రచనా కాలపు ఒక గ్రంథంగా మాత్రమే చదవవచ్చు. అందులో పెట్టుబడిదారీ సమాజపు మౌలిక అంశాలకు సంబంధించి కాలాతీతమైన అవగాహన వుంది. అయినా అది తన కాలపు పరిస్థితులను చిత్రించే గ్రంథం కూడా. ఉదాహరణకు కార్మికవర్గం తప్పనిసరిగా జోక్యం చేసుకోవలసిన విప్లవకర తిరుగుబాటు అతివేగంగా సమీపిస్తున్న కాలమిది, ఇది అందరూ గమనించారు. అందువల్ల కార్మికవర్గ ఉద్యమం ఒక తక్షణ పరిస్థితిని ఎదుర్కొంటుంది. అందువల్ల సరైన రాజకీయ విధానం ఎప్పుడో సుదీర్ఘ భవిష్యత్తుకు సంబంధించిన అంశంగాగాక, వెంటనే ఎదురయ్యే వర్తమాన సమస్యగా మారింది. నిజానికి 1848లో పారిస్‌లో విప్లవం బద్దలయింది. ఆ విప్లవం యూరప్‌లో ఈరోజు 13 దేశాలుగా పిలవబడుతున్న ప్రాంతమంతా దావానలంలాగా అంటుకుంది. ఆ ఘటనకు కొద్ది వారాలముందే 'ప్రణాళిక మొదటి ముద్రణ లండన్‌లో వెలువడింది. విప్లవ ప్రజాసమూహంలో అత్యధికులు పట్టణ కార్మికులు వుంటారని ఆశించారు. నిస్సందేహంగా ఆచరణలో జరిగింది. అదే. అంతర్జాతీయ వర్గ ఐక్యతకు, రాజకీయంగా స్వంత నిర్మాణాన్ని, కార్మికవర్గ స్వతంత్ర కార్యాచణలకు, విభిన్న దేశాల కార్మికులకు 'ప్రణాళిక' మహత్తరమైన పిలుపునిచ్చింది. అప్పటివరకు జరిగిన తిరుగుబాటులో ఏనాడు స్వతంత్ర కార్యాచరణలో కార్మికవర్గం సాధించలేని

అపూర్వమైన, వినూత్నమైన సమైక్యతకు, ఇచ్చిన ప్రణాళిక పిలుపు కమ్యూనిస్టులు ఇతర కార్మికవర్గ పార్టీలకు వ్యతిరేకంగా ప్రత్యేక పార్టీ ఏర్పరచరు అనే కార్యక్రమానికి సంబంధించిన వాక్యం. ఈనాటి పాఠకులకు, ఆనాటి పరిస్థితిని గ్రహించకుంటే అర్థం చేసుకోవడం కష్టతరమౌతుంది. (అ) కమ్యూనిస్టు లీగ్ అనేది ఒక చిన్న సంస్థ. ఈనాటి అర్థంలో దానిని ఒక రాజకీయ పార్టీగా మార్చడం నిష్ప్రయోజన చర్య లేదా సెక్టేరియన్ చర్య అయి వుండేది. (ఆ) ఆనాటి కార్మికవర్గంలో వివిధ భాగాలు సిద్ధాంత ప్రాతిపదికపై చాలా లోతుగా చీలివున్నాయి. ఈ సిద్ధాంత విభేదాలు మూడవ సెక్షన్లో వివరించారు. అందువల్ల కార్మికవర్గం "అంతటి పార్టీ" ఆ తరువాత కాలంలో ఏర్పడేందుకు ముందుగా ఇతర ధోరణులతో సిద్ధాంత చర్చ సాగించడం పార్టీ ఏర్పాటుకుముందు షరతుగా భావించారు. (ఇ) ఆనాటి యూరోపియన్ దేశాలలో రాజ్యాంగ బద్ధమైన, ప్రాతినిధ్య ప్రభుత్వం వంటి పోలికలన్నా వున్నా ప్రభుత్వాలు ఎక్కడా లేవు అందువల్ల విజయవంతమైన విప్లవకర ఎదురుదాడి చేయాలంటే రాజకీయంగా చురుకైన కార్మికవర్గ వివిధ సెక్షన్ల ఐక్యతేగాక, సెక్షన్ నాలుగులో ప్రజాతంత్ర పార్టీలుగా చిత్రించిన వాటితో కూడా ముందుగా ఐక్యత

3. ఈ లక్ష్యంతో, దృక్పథం నుండే 'ప్రజాస్వామ్యం కోసం సాగే సమరంలో విజయం సాధించడం' 'కార్మిక వర్గ రాజకీయ ఆధిక్యతను ఏర్పర్చేందుకు' విప్లవంలో మొదటి అడుగు'గా భావించారు. 'కార్మికవర్గ నియంతృత్వం అనే సంపూర్ణస్థితికి ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్ళడం'గా మరొక చోట అభివర్ణించారు మెజారిటీ ప్రయోజనాల కోసం మెజారిటీ కృషి చేసేందుకు హక్కుగా గూడా వివరించారు పెట్టుబడిదారీ విధానంలో అత్యధికులు కార్మికులుగా తయారుకావడం తప్పదు గనుక ప్రజాస్వామ్యమంటే మెజారిటీ పరిపాలన అని భావించారు గనుక మార్క్స్ కొన్ని సందర్భాలలో 'కార్మికవర్గ' అని మరి కొన్ని సందర్భాలలో 'ప్రజాస్వామిక' అని ఒకే అర్థంలో వాడారు. ఈ అర్థం వచ్చే విధంగానే మొదటి కార్మికవర్గ నియంతృత్వం అనే పదం రూపొందించారు ఇదంతా ఈ నాటి పాఠకుడికి గందరగోళంగా కనిపించవచ్చు. కాని ఆనాటి ఆలోచనల దృష్ట్యా పరిశీలిస్తే ఇందులో అర్థం స్పష్టం అవుతుంది

4 అజాగ్రత్తగా వుండే పాఠకుడికి 'ప్రణాళిక' పదజాలం అనే సమస్యలను తెచ్చిపెడుతుంది 'కండిషన్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లాండ్' అనే తన రచన మొదటి జర్మన్ ముద్రణకు ఏంగెల్స్ రాసిన పీఠికలో తాను కార్మికుడు, పారిశ్రామిక కార్మికుడు, కార్మికవర్గం, సంపద లేని వర్గం, పారిశ్రామిక కార్మికుని వంటి పదాలను ఒకే దృగ్గోచర విషయాన్ని వివరించేందుకు వాడానని రాశారు ఈ విషయం రైఖోవ్ పై పీఠికలో మన దృష్టికి తెస్తారు. అలాంటి సాధారణ అర్థమిచ్చే పారిశ్రామిక కార్మికుడు అనే పదం ప్రణాళికలోనూ కనిపిస్తుంది 'పారిస్ కార్మికవర్గం' అని అనాడు చెప్పిన వారిలో దివాలా తీసిన చేతివృత్తులవారు, బ్రతుకు తెరువుకై పోరాడుతూ దుకాణాల్లో, జీతంతో గాక మాటలతో బ్రతుకీడుస్తున్న ఎలాంటి ఆస్తిపాస్తులు లేని వివిధరకాల పట్టణ మురికివాడలలో నివసించే వారంతా కలిసి వున్నారు వారిలో అత్యధికులు ఆధునిక ఫ్యాక్టరీ ఉత్పత్తిలో భాగస్వాములు కానివారే అలాగే 'గ్రామీణ జీవితపు మౌఢ్యం' అనే పదం కూడా ఎంతో విమర్శకు గురైన మరొక ఉదాహరణ. ఈ పదం 'ఇడి యోటస్' పదంతో సమానం ఈ ఇటాలియన్ పదంతో సమానం ఈ ఇటాలియన్ పదానికి 'మూర్ఖత్వం, లేక తెలివిలేమితనం అనిగాక 'హ్రస్వదృక్పథం' 'సమాజం నుండి వేరుపడిన' అనే అర్థాలున్నాయి 'తన స్వంత వ్యవహారాలు తప్ప విస్తృతమైన ప్రజా సమూహాలకు సంబంధించిన విషయాలు పట్టని వ్యక్తి' అనే అర్థం వుండటం మరింత ఆసక్తికరమైన విషయం) అందువల్ల 'ఇడియట్' అనే మార్క్స్ వాడిన పదానికి 'ఒంటరిపాటైన అని ఒక అర్థంలోనూ 'వ్యక్తి భూయిష్టం' అనే మరో అర్థంలోను, మనం అన్వయం చెప్పుకోవాలి. రైతాంగం ఉత్పత్తి క్రమంలో వ్యక్తిగత స్వభావానికి పారిశ్రామిక కార్మికుల ఉత్పత్తిలో సమిష్టి స్వభావానికి మధ్య మార్క్సిస్టులు చేసే కీలకమైన తేడాతో అనుసంధానించి చూడాలి ఈ మాటలను, ఇలాంటి అపార్థాలకు, మనం పరిశీలిస్తున్న రచనలో అనేక పదాలున్నాయి దురదృష్టవశాత్తు ఈ అపార్థాలు సర్వ సామాన్యమైనాయి

సాధించడం అవసరమని భావించారు.[3] ఈ మొత్తం వర్గ ఐక్యతను కేంద్రంగా నొక్కి చెప్పడంతో ఈ సూత్రం వేరుగా ముడిపడి వుంది. 'ప్రపంచ కార్మికులారా! ఏకంకండి' అనే నినాదంతో ఈ పుస్తకం పూర్తి ఔతుంది. సాయుధ పోరాటపు ఈ పిలుపులో కార్మికులందరి ఐక్యతాభావం ప్రతిఫలిస్తుంది.[4]

ప్రణాళికను ప్రత్యేకించి మొదటి సెక్షన్‌ను కేవలం తాత్విక దృక్పథపు కోణంనుండే పరిశీలించవచ్చు. మార్క్స్ ప్రధమ అభ్యాసం, అతి కఠినమైన అభ్యాసంకూడా, తాత్విక రంగంలోననేది గుర్తుచేసుకోవాలి. స్పినోజా, కాంట్, హెగల్‌ల ఆలోచనలలో చాలా లోతుగా కూరుపోయారు. ఫూయర్‌బా వంటి వందలాది చిన్న తరహా తాత్వికుల ఆలోచనా ధోరణులను కూడా బాగా అధ్యయనం చేశారు. ఆనాటి జర్మన్ యువకులలో ఫ్యూయర్‌బా చాలా ప్రభావం కలిగించేవాడు. హెగెల్ ప్రభావం, ప్రత్యేకించి, చాలా ఎక్కువగా వుండేవి. మార్క్స్ తాత్వికంగా చరిత్ర ప్రతి అడుగులోనూ హెగెల్ ఆలోచనలలో ఏదో ఒక అంశంతో సంబంధం కలిగే వున్నారు. కార్మికవర్గ చైతన్యం 'నిజమైన' చైతన్యం అనే భావన హెగెల్ రచన ఫినామినాలజీ అనే గ్రంధలో బానిస యజమాని బానిస గతితర్కం గురించి హెగెల్ చెప్పిన దానికి పూర్తి అనుగుణంగా వుంటుంది. తనను గురించి, యజమానిని గురించి కూడా బానిసకే ఎప్పుడూ ఎక్కువ తెలిసి వుంటుందని ఆయన వాదిస్తాడు. అందువల్ల మొత్తం సమాజం గురించి జ్ఞానం కూడా ఎక్కువేనని కూడా వాదిస్తాడు. తనను గురించి తాను తెలుసుకోవడమే గాక, మొత్తం బానిస వ్యవస్థగురించి కూడా తెలుసుకోవాలి. యజమానికి అలాంటి అవసరం లేదు తనకు సేవచేస్తాడు అనే విషయం తప్ప బానిస గురించి అదనంగా తెలుసుకోవలసిన అవసరం అతనికి లేదు.

హెగెల్ దృష్టిలో రాజ్యాంగ యంత్రం అత్యున్నత సంస్థ. పౌర సమాజంలో వుండే వైరుధ్యాలను సామరస్యంగా పరిష్కరించడంలో ఎలాంటి ఆసక్తిలేని యంత్రాంగం. ఇందుకు పూర్తి విరుద్ధంగా మార్క్స్ దృష్టిలో రాజ్యాంగ యంత్రం అనివార్యంగా పాలకవర్గాల చేతిసాధనం. నిజానికి 'ప్రణాళిక'లో మార్క్స్ రాజ్యాంగ యంత్రం గురించిన తన సిద్ధాంతాన్ని ఎంతో పొదుపైన మాటల్లో వివరించాడు. విద్యార్థిగా వుండగానే హెగెల్ రచనను, ప్రతిభాగాన్ని ఏ భాగానికి ఆ భాగం బాగా సన్నిహితంగా, విమర్శనాయుతంగా చదివిన సందర్భంలోనే మార్క్స్ సిద్ధాంత భావాలు తలెత్తాయి. ఎవరైనా ఇంకా ముందుకుపోయి రాజ్యమంటే సామాజిక సామరస్యం సాధించే అత్యున్నత రూపంగా చిత్రించిన హెగెల్ భావాల నిరాకరణే మార్క్స్ రాజ్యాంగ యంత్ర సిద్ధాంతమని కూడా వాదించవచ్చు. ఆ నిరాకరణే రాజ్యాంగ యంత్రం సామాజిక ఘర్షణల నివారణకుగాక, ఆ ఘర్షణల స్పష్టమైన వ్యక్తీకరణగా వుంటుందనే మార్క్స్ సైద్ధాంతిక శోధనకు దారి తీసింది. ఆ సిద్ధాంతం చివరకు వర్గపోరాట సిద్ధాంతాన్ని ఆవిష్కరించేందుకు తోడ్పడింది వర్గఘర్షణే ఏ సమాజంలోగాని అత్యంత మౌలిక ఘర్షణ. ఏ రాజ్యాంగ యంత్ర అధికారంగాని, ఈ ఘర్షణలో మధ్యవర్తిగా వుండజాలదు, ఘర్షణను తాత్కాలికంగానైనా రద్దుచేయలేదు అనేదే



సుందరయ్య గ్రంధాలయ
A C. No 83332

వర్గ పోరాట సిద్ధాంతం. మార్క్స్ ఎంతో జాగ్రత్తగా రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలను అధ్యయనం చేసి వాటి ఆచరణ నుండి నిత్యజీవిత అనుభవంనుండి తన సిద్ధాంతాన్ని రుజువు చేయడానికి ముందే హెగెల్స్‌తో తన భావఘర్షణ తేల్చుకునే సందర్భంలో మొదట తాత్విక రంగంలోనే తన సిద్ధాంతానికి అవసరమైన వాదనలు చేశారు.

మరొకవైపు దేశాల, వివిధ జాతుల ప్రజలమధ్య శాంతియుత సంబంధాలకు, స్నేహానికి వాణిజ్యం ఒక సాధనంగా కాంట్ వివరించారు. ఈ భావాన్ని సవాలు చేసేందుకు అనువుగానే కాంట్ భావాలను ప్రతిఘటించేందుకే వాణిజ్యం ఆధిపత్యానికి గురైన జాతుల ప్రాంతాల ఆక్రమణకు ఒక సాధనమని తీవ్రంగా నిరసించారు. ఇలా గతంలో తాత్వికరంగంలో నిష్ణాతులుగా పేరుగాంచిన వారందరితో మార్క్స్ రాజకీయ సిద్ధాంతాలనుండి తాత్విక చింతనల వరకు విస్తృత రంగాలలో ఈ తాత్విక ఘర్షణ సాగించారు. ఇలాటి ఉదాహరణలు ఇంకా చాలా చూపించవచ్చు. ఇక్కడ ప్రధానాంశం ఒకటే. రాజకీయ అర్థశాస్త్రాన్ని గురించి తిరుగులేని విమర్శలతో మార్క్స్ రాజకీయ అర్థశాస్త్ర ఆచార్యుడు అయ్యారు ఆ తరువాత కాలంలో, అయితే 'ప్రణాళిక' రచనకు ముందుగానే ఆయన తత్వశాస్త్రంపై విమర్శను కొనసాగించారు. ఈ విమర్శ ఎంత కీలకమైన మౌలిక విమర్శంటే, ఎంత విస్తృతంగా సాగిందంటే ఆనాటి ఫ్రెంచ్ తాత్విక వేత్త బాలిబర్ మార్క్స్ విమర్శను "తాత్వికవ్యతిరేకత"గా అభివర్ణించారు.[5] తత్వ వేత్తలు ఆనాడు భావవాదంలో కూరుకుపోయి వున్నారు. మార్క్స్ రచన 'జర్మన్ ఐడియాలజీ'లోని భాషంతా భావవాదజాల పదజాలాలతో నిండి వుంటుంది. అయినప్పటికీ ఉదాహరణకు జర్మన్ భావవాద తత్వవేత్తలు తాత్వికులుగా బ్రతుకుతున్న తీరులో తాను తత్వశాస్త్రవేత్తగా బ్రతకరాదని మార్క్స్ దృఢనిశ్చయానికి వచ్చారు. మరొక మాటలో చెప్పాలంటే విషయమిది. తాత్విక వాద ప్రతివాదాల ధోరణిని ఆయన ఎంత విస్తృతంగా కరతలామలకం చేసుకున్నారంటే, అదే "తాత్విక వ్యతిరేకత'ను సాధ్యపరచిందని కూడా మనం చెప్పుకోవచ్చు. తాత్విక దృక్పథాలైన చైతన్య సిద్ధాంతం, గతితర్కం, విశ్వవ్యాపిత, నిర్దిష్టత లాంటివన్నీ ఆయనకు కొట్టినపిండి ఆయన అవగాహన అంత లోతైనది. ఆయన అవగాహనను అర్థంచేసుకోవాలంటే సరళమైన, స్పష్టమైన ఆయన వచనరచన మాటున అలవోకగా ఆయన వ్యక్తంచేసే తాత్విక ఆలోచనల భారం మనం గమనించాలి. "విశ్వవ్యాప్తి" గురించిన ఆయన 'ప్రణాళిక'లో వ్యక్తంచేసిన భావం, ఈ ప్రత్యేక విషయంపై 18,19 శతాబ్దాల యూరోపియన్ తత్వశాస్త్ర వారసత్వమంతటినీ చిటికెలో తల్లక్రిందులు చేస్తుంది. ఈ విధంగా ఈ భావాన్ని తీవ్రమైన, నూతన మార్గంలో వినియోగించిన, పునర్ వ్యాఖ్యానించిన తీరుగురించి నేనే ఒక వ్యాసం ప్రకటించాను [6]

'ప్రణాళిక'ను అనేక దృక్కోణాల నుంచి పరిశీలించవచ్చు. ఈ దృక్కోణాలన్నిటి నుండి

5. ఎటినే బాలిబర్ దఫిలాసఫీ ఆఫ్ మార్క్స్" లండన్ 1995 ఫ్రెంచి మాతృక 1993

6. కమ్యూనిస్టు ప్రణాళిక – విశ్వతత్వం సమస్య – లెజబ్ అహ్మద్ మంత్లీ రివ్యూ జూన్ 1998

పరిశీలించి రాయదలచుకొంటే ఎవరైనా నిరంతరం రాస్తూనే వుండవచ్చు. ఇది ఎంతో సంక్లిష్టమైన రచన. కాని ఆరచన ఎంత సంపన్నవంతమైనదో, ఎంత సంక్లిష్టమైనదో, ఎంత అర్థంకాని విషయంగా గందరగోళ పరుస్తుందో, ప్రధానంగా ఉదాహరణలు ఇవ్వడం ద్వారా అందరికీ తెలియజెప్పేందుకే ఈ పరామర్శ అంతటా నా ప్రథమ ప్రయత్నం. 'ప్రణాళిక' చివరి సెక్షన్లపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయకుండా మొత్తం మీద నన్ను నేను నివారించుకున్నాను. నిజానికి ఆ సెక్షన్‌లోనూ అనేక ఆశ్చర్యకరమైన విషయాలు వున్నాయి. ఒకసారి ప్రతీఘాత సోషలిజంపైన 'ఊహాజనిత సోషలిజం' పైన మార్క్స్ రచనను చదివితే, ఆలోచిస్తే భారత దేశంలో రాజకీయ భావాలలోగల అనేక అంశాలు ఆ విమర్శకు తగినవేమోననే ఆలోచనలకు చేరుతాము. ఈ రాజకీయ భావాలలో గాంధీజీ భావాలూ వున్నాయి. (మార్క్స్ చర్చించిన నిర్దిష్ట ఊహాజనిత వాదుల ప్రభావం గాంధీజిపై లేకున్నా) గాంధీజీ ఊహాజనిత ఉద్యమాలతో తీవ్రంగా ప్రభావితులైనారు. అలాగే కార్లైయిల్, టాల్‌స్టాయ్, రస్కిన్‌వంటి వారు పెట్టుబడిదారీ విధానంపై మితవాద, మితవాద పక్షాల వారు సాగించిన విమర్శల ప్రభావం కూడా ఆయనపై వుంది. తగినంత చోటులేక దీనంతటినీ పక్కకు పెట్టాను. కొన్ని సమస్యలపై నేను కొంత సుదీర్ఘ వ్యాఖ్యలను చేయాలనుకుంటున్నాను. అవి దానితో సంబంధంగల కొన్ని సమస్యలను ముందుకు తెస్తాయి. బూర్జువా వర్గం విప్లవకర వర్గంగా ఏ అర్థంలో, ఏ మేరకు భావించబడింది? తరువాత కాలంలో ఆవిష్కృతం కానున్న ప్రపంచీకరణను ఆయన చిత్రీకరించిన తీరులో మార్క్స్ అంతే ఖచ్చితమైన పెట్టుబడిదారీ ఆర్థిక విధానపు చిత్రాన్ని దానితో రూపొందే రాజకీయ, భావావేశపు తీరులను విశదీకరించారా? అలాగే ఆనాటి, ఈనాటి కార్మికవర్గం గురించి మనం ఏమి నేర్చుకుంటామో?

## 'విప్లవకర' బూర్జువా?

'ప్రణాళిక' కార్మికవర్గాన్ని భవిష్యత్ విప్లవ వర్గంగా ప్రకటించింది. (బూర్జువా సమాజపు గోరి త్రవ్వేవారు) అదే ప్రణాళిక పాత సమాజాన్ని రద్దుచేసి, మొత్తం భూగోళంపై తన ఆధిపత్యాన్ని నిర్మించుకున్న బూర్జువా వర్గ విజయాలను వివరిస్తుంది. అని అనేకమంది వ్యాఖ్యాతలు గమనించారు. [7] 19వ శతాబ్దంలో ప్రాచుర్యంలో వున్న పాజిటివిజంలోని ప్రొగ్రెసివిస్ట్ సిద్ధాంతం (క్రమమైన పెరుగుదలలను) ఆ సిద్ధాంతం ప్రకారం ఆధునికతకు హీరో బూర్జువా వర్గం, నిరంతర పురోగతి చరిత్రే చరిత్ర మార్క్స్ ఈ సిద్ధాంతం ప్రభావంలో పడ్డాడని గూడా కొందరు

7 ఈసమస్యకు సంబంధించి ఎంతో ఉత్సాహం గొలిపే ప్రకటన ఎలెన్ మెయిక్సిన్ వ్యాసం'150 సంవత్సరాల తరువాత కమ్యూనిస్టు ప్రణాళిక' అనే వ్యాసంలో కనిపించింది. 1998మే 'మంత్లీ రివ్యూ' నూతన ముద్రణలో చేర్చారు. ఈ క్రింది కొద్ది పేరాలలో నేను వ్యాస భాగాలను ఉపయోగించుకున్నాను. అదే సమయంలో అత్యంత సూక్ష్మమైన ఆ విశ్లేషణ నుండి దూరమైనాను గూడా

రుజువుచేసే ప్రయత్నం చేశారు. మొదటి అంశంలో ఒక మేరకు నిజం వుండవచ్చు. చివరి భాగం మాత్రం అర్థరహితం.

'ప్రణాళిక'లో అభివృద్ధిలో ఆవిష్కృతమయ్యే సాంకేతికత వివరణ ప్రధాన సూత్రం కాదు. (ఎప్పటికప్పుడు మరింత మెరుగుదలవైపు ఒకే మార్గాన సాగే అభివృద్ధి కాదు) చరిత్రలో ఒకే సమయంలో వ్యక్తమయ్యే నిర్మాణము వినాశనము గురించిన విరుద్ధ క్రమాన్ని 'ప్రణాళిక' వివరిస్తుంది. ఆ వైరుధ్యాన్ని పరిష్కరించుకోలేని తానే ఉత్పన్నం చేసి వైరుధ్యాలను అదుపు గూడా చేయలేని స్థితి ఏర్పడే వరకు ఈ పరిణామం కొనసాగుతుంది. కార్మికవర్గం విప్లవ సాధనలో విజయవంతమైతే అదే విప్లవం బద్దలయ్యే క్షణం. లేదా 'ప్రణాళిక'లోనే పేర్కొన్నట్లు, విప్లవకర పరిష్కారం కనుగొనకపోతే పోరాటంలోని విభిన్న వర్గాల పరస్పర నాశనం[8] చరిత్ర ఎల్లప్పుడూ ప్రగతిబాటలోనే పయనిస్తూంటే విప్లవం అవసరమే లేదు. అంతకుముందున్న ఉత్పత్తి విధానాలతో సంబంధించిన, వాటితో సరస్పర సంబంధంగల రాజకీయ అంగాలకు సంబంధించి బూర్జువావర్గపు ప్రగతి శీల పాత్రను మార్క్స్ ఆ తరువాత మార్క్సిస్టులు ఎలాంటి భావాలు వ్యక్తం చేశారు? పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం గురించి వినాశపు విశ్వవ్యాపిత సమరంగా 'ప్రణాళిక'లో చిత్రించిన రచయితలు, లేదా ఈ క్రింది వ్యాక్యాలను రాసినవారు ఆ పదపు అనుకూల అర్థంలో బూర్జువావర్గ పాత్రను కేవలం లేదా ప్రధానంగా విప్లకరంగా బావిస్తున్నారని అనుకోలేమని చెప్తే సరిపోతుంది.

"అదే (పెట్టుబడిదారీ విధానం) వ్యక్తిగత విలువలనన్నిటినీ మారకపు విలువలు'గా మార్చివేసింది. అసంఖ్యాకమైన, రద్దు చేసేందుకు వీలులేని స్వాతంత్రాలస్థానే మార్పుకు అవకాశంలేని స్వాతంత్ర్యంగా ఒకే ఒక స్వాతంత్ర్యాన్ని ప్రతిష్టించింది. – అదే స్వేచ్ఛా వాణిజ్యం. ఒక ముక్కలో చెప్పాలంటే దోపిడీ స్థానంలో, మతం, రాజకీయ భ్రమల ముసుగులో నగ్నమైన,

---

8. రోజా లగ్జంబర్గ్ ఈ ప్రత్యామ్నాయ అవకాశాల సారాంశాన్ని వివరించారు పెట్టుబడిదారీ విధానం సోషలిజానికి తప్పక దారి తీయదు అని ఆమె అనడం విషయాన్ని సూక్ష్మంగా నిండు అర్థంతో వివరించడమే అందువల్ల మానవాళికి ఎన్నుకునేందుకు అవకాశం వుండేది. సోషలిజం ఆటవికత అయితే ఈనాటి అనుకూల స్థితి నుండి చూస్తే మార్క్స్ ఉపయోగించిన పోరాటంలోని భిన్న వర్గాల పరస్పర సంహారం అనే పదమే సరియైనదిగా తోస్తుంది పెట్టుబడిదారీ ఆధిపత్యం ఈనాడు సాధించిన విజయంతో అవసరాన్నిమించి సదభిప్రాయం కలిగి వారికి తోచిన దానికన్నా ఇందుకు అసంఖ్యాక ఉదాహరణలు వున్నాయి కాని ఒకదానికే మేము పరిమితమౌతాము. లాభాల వేట ధ్యేయంగా సాగే పెట్టుబడిదారీ విధానంలో అనూశ్రుతంగా వుండే మౌలిక వైరుధ్యం వినాశనం మొదట నెమ్మదిగానే వున్నా, క్రమంగా మరింత విస్తృత వినాశనంగా పరిణమిస్తుంది. మానవజీవితపు ఉనికి కొనసాగింపుకు అవసరమైన పర్యావరణ వినాశం మనకు స్పష్టమవుతున్నది. పర్యావరణ రీత్యా క్షేమకరం కాని భూగోళంలో ఈనాడు మనం నివసిస్తున్నాం రానున్న కొన్ని శతాబ్దాలలో మానవజాతి మనుగడ విశ్వాసంతో కొనసాగుతుదని గుండెలమీద చేయివేసుకొని చెప్పగల స్థితిలో మనం లేనంతగా పర్యావరణం నాశనమైంది 'ఘర్షణలో గల అన్ని వర్గాలకు సమానంగానే ఈ ప్రమాదం ఆవరిస్తున్నది

సిగ్గులేని, ప్రత్యక్ష, రాక్షస దోపిడీని ఆవిష్కరించింది. వైద్యుడిని, లాయర్‌ను, మతగురువును, కవిని, శాస్త్రవేత్తను తాను వేతనాలు చెల్లించే కార్మికునిగా మార్చివేసింది... అది అన్ని బూర్జువాదేశాలను, లేకుంటే అదృశ్యమైపోతారనే భయం కల్పించి, బూర్జువా ఉత్పత్తి విధానం అమలు జరిపేలా వత్తిడి తెస్తుంది. తాను నాగరికతగా చెప్పే జీవితాన్ని వారి మధ్య ఏర్పరచుకొనేలా బలవంతం చేస్తుంది. అంటే వారిని సహితం బూర్జువాలుకమ్మని వత్తిడి తెస్తుంది. తన ప్రతిబింబంగా ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

"తాను నాగరికతగా చెప్పే" అనే వ్యంగ్యపదం చూస్తే ఆ తరువాత కాలంలో వలసలను ఏర్పర్చే బూర్జువావార్గం గురించి ఎంతో అసహ్యం వుట్టిపడేలా ఏంగెల్స్ ప్రయోగించిన "నాగరికత-కాంక్షితులు" అన్న పదం గుర్తుకు వస్తుంది. ఇవి అంతులేని ద్వేషంతో, ఖండనకు ప్రయోగించే పదాలు తప్ప, కల్తీలేని ఉత్సాహంతోవాడే మాటలు కావు.

'ప్రణాళిక' కార్మికవర్గాన్ని ఒక ఎదుగుతున్న విప్లవవర్గంగా మాత్రమే చిత్రించారని, బూర్జువా వర్గ విజయాలను గురించి చెపుతున్నారనే - రెండో అంశం - నిజంగా సరైనదే. ఈనాడున్న పరిస్థితులను అభివర్ణించి, దాని నుంచి భవిష్యత్ కర్తవ్యాలను నిర్ధారించే అతి సూక్ష్మగ్రాహ్యంగా వుండే మార్క్స్ పద్ధతికి సంబంధించిన విషయమిది. ఒక విషయం గుర్తుకు తెచ్చుకోవడం బాగుంటుంది. ఆనాటికి బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశమైన బ్రిటన్‌లో సహితం పరిమిత ట్రేడ్ యూనియన్ హక్కులు వచ్చి అప్పటికి 25 సంవత్సరాలు కూడా కాలేదు. అలాగే మొదటి కార్మికవర్గ పార్టీగా భావించడానికి వీలయ్యే చార్టిస్టు ఉద్యమం ప్రారంభమై ఒక దశాబ్దకాలం కూడా కాలేదు. దానిని విప్లవకరమైనదిగా కూడా పిలవడానికి లేదు. ఎనిమిది గంటల పనికోసం విజయవంతంగా సాగిన పోరాటం ఆ తరువాత కాలంలోనే వచ్చింది. ఐరోపాలో విస్తృత ప్రజాబాహుళ్యం అండగాగల కార్మికవర్గ పార్టీలు "ప్రణాళిక" ప్రచురించిన దాదాపు 40 ఏండ్లకు, 1880లో ఏర్పడ్డాయి. 'ప్రణాళిక' ఎవరికోసమైతే రాశారో ఆ కమ్యూనిస్టు లీగ్, సహితం జర్మనీ నుండి వలసవచ్చి లండన్‌లో తలదాచుకుంటున్న వారి చిన్న సంస్థ. అంతకంటే తక్కువ సభ్యులుండే శాఖలు యూరప్‌లో కొన్ని నగరాలు వుండేవి. భవిష్యత్‌లో కార్మికవర్గం నిర్వహించాల్సిన విప్లవపాత్రపట్ల మార్క్స్ భావన, సిద్ధాంతీకరణ అత్యంత గొప్పవి. కమ్యూనిస్టు లీగ్‌తో దానిని ముడిపెట్టగలిగేది కాదు. 'ప్రణాళిక' ఆ పార్టీ ప్రణాళికా అయినా రచనలో ఆ సంస్థపేరు కూడా కనిపించదు. కార్మికవర్గ విప్లవకర పాత్రను 'ప్రణాళిక' ప్రస్తావించకపోవడానికి సముచిత కారణముంది. ఆనాటివరకు జరిగిన అన్ని విప్లవాలలో కార్మికవర్గం పెద్ద పాత్రనే నిర్వహించింది. కాని దాని సహాయక పాత్రకు చరమగీతం పాడుతూ సాయుధ పోరాటానికి పిలుపును మార్క్స్ రచిస్తున్నారు. తన స్వంతహక్కుగా, ఒక విప్లవకరవర్గంగా కార్మికవర్గాన్ని చరిత్ర రంగంపైకి మొదటిసారిగా ప్రవేశపెడుతున్నారు. కార్మికవర్గ విప్లవకర విజయాలు మార్క్స్‌కు కరువుకాదు. అలాంటివి అనేకం ఆయనకు తెలుసు. ఆ విషయం అంత ప్రాధాన్యత కలదికాదు. ఇక్కడ ముఖ్యమైన అంశం భవిష్యత్ గురించి చెప్పిన విషయాలలో

వుండే గుణాత్మక విలువ. పెట్టుబడిదారీ విధానం గురించి ఆయన వివరణ 1848లో రూపొంది వున్న పెట్టుబడిదారీ విధానం గురించికాదు. అది ఆ తరువాత ఎంతో కాలానికి ఎత్తిన అవతారాన్ని అభివర్ణించారు, అలాగే విప్లవానికి మూలం కాగల వర్గం గురించిన ఆయన భావజాలం సహితం అలాంటి భవిష్యత్‌ను గురించిన అసాధారణ భావనే.

పాత దోపిడీ వ్యవస్థలతో అనుసంధానించి చూసినప్పుడు, బూర్జువావర్గాన్ని ఒక వర్గంగా పరిశీలించినప్పుడు, అది నిస్సందేహంగా విప్లవకరపాత్ర వహించింది. అదే సమయంలో సంక్షోభపు పునరావృతి నుండి తనను తాను బయటవేసుకోవడంచేతగాని వర్గంగా కూడా చిత్రించారు. (ఉదాహరణకు 'అతి ఉత్పత్తి జాడ్యం) 'విశ్వవ్యాప్త వినాశకర సమరం' ఇక విప్లవకర పాత్ర ఏమిటి?

'ప్రణాళిక' తీవ్రంగా భిన్నమైన రెండు అర్థాలలో బూర్జువావర్గాన్ని విప్లవకర వర్గంగా భావిస్తుంది.. పూర్తిగా భిన్నమైన బ్రిటన్, ఫ్రాన్స్‌ల అనుభవం నుండి రెండు విభిన్న అర్థాలను స్వీకరించింది. ఒకవైపు ప్రధానంగా ఆర్థికరంగంలోనూ, ఆ ఆర్థికరంగ పునరుత్పత్తి విస్తృతికి అవసరమైన సామాజిక సంబంధాల రంగంలోనూ వాస్తవంగా దానికి విప్లవపాత్ర వుంది. ఈ విషయంలో ప్రధానంగా బ్రిటీష్ పెట్టుబడిదారీ వర్గ అనుభవం నుంచి మార్క్స్ గుణపాఠాలు తీసుకున్నారు. ఉత్పత్తి శక్తులను సంబంధాలను నిరంతరం విప్లవీకరించడం, ఆస్తిలేని ప్రజల సంఖ్యను ఎప్పటికప్పుడు గరిష్టస్థాయికి చేర్చడం, అదనపు విలువ రేటును గరిష్ట పరుస్తుండడం, వేతన సంబంధాలను 'డబ్బు సంబంధాల'ను సర్వవ్యాపితంగా విస్తృత పరుస్తుండడం, భూగోళపు మారుమూలలకు సహితం మార్కెట్ సంబంధాలను తీసుకుపోవడం అనేవి బూర్జువావర్గానికి ఎంత అవసరమో కేంద్రీకరించి వివరిస్తారు. ఇది పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి తర్కం. ఆనాటికి బ్రిటన్‌లో మాత్రమే ఆధిపత్యం వహించే వర్గంగా పారిశ్రామిక బూర్జువావర్గం పరిపూర్ణంగా ఆవిర్భవించింది. అయినాసరే బాగా అభివృద్ధి చెందిన ఏదేశంతో పోటీ పడదలచుకున్న ఇతర ఏ జాతీయ బూర్జువావర్గపు నడక అయినా ఇదేనని గ్రహించగల వివేకవంతుడు మార్క్స్. ఆయన మిగతా జీవితకాలంలో బ్రిటన్ అదే ప్రథమస్థానంలో కొనసాగింది. అనే విషయం వాస్తవం. కాని అతి త్వరలోనే అలాంటి కేంద్రాలు అభివృద్ధి చెందాయి. ఫ్రాన్స్ కన్నా జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. అది ఒక రకమైన సామ్రాజ్యవాద శత్రుత్వాలకు దారితీసింది. అయితే ఈ శతృత్వం వ్యాపారయుగపు వలస పోటీలకన్నా గుణాత్మకంగానే భిన్నమైనది

మరొకవైపు బూర్జువావర్గానికి స్వీయమానసికపరమైన విప్లవకర పాత్రగూడా వుండేది. అది ప్రధానంగా రాజకీయరంగానికి సంబంధించింది. ఫ్రెంచి విప్లవంలో ఇది గుర్తించదగినంతగా వ్యక్తమైంది. అలాగే 1848 వరకు ఐరోపాలో వచ్చిన తిరుగుబాట్లు అన్నిటిలో ఫ్రాన్స్‌లో వచ్చిన తిరుగుబాట్లు అన్నిటా, ఈ ధోరణి పునరావృతమైంది. ఆధునిక బ్రిటీష్ రాజ్యాంగ యంత్రం పాత భూస్వామ్యవ్యవస్థ, కొత్తబూర్జువా వర్గాల మధ్య ఏర్పడిన వర్గ రాజీ

పునాదిగా రూపొందింది. ఈ క్రమంలో పాత భూస్వామిక శక్తులు భూమి కౌలు(గ్రౌండ్ రెంట్) పొందే బూర్జువావర్గంగా పరివర్తన చేసుకుంది. బ్రిటన్‌పై తన రచనలన్నిటా ఈ విషయం ఏంగెల్స్ నొక్కి చెప్పారు. ఫ్రాన్స్ అనుభవం భిన్నమైనది. జాకోబిన్, కమ్యూనిస్టు శక్తులు కూడా కలసిన ఫ్రెంచి విప్లవం పాత వ్యవస్థను, అది ఆధారపడి వున్న సాంఘిక వ్యవస్థను నాశనం చేయచూశాయి. కాని ఆ వ్యవస్థ పునరావృతం కావడంతో నూతన, లౌకిక, ప్రాతినిధ్య రాజ్యాంగాన్ని నిర్మించేందుకు, వరుసగా జరిగిన విప్లవ తిరుగుబాట్లకు మాత్రమే దారితీసింది. బ్రిటీష్ పెట్టుబడిదారీ వర్గ విప్లవకరపాత్ర ఆర్థికరంగంలో వివిధవర్గాల విభజనకు దారితీసింది. 'డబ్బు సంబంధాల'లో సర్వవ్యాపితత్వం నెలకొన్నది. ఫ్రెంచి విప్లవ అనుభవం ఇందుకు భిన్నమైనది. వర్గ విభజన వున్నా పౌరులకు పౌర, న్యాయ సమానత్వం ఏర్పర్చేందుకు ప్రయత్నించింది. బ్రిటీష్ బూర్జువావర్గం రాజకీయ క్రమంనుండి కార్మికవర్గాన్ని దూరంగా వుంచేందుకు తాను చేయగలిగిందంతా చేసింది. పందొమ్మిదవ శతాబ్దపు మూడవ దశకం వరకు కనీస ట్రేడ్ యూనియన్ హక్కులను సహితం యివ్వలేదు. ఫ్రెంచి బూర్జువా వర్గం తాను పూనుకున్న ప్రతి విప్లవ కెరటంలోనూ పౌర సమానత్వం కొరకు జరిగే పోరాటాన్నిటా హక్కులే లేని, కార్మికవర్గ రూపం చెందిన ప్రజా సమూహాలను చురుకైన పాత్ర వహించేలా నిర్మాణయుతం చేసే ప్రయత్నం చేసింది. అయితే ఆ బూర్జువావర్గం గూడా తమంతట తాము స్వతంత్ర 'కాంబినేషన్లు'లో (ఆనాడు వాటిని అలా పిలిచేవారు) నిర్మాణయుతంకావాలనే కార్మికవర్గ ఆకాంక్షలను అత్యంత దారుణంగా అణచివేసింది. బ్రిటీష్ రాజకీయ ఆర్థిక వ్యవస్థ స్వేచ్ఛా మార్కెట్ సిద్ధాంతాన్ని పరిపూర్ణంగా అభివృద్ధి చేయగా, ఫ్రెంచి బూర్జువావర్గం సామాజిక, ఆర్థిక, మత స్వాతంత్ర్యపు రంగాలలో విస్తృత సిద్ధాంతాలకు రూపకల్పన చేసింది. బ్రిటీష్ ఫ్యాక్టరీ ఉత్పత్తి మిగతా ప్రపంచంలో, ప్రత్యేకించి సామ్రాజ్యవాద కేంద్రాలలో, ఆ తరువాతికాలపు పారిశ్రామికీకరణకు నమూనాను సమకూర్చగా, 'స్వేచ్ఛ, సమానత్వం, సౌహార్ధత' అనే ఫ్రెంచి సిద్ధాంతాలు ఈనాటివరకు జరుగుతున్న ప్రతిపక్ష రాజకీయ ఆందోళనలపై తమ ముద్ర వేశాయి. సరిగా ఈ నిర్దిష్ట అర్థంలోనే ఎన్‌లైటన్‌మెంట్ పథకాన్ని మార్క్సిజం తనలో యిముడ్చుకొని వర్గ జాడ్యాన్ని తొలగించడంపై కేంద్రీకరించడం ద్వారా దానిని అధిగమించే ప్రయత్నం చేస్తుంది. "స్వాతంత్ర్యం" గురించిన రిపబ్లికన్ ఆలోచనలలోగల వర్గ స్వభావ సమస్యపైనే ఫ్రెంచి ఆలోచనా ధోరణులను మార్క్స్ అతినిశితంగా విమర్శించారు.

మార్క్స్- ఏంగెల్స్‌లు బ్రిటన్‌లో స్థిరపడిన జర్మన్‌లు, వారికి పారిస్, బ్రసెల్స్‌వంటి స్థలాల పట్ల అత్యంత సన్నిహిత విషయజ్ఞానంవుంది. అందువల్లనే యూరోప్‌లో బూర్జువావర్గ విభిన్న అనుభవాలను వారు అవగాహన చేసుకున్నారు. అదేవిధంగా బ్రిటీష్ బూర్జువా వర్గపు లేదా, ఫ్రెంచి బూర్జువావర్గపు 'విప్లవకరపాత్ర'ను ఆకర్షవంతంగా చూపలేదు. బ్రిటీష్ బూర్జువావర్గం ఆవిర్భవం వెనుకగల అనేకానేక మోసపూరిత మార్గాలను 'పెట్టుబడి' గ్రంథంలోని ప్రాథమిక పెట్టుబడి సమీకరణను గురించిన అధ్యాయాలు వివరించగా, బ్రిటీష్ పెట్టుబడిదారీ

విధానపు 'విప్లవకర'దశలో అనూశ్రితంగా వున్న అత్యధిక ప్రజల నైతిక, వాస్తు దిగజారుడును ఏంగెల్స్ రచన 'కండిషన్స్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లాండ్'లో చిత్రించారు. మార్క్స్ పరిపక్వరచన ప్రధానంగా బ్రిటిష్ రాజకీయార్థిక విధానపు విమర్శగా ఉద్దేశింపబడింది. ఆ రాజకీయార్థిక విధానం భ్రమాపూరితమైన శాస్త్రమని, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ ప్రత్యేకమైన తీరుకు అది ప్రతిబింబంగా వుంటుందని బహిర్గతం చేసేందుకే ఆ విమర్శ. ఆవిధంగా 'స్వేచ్ఛామార్కెట్' అనబడేది వాస్తవంలో ఎంత స్వేచ్ఛారహితమైనదో బహిర్గతం చేస్తారు. అలా మార్కెట్ స్వేచ్ఛ ఏవిధంగా గుత్తాధిపత్యానికి దారితీస్తుందో విశదీకరిస్తారు. అలాగే బ్రిటిష్ రాజ్యాంగ యంత్రాన్ని విశ్లేషించే విధానం భ్రమపూరితమైన శాస్త్రమని, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికీ ప్రత్యేకమైన తీరుకు అది ప్రతిబింబించే సందర్భంగా భూస్వామ్య శక్తులు అరాజ్యాంగ కీలక సంస్థలలోకి ఏమేరకు సమ్మిళితం చేసుకోబడ్డారో స్పష్టం చేశారు. ప్రత్యేకించి సాయుధదళాలలో, వలస పాలనలో వీరి కీలకస్థానం బహిర్గతంచేశారు ఇక ఫ్రెంచివిప్లవం గురించి 'ప్రణాళిక' రచనకు చాలాముందుగానే 'జూవిష్ సమస్య' (1843)అనే తన రచనలో ఫ్రెంచి ప్రాతినిధ్య రాజ్యాంగ యంత్రం గురించే దాని న్యాయ సంబంధ సమానతలకు సంబంధించే 'రాజకీయరంగంలో స్వాతిశయం'గా అతి జుగుప్సతో వర్ణించారు. 'మానవహక్కుల ప్రకటన'ను ఫ్రెంచి రాజ్యాంగంలోని కీలక క్లాజులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషించి, ఆ రాజ్యాంగం పేర్కొనే సమానత, మరింత మౌలికమైన అసమానతలపై ఎలా ఆధారపడివుందో, అందులో ప్రైవేట్ ఆస్తిహక్కు ఒక ప్రాథమిక హక్కుగా ఎలా గ్యారంటీ చేయబడిందో ఆయన బహిర్గతం చేశారు. బ్రిటిష్, ఫ్రెంచి అనుభవాలలో కనిపించేతేడాను మార్క్స్, ఏంగెల్స్‌లు తమ అనేక రచనలలో బహిర్గతం చేస్తారు. తామే ప్రారంభించిన విప్లవాలను పూర్తిచేయడానికి, ఎంత శక్తిహీన రాజ్యాంగంలో విశదీకరిస్తారు. 'అవే సృష్టించిన సంపదను చుట్టుముట్టేందుకు బూర్జువా సమాజంలోని పరిస్థితులు అత్యంత హ్రస్వంగా వుంటాయి' అనే మాటలతో ఆ విషయమే 'ప్రణాళిక' స్పష్టం చేస్తుంది.

'ప్రణాళిక' వచన రచనలో ఎంతో సంక్షిప్తం కాని మహాకావ్య సదృశ్యం. అయితే ఆయా బూర్జువాల రెండు కథలను ఒకే గాథగా రచించారు. ఆ రచనా సంవిధానం దానంతట అదిగా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని జనరల్ సూత్రంగా అభివర్ణించే సందర్భంలో అనూశ్రితంగా వుండే సంవిధానం దృష్ట్యానే రూపొందింది అందులో ఉత్పత్తి శక్తులను విప్లవీకరించిన బూర్జువా వర్గమే రాజకీయ నిర్మాణాలను గూడా విప్లవీకరిస్తున్న బూర్జువావర్గంగా చిత్రించారు. 'ప్రణాళిక'ను ఎంతో ఆరాధించే వారితో సహా కొందరు రచయితలు ఈ విభిన్న అనుభవాలను సంక్షిప్తీకరించిన తీరును రచనలోగల ఒక బలహీనతగా చూస్తున్నారు. అది అతి సార్వత్రీకరణ అని, ఫ్రెంచి బూర్జువావర్గ స్వభావ చిత్రణ సరిగాలేదని భావిస్తున్నారు ఇది ఒక మేరకు నిజమే. అయితే అవి లక్షణాలను వివరాలతో చిత్రించే రచన విషయం మనం పరిశీలిస్తుంటే ఈ బలహీనత మరింత ప్రాధాన్యత సంతరించుకునేది. ప్రతిజాతీయ

బూర్జువావర్గం, తనకుగల చారిత్రక పరిస్థితులలోనే పెంపొందుతుంది. అలాంటి క్రమంలో పరిపక్వత చెందే ప్రతి జాతీయ బూర్జువావర్గము, తనకే ప్రత్యేకమైన అరాచకాలతో, తనదైన అసమాన అభివృద్ధితో సతమతమవుతుంది. 'ప్రణాళిక' అనుసరించిన పద్ధతే ఈ తీరును వాస్తవంగా భావిస్తుంది. సార్వత్రిక రూపం తీసుకున్న "స్వేచ్ఛాయుత" కార్మికవర్గం లేకుండా పరిపక్వమైన ఏ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమూ తలెత్తదు. ముందో వెనుకో అది న్యాయసంబంధమైన సమానతగా పరివర్తన చెందక తప్పదు. పెట్టుబడిదారీ మార్కెట్ సమానతల భాషలోనే సరకుల మార్కెట్‌ను నిర్వహిస్తుంది. ఆ నిర్వహణ యొక్క ప్రతిబింబమే వాస్తవంలో అసమానులైన పౌరులకు, మాటల్లో సమానతను యిచ్చినట్లు చెప్పడం ఇదీ అత్యంత ప్రాముఖ్యంగల అంశం. 'ప్రజలంతా సమానులే' అని బిల్ ఆఫ్ రైట్స్ ప్రకటించింది. అది ఎంతో సాహసమైన ప్రకటన. అందులో ఏమాత్రం చిత్తశుద్ధిలేదు. అయినా మాటలలోనైనా అలాంటి ప్రకటన వుంది. అలాంటి ప్రకటన వున్నప్పటికీ, మార్క్స్ కాలంలోనే, దక్షిణ అమెరికాలో స్వేచ్ఛలేని, బానిస కార్మికుల శ్రమ పునాదిగా ఉత్పత్తి సాగించబడింది. చారిత్రక దృక్పథం దృష్ట్యా, దీర్ఘకాలిక ధోరణిగా ఇది ముఖ్యంకాదు. అయితే ముఖ్యమైన విషయమేమిటంటే. అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఒక సమైక్యతాయుత లేబర్ మార్కెట్‌గా ఆవిర్భవించలేకపోయింది. ముందో, వెనుకో బానిసత్వాన్ని రద్దు చేయకుండా, పౌరుల మధ్య న్యాయసంబంధమైన సమానతను ఏర్పర్చకుండా ఆదేశం పారిశ్రామిక సమాజంగా ఆవిర్భవించలేకపోయింది ఈక్రమం 1860లో బానిసత్వ రద్దు నుండి 1950, 1960లలో సివిల్ రైట్స్‌చట్టాలు ఉద్యమాల వరకు దాదాపు వంద సంవత్సరాలు సాగింది. అయినా ఈ క్రమం అమలు అయింది కానీ జాతి, వర్గ ఆధారంగా ఏర్పడిన సాంఘిక ఆర్థిక అసమానతల రొంపిపైన నూతనంగా సాధించుకున్న న్యాయరూపంలోని సమానత ఆధారపడివుంది.

బూర్జువా వర్గానికి గల అ ఈవిప్లవకర పాత్రకు సంబంధించిన సమస్యను మరొక కోణం నుండి గూడా మనం పరిశీలించవచ్చు 'ప్రణాళిక' కాలంనుండి మార్క్సిస్టులు ఒక ప్రత్యేక సమస్యపై దృష్టి సారిస్తున్నారు. బూర్జువావర్గం విప్లవకరవర్గం కాకుండా ఎప్పుడి నుండి మారింది? (అ) 19వ శతాబ్దపు చివరిభాగంలో జాతి పునాదిగా రాజ్యాంగ యంత్రాలు ఏర్పడేక్రమం పూర్తి అయిన తరువాత (ఆ) దాదాపు అదే సమయంలో కార్మికవర్గ విప్లవకర ఉద్యమాలు తలెత్తడం (ఇ) సామ్రాజ్యవాద ఆవిర్భావంతో సామ్రాజ్యవాదం యూరప్‌లో అంతర్గతంగా కూపన్ – క్లిపర్స్ (ఉత్పత్తిలో ఎలాంటి అజమాయిషీలో గూడా భాగం పంచుకోకుండా షేర్లుకొని, లాభాలలో భాగం అనుభవించే పెట్టుబడిదారీ పరాన్నభుక్కులు – అను) ఆధిపత్యాన్ని ఏర్పడింది. వలసలలో ఆధునిక పెట్టుబడిదారీ వర్గం సుస్థిరం కాకుండా నివారించింది. ఈ పరిణామాలు 1880లలో ప్రారంభమైనాయని లెనిన్ చారిత్రీకరించారు. ఈ మూడు అంశాలు యూరప్‌లో నిర్ణయాత్మక మార్పుకు కారణాలని ఒక సాధారణ స్థాయిలో లెనిన్ వాదించారు. అయితే వలస దేశాలలో అప్పుడే రూపుదాలుస్తున్న జాతీయ బూర్జువావర్గం

వలస వ్యతిరేక పోరాటాలలో నిర్మాణాత్మక పాత్ర వహించగలదు. కానీ వలసవ్యతిరేక ఉద్యమాలలో కార్మికకర్షక ఐక్య నాయకత్వ పాత్రను సంఘటితపరిచేందుకు కృషి చేయాలనేది ఆయన వాదన. రష్యా విషయానికి వచ్చినపుడు అక్కడ పెట్టుబడిదారీ విధానం కీలకమైన వర్గపోరాట కేంద్రాలలో కార్మికవర్గ కేంద్రీకరణను రూపొందించిందని, అందువల్ల సోషలిస్టు విప్లవం ప్రారంభంకావడానికి అనువుగా ఈ కేంద్రీకరణ వుందని పేర్కొన్నారు రష్యన్ పెట్టుబడిదారీ విధానంలో వైరుధ్యాల రూపం దృష్ట్యా పెట్టుబడిదారీ విధానాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళి, సంపూర్ణమైన, స్వతంత్రమైన పారిశ్రామికీకరణ సాధించడం గాని, ఆధునిక రాజ్యాంగ యంత్రం ఏర్పాటు చేసే కర్తవ్యాన్ని గాని బూర్జువా వర్గానికి వదిలివేయడానికి వీలేలేదని ఆయన స్పష్టీకరించారు.

1848లో విఫలమైన విప్లవాల 'ప్రణాళిక' ప్రకటించిన వెంటనే 1871లో అతికొద్దికాలం మాత్రమే మనగలిగిన పారిస్ కమ్యూన్‌ల మధ్యకాలంలో బూర్జువావర్గపు 'విప్లవకర పాత్రలో మార్పు వచ్చినట్లు, సాధారణంగా మార్క్సిస్టుల వాదనలు సాగాయి. మరొకరకంగా చెప్పాలంటే 1848 విప్లవాల సమయంలోనే కార్మికీకరణ చెందిన ప్రజా సమూహాల గురించి స్పష్టంగా కనిపించిన బూర్జువావర్గ భయం, కమ్యూన్ అనంతరం, కార్మికవర్గ విప్లవం రానున్నదనే పెనుభూతంగా మారిందనేది ఈ వాదన సారాంశం. ఆంటోనియో గ్రాంస్కీ దృష్టి సారించాల్సిన ఒక అంశం ముందుకు తెచ్చారు. కార్మికవర్గాన్ని గురించిన బూర్జువావర్గ భయం ఫ్రెంచి విప్లవంతోనే ప్రారంభమైంది అంటారాయన. ఆ విప్లవం సనాతన పాలనను కూలగొట్టే తన పోరాటంలో క్రోడీకీకరణ చెందిన ప్రజాసమూహాలను సంపూర్ణంగా సమీకరించింది. ఆస్తులను రద్దు చేయాలనీ ప్రభుత్వ పరిపాలన పూర్తిగా ప్రజాతంత్రయుతం చేయాలని, డిమాండ్లతో ప్రజలు తీవ్రవాద సమానతా వేదికపై సమీకృతులై, బూర్జువావర్గ ఆధిక్యతకు ప్రమాదం ఏర్పడగానే ప్రతీఘాత విప్లవ భయానక దాడులకు పూనుకున్నారు. ప్రజలు అణచివేయబడ్డారనేది వాస్తవం. ఐరోపా బూర్జువావర్గం ఈ అనుభవాన్ని బాగా వంటపట్టించుకుంది. ఫలితంగా మొత్తం ఆస్తిపరుల పాలనను కాపాడేందుకు భూస్వామిక వర్గాలతో ఎప్పుడూ రాజీపడుతూనే వచ్చింది. ఇదీ గ్రాంస్కీ వాదన.

బూర్జువా వర్గానికి సంబంధించినవరకు ఈ కొనసాగుతున్న వర్గ రాజీపునాదులు యూరప్‌లో, ముఖ్యంగా జర్మనీ, ఇటలీలలో 19వ శతాబ్దంలో వుండిన బూర్జువాపాలనలో గల విప్లవ ప్రతీఘాతధోరణి పునాది అని ఆయన చరిత్రను పరిశీలించి వాదించారు. ఆయన ప్రధానంగా ఇటలీ విషయంలో ప్రత్యేక ఆసక్తి చూపారు అక్కడ పార్లమెంటరీ ప్రజాస్వామ్య బలహీనతకు, ఫాసిజం తలెత్తేందుకు కారణాలను వెతికారు. ఇటలీ ఉత్తరభాగంలో అత్యంత ఆధునిక పెట్టుబడిదారీ సంబంధాలు ఏర్పడ్డాయి. మిగతా దేశంలో, ముఖ్యంగా దక్షిణభాగంలో అత్యంత వెనుకబడిన, కాలం చెల్లిన నిర్మాణాలు పట్టుబట్టి కొనసాగుతున్నాయి. ఈ విధంగా ఆర్థికరంగంలో ఒక విభాగంలో ఆధునిక పెట్టుబడిదారీ సంబంధాలు తలెత్తినందున ఏర్పడిన

సంక్షోభంతో ఆదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య బలహీనతకు, ఫాసిజం పుట్టుకకు సంబంధం వుందని గ్రాంస్కీ వాదన. అత్యంత దారుణమైన ఈ అసమానాభివృద్ధికి మూలం బూర్జువావర్గం భూస్వామ్య వర్గాలతో ఏనాడూ తలపడకపోవడంలోనే వుంది అంటారు గ్రాంస్కీ. అయితే స్వాతంత్ర్య సాధనలో ఇటాలియన్ జాతీయ రాజ్యాంగ ఐక్యత ఏర్పర్చడంలో దానికి సాపేక్షికమైన ప్రగతిశీల పాత్ర వుంది. అయినా భూస్వామ్యశక్తులతో ఏనాడూ తలపడకపోవడంతో బలహీనమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, ఫాసిజం తలెత్తేందుకు దారి తీసింది. ఈ వాదనను అనుసరించి చూస్తే బూర్జువావర్గ విప్లవకర పాత్ర ఇలా తలెత్తి, అలా ముగిసిపోయిందనిపిస్తుంది.

భారత బూర్జువావర్గ పాత్రపై ఆసక్తికరమైన విషయాలను ఈ వాదన బహిర్గతం చేస్తుంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో బూర్జువావర్గంలోని కొన్ని సెక్షన్లు ప్రగతిశీల పాత్ర వహించాయనడం నిస్సందేహం. అయితే అంతేశక్తితో వుండే ఐదు వ్యతిరేక అంశాలను మనం గమనించాలి. మొదటిది భారత బూర్జువా వర్గంలోని కీలకరంగాలు. టాటాహౌస్ వంటివి, జాతీయోద్యమం కన్నా వలస అధికారానికే సన్నిహితంగా వుండేవి. రెండవది ప్రధానంగా గాంధీజీ ద్వారా జాతీయోద్యమానికి సన్నిహితులైనవారు గూడా బిర్లాలవంటివారు, వలస అధికారంతో మిళితమౌతూ పోటీపడే వైఖరిని అనుసరించారు. పూర్తిగా వలస వ్యతిరేక వైఖరులను చేపట్టడం చిన్న బూర్జువా వర్గ సెక్షన్లలో సాధారణంగా వుండేది. మూడవది ప్రజా ఉద్యమాల పట్ల బూర్జువావర్గం ఎప్పుడూ అనుమానంతోనే వుండేది. రెండవ ప్రపంచయుద్ధం ముగింపు స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి మధ్యగల రెండు కీలక సంవత్సరాలలో విప్లవోద్యమ వెల్లువ తలెత్తగానే బ్రిటిష్‌వారు ఎంత త్వరగా పరిష్కారానికి రావాలని కోరారో, అంతే త్వరగా పరిష్కారం సాధించడంపై భారత బూర్జువావర్గం కూడా కేంద్రీకరించింది. అందువల్ల దేశ విభజనకు దారి తీసినా పరిష్కారానికి ఆరాటపడింది. విప్లవంకన్నా దేశ విభజనే మంచిదని చెప్పింది. నాల్గవది స్వాతంత్ర్యానంతరం బూర్జువావర్గం భూస్వామ్యవర్గాలతో ఎంతో ప్రభావం కలిగించే మైత్రిని కుదుర్చుకుంది పాత, కొత్త భూస్వామ్యశక్తులతో కూడా ఈ మైత్రి సాగించింది. పేదరైతుల, గ్రామీణ కార్మికుల, కట్టుబానిసకూలీల, ఆదివాసీల వంటి వారి జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు అనువైన భూసంస్కరణలకు ఆస్కారంలేకుండా అడ్డుకున్నది. కొన్ని ప్రాంతాలలో అత్యంత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ అభివృద్ధి పద్ధతులలో దేశం అత్యధికభాగంలో విస్తరమైన వెనుకబడిన సాంఘిక, ఆస్తి సంబంధాలు సహజీవనం చేస్తున్నాయి. సామాజిక జీవితంలో మనం చూస్తున్న కుళ్ళులో ఎక్కువభాగానికి, అన్ని రకాల ఫాసిస్టు ధోరణులతో పెచ్చరిల్లుతున్న హింసాకాండకు తుదిమూలం ఈ వాస్తవంలోనే ఇమిడి వుంది. చివరగా కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని గురించిన భయం అంటే అర్థం తన ప్రయోజనాల దృష్ట్యానైనా భారత సమాజపు తీవ్రమైన పరివర్తన చేయడానికి బదులు ఈ బూర్జువావర్గం సామ్రాజ్యవాదంతో రాజీపడడమే సులభమని కనుగొన్నది. వారు పూర్తిగా కుదింపబడిన అంతర్గత

మ్యార్కెట్, అనారోగ్యకరమైన, సామాజికంగా వెనుకబడిన, నిరక్షరాస్యత, అర్థ నిరక్షరాస్యతా కార్మికవర్గంతో సరిపెట్టుకుంటారు తప్ప, తమ ఆధిపత్యం చేజారే ఎలాంటి సామాజిక పరివర్తనను చేపట్టరు. ఒక విప్లవకర బూర్జువాబదులు, ఒక శాశ్వతమైన ఒకరకంగా ముందుగానే ఏర్పరిచిన విప్లవ ప్రతీఘాతం మనం కలిగివున్నాము. మన సమాజంవంటి సమాజాలలో సోషలిస్టు పరివర్తనలో మినహా బూర్జువా విప్లవ కర్తవ్యాలను సహితం పూర్తిగా నెరవేర్చడం సాధ్యంకాదని ఇది రుజువు చేసింది.

## పెట్టుబడిదారీ "సూత్రాలు" వున్నాయా

'ప్రణాళిక' ఆ మహత్తర బాట వెనుకగల దృక్పధాన్ని మార్క్సిజం శాస్త్రమూ కూడా వాటి పథకం అనుసరించి, రెండు రకాల సూత్రాలు లేదా నిబంధనల చుట్టూతా నిర్మించబడింది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు గతి తర్కానికే సంబంధించిన 'సూత్రాలు' ఒక భాగం. ఆ సూత్రాలు మౌలికమైనవి. మార్పుకు అతీతమైనవి ఆ ఉత్పత్తి విధానం కొనసాగినంతకాలం కొనసాగేవి. అవిలేకుంటే పెట్టుబడిదారీ విధానం పెట్టుబడి దారీ విధానమే. ఈ సిద్ధాంత సారపు భాగాన్ని లేదా సిద్ధాంతపు "విజ్ఞతా మూలమ'ని మార్క్స్ పేర్కొని వుండగల భాగాన్ని సులభతరంగా వివరించేందుకు అలాంటి మూడు సూత్రాలను సంక్షిప్తంగా యిక్కడ పేర్కొనవచ్చు.

పెట్టుబడిదారీ విధానం దాని చరిత్ర అంతటా మౌలిక వర్గాల మధ్య అంతకంతకూ హెచ్చుగా విభజన వచ్చే వైపు నెడుతోంది. మొదట ఈ స్పష్టీకరణ వుంది. అయితే ఏ సమయంలోగానీ, మధ్యంతరవర్గాలు దొంతరలు వుండనే వుండవని దీని అర్థంకాదు. నిజానికి పరిపాలన సంక్లిష్టమయ్యే కొద్దీ, పెట్టుబడిదారీ పునరుత్పత్తిని అవసరమైన నిర్వాహక సాంకేతిక నైపుణ్యం మూలంగా వర్గ విభజనకు తోడుగా దానితోపాటే అలాంటి మధ్యంతర దొంతర తలెత్తుతుంది. ఈ సూత్రపు అర్థమేమిటంటే పెట్టుబడి పునరుత్పత్తి విస్తరణకు అవసరమైన ఉత్పత్తి సాధనాలు వర్గవిభజనల్లో ఒక చివర కేంద్రీకృతమవుతాయి. మెజారిటీ ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు అంతకంతకూ కార్మికీకృతమవుతారు. (అంటే ఈ ఉత్పత్తి సాధనాలపై ఆధిపత్యం కోల్పోవడం) సంఘటిత లేదా 'అసంఘటిత' రంగాలలో దేనిలోనో ఒక దానిలో, పూర్తిగా శాశ్వత లేదా తాత్కాలిక, క్యాజువల్ కార్మికులుగానో తమ శ్రమశక్తిని అమ్ముకోకతప్పదని స్థితికి నెట్టబడతారు. "అణచివేత" "పేదరికం" ఈ వర్గ సంబంధాలలో అతి స్పష్టంగా వ్యక్తమయ్యే లక్షణం. అయితే 'దోపిడీ' తరహా ఈ సంబంధాలలో పెట్టుబడిదారీ విధాన నిర్దిష్ట ప్రత్యేకత విస్తరించిన పునరుత్పత్తి రెండవవర్గపు శ్రమశక్తిని స్వంతం చేసుకునే ఒక వర్గం చేతుల్లో పెట్టుబడి సమీకృతం కావడం. ఈ వర్గ విభజనకు సంబంధించే వర్గ పోరాట భావం సాధింపబడింది. అన్నివర్గాలు, ముఖ్యంగా రెండు ధృవాలుగా వుండే వర్గాలు, బూర్జువా కార్మికవర్గాలు ఈ పోరాటంలో పాల్గొంటాయనేది ఇందులో ప్రధాన అంశం. కార్మికవర్గానికి

సంబంధించినంతవరకు విప్లవకర పోరాటంగానే మనం వర్గపోరాటాన్ని అర్థం చేసుకుంటాము. కానీ మార్క్సు చెప్పిన అంశం ఏమిటి? తమ స్వంతవర్గ ప్రయోజనాల పరిరక్షణ కోసం పాశవిక, శాశ్వత పోరాటానికి అస్తిపర వర్గాలే పూనుకుంటాయి. ఈ పోరాటంలో హింసను, హింసాయుత బెదిరింపులు, లోతైన, విస్తృతమూనైనా దోపిడీల ద్వారా నిరుద్యోగ శాశ్వత సైన్యాన్ని ఏర్పర్చడం ద్వారా సాంఘిక, రాజకీయ, ఆర్థిక, భావజాల, సాంస్కృతికరంగాలలో వేయిరకాల ఇతర పద్ధతులను ఉపయోగిస్తాయి. మరొకరకంగా చెప్పాలంటే వర్గపోరాటం ఒక వైపు అంశం కాదు. ఇది రెండు వైపులు కలిగినది.

పెట్టుబడిదారీ విధానం అంతకంతకూ ఎక్కువగా ప్రపంచీకరింపబడుతుంది. ఇది రెండవ తిరుగులేని సూత్రం. ముందుగా అంతకంతకూ ఎక్కువ భూభాగాలను ప్రజలను విస్తారంగా తన ఆధిపత్యం క్రిందికి తెస్తుంది. ఆ తరువాత లోతైన సాంద్రరూపంలో కొత్త, కొత్త శ్రమపద్ధతులను, ఉత్పత్తిక్రమాలను నిరంతరం నెత్తిన రుద్దుతుంది. అలాంటి శ్రమపద్ధతులు, ఉత్పత్తి క్రమాలు పెట్టుబడిదారీ విధానపు కేంద్రాలలో కనుగొంటారు. అవసరం వచ్చినపుడు వాటిని తమ ఆధీనంలోని ప్రాంతాలలో అమలు జరిపేలా ఒత్తిడి తెస్తారు.పారిశ్రామిక విప్లవం రావడానికి చాలా ముందుగానే ప్రపంచీకరణ ధోరణి వుండేది. పై క్రమం ఈ నాటికీ కొనసాగుతున్నది. అనేక రూపాలలో జరుగుతున్నది. తన న్యాయపునరుత్పత్తిలో అనుశ్రితంగా నిరంతర విస్తరణ అనే సూత్రం పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానం దేనికీలేదు. పెట్టుబడిదారీ విధానానికి వున్నది. తమ ఫ్యూడల్ ఉత్పత్తి విధానాన్ని ప్రపంచమంతటా విస్తరింపచేయాలనే పథకంగానీ శక్తిగానీ బ్రిటిష్ ఫ్యూడల్ ప్రభువులకు లేదు. ప్రపంచవ్యాప్తం కావడానికి అవసరమైన అలాంటి పథకాలను, శక్తిని చక్కగా రూపొందించుకునే కృషిలో బ్రిటిష్ పెట్టుబడిదారులు అంతకంతకూ హెచ్చుగా నిరంతర కృషి ఘర్షణలో మునిగితేలుతుండేవారు. ఈనాడు బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదేశాలలో ప్రఖ్యాతి చెందిన కొందరు సిద్ధాంతవేత్తలు ఈనాటి పెట్టుబడిదారీ విధానాన్ని అనేకపేర్లతో పిలుస్తున్నారు. "లేట్ కాపిటలిజం", "పోస్ట్ ఇంపీరియరిస్టు కాపిటలిజం", "పోస్ట్ మోదరన్", " సైబర్‌నెటివ్ కాపిటలిజం"అని కూడా అంటున్నారు. పోస్ట్ మోదరనిస్టు వామపక్షానికి చెందిన ఒక కార్మిక సిద్ధాంతవేత్త "పోస్టవర్క్" (శ్రమ అనంతరం అంటే శ్రామికుల శ్రమశక్తి లేకుండానే ఉత్పత్తి జరుగుతున్న కాలంగా చిత్రించడం - అను) అనే పేర అమెరికాలో ఒక పుస్తకం కూడా ప్రచురించారు ఈ వర్ణనలన్నీ ఉత్పత్తిలో శ్రమస్థానాన్ని సమాచార సాంకేతిక పురోగమనం తొలగించి వేసింది అని చెప్పేవే. కానీ మౌలికమైన నిజమేమిటి? ఆధునిక (పూర్తిగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో) రంగంలో పనిచేసే కార్మికుల సంఖ్య 1665-95 మధ్యగల ముప్పై సంవత్సరాలలో రెట్టింపు అయింది. ఇది ప్రపంచబ్యాంకు వేసిన అంచనా.

పెట్టుబడిదారీ విధానపు శాశ్వత లక్షణమైన మూడవ సూత్రం రాజ్యాంగ యంత్రపువర్గ స్వభావం. మొత్తం బూర్జువావర్గపు రాజ్యాంగ యంత్రంగా రాజ్యాంగ యంత్రం లేకుండా ఏ

పెట్టుబడిదారీ సమాజమూ మనజాలదు. తనను తాను పునరుద్ధాన చేసుకోలేదు. ఈ విషయం వామపక్షాల వరకు మనం నిజమేనని అంగీకరిస్తాము. మార్క్సుకు సంబంధించి ఇది ఒక విప్లవాత్మక పరిశోధన. ఎన్‌లైటెన్‌మెంట్, ఫ్రెంచి విప్లవం నుండి హెగెల్ వరకు ఆయనకు వారసత్వంగా వచ్చిన రాజకీయ సిద్ధాంతం ప్రకారం సాధారణ, వాంఛనీయమైన రాజ్యాంగయంత్రం, వర్గాలకతీతంగా నిలిచిన రాజ్యాంగ యంత్రమే. అది పౌరసమాజపు ఘర్షణపడే పక్షాలకు అతీతమైనది. సర్వశక్తుల వాంఛలకు నిర్ణయాలకు ప్రతినిధి. సరిగా ఈ అర్థంలోనే నిరంకుశ అధికారవర్గాన్ని "యూనివర్సల్ క్లాస్"అని హెగెల్ వర్ణించారు. మరొకవిధంగా చెప్పాలంటే నిరంకుశ అధికారవర్గం ఒక ప్రత్యేకవర్గపు ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవర్గం కాదు. సమాజమంతటికీ ప్రాతినిధ్యం వహించేవర్గం. ఇదే హెగెల్ వర్ణన. నిరంకుశ అధికార వర్గాన్ని యూనివర్సల్ క్లాస్‌గా ఎదగగల అవకాశమున్న వర్గమని నొక్కిచెప్పవలసి వచ్చింది. అది సర్వవ్యాపిత దోపిడీకి గురయ్యే వర్గంగా దానిని రక్షించవలసిన ఏ ప్రత్యేక ప్రయోజనం లేదు. ప్రతి ఒక్కరి స్వేచ్ఛాభివృద్ధి, అందరి స్వేచ్ఛాయుత అభివృద్ధికి ఒక ముందు షరతుగా భావించే సమాజంగా అన్నిటినీ మించి దోపిడీనుండి స్వేచ్ఛను కలిగించే సమాజంగా సమాజాన్ని విప్లవకరంగా పునర్నిరించడం ద్వారా కార్మికవర్గం నిజంగానే 'యూనివర్సల్ క్లాస్'గా రూపొందుతుంది. స్వేచ్ఛ అంటే అన్నిటినీమించి దోపిడీ నుండి స్వేచ్ఛ అని నిర్వచించడం కూడా కొంగ్రొత్త విషయమే. ఫ్రెంచి విప్లవ సంస్థాపక ప్రకటన అయిన 'మానవ హక్కుల ప్రకటన'ను రిపబ్లికన్ రాజ్యాంగంలోని కొన్ని కీలక నిబంధనలను చాలా లోతుగా ఎంతో ప్రతిభావంతంగా విశ్లేషించారు మార్క్స్. 'జువిష్ క్వశ్చన్' అనే రచనలో సాగిన ఈ విశ్లేషణ ద్వారా ఆ ప్రకటన పేర్కొన్న మౌలికహక్కు ఆస్తిహక్కుగా చూపారు. ఇతరులు ఎవరూ ఆక్రమించుకొనడానికి వ్యతిరేకంగా తన స్వంత ఆస్తిని రక్షించుకునే హక్కు ఆ ప్రాథమిక హక్కు. చట్టబద్ధ ప్రభుత్వపు కీలక చట్టాలు ఆస్తిహక్కు, ఆస్తి కలిగివుండే స్వేచ్ఛకు సంబంధించినవే. ఈ రాజ్యాంగం అంతకుముందుగల రాచరిక నిరంకుశ అధికారంకన్నా మెరుగైనదే. అయితే ఒక్క గతి తార్కిక వాదనతో, దోపిడీనుండి స్వేచ్ఛ లభించడమే నిజమైన స్వేచ్ఛగా మార్క్స్ భావ ప్రతిష్ట చేశారు. అలాంటి స్వేచ్ఛ పెట్టుబడిదారీ విధానాన్ని రద్దు చేయడం ద్వారానే గ్యారంటీ చేయబడుతుంది. అది మాత్రమే బూర్జువా విప్లవం తన వివిధ పత్రాల ద్వారా ఆస్తి కలిగివుండే హక్కును కలిగివుండే వర్గ పునాదిగా వుండే భ్రమాపూరిత స్వేచ్ఛ స్థానే నిజమైన స్వేచ్ఛను ఏర్పరుస్తుంది. ప్రైవేటు ఆస్తిహక్కుకు తద్వారా దోపిడీ విధానానికి గ్యారంటీ ఇచ్చే రాజ్యాంగ యంత్రం సిద్ధాంత రీత్యాగాని, ఆచరణరీత్యాగాని, సార్వత్రిక భావాలను వ్యక్తం చేయడం సాధ్యపడదు అనేది ఇందులో ఇమిడివున్న ప్రధానాంశం. అలాంటి రాజ్యాంగ యంత్రం వర్గ రాజ్యాంగ యంత్రంగానే వుండాలి. వర్గ రాజ్యాంగ యంత్రాన్ని రద్దు చేయకుండా వర్గ సమాజాన్ని రద్దు చేయడం సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ విధానంలో వుండే మౌలిక గమన సూత్రాలలో ఇవి కొన్ని. అలాంటి సూత్రాలపట్ల కొంత ఖచ్చితమైన అవగాహన లేకుండా మార్క్సిజం చక్కని అన్వయం గల శాస్త్రంగా వుండజాలదు. దీని అర్థం ఈ సూత్రాలు అన్నిచోట్లా, అన్ని సమయాల్లో ఖచ్చితంగా

ఒకే విధంగా పనిచేస్తాయని కాదు. అయితే అలాంటి సూత్రాలు పనిచేయకుండా పెట్టుబడిదారీ విధానం మనజాలదనే దాని అర్థం. అయితే 'చరిత్రసూత్రాలు', 'ప్రకృతిసూత్రాలు' చివరకు 'రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలు'అని చెప్పబడేవన్నిటినీ వాస్తవంలో ధోరణులు, సూత్రాలు అని మనం పేరుపెట్టవచ్చు. దీని అర్థమేమిటి? మొత్తం మీద పెట్టుబడిదారీ విధానం ఒక అవగాహన చేసుకొనదగు నిర్మాణవ్యవస్థ. కనుక ఈనాటి నిర్మాణవ్యవస్థను సరిగా అవగాహన చేసుకుంటే, ఇతర అంశాలన్నీ సమానంగానే వుంటే, కొన్ని దృగ్గోచర విషయాలు ఒక ప్రత్యేకమైన మార్గం పట్టే, ఒక ప్రత్యేకమైన రూపం తీసుకోగల ధోరణిని ముందుగానే వూహించవచ్చు. ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానం నిర్ణీత కాలపు సంక్షోభం ఎదుర్కొనే ధోరణి కలిగివుందని ప్రణాళికలో మార్క్స్ చెప్పారు. ప్రత్యేకించి "అధికోత్పత్తి అంటువ్యాధి" గురించి పేర్కొంటున్నారు. ఇది దాని అనూశ్రిత ధోరణిగా వివరించారు. ఆ తరువాత కాలంలో రాజకీయ ఆర్థిక విధానంపై మరింత పరిపక్వ అధ్యయనం జరిగింది. వాటిలో పెట్టుబడిదారీ లాభాల సరాసరి రేటు పడిపోయేధోరణిని మరింత సన్నిహితంగా ప్రదర్శించారు. ఆ ధోరణి అనూశ్రితమని రుజువు చేశారు. ఇది రకరకాల పోటీల మూలంగా అధికోత్పత్తి సంక్షోభం వంటి వాటివల్ల తలెత్తుతుందని చూపించారు. ఇవి పెట్టుబడిదారీ విధానానికి ఒక విచిత్రమైన అస్థిర స్వభావాన్ని కలిగించే ధోరణి సూత్రాలు అనేది స్పష్టమే. అయితే లాభాలరేటు ఎల్లప్పుడూ పడిపోదు. ప్రతి ఒక్క సమయంలో ప్రతి ఉత్పత్తి శాఖలో,వర్గ పోరాటపు అన్ని దశలలో, పెట్టుబడికి గల ప్రతి జాతీయ పరిధిలో అవకాశంలో అలా పడిపోయే ధోరణి వ్యక్తం కాకపోవచ్చు. బూర్జువావర్గం లాభాలరేటును పెంచేందుకు కాకున్నా, నిర్ణీతరేటును నిలబెట్టేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. విధానానికి మూలపరంగా వుండే,రాజ్యాలలో ఈ రేట్లను పెంచడం లేదా స్థిరీకరించడమే సామ్రాజ్యవాద విస్తరణ వెనుక వుండే ఉద్దేశం. అంతకంతకూ ఎక్కువ ప్రాంతాలను, ప్రపంచ ప్రజలను దోపిడీ చేసేందుకు సాగే ప్రయత్నమంతా ఇందుకోసమే.

అదే సమయంలో కార్మికుల ఉత్పాదనా సామర్థ్యం పెంచేందుకు, వేతనాలు కుదించేందుకు కార్మికులకు వ్యతిరేకంగా బూర్జువా వర్గం ప్రతిచోటా ఎడతెగనిపోరాటం చేస్తుంది. అయినా తన ఉత్పత్తులకు మార్కెట్‌ను విస్తరించేందుకు కృషి చేస్తుంది. ఉదాహరణకు వినిమయ రుణాల స్థాయినిపెంచుతుంది. వినమియదారులు సంపాదించుకున్న ఆదాయాలకు మించిన కొనుగోలు శక్తిని వారికి విస్తరించడమే ఇది. ఆ విధంగా తమ ఉత్పత్తులను అమ్ముకోవడమేగాక, సర్వవ్యాప్తం చేయబడిన రుణాలపై వడ్డీ కూడా వసూలు చేసుకుంటుంది. ఈ విధంగా ఈ తిరోగమన సూత్రం అత్యున్నత దశ రూపంలో వ్యక్తంకాకుండా ధోరణులు, ప్రతి ధోరణుల విరుద్ధ నిర్మాణవ్యవస్థగా మనకు కనపడుతుంది.

"మానవుడు తన చరిత్రను రూపొందించుకుంటాడు. అయితే తనకు గల పరిస్థితుల పరిధిలోనే రూపుదిద్దుకోగలడు"అని ఏంగెల్స్ అన్నట్లు, ఈ సూత్రమే మార్గదర్శక సూత్రమని సాధారణంగా చెప్పవచ్చు. మరో మాటలో చెప్పాలంటే చరిత్ర అత్యంతగమన శీలమైంది. ఆకాంక్షలు, అవధులు కలబోసిన నిరంతర విషయం. ప్రజల ఎంపికలకు వారి చర్యలు ఉత్పన్నం చేసే ఫలితాలకు ఉన్న పరిస్థితులతో అవధులు ఏర్పడతాయి. అయితే ఆకాంక్షలకు ప్రాధాన్యత

లేకుంటే ఒక విధానంలో అనుశ్రితంగా వుండే ధోరణులను వెనక్కు కొట్టకుంటే వారు 'తమ చరిత్ర'కు రూపుదిద్దగలిగి వుండేవారు కాదు. నిజానికి విప్లవం అంటే మానవీయ అంశమైన ఆకాంక్షలు సమిష్టి మానవ కార్యాచరణ ద్వారా అవధులను ఎదిరించి, దాటి ఓ కొత్త మార్గానికి పరివర్తన చెందిన క్షణమే.

## ప్రపంచీకరణ, ఆర్థికరంగం, సంస్కృతి

మొత్తం మీద నిర్మాణ వ్యవస్థకు మౌలికమైన సూత్రాలుకొన్ని. కేవలం ధోరణులుగా వుండే సూత్రాలు మరికొన్ని. వీటిమధ్య తేడా వుంది. ఈ తేడాను 'ప్రణాళిక' వివరించిన తీరులో పరిశీలిస్తే అవగాహన చేసుకోగలం. 'ప్రణాళిక' వివరించిన విషయాలను చూద్దాం. (అ) ఒకవైపు పెట్టుబడి విస్తరణ దృష్టినుండి ప్రపంచీకరణ క్రమం (ఆ) తత్ఫలితంగా ఇతర రంగాలలో రాగల పరిణామాలు. ఈ పరిణామాలను ముందుగా ఊహించేందుకు 'ప్రణాళిక' ప్రయత్నం 'జాతీయ నిర్దిష్టత' ఒక రంగం. జాతీయ సాహిత్యాలు రద్దు అయి, సుదూర భవిష్యత్‌లో ఏర్పడగల 'ప్రపంచసాహిత్యం'కు సంబంధించిన సమస్యలు ఈ రంగాలలో వున్నాయి

'ప్రణాళిక'లో సంక్షిప్తంగా వుండేమొదటి భాగంలో 'ప్రపంచవ్యాప్త', 'విశ్వవ్యాప్త' అనే పదాలు తరచూ కనిపించడం నిజంగా అసాధారణమైన విషయం. శక్తివంతమైన వాణిజ్య పెట్టుబడి వహించిన పాత్ర ప్రభావంలో కనీసం 16వ శతాబ్దపు ప్రారంభకాలంనుండి ప్రపంచాన్ని గణనీయంగా జయించడం అనేది జరుగుతూ వచ్చింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలను వలసలుగా మార్చారు. ఆ రాష్ట్రాల ప్రజలలో అత్యధికులను సర్వనాశనం చేశారు. ఆఫ్రికన్‌లను సామూహికంగా బానిసలను చేశారు. (ఆఫ్రికా నుండి 3కోట్ల మంది బానిసలను ఎగుమతి చేశారు. అమెరికా కరేబియన్ తీరాలకు చేరేసరికి వారిలో సగం మందిమరణించారు) ఆఫ్రికా, ఆసియా తీరాలవెంట వాణిజ్య సైనిక స్థావరాలను ఏర్పాటు చేశారు. భారతదేశాన్ని సంపూర్ణ వలసగా మార్చారు. 'ప్రణాళిక' రచించేనాటికి ఇవి, ఇంతకన్నా మించిన అనేక ఘటనలు జరిగివున్నాయి. నిజానికి పారిశ్రామిక విప్లవానంతరం (నిజానికి దాన్ని ఆ పేరుతో పిల్చింది ఏంగెల్స్) ఈ క్రమం మరింత వేగం పుంజుకుంది. 1770-1848 మధ్య బ్రిటిష్‌వారు భారతదేశంలో అత్యధికభాగానికి తోడు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలను స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో ఫ్రాన్స్, ఉత్తర ఆఫ్రికాలో భాగాలను చేజిక్కించుకుంది.

హెగెల్ ఒక తాత్వికుడు. ఆయనను మార్క్స్ ఎంతో గౌరవించాడు. ఆయనతోనే ఎక్కువ ఘర్షణ కూడా పడ్డారు. వలసాధిపత్య వెల్లువ పట్ల వారిద్దరూ తీసుకున్న భిన్న వైఖరులను బట్టి హెగెల్ భావాలకు మార్క్సిస్టు భావాలకు ఎంత తేడా వుందో మనం అంచనాకు రావచ్చు. వలసలు ఏర్పాటు చేసుకునే వెల్లువను ఐరోపా అదనపు జనాభా సమస్యకు అవసరమైన స్వాగతించవలసిన పరిష్కారంగా హెగెల్ భావించారు. ప్రకృతే అలా కావాలని ప్రారంభించింది అని చెప్పారు. అదే సమయంలో మార్క్స్ 'ప్రణాళిక'లో ఆయన చెప్పినట్లు "విశ్వవినాశసమరం' లో భాగంగా చూచారు. పెట్టుబడిదారీ విధానపు అనుశ్రిత లక్షణంగా అక్రమాన్ని వివరించారు. ఐరోపా కార్మికవర్గ చైతన్యంలో దీనిని ఒక కీలక అంశంగా మార్చేందుకు ప్రయత్నించారు.

అదే మార్క్స్ సాధించిన అతిగొప్ప విజయం. ఇక్కడ ఒక విషయం చెప్పాల్సిన అవసరం వుంది. మార్క్స్ కాలంలో ఏర్పడిన వలసవాదం, ఆ తరువాత 70 సంవత్సరాల అనంతరం లెనిన్ వివరించిన సామ్రాజ్యవాదంవంటిది కాదు. సామ్రాజ్యవాదం 1880లలో ప్రారంభమైందని లెనిన్ స్వయంగా పేర్కొన్నాడు. అంటే మార్క్స్ యువకుడుగా వున్నప్పుడు కాక, ఆయన జీవితపు ఆఖరి సంవత్సరాలలో రూపొందిందన్నమాట. 'సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అన్న లెనిన్ ప్రఖ్యాత రచన వెలువడిన 70 సంవత్సరాల తరువాత, అంతకుముందు 10సంవత్సరాలలో చెందిన మార్పుకన్నా సామ్రాజ్యవాద మౌలిక లక్షణాలలో మరిన్ని తీవ్రమైన మార్పులు ఏర్పడ్డాయి.

ప్రపంచస్థాయిలో పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక సాంకేతిక విస్తరణ గురించి మార్క్స్ నిర్దిష్టంగా రాశారు., యూరోప్‌కు ఎంతో దూరంలో వుండే ప్రాంతాలలోకి కూడా పెట్టుబడిదారీ తర్కం లోతుగా చొచ్చుకుపోయిన విషయం వివరించారు. అవి చదివితే మార్క్స్ తన కాలంనాటి పెట్టుబడిదారీ విధానాన్ని, వలస విధానాన్ని గురించి గాక ఈనాటి పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదం గురించి చెపుబుతున్నాడని ఈనాటి పాఠకుడు భావిస్తాడు. ఈకాలంలో అనేక చారిత్రిక మార్పులు జరిగాయి. అనేకమౌలిక రూపాల్లోనే ప్రపంచీకరణ క్రమం మార్పు చెందింది. అయినా నేటి పరిస్థితినే తలపింపచేసేంత పోలిక, భవిష్యత్ గురించిన అంచనా ఆ రచనలలో వుంది. అదే అత్యంత ఆశ్చర్యం గొలిపే విషయం.

'ఆధునిక పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌ను స్థాపించింది. బూర్జువా వర్గం అన్నిచోట్ల సంచరించాలి. ప్రతిచోటా స్థిరపడాలి. ప్రతిచోట సంబంధాలు ఏర్పరచుకోవాలి. పాత స్థానిక, జాతీయ ఒంటరిపాటు స్థానే అన్నివైపులా ప్రతిచోట విశ్వవ్యాప్తంగా జాతులు పరస్పరం ఆధారపడే స్థితి మనకు ఎదురవుతున్నది. అని ఆయన గట్టిగా నొక్కి చెప్పారు. మిగతా ప్రపంచం సంగతి వదిలేసినా, ఆనాటికి యూరప్ అంతటా గూడా పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలు ఏర్పడనేలేదు. ఆనాటికి ఫ్రాన్స్‌గూడా అత్యధికంగా గ్రామీణ సమాజమే. 19వ శతాబ్దపు చివరి నాటికి బ్రిటన్, ఫ్రాన్స్‌లతోపాటు మూడవ పారిశ్రామిక వంతమైన దేశంగా ఆవిర్భవించిన జర్మనీ ఆనాటికీ ఇంకా ఒక ఐక్యజాతీయ రాజ్యంగా గూడా ఏర్పడలేదు. స్టీంబోట్లు, రైల్వేలు అప్పుడే కొత్తగా వచ్చాయి. అయినా రవాణా 'విప్లవం' ద్వారా ప్రపంచాన్ని ఏకం చేసే పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయత్నాన్ని గురించి ఆయన రాశారు. అమెరికానుండి యూరప్‌కు 1819లో మొదటి స్టీంబోటు ప్రయాణమైంది. 1840 నాటికి గూడా ఇంగ్లండ్‌లో గూడా విస్తరించిన రైల్వేలు 843 మైళ్ళు మాత్రమే. పరిశ్రమలు సాంకేతిక రంగం, సరుకుల ప్రపంచ వ్యాప్త పోటీ, డబ్బు సంబంధాలు' అనేవి ప్రపంచాన్ని ఒకే మూసగా పరివర్తన చెందించే వేగం, దూరాన్ని, కాలాన్ని అవి కుదించేయడంపైన ఆయన విసిరే ఉత్ప్రేక్షాలంకారాలు చూస్తే ఈనాటి జెట్ ప్రయాణాలు. అంతర్జాతీయ టి.వి. ఛానెళ్ళు, ప్రపంచమంతటా ఒకే రూపం తీసుకుంటున్న ఫ్యాషన్లు, ఫాస్ట్‌ఫుడ్ అలవాట్లు, పాఠకుని ఆలోచనలలో ఒక్కసారి మెదులుతాయి. ప్రపంచం నలుమూలలకు క్షణాలలో శతకోట్ల డాలర్లు మార్చగల కంప్యూటర్లతో నడిచే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు మనసులో మెదులుతాయి. అంతటి సంక్షిప్త రచనలో చాలా త్వరగా, సూటిగా, ఒక్క దెబ్బతో చెప్పాల్సిన దృష్ట్యా ఒకే

ఊహాప్రపంచంలో పరిస్థితి, దాని భావిరూపము అంచనా గూడా కలబోసి చెప్పారు మార్క్స్. ఆనాటికే ఏర్పడి వున్న పరిస్థితిని చూస్తారు. తాను చూసిన దానికి మించి, దాని వెనుక ఏర్పడుతున్న దీర్ఘకాలిక గమనాలను ఆయన కరతాలమలకం చేసుకున్నారు. ఆ విధంగా 'ప్రణాళిక'లో ఒక వాక్యం 1848 పెట్టుబడిదారీ విధానాన్ని మనముందు వుంచితే, నిరవధిక భవిష్యత్‌లో పెట్టుబడిదారీ విధానం-మనం కాలం వరకు అంతకుమించి గూడా తీసుకోబోయే రూపాన్ని మనముందు వుంచుతుంది తర్వాతి వాక్యం. పెట్టుబడిదారీ విధానంయొక్క స్వయం చలనమైన, పనిచేసే సూత్రాలను పూర్తిగా అవగాహన చేసుకోవడం ద్వారా పెట్టుబడిదారీ విధానపు భవిష్యత్ పరిణామాలను గట్టిగానూ, ఖచ్చితంగానూ మార్క్స్ దర్శించగలిగారు. అదే కీలక ప్రాధాన్యత గల విషయం.

అదే 'ప్రపంచీకరణ'కు సంబంధించిన కొన్ని ద్వితీయ ప్రాధాన్యతలు గల సూత్రాల నిర్మాణంగూడా అందులో కనిపిస్తుంది అవి ప్రధానంగా కొన్ని ప్రాతిపదికల ఆధారంగా సాధించిన సూత్రాలు. స్వభావరీత్యా ఊహాప్రాతిపదికన అంచనాగా ఏర్పరుచుకున్నవి. ఈ పెట్టుబడిదారీ విధాన తర్కం ఏర్పర్చగల ఫలితాలు వివిధ రంగాలలో ఏరూపం తీసుకొనే అవకాశంవుంది అనే అంచనాలు అవి. జాతులు పరిణితి చెందే రూపురేఖలు, కళలు మున్నగు రంగాలలో రాగల ఫలితాల అంచనాలు అవి. మిగతా ప్రపంచంలోకి యూరప్ విస్తరణ ఫలితంగా ఆ ప్రపంచ రూపురేఖలు ఏ విధంగా తయారవుతాయనే విషయానికి సంబంధించిన సూత్రాలు ఇందులో అనేకం వున్నాయి. మొత్తం ఆర్థిక విధానంతోనే కొంత దూరంగా వుండే రంగాలలో ప్రధానంగా రాజకీయ, సాంస్కృతిక రూపాలకు సంబంధించినంత వరకు ఇక్కడ రెండు సమస్యలు ఉత్పన్నమవుతాయి. మొదటిది సక్రమించిన కొన్ని తరహాలను విమర్శనా రహితంగా ఉపయోగించుకోవడం. ఉదాహరణకు పెట్టుబడిదారీ యూరప్‌ను "నాగరికంగానూ" పెట్టుబడి దారీ పూర్వపు చైనాను "అనాగరికంగానూ" వర్ణించడం. దీర్ఘకాలిక దృష్ట్యా చారిత్రికంగాగాని, సిద్ధాంతరీత్యా కూడా ఇది అప్రధానమైన విషయం. అలాంటి చిత్రణ మహా అయితే ఆ అహ్లాదకరం కాని విషయం మాత్రమే. రెండవది వ్యక్తంచేసిన ఆశలు. ముఖ్యంగా వలసలుగా మారిన దేశాల గురించి అంచనాలు. ఇవి ఆ తరువాత చరిత్రలో తప్పులని రుజువైంది. వలసవాదం పరిపక్వత చెందితే జాతీయ తేడాలు మాసిపోతాయనే ఆలోచన అలాంటి వాటిలో ఒకటి. వలసవాదం పరిపక్వం అయింది. లెనిన్ పేరు పెట్టిన 'సామ్రాజ్యవాదం' ఏర్పడింది. చివరక్కు అది ఈనాటికీ మనముందే కొనసాగుతున్నది. అయినా జాతీయ తేడాలు మాసిపోలేదు. సరికదా వాస్తవంలో మరింత తీవ్రమైనాయి. మరింత అంచెలంచెల నిర్మాణరూపం సమకూర్చుకుంది. ప్రణాళిక అధ్యయనం నుండి జాతీయ వాదపు చరిత్ర గురించి మనకు తెలిసిన దానికి భిన్నంగా జాతీయ వాదపు చరిత్రే నడిచింది. ఆ తరువాత కాలంలో మార్క్స్, ఏంగెల్స్‌ల రచనలలోనే ఇవి సరిచేయబడ్డాయి. అయితే వాటిని ఆ తరువాత కాలపు మార్క్సిస్టులు ప్రత్యేకించి లెనిన్, రోజాలగ్జంబర్గ్‌లు గణనీయమైన రీతిలో సవరించారు.

'ప్రణాళిక' రచన నాటికి మార్క్స్ అనేక విషయాలను అధ్యయనం చేశారు. కాని వలస వాద వ్యవస్థ సంక్లిష్టత నంతటినీ ఆయన అధ్యయనం చేశాడనేందుకు ఆధారం లేదు.

ఆ తరువాతి కాలంలోనే, 1848 విప్లవాలు విఫలమైన తరువాత, ఆమరుసటి సంవత్సరంలో జీవితకాల ప్రవాసానికి లండన్‌లో స్థిరపడిన తర్వాతనే ఆయన వలస వాదాన్ని క్రమబద్ధంగా అధ్యయనం చేయడం మొదట చేపట్టారు. ఏదో కొంత డబ్బు సంపాదించేందుకు 'న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్'కు పత్రికా రచనలకు పూనుకొనమని ఏంగెల్స్ ఆయనను ఒప్పించారు. అప్పటినుండి ఈ అధ్యయనం లోతు సంతరించుకుంది. ఆతరువాత మూడు, నాలుగు దశాబ్దాలలో రూపుదాల్చిన వలస వాద చరిత్రలోని వాస్తవ ఘటనల పట్ల మార్క్స్, ఏంగెల్స్‌లు మరింత ఎక్కువ గా తమ దృష్టిని మరల్చారని దీని అర్థం. బ్రిటన్ పత్రికలలో వెలువడిన కధనాల నుండే విషయాలను గ్రహించగలిగినంత లోతుగా విస్తృతంగా ఈ అధ్యయనం సాగింది. అంతకు ముందు యువజనుడుగా, వలసవాదం నుండి ఆశించిన "ప్రగతిశీల" ఫలితాల పట్ల మార్క్స్ చాలా అధ్యయనం సాగించిన తరువాత కాలంలోనే పూర్తిగా భ్రమలు కోల్పోయారు. వలస దేశాల ప్రజల ప్రతిఘటన హక్కును మార్క్స్, ఏంగెల్స్‌లు ఇద్దరూ గట్టిగా సమర్థించసాగారు. ఈ విషయంనేను మరింత వివరంగా పేర్కొన్నాను.[9]

---

9 అయ్‌జాజ్ అహమ్మద్ ఇన్ థియరీ -క్లాసెస్, నేషన్స్, లిటరేచర్స్, లండన్ 1992 న్యూఢిల్లీ 1994 పేజీలు 228-29) మార్క్స్, ఏంగెల్స్ రచనలలోని ఈక్రింది భాగాలు ఈ విషయాన్ని మరింత స్పష్టంచేస్తాయి మొదటి భాగం 1881లో తన జీవిత చరమాంకంలో డేనియల్ సన్‌కు రాసిన లేఖలో వున్నది

భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వానికి ఒక సార్వత్రిక తిరుగుబాటు, కాకుంటే తీవ్రమైన ఇబ్బందులు ఎదురుకానున్నాయి భూమి కౌలురూపంలో హిందువులకు ఏ మాత్రం ప్రయోజనం లేని రైల్వేల డివెడెంట్లుగా, సైనిక పౌర అధికారులకు పెన్షన్ చెల్లింపులకు, యితర యుద్ధాలు మొదలైన వాటికోసం వారినుండి తీసుకునే మొత్తం, తామే ప్రతిఏటా భారతదేశంలోనే అనుభవించేది అలా వుంచినా ఎలాంటి సమానమైన తిరుగు చెల్లింపులేకుండా వారు కాజేసే మొత్తం ఉచితంగానూ, ప్రతిఏటా భారతీయులు పంపే సరుకుల విలువ గురించి మాట్లాడినా, భారతదేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో 6కోట్లమంది శ్రామికులు మొత్తం ఆదాయం కలిపి చూస్తే ఎంత అవుతుందో అంతకన్నా ఎక్కువ వుంటుంది

మార్క్స్ క్రోధంగా 'నెత్తురుపిండే క్రమం' అని వలసవాదాన్ని అభివర్ణించే చాలా కాలం ముందే మనం ఈనాడు 'జాతీయ విమోచన' అని పిలిచే దాని గురించి ఏంగెల్స్ ఇలా అన్నారు.

చైనీయులలో ఈనాడు విభిన్నమైన మానసిక స్థితి ఏర్పడిందనేది స్పష్టమే. ... విదేశీయులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆవేశపూరితంగా చురుకైన పాత్ర వహిస్తున్నారు ప్రజాసమూహాలు, ఏమాత్రం తటపటాయింపు లేకుండా, అతి సాధారణ విషయంగా వారు మొత్తంగా యూరోపియన్ జాతుల రొట్టెలలో విషం కలుపుతున్నారు. విదేశాలకు వలస వెళుతున్న కార్మికులే తిరుగుబాట్లలోచేరుతున్నారు. ఒక బృందగానం సాగినట్లుగా ప్రతివిదేశీ నౌకతోనూ, దానిని స్వాధీనం చేసుకునేందుకు పోరాడుతున్నారు నాగరికతా వాంఛితులు రక్షణలేని నగరంపై వేడి బాంబులు విసురుతున్నారు హత్యలకు, మానభంగాలు తోడుచేశారు అలాంటి వారు ఆ విధానాన్ని (చైనీయుల తిరుగుబాట్లను -అను) పిరికితనం అనవచ్చు. అమానుషం అనవచ్చు. దారుణం అని కేకలు పెట్టవచ్చు. ఎవరేమనుకుంటే చైనీయులకు లెక్కేమిటి? వారి తిరుగుబాటు విజయవంతమైతే చాలు చైనా జాతీయతా పరిరక్షణకు, కొనసాగింపుకు ప్రజలు సాగించే యుద్ధంగా, ఈ యుద్ధాన్ని మనం గుర్తించితే మంచిది. ( 'పర్షియా-చైనా' - 1857)

150 సంవత్సరాల పరిశీలనా ఫలితంగా కలిగే ప్రయోజనాల దృష్ట్యా కొంత మేరకు కచ్చితంగా నాలుగు అంశాలను ఎవరైనా పేర్కొనవచ్చు ఒకటి 1847-48లో స్వయంగా వలసవాదం గురించి మార్క్స్, ఎంగెల్స్ మరింత చక్కగా అవగాహనకు వచ్చారు. పెట్టుబడిదారీ విధానపు ప్రపంచ వ్యాప్త విస్తరణలో వలస వాదం వహించిన కీలక పాత్రను వారు పూర్తిగా అర్థంచేసుకొన్నారు అంతవరకే గాదు. వలస వాదం ప్రపంచాన్ని రాజకీయంగా ఐక్యంచేయడమేగాక, ప్రపంచాన్ని అనేక చిన్న, పెద్ద భాగాలుగా ఖండ, ఖండాలుగా విభజిస్తుంది. అందువల్ల 'జాతి నిర్దిష్టలక్షణాలు ' తగ్గడం కాకుండా మొత్తం మీద పెరుగుతాయి [10] రెండవది వలసవాదాన్ని తరువాత కాలంలో వారు మరింత బాగా అర్థంచేసుకున్నప్పటికీ, దాని నిర్మాణమే ఎంతో తీవ్రంగా మారవలసివచ్చింది. అందువల్ల మొత్తం మీద మరింత సంక్లిష్టమూ, కొన్ని విధాల పూర్తిగా భిన్నమూ అయిన సిద్ధాంతాయుధాలు అవసరమవుతాయి. అదే ఆ తరువాత తరం మార్క్సిస్టులక్కు, అత్యంత ప్రత్యేకంగా లెనిన్, బుఖారిన్, లగ్జంబర్గ్, హిల్‌పర్‌డింగ్, అటాబంవర్ వంటి ఆస్ట్రో మార్క్సిస్టుల ఆలోచనలకు కేంద్రమైంది. వారు వలస వాదానికేగాక, జాతీయతకు సహితం అనుపమానమైన సిద్ధాంతాలను అందించారు. మూడవది రాజకీయ ఫలితాలనే అతి నిక్కచ్చిగా అంచనా కట్టడం సాధ్యంకాని సందర్భంలో సాంస్కృతిక భావాలను కచ్చితంగా అంచనా వేసే అవకాశాలు మరీ తక్కువ. "ప్రపంచ సాహిత్యం" తలెత్తుతుందని 'ప్రణాళిక' ఊహించింది. అర్థవంతమైన భావంలో అలాంటి సాహిత్యం ఆవిర్భవించలేదు సరకదా, వలసవాదపు సాంస్కృతిక ప్రభావం ఎలాంటిదంటే వలస ప్రజల సాహిత్యమంతా ప్రాంతీయ లేదా జాతీయ స్థాయిలలోనే అభివృద్ధి చెందిన దేశాల సాహిత్యాలకు అణిగి వుండవలసి వచ్చింది. చివర అంశంగా అంతకు ముందుగల ఉత్పత్తి విధానాలు అన్నిటికన్నా, పెట్టుబడిదారీ విధానంలో మార్పురేటు, మొత్తం గూడా ఎక్కువని మార్క్స్ స్వయంగా పరిశోధన తరువాత ప్రతిదశలో ఇవి మరింత పుంజుకుంటాయని కూడా ఆయన చెప్పారు. దీని దృష్ట్యా ఈనాడు మనకు ఎదురయ్యే ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలంటే ఎంతో విస్తృతమైన సైద్ధాంతిక కృషి అవసరం. అంటే మార్క్సుకాలంతో పోల్చితేనే గాక, లెనిన్, చివరకు గ్రాంస్కీల కాలంతో పోల్చినా ప్రపంచం ఎంతో మారిందని అర్థం.

కేవలం ఆర్థికరంగంలోని మౌలిక నిర్మాణవ్యవస్థను తాత్పర్యపూర్వకంగా మనలను నిశ్చేష్టులను చేసేంత ఖచ్చితంగా దీర్ఘకాలిక దృష్టితో వివరించారు మార్క్స్. రాజకీయ,

---

10. అయితే సామ్రాజ్యవాద కేంద్రాలలో, మరింత పరిపక్వ దశకు చేరిన అనంతరం, ఈ జాతి ప్రత్యేకత, తరిగి పోతున్నది నిజం. యూరోపియన్ యూనియన్ పేర ఐరోపా సమైక్యం కావటానికి జరుగుతున్న ప్రయత్నాలను ఉదాహరణగా చూడవచ్చు మిగిలిన ప్రపంచంలో అలాగ జరగలేదు సరికదా ఐరోపాలో జరుగుతున్న ప్రయత్నంకూడా ఈ మధ్యకాలంలోనే జరిగింది ఇప్పటికీ ఎంతో అసమానమైన క్రమంగానే సాగుతున్నది

సాంస్కృతిక రంగాలలో రానున్న పరిణామాలను ఊహించడంలో అంతే ఖచ్చితమైన అంచనా కనిపించదు. ఈ వ్యత్యాసాన్ని మరొక కోణంనుండి బహుశా మనం చూడవచ్చు. 'ప్రణాళిక' రచన జరిగిన చాలాకాలం తర్వాత 1859 'క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' గ్రంధానికి 'పీఠిక' రాశారు. అందులో ఇలా రాయవలసి వచ్చింది :

**"ఈ తేడాలోకొట్టవచ్చే అంశం ఏమిటి? ఉత్పత్తియొక్క ఆర్థిక స్థితిలో వచ్చే పరివర్తనను మాత్రమే నిక్కచ్చిగా నిర్ణయించగలిగింది. శాస్త్రీయ పద్ధతిలో ఇలా చేయవచ్చు. అయితే ఆ మౌలిక ఘర్షణ "చైతన్యం" ఇతర అంశాలకు సంబంధించి అవే 'చట్టబద్ధ రాజకీయ, మత, సౌందర్య భావాలు లేదా తాత్విక" రీతులలో వుంటుంది. వీటిని ఇంతే "కచ్చితంగా" "నిర్ణయించడం" సాధ్యంకాదనేది స్పష్టమే. అక్కడే ప్రజలు "పోరాడి తేల్చుకుంటారు".**

అయినా బహుశా అందువల్లనే కావచ్చేమో వాటిని కచ్చితంగా నిర్ణయించడం సాధ్యంకాదు. బహుశా, ఈపోరాటపద్ధతులు భౌతిక నిర్మాణవ్యవస్థ సూత్రాల ఫలితంగా కాకపోవచ్చు. వాటి ప్రభావం తక్కువ కావడం వల్ల కావచ్చు. మానవులు సమిష్టిగా సాగించే పోరాటాలు కేవలం 'చట్టబద్ధ' రాజకీయ పద్ధతులనే గాక "మత, సౌందర్యభావనల లేదా తాత్విక" పద్ధతులను అనుసరిస్తాయి. కాబట్టి ఆ "పోరాడి తేల్చుకునే" మానవులే ఎక్కువగా ఆ పద్ధతులను నిర్ణయిస్తారు. అందువల్ల ఆ పోరాట పద్ధతులపై సైద్ధాంతిక రంగాల ప్రభావం ఎక్కువగా వుండవచ్చు. ఈ సూత్రరీత్యా చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక ఉత్పత్తి ప్రపంచీకరణ తీసుకునే క్రమాన్ని మార్క్స్ స్పష్టంగా ముందుగానే ఊహించగలిగారు. అంతే కచ్చితంగా 'రాజకీయ' 'సౌందర్యభావన" రీతులు పొందే రూపాలను ముందుగానే ఊహించలేకపోయారు. పై సూత్రాన్ని అనుసరించి చూస్తే ఈ వ్యత్యాసం తార్కికంగానే వుందని అర్థమౌతుంది.

## 'విశ్వవ్యాపిత వర్గం' కార్మికవర్గం

కార్మికవర్గాన్ని 'విశ్వవ్యాపిత వర్గం'గా భావించారు. అలా ఆయన భావించే నాటికి ఆసియా, ఆఫ్రికాలలో ఒక్కదేశంలో గూడా ఆధునిక కార్మివర్గానికి పోలిక గల ప్రజాసమూహాలు లేవు. అమెరికా, బ్రెజిల్ వంటి పెద్ద అమెరికన్ దేశాలలో గూడా కార్మికులకన్నా ఎక్కువమంది బానిసతే వుండేవారు. రష్యా దాస్య వ్యవస్థలో కూరుకుపోయివుంది. మొత్తం తూర్పు, దక్షిణ యూరప్ అంతా, మిగతా యూరప్‌లో అత్యధికం భాగంలో వ్యవసాయక రంగమే ఎక్కువగా వుండేది. 'విశ్వవ్యాపిత వర్గం' అనే పదం రెండు అర్థాలలో వాడారని నేను అనుకుంటున్నాను. మొదటిది ఒక భాగం తాత్విక ప్రతిపాదన, కార్మికవర్గానికి సమిష్టిగా గల అనుభవం దోపిడీ. ఉత్పత్తి క్రమంలో సమిష్టిగా, స్వంత వ్యక్తిత్వ రహిత స్థానం గూడా దాని అనుభవమే. మొత్తం దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా అనూశ్రితంగా (వర్గంలో అంతర్గతంగా, విశ్వవ్యాప్తం) విప్లవం పట్ల ఆసక్తి కలిగి వుంటారు. దోపిడీ వ్యవస్థను వేరేవేరు భాగాలుగా రద్దుచేయటం సాధ్యంకాదు.

పెట్టుబడి, "వేతన బానిసత్వం" రెంటినీ ఒకేసారి రద్దు చేయకుండా ఆ వ్యవస్థను రద్దు చేయడం సాధ్యంకాదు. దానితోపాటు దోపిడీ పునాదిగా ఏర్పడిన రాజకీయ, సామాజిక, సైద్ధాంతిక ఉపరితలాన్ని రద్దు చేయకుండా దోపిడీ వ్యవస్థ రద్దుకాదు. అందువల్ల ఆ వ్యవస్థను మొత్తంగా రద్దు చేయకుండా మొత్తం సమాజాన్ని విముక్తం చేయకుండా, కార్మికవర్గం తనను తాము విముక్తం చేసుకోలేదు. అందువల్లనే విశ్వ విముక్తికి అది అత్యంత అనువైన వర్గం.

ఇది మొదటి అర్థం. ముందే పేర్కొన్నట్లు ప్రధానంగా నిరంకుశ అధికారవర్గాన్ని విశ్వవ్యాప్త వర్గమని చిత్రించిన హెగెల్ వర్ణనకు వ్యతిరేకంగా రూపొందించబడిన తాత్విక ప్రతిపాదనగా మొదట అలా ప్రారంభమైంది. దానికి రెండవ అర్థం కూడా వుంది. భూమి నలుమూలలా తన ఆధిపత్యాన్ని ప్రతిష్టించుకునే పెట్టుబడి ప్రయత్నం – ఈ ప్రపంచీకరణ ప్రయత్నం పెట్టుబడికి అనూశ్రిత లక్షణం. ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ సంఖ్యను నిరంతరం పెంచడం దాని కర్తవ్యం. బాధ్యత. అందువల్ల, చిట్టచివరకు మానవాళిలో అత్యధికంగా మెజారిటీ కార్మికవర్గమే ఉంటుంది. ప్రపంచంలోని అన్ని భాగాలలో సార్వత్రికంగా వ్యాపించి వుంటుంది. మరొకరకంగా చెప్పాలంటే జాతి సరిహద్దులకు అతీతంగా ప్రపంచ కార్మికవర్గం ఏర్పడుతుంది. అది రాశిలో సహితం విశ్వవ్యాప్తమౌతుంది! దీనినే వర్గ విభజనా క్రమం అని కూడా అన్నారు. ('వర్గ నిర్మాణాన్ని సులభతరం చేయడం'గా దానిని 'ప్రణాళిక' పేర్కొంది.) మెజారిటీని సంపూర్ణంగా ఏకోన్ముఖం కూడా చేస్తుంది.

ఇదే చరిత్రలో మొదటిసారిగా ఈనాడు జరుగుతుంది. మార్క్స్ కాలంలో కాదు. లెనిన్ కాలంలోనూ కాదు. ఇప్పుడే, మనకాలంలోనే జరుగుతున్నది.

ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం 1965–95 మధ్యగల 30 సంవత్సరాల కాలంలో కార్మికవర్గ సంఖ్య రెట్టింపు అయింది. ఈ విషయం ముందే పేర్కొన్నాను. ఈనాడు ఈ సంఖ్య 250 కోట్లుగా చెబుతున్నారు. వీరిలో 12 కోట్ల మంది ఈనాడు నిరుద్యోగులు. నూర్రుకోట్ల మంది రోజుకు ఒక డాలర్ కన్నా తక్కువ ఖర్చుతో నికృష్టపు బ్రతుకు వెళ్ళదీస్తున్నారు. సంఖ్య అంచనాలేవి మరికొన్ని కోట్లమంది పనికోసం ఎదురు చూడటమే మానేశారు. ఇలా అగాధంలో కూరుకుపోయిన వారిలో అత్యధికులు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో నివసిస్తున్నారనే విషయం చెప్పవలసిన అవసరం లేదు. ప్రపంచబ్యాంకు లెక్కల ప్రకారం, ఒక్క చైనాలోనే నిరుద్యోగులు, అర్థ నిరుద్యోగులు కాక 8 కోట్ల మంది "అనిశ్చిత జనాభా" (ఫ్లోటింగ్ పాపులేషన్) ఉన్నారు. వీరు రైతాంగ జీవితం వదిలేశారు. 'ఆధునిక' రంగంలో బాగస్తులు కాలేదు. రానున్న దశాబ్దంలో 10 కోట్ల ప్రజలు చైనా గ్రామీణ ప్రాంతాలను వదిలి నగరాలలో ఉద్యోగాలు వెతుక్కోవలసి వుంటుంది. ఆసియా, ఆఫ్రియా, లాటిన్ అమెరికాల్లో సహితం ఇలాంటి క్రమమే పనిచేస్తున్నది. అదే లెక్కల ప్రకారం ప్రపంచ మార్కెట్‌తో ఏదో ఒకరకంగా ప్రత్యక్షంగానో, బాగా దూరంగానో, సంబంధమే లేని వారు ప్రపంచంలో శ్రమలో పాల్గొనే వారిలో 12 నుండి 15శాతం వరకే ఉంటారు దాదాపు నూటికి 80మంది వరకు

అనుసంధానమైన ఈ మార్కెట్‌కోసం ఉత్పత్తి చేస్తున్నారు. కొత్తరూపంలో ఏర్పడిన 'విశ్వవ్యాప్తి' ఇది! ఇక ఏకోన్ముఖత విషయాన్ని చూద్దాం. పేద, మధ్యతరగతి నుండి సంపన్నులకు సంపద చేతులు మారే వరకు చూద్దాం. 1965-1990 మధ్య ఈ మార్పుకు సంబంధించి ఈ క్రింది లెక్కలను 1998 మే మాసపు 'మంత్లీ రివ్యూ' పత్రిక ప్రకటించింది.

| | 1965 | 1970 |
|---|---|---|
| అత్యంత పేద 20శాతం | 2.3 | 1.4 |
| తరువాత 20 శాతం పేదలు | 2.4 | 1.8 |
| మూడవ 20 శాతం | 4.2 | 2.1 |
| నాల్గవ 20 శాతం | 21.2 | 11.3 |
| 20శాతం సంపన్నులు | 69.5 | 83.4 |

దీని అర్థం ఏమిటి? ప్రపంచ వ్యాప్తంగా వున్న 80 శాతం ప్రజలకు గల సంపదలో భాగం 25 సంవత్సరాలలో సగానికిపైగా కత్తిరింపు అయింది. ఇది ఒక్క తరంలోనే జరిగింది. 1995 నాటికి తక్కువ ఆదాయం వచ్చే 40 శాతం ప్రజల వాటా 3 శాతం కన్నా కొద్దిపాటి ఎక్కువగా దిగజారిపోయింది. మరో ప్రాముఖ్యంగల అంశం కూడా వుంది. ఇందులో, రెండవ అత్యధిక సంపద కలిగిన వర్గాన్ని చూడండి. బహుశా వీరినే మనం 'మధ్యతరగతి' లేదా 'ఉన్నత మధ్య తరగతి' అని కూడా అంటాము. మొత్తం సంపదలో వారి భాగం కూడా సగానికి తగ్గింది! ఈ కేటగిరివారి సరాసరి ఆదాయం అంతగా తగ్గిపోవాలి అంటే కనీసం వారిలో గణనీయమైన సంఖ్య తక్కువ ఆదాయం పేదరికపు కేటగిరిలో చేరి వుండాలి. ఇంకా అనేకమంది జీవన ప్రమాణాలు తీవ్రంగా క్షీణించి వుండాలి. అదే నిష్పత్తిలో వారి రుణభారం పెరిగివుండి వుండవచ్చు కూడా. సంపూర్ణ రూపంలో వర్గ విభజన ఇందులో కొట్టవచ్చినట్లు కనిపించే అంశం. 40శాతం ప్రజల ఆదాయం 3శాతం. అత్యున్నత 20శాతం వారి సంపద 83శాతం.

ఆ విధంగా పెరుగుతున్న వర్గ విభజన, ఏకోన్ముఖత, కార్మికీకరణ, ప్రాథమిక సంపద సమీకరణ అనేవి మనకాలంలోనూ కొనసాగుతున్న ప్రక్రియలు. సామ్రాజ్యవాద దేశాలలో పోగుపడిన పెట్టుబడి అత్యధికంగా కేంద్రీకరింపబడింది. అక్కడ కార్మికీకరణ, ప్రాథమిక సంపద సమీకరణ పూర్తి అయినాయి. ఆ దేశాలలో మరింతలోతైన దోపిడీ, సాపేక్షిక అదనపు విలువ సమీకరణల వైపు క్రమంగా మారుతోంది. దీనిపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకృతమౌతున్నది. ఇందుకు బాగా అభివృద్ధి చెందిన సాంకేతికతను వినియోగిస్తున్నారు. వెనుకబడిన పెట్టుబడిదారీ వ్యవస్థలలో పెట్టుబడికన్నా, శ్రమశక్తిని అంతకంతకూ ఎక్కువ లోతుగా వినియోగించడమే. 'ప్రపంచీకరణ'లో గణనీయమైన భాగంగా వుంది. చైనా పరిస్థితి చూద్దాం. అది ఎగుమతి రంగంలో అద్భుత విజయాలు సాధించింది. అయితే ఆ విజయం ఇప్పుడు తగ్గుముఖం పడుతోంది. అది ఎగుమతి చేసే వస్తువులలో 75శాతం శ్రమశక్తి ప్రధానమైన పరిశ్రమల

నుండి జరుగుతోంది. ఎగుమతులు అతి పరిమితంగా వుండే రోజులలో ఈ శాతం 40 మాత్రమే ఉండేది., మరోవిధంగా చెప్పాలంటే ఎగుమతులలో పెరుగుదల ఉత్పత్తి క్రమంలో సాంకేతిక 'ఆధునీకరణ' వల్లగాక, మరింత క్రమబద్ధమైన మరింత లోతు సంతరించుకున్న కార్మిక శ్రమను వినియోగించుకోవడం వల్లనే సాధింపబడింది. ప్రపంచవ్యాప్తంగా విస్తరణను బట్టి చూస్తే, కార్మికవర్గం అవధులు లేకుండా మరింతగా, మునుపెన్నడూ లేనంతగా "విశ్వవ్యాప్త 'మైంది. దీని అర్థం ప్రపంచ కార్మికులు ఐక్యం కావలసిన తప్పించుకోరాని కర్తవ్యం గతంలో ఏనాటికన్నా ఈనాడు ఎక్కువైంది. అయితే ఈ కార్మికవర్గ విశ్వవ్యాప్తీకరణ మూలంగా సమస్యలు తలెత్తవని కాదు. ఎలాంటి సమస్యలు లేకుండా ఆవిర్భవించదు. డేవిడ్‌హార్వే ఇలా అన్నారు :

"కార్మికశక్తి ఈనాడు భౌగోళికంగా ఎంతో ఎక్కువగా వివిధ ప్రదేశాలలో ఏర్పడింది. సాంస్కృతికంగా విభిన్నమైంది. తెగ, మత భావాలు అతి భిన్నమైనవి. జాతులుగా తీవ్ర విభజన ఉంది. భాషాయుతంగా విడగొట్టబడి వుంది.. . (భౌగోళికంగా, సామాజికంగా) వేతనాలు, సమాజ సేవల విషయంలో ప్రపంచ కార్మికుల మధ్య వ్యత్యాసాలు గతంలో ఎన్నడూ లేనంత హెచ్చుగా వున్నాయి.[11]

కార్మికవర్గంలో ఈనాటి ఈ విభజన, కార్మికవర్గ ఐక్యత సాధించడంలో ఇబ్బందులను మరింత పెంచుతుంది. దీనికితోడు భద్రతగల ఉద్యోగాల స్థానే క్యాజువల్, తాత్కాలిక కార్మికుల నిష్పత్తి రోజురోజుకు పెరుగుతున్నది. 'సంఘటిత' రంగంతో సాపేక్షంగా చూస్తే 'అసంఘటిత' రంగం పాత్ర పెరుగుతున్నది. కార్మికశక్తి మరింత స్థానచలనం పొందడం, తాత్కాలిక రూపం తీసుకొనడంతోపాటు, పెట్టుబడి సహితం మరింతగా స్థానచలనం (మొబిలిటీ) చెందడం వంటి అనేక విషయాలు కార్మికవర్గ ఐక్యతకు పెరిగిన ఇబ్బందులను మరింత జఠిలం చేస్తున్నాయి.

ఒక్కముక్కలో చెప్పాలంటే దాని చారిత్రక కర్తవ్యంగా ఒకనాడు భావించబడిన కర్తవ్యాన్ని పెట్టుబడి పూర్తిచేసింది. అది ప్రపంచ మార్కెట్‌ను ఒకే మార్కెట్‌గా రూపొందించింది. ప్రపంచం నలుమూలలకూ కార్మికీకరణ క్రమాన్ని లోతుగా తీసుకెళ్ళింది. నివాసాల నుండి, ఉత్పత్తి స్థానాల నుండి, జాతీయ ఐక్యతను సాధించడం అనేది ఇంకా రావలసి వున్న సోషలిజం కోసం పోరాడే మిలిటెంట్లకు అత్యంత కష్టభూయిష్టమైన, కఠినతరమైన కర్తవ్యం. 'ప్రతి వర్గ పోరాటమూ, సారాంశంలో గుర్తు చేస్తుంది. అలా గుర్తు చేసే సందర్భంలో నేను ఇంతకుముందే కొంతమేరకు వివరించేందుకు ప్రయత్నించిన వివిధ పోరాటాల మధ్యగల తేడాను మనం గుర్తించాలని ప్రబోధిస్తున్నది. మార్క్స్ (ఎ)క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ 1859'కి రాసిన పీఠికలోని సూత్రంతో నేను ఆ పనికి పూనుకున్నాను. మరింతగా విషయాన్ని నొక్కి చెప్పేందుకు ఆ సూత్రాన్ని మరొకసారి గుర్తు చేస్తున్నాను.

"..... ఉత్పత్తి యొక్క ఆర్థిక స్థితిగతుల భౌతిక పరివర్తనను, నేచురల్ సైన్స్‌వలే అతి

---

11 డేవిడ్ హార్వే – 'వర్గ అధికారపు భూగోళం' ది సోషలిస్టు రిజిస్టర్ 1998 మెర్లిన్ ప్రెస్ (ఇన్ యు కె ) మంత్లీ ప్రెస్ ఇన్ యు.ఎస్.ఎ 1998

ఖచ్చితంగా నిర్ణయించవచ్చు. కాని మానవులు తమ పోరాటం పట్ల చైతన్యవంతులై, పోరాడి గెలిచే, చట్ట, రాజకీయ, మత, సౌందర్య భావన, లేక తాత్విక ధోరణులను క్లుప్తంగా చెప్పాలంటే సైద్ధాంతిక రూపాలను ఉత్పత్తి రంగంలోని మార్పులకు మధ్య ఎల్లప్పుడూ తేడాగాచూడాలి."

'ఉత్పత్తి ఆర్థిక పరిస్థితిలోని భౌతిక పరివర్తన'లో నిరంతరం సాగుతున్న వర్గ పోరాటాన్ని సక్రమంగా 'రాజకీయ పోరాటంగా' పరివర్తన చెందించేందుకు 'మానవుడు తన ఘర్షణ పట్ల చైతన్యవంతుడై పోరాడి తేల్చుకునే సైద్ధాంతిక రూపాలను' అన్నిటినీ చట్టబద్ధ, రాజకీయ, మత, సౌందర్య భావన లేదా తాత్విక రూపాలు – కలబోసి పరిశీలించవలసి వుంటుంది. లేకుంటే ప్రపంచ కార్మికవర్గాన్ని చీల్చే భౌతిక విభజనలను, స్వీయ మానసిక చైతన్యపు సమస్యను పరిష్కరించలేము. విభిన్న తరహాల ప్రజానీకం అంతకంతకూ కార్మికీకరణ చెందేకొలదీ, అలాంటి ఐక్యత సాధించేందుకు ఉపయోగించే రూపాలు సహితం మరింత భిన్నంగా వుండవలసి వుంటుంది. కార్మికీకరణకు అవకాశాలు ఎక్కువ కావడం వేగవంతమయ్యే కొద్దీ, ప్రతి 'రాజకీయ పోరాటం' అదే విధంగా మరింత సంక్లిష్టమౌతుంది. అనేక రకాల రూపాలను ('మత, సౌందర్య భావనల వంటివి') సంతరించుకుంటుంది. ఈక్రమంలో మనకు ఒక చేదు అనుభవం ఎదురైంది. కేవలం ఏకోన్ముఖంకావడం దానంతట అదేవర్గ చైతన్యాన్ని ఏర్పర్చదు. ఇదే ఆఅనుభవం. ప్రపంచాన్ని తను ఏ రూపంలో అనుభవానికి తెచ్చుకుంటుందో, ఆ చైతన్యంపైనే మనం కేంద్రీకరించాల్సి వుంటుంది. ఆ రూపాలు స్వభావరీత్యా సాంఘిక, సైద్ధాంతిక రూపాల్లోనే వుంటాయి.

ఇర్ఫాన్ హబీబ్

# కమ్యూనిస్టు ప్రణాళికలో చరిత్ర అధ్యయనం

## రచనకు సమాయత్తం

1848 ప్రథమ భాగంలో కమ్యూనిస్టు ప్రణాళికను ప్రచురించవలసి వుంది. తాత్విక, చారిత్రక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మార్క్స్, ఏంగెల్స్‌ల అవగాహనను ప్రజలకు అర్థమయ్యేలా సులభమైన భాషలో రాయాలని వారిని కోరారు. ఆ అవగాహన ప్రాతిపదికగా ఆచరణాయుత కార్యక్రమం రూపుదిద్దమని కోరారు. ఈ కృషిలో తమ అవగాహన సారాన్ని అందించే కర్తవ్యం. నూతనత్వం ఆవిష్కరించే పని రెండూ మిళితమై వున్నాయి. అప్పటికి ఐదు సంవత్సరాలనుండి వారు విడివిడిగానూ సమిష్టిగానూ పట్టు సంపాదించిన సూత్రాల సారాంశాన్ని క్లుప్తీకరించడం, ఆ అవగాహనలోగల ఖాళీలను పూర్తిచేసే సృష్టి కర్తవ్యం కలసి వున్నాయి. ఈ కర్తవ్యం అత్యంత ప్రతిభావంతంగా పూర్తి చేశారు వారు. ఫలితంగా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో నిస్సందేహంగా అత్యంత ప్రాముఖ్యంగల గొప్ప రచన అయ్యింది, అందువల్ల అందులోని విషయాలను అత్యంత అసాధారణ జాగ్రత్తతో విశ్లేషించాలి. ఆ విషయంలో ప్రత్యేక సమర్థన అవసరం లేదు.

చరిత్ర గురించి మార్క్స్ రూపొందించుకున్న ప్రారంభ అభిప్రాయాల మీద పై యువ హెగేలియన్ల ప్రభావం వుంది. ఆ అవగాహన నుండి మౌలికంగా ఆయన వేరుపడ్డారు. దాని ఫలితమే కమ్యూనిస్టు ప్రణాళిక. 1945లో ఫ్యూయర్‌బాపై తన సిద్ధాంత వ్యాసాన్ని ప్రచురించారు మార్క్స్. మొదటి రచనలోనే ఆయన ఈ క్రింద విధంగా రాశారు.

(అ)

మూడవ రచనలో ఈ విషయం మరింత వివరించారు:

(ఆ) "పరిస్థితులను మార్చి, దానిని పెంపొందించేందుకు సంబంధించిన ఫ్యూర్ బా సిద్ధాంతం. పరిస్థితులను మానవులే మారుస్తారనే విషయాన్ని విస్మరిస్తుంది. విజ్ఞానదాతే విజ్ఞానవంతుడు కావాలనే అంశాన్ని మరచిపోతుంది."

ఈ రచన ఎంతో ప్రఖ్యాతి చెందిన ఈ క్రింది వాక్యంగా రూపొందింది.

· "తాత్వికులు ప్రపంచాన్ని పరిపరివిధాల వ్యాఖ్యానించారు. అసలు సమస్య దాన్ని మార్చడం " [1]

మార్క్సిస్టు విమర్శకులు (దురదృష్టవశాత్తూ, కొందరు దాని అనుయాయులు గూడా) ఈ సిద్ధాంత రచనకు గల కీలక ప్రాధాన్యతను తరచూ విస్మరిస్తున్నారు. వారు దానికి ఒక పిడివాదంలా నిశ్చయాత్మక భావాలను అంటగడుతున్నారు. కేవలం "వస్తు" లేదా భౌతిక అంశాల చైతన్యాన్ని నిర్ణయిస్తాయని మాత్రమే ఆ సిద్ధాంతం చెప్పినట్లు ఆపాదిస్తున్నారు. ఈ భౌతిక పరిస్థితులు "అనివార్యం" చేసే మార్పులను సాధించే సాధనంగా మాత్రమే చైతన్యపు పాత్రగా మార్క్స్ పేర్కొన్నట్లు వ్యాఖ్యానిస్తారు. ''ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి" (1859) గ్రంథానికి ఆయన రాసిన ఉపోద్ఘాతంపై తరచూ ఆధారపడి ఇలాంటి వ్యాఖ్యానాలకు పూనుకుంటున్నాను. "సామాజిక, రాజకీయ, బౌద్ధిక జీవితపు సాధారణ క్రమాన్ని భౌతిక జీవితపు ఉత్పత్తి విధానం" ఎలా అవధులు ఏర్పరుస్తుందో వివరించారు. "మానవ అస్తిత్వాన్ని వారి చైతన్యం నిర్ణయించదు. అందుకు భిన్నంగా వారి సామాజిక జీవన పరిస్థితులే. వారి చైతన్యాన్ని నిర్ణయిస్తాయి" అని నొక్కి చెపుతారు.[2]

ఈ మాటలను మనం మరింత జాగ్రత్తగా పరిశీలిస్తే మనకు ఒక ప్రశ్న ఎదురౌతుంది. "భౌతిక జీవిత ఉత్పత్తి" అంటే అర్థమేమిటి అనేదే ఆ ప్రశ్న. ఉత్పత్తి క్రమం అంతటి వెనుక, దానిని నడిపించే అంశం మానవ శ్రమ అనేది సత్యం. (ఆ విధంగా అది మానవ చైతన్యమే). ఆ విధంగా తన స్వీయ ఆచరణ ఫలితమే మానవుని సాంఘిక వునికిని నడిపే అంశం. అందువల్ల మానవ సమాజపు వునికిని "నిర్ణయించే" లేక దానికి పరిమితులు విధించే 'చైతన్యం' భౌతిక ఉత్పత్తి పరిధికి, కేవలం బౌద్ధిక పరిధిగా కనిపించే దానికి వెలుపలనే వుంటుంది. మానవాళి ఎల్లప్పుడూ తాను పరిష్కరించుకోగల కర్తవ్యాలనే ఎంచుకుంటుంది. ఒక సమస్య పరిష్కారానికి అవసరమైన భౌతిక పరిస్థితులు సిద్ధమై వుండడమో లేదా కనీసం రూపొందే

1. కారల్ మార్క్స్, ఏంగెల్స్‌ల రచనలను కలెక్టెడ్ వర్క్స్‌గా ఇంగ్లీషు అనువాదంగా ప్రకటించారు అందులో 5వ సంపుటంలో మాస్కో 1976 - 3-5 పేజీలలో ఇంగ్లీషు అనువాదం థీసిస్ అనే ఫ్యూయర్‌బా నుండి తీసుకున్న వాక్యాలు. ఈ చివరి సిద్ధాంతపత్రం ది జర్మన్ ఐడియాలజీలో తిరిగి కనిపిస్తుంది. 1845-46లలో మార్క్స్ - ఏంగెల్స్‌లు ఈ రచన చేశారు. చివరి సిద్ధాంతపత్రంలో ఈ క్రింది వాక్యాలు వున్నాయి. "వాస్తవంలో ఒక ఆచరణ యుతుడైన భౌతికవాదికి అంటే ఒక కమ్యూనిస్టుకు ఈ విషయం ఎదురవుతున్న ప్రపంచాన్ని విప్లవకరం చేయడమనే సమస్యగా ఎదురవుతుంది ఉనికిలో కనిపించే విషయాలను అవగాహన చేసుకుని మార్చడమనే ఆచరణయుత సమస్యగా రూపొందుతుంది" అదే పుస్తకం 38-39 పేజీలు. ఈ భాగం మాస్కో 1964 ప్రచురించిన జర్మన్ ఐడియాలజీ రైజనిస్కయా అనువాదంలో వదిలివేయబడినట్లుంది. ఆ వాక్యాలు 39వ పేజీలో వచ్చి వుండాలి

2 ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమి" రైజనిస్కాయా అనువాదాన్ని మారిస్ దాబ్ సంపాదకత్వం వహించారు. మాస్కో 1978 పేజీ 20-21

క్రమంలో వుంటేనో మాత్రమే అసలు సమస్యగా ఒక అంశం తలెత్తుతుంది.' అనే మార్క్స్ నిర్ధారణలోనే ఈ విషయం స్పష్టీకరింపబడింది.[3] పరిష్కారానికి అనువైన సమస్యను సరిగా కనుగొనడం, దాని పరిష్కారాన్ని నిర్దేశించడం అనేది మానవ మేధస్సుకు సంబంధించిన నిర్ణయాత్మక శక్తి. 'బోధకుడికే' బోధన గరపాలి" ఎదుర్కోవలసిన సమస్యను వ్యక్తులు అవగాహన చేసుకోగానే, ఆభావాలను ప్రచారంలో పెట్టాలి తద్వారా ఆచరణయుత ఫలితాలకు దారి సుగమం చేయాలి. ఇదే మార్క్స్ ఫ్యూయర్‌బాపై రాసిన సిద్ధాంత వ్యాసంలో చెప్పిన "విప్లవకర" (ప్రాధాన్యత) ఆచరణయుత విమర్శనాపూర్వక" కార్యాచరణ అంటే అర్థం.[4] బలహీనమైన పరిస్థితిలో వున్న సందర్భంలో నిజమైన, క్రియాశీల భావాలు తొడుక్కునే బట్టలే ఇక తిరుగులేదనే భావం (అంటే నిర్ణయాత్మకత, కొన్ని క్రమాలు అనివార్యం అనుకునే అభిప్రాయం) అనే దానిని ఇటాలియన్ కమ్యూనిస్టు తాత్వికుడు గ్రామ్‌స్కీ తన 'ప్రిజిన్ నోట్ బుక్స్'లో ఎంతో వివేకవంతంగా వివరించారు. యాంత్రిక నిర్ణయాత్మకభావ నిష్ప్రయోజకత్వాన్ని బహిర్గం చేయడం అత్యవసరం, అలా చేయకుంటే, నిర్లిప్తతకు, మూర్ఖ ఆత్మసంతృప్తి'కి దారితీస్తుంది. అది ఏ విప్లవకర వుద్యమానికైనా అత్యంత అరిష్టదాయకమౌతుంది. అన్నారాయన.[5]

చారిత్రకంగా అనూశ్రితంగా వచ్చిన పరిస్థితులు తక్షణ 'ఆచరణ'పై ఏర్పర్చే అవధుల పట్ల మార్క్స్, ఏంగెల్స్‌లు తమ దృష్టిని పూర్తిగా కేంద్రీకరించారు. అయితే చరిత్ర అంధశక్తి పట్ల గాని, దానంతట అదిగా సాగే ప్రక్రియల పట్ల వారు ఎలాంటి విశ్వాసం ప్రకటించలేదు. విప్లవ ఆచరణకు దారిచేసే భావాలను విస్తరింపచేయడం మాత్రమే ప్రపంచం మార్పుకు అవసరమైన కార్యాచరణకు దారితీస్తుంది. అందువల్ల 1845-46లలో వారి తాత్విక నిర్ధారణలలో అంతర్గతంగా నిబిడీకృతమై వున్నది విప్లవం. అందువల్లనే కమ్యూనిస్టు ప్రణాళిక ప్రధాన లక్ష్యమైన విప్లవానికి గళం విప్పి మహత్తర పిలుపునిచ్చారు. అంధ 'పదార్థం'గాక ఆలోచనా పరులైన మానవులే ప్రస్తుతం వున్న వ్యవస్థపై తిరగబడి, కూల్చివేస్తారనే మార్క్సిస్టు మూల పురుషుల విశ్వాసయుతమైన నమ్మకానికి అద్భుత స్మృతి చిహ్నమే ప్రణాళిక.

## II

సిద్ధాంతం విప్లవ ఆచరణకు దారి తీయాలనేది మార్క్స్, ఏంగెల్స్‌ల విశ్వాసం. చరిత్రకు గతితార్కిక పద్ధతిని అన్వయించడం ఆ విశ్వాసానికి తోడుగా వుంది. వైరుధ్యాల పరస్పర ప్రభావాలే మార్పులు అని అర్థం చేసుకోవడం దీనిలో ఇమిడివుంది."పెట్టుబడి" ఒకటవ సంపుటికి జర్మన్ రెండవ ముద్రణకు ఆయనరాసిన పీఠికలో చెప్పినట్లు (1873) హెగెల్ గతితార్కానికి యిచ్చిన "మాయా రూపాన్ని" హేతుశీల ఆలోచనారూపంగా మార్చవలసిన అవసరం వుంది.

---

3 అదే పుస్తకం పేజీ 21

4 మార్క్స్-ఏంగెల్స్ కలెక్టెడ్‌వర్క్స్ 5 పేజీ 1

5 <u>సెలెక్షన్స్ ఫ్రం నోట్‌బుక్స్ ఆఫ్ ఆంటోనియో గ్రామ్‌స్కీ-</u> క్వింటిన్ హూర్, జాఫ్రీ నోవెల్ స్మిత్‌లు ఎడిట్ చేసినది న్యూయార్క్ *1971* పేజీలు *336-37.* అలాగే లూయిస్ అల్తూసర్ రచన 'ఫార్ మార్క్స్' బ్రూస్టర్, అనువాదం హార్‌మోన్ డీ వర్త్-1969 పేజీ 105-106 నోట్ 23

“అది (గతితర్కం) వస్తువుల ఉనికి ద శను స్పష్టంగా గుర్తించి, అర్థం చేసుకుంటుంది. అదే సమయంలో ఆ దశ యొక్క విరుద్ధాంశాన్ని (నెగేషన్)ను కూడా గుర్తిస్తుంది. ఆ దశ విచ్ఛిన్నమౌతుందనీ గుర్తిస్తుంది. ఎందువల్లనంటే చారిత్రకంగా అభివృద్ధి చెందిన ప్రతి సామాజిక రూపాన్ని అది నిరంతర చలనంలో వుండే అంశంగానే భావిస్తుంది. అందువల్ల ఆ దశ యొక్క పరివర్తనా దశను, దాని వునికిలో గల క్షణికత్వంను గుర్తించిన దానికన్నా తక్కువ కాకుండా పరిశీలిస్తుంది. ఎందువల్లనంటే గతితర్కం తనపై వుండే అంశం ప్రభావం కలిగించడాన్ని ఆమోదించదు. దానిసారం విమర్శనాత్మకం, విప్లవకరము.”

ఆ తరువాత పెట్టుబడిదారీ సమాజపు నడకలో అంతర్గతంగా వుండే వైరుధ్యాలను గురించి ఆయన పేర్కొంటారు. [6]

హెగల్ గతితర్కాన్ని మార్క్స్ ఏమి చేశారు? (ఆయన రాసిన పైన పేర్కొన్న ఉల్లేఖన ననుసరించి మరొకసారి తల్లక్రిందులు చేయడం) అని అర్థంలో దానిని మార్చడమేనా లేక అత్సాస్సర్ వాదిస్తున్నట్లు హెగెల్‌తో మౌలికంగానే ‘తెగతెంపులు’ చేసుకున్నారా?”[7] ఇది చాల ముఖ్యమైన ప్రశ్న. దీనికి సమాధానం ఏదైనా కానీయండి, చరిత్ర పట్ల తమ భావనను రూపొందించుకోవడంలో మార్క్స్ గతితార్కిక పద్ధతిని ఉపయోగించుకున్నారు. ఈ విషయంలో వివాదం లేదు. 1843 మార్చి – ఆగస్టులో ‘ఇంట్రడక్షన్ టుది క్రిటిక్ ఆఫ్ హెగెల్స్ ఫిలాసఫీ ఆర్ లా’ అనే వ్యాసం రాశారు. సమాజానికి చరిత్రకు గతితర్కాన్ని మార్క్స్ ఉపయోగించడం అ వ్యాసంలోనే మొట్టమొదట కనిపిస్తుంది. అలా ఆ వ్యాసంలో అది కనిపించడం ఎంతో సందర్భ శుద్ధితో కూడి వుంది. ఈ వ్యాసంలోనే సమాజంలోని ఒక ప్రధాన వైరుధ్యమైన వర్గాల మధ్య వైరుధ్యాన్ని పేర్కొన్నారు. సమాజంలో ఒకానొక భాగం తనను తాను విముక్తి చేసుకొని, సార్వత్రిక అధికృతను సంపాదించడానికి ఈ వైరుధ్యం, దాని ఫలితంగా ఏర్పడే పోరాటం దారితీసి తీరాలి.[8]

ఆ తరువాత సంవత్సరంలో మార్క్స్, ఏంగెల్స్‌లు సంయుక్తంగా హోలీ ఫామిలీ అనే పుస్తకం రాశారు. అది 1845లో ప్రచురించారు. అందులో ‘కార్మికవర్గానికి– సంపన్నులకు’ మధ్య గల సంబంధం ‘విరోధాంశమైనది’గా అభివర్ణించారు.[9] ఈ వైరుధ్యం అంతకంతకూ మరింత పదునుగా మారుతుందని 1845లో ఏంగెల్స్ చేసిన ఒక ప్రసంగంలో వివరించారు.[10]

---

6 పెట్టుబడి–1 ఎస్ మూర్, ఎ ఎవలింగ్‌ల అనువాదం ఏంగెల్స్ సంపాదకత్వం, నెరిపారు. లండన్ 1889. దానిని దోనా టగర్ సంపాదకత్వాన 1938 లండన్‌లో ప్రచురించిన ఫోటోప్రింట్ పేజీలు 30–3. ఇందులో పెట్టుబడి ఉల్లేఖనలు ప్రచురణలోవే. వేరే పుస్తకంలోనివి అయితే ప్రత్యేకంగా పేర్కొన్నాము

7 అత్సాస్సర్ – పార్‌మార్క్స్–పేజీ 89–116, 203–04 వగైరాలలో

8 ఈ వ్యాస సారాంశానికి విశ్లేషణకు, మార్క్స్ ఆలోచనలు పరిణామంలో ఈ అవగాహనకు గల ప్రత్యేక ప్రాధాన్యతను అర్థం చేసుకునేందుకు మార్క్స్ బిఫోర్స్ మార్క్సిజం అనే పేరు డేవిడ్ మెక్లన్ రాసిన పుస్తకం చూడండి – లండన్ 1980 పైన వుల్లేఖించిన భాగం 152 పేజీలో ఇచ్చారు

9. కలెక్టెడ్ వర్క్స్ పేజీ 224

10 అదే పుస్తకం

విభిన్న 'అస్తి సంబంధాల' పునాదిగా వివిద ప్రధానవర్గాల అవిర్భావ క్రమాన్ని చిత్రించడం ఆ తరువాత వేసిన అడుగు. ఆ పనికి జర్మన్ ఐడియాలజీ (1845-46)లో పూనుకున్నారు. ఒక సామాజిక స్థితి నుండి మరొక సామాజిక స్థితికి పరిణామం చెందడం వర్గపోరాట ఫలితమే. మానవ సమాజం ప్రారంభ దశ నుండి 'పని విభజన' ఏదో ఒక రూపంలో వుండేదని ఇక్కడ భావించారు. ఆ రూపానికి అనుగుణ్యమైన 'అస్తి' రూపం వుండేదనేది అంచనా. పని విభజన అంతకంతకూ సంక్లిష్ట రూపం పొందే కొద్దీ, అస్తి రూపాలు మారాయి. అది అందుకనుగుణ్యమైన వర్గాల అవిర్భావానికి దారితీసింది. వాటి మధ్య పరస్పరం శత్రు ప్రయోజనాలు రూపొందాయి. మొదట 'తెగల అస్తి' దానితో పితృస్వామికంగా ప్రారంభమై బానిస విధానానికి మారిన అస్తి సంబంధాలు. 'పురాతన సమిష్టి లేదా ప్రభుత్వ అస్తి' ఆ అస్తి సంబంధాలలో 'పౌరులకు బానిసలకు మధ్య వర్గసంబంధాలు బాగా అభివృద్ధి చెందాయి. 'మూడవ రూపం 'భూస్వామిక లేక ఏస్టేట్ అస్తి' అసమాజంలో 'భూస్వాములు ఒకవైపు – కట్టుబాటువున్న పేద రైతులు మరొకవైపు' వున్నారు.[11] ఈ సంబంధాల నుండి కార్ఖానా ఉత్పత్తి ఆ తరువాత భారీ పరిశ్రమలతో అధునిక 'బూర్జువా సమాజం' అవిర్భవించింది. అందులో 'పారిశ్రామిక పెట్టుబడి' కలిగిన వారితో 'కార్మికవర్గం' తలపడుతుంది. [12]

ఐదారు సంవత్సరాలలో మార్క్స్ ఏంగెల్స్‌లు ఈ అవగాహనకు వచ్చారు. 'ఈనాటి వరకుఅమలులో ఉన్న సమాజపు చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే' అనే "ప్రణాళిక" ప్రారంభవాక్యంలో గల అంతిమ సూత్రీకరణకు స్పష్టంగా ఈ అవగాహనే కారణం. మార్క్స్, ఏంగెల్స్‌లు తరువాత కాలంలో 'ఈనాటి వరకు అమలులో వున్న సమాజం' అనే వాక్యాన్ని మార్చారు. అయినప్పటికీ చారిత్రిక భౌతికమౌలిక ప్రాతిపదిక నుండే మార్క్సిస్టు చారిత్రిక శాస్త్రాన్ని రూపొందించుకోవలసి వుంటుంది.

## III

ప్రణాళిక రచనకు ముందు తత్వశాస్త్రము, రాజకీయ అర్థశాస్త్రము సాధించిన ప్రగతితో పోలిస్తే జంతుశాస్త్రము, సామాజిక పురావస్తు శాస్త్రము వెనుకబడి వున్నట్లు తోస్తుంది. ఆ తరువాత కాలంలో ఈ బలహీనతను ఆ శాస్త్రాలు అధిగమించాయి. అందువల్లనే 'ఇంతవరకు ఉనికిగలో గల సమాజాలన్నీ' అనే వాక్యం బదులు ఆ తరువాత (చారిత్రక) కాలాలకే వర్గము, వర్గపోరాటాలు అనే వాటిని అన్వయించడానికి మార్క్స్, ఏంగెల్స్‌లు పరిమితమైనారు. మానవాళి అవిర్భావం, సామాజిక రూపకల్పన, పనివిభజన అనేవి అవిభాజ్యమైనవిగా, ఒకే సమయంలో జరిగిన ఘటనలని మార్క్స్ ఏంగెల్స్‌లు జర్మన్ ఐడియాలజీ రచనలో భావించారు.

---

11. కలెక్టెడ్‌వర్క్స్ పేజి 32-36

12. కలెక్టెడ్ వర్క్స్ పేజీ 68-69 జర్మన్ ఐడియాలజీ-రైజనస్కియా అనువాదం పేజీ 66-85

ఏకకణ జీవితో సహా వివిధ జీవజాలం యొక్క పరిణామ క్రమాన్ని నేచురల్ శాస్త్రవేత్తలు వాటిని కనుగొనలేదు. నిర్ధిష్ట అవయవ నిర్మాణంతో మానవుడు ఒకే దఫా సృష్టించబడ్డాడనే వాదనకు సమాధానం అప్పటికి రాలేదు. 1844లో రాసిన పారిస్ ప్రాత పత్రులలో విశ్వసృష్టి భావనను వ్యతిరేకించడం సులభతరమని మార్క్స్ కనుగొన్నారు. భూగర్భ పరిశోధనా ఫలితాలను ఆకళింపు చేసుకొని, ఒకేసారి జరిగినట్లు చెప్పే పరిణామ భావాలను నిరాకరించ చూశారు. కాని మానవాళి శరీర నిర్మాణ రంగంలో అయితే ఆయన 'స్వయం సృష్టి, తన స్వీయ నిర్మాణ క్రమం' మానవ పరిణామం జరిగిందని గట్టిగా వాదించారు.[13] అయితే ఆనాటికి పరిణామం. చారిత్రిక అభివృద్ధి వివరణకు చాలదు. ప్రతిజీవి మార్పుకు అతీతమని చెప్పే లినాయస్ సిద్ధాంతాలకే పరిమితమై ఉంది.

1859లో <u>అరిజన్ ఆఫ్ స్పేసిస్</u> అనే పుస్తకాన్ని ఛార్లెస్ డార్విన్ ప్రకటించారు. మానవ శరీర నిర్మాణంలో సహితం పరిణామ క్రమం పనిచేస్తుంది. (కాబట్టి గతితర్క పాత్ర వుంది) ఈ డార్విన్ సిద్ధాంతంతో మార్క్స్ ఎంతో ఉత్సాహపడడంలో ఆశ్చర్యం లేదు.[14] ఇది సహజంగానే వానరుడు నరుడుగా మారిన పరిణామ సమస్యను వెంటనే లేవనెత్తింది. (దీనిపై 1876లో ఏంగెల్స్ ఒక కరపత్రం రాశారు)[15] దానితోపాటు సామాజిక పరిణామక్రమం సమస్యముందుకొచ్చింది. మానవుని జంతుజాలంనుండి వేరుపరచి చూచేందుకు తన తక్షణ అవసరాలను మించి ఉత్పత్తి చేయగల సామర్థ్యమే ఆధారంగా 1844 పారిస్ రాతప్రతులలో మార్క్స్ చూచారు.[16] అయితే శారీరకంగా మానవ పరివర్తన అనంతరమే మానవుడు ఈ సామర్థ్యాన్ని సంతరించుకున్నారని గమనించడం ఇప్పుడు సాధ్యమైంది.

1877లో అమెరికన్ మానవ పరిణామ శాస్త్రవేత్త లూవిస్ హెచ్. మోర్గాన్ తన రచనను ప్రకటించారు. ఏన్షియం ట్ సొసైటీ ఆఫ్ రీసెర్చెస్ ఇన్ ది లైన్స్ ఆఫ్ హ్యూమన్ ప్రోగ్రస్ ఫ్రం సావేజరీ త్రూ బార్ బాలిజం టు సివిలిజేషన్ అనేదే ఆ రచన. ఆ ప్రచురణతో మార్క్స్, ఏంగెల్స్‌లకు పరిష్కారం చేతికందింది. ఆ రచననుండి మార్క్స్ వివరమైన నోట్స్ తయారు చేసుకున్నారు. అయితే మోర్గాన్ రచనను విమర్శనాత్మకంగా అంచనా వేయకుండానే మార్క్స్ మరణించారు. అయితే అవసరమైన కర్తవ్యాన్ని ఏంగెల్స్ చేపట్టారు. అరిజన్ ఆఫ్ ఫ్యామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ ఎండ్ ది స్టేట్ (కుటుంబం ప్రైవేట్ ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక) అనే రచనను

---

13 <u>మార్క్స్ బిఫోర్ మార్క్సిజం</u> అనే పుస్తకం 190-191 పేజీలు

14. 'డార్విన్ పుస్తకం అత్యంత ప్రాముఖ్యత తేగలది. చరిత్రలో వర్గపోరాటాన్ని ప్రతిపాదించేందుకు నేచురల్ శాస్త్ర పునాదిగా అవి నాకు తోడ్పడుతుంది. అందులో అనేక లోపాలు వుండవచ్చు. కాని ప్రకృతి శాస్త్రంలో 'తుది సిద్ధాంతాలకు' అది చావుదెబ్బ. అంతమాత్రమే కాదు. దాని అర్థాన్ని ఆధారసహితంగా వివేకవంతంగా వివరిస్తుంది. అని లాసెలేకు (16.1.1861)న జాబులో మార్క్స్ రాశారు. (మార్క్స్ - ఏంగెల్స్ <u>సెలక్టెడ్ కరస్పాండెన్స్</u> మాస్కో 1956 పేజీ 151

15 వానరుడు నరుడుగా మారినక్రమంలో శ్రమ పాత్ర మాస్కో 1949

16. మార్క్స్ బిఫోర్ మార్క్స్ పేజి 171-72



సుందరయ్య గ్రంథాలయ
A C No. 83332

1884లో ప్రకటించారు. మోర్గాన్ అభివర్ణించిన 'ఆటవిక దశలో' మానవాళి వుంది 'ప్రధానంగా సమిష్టి'గా ఉత్పత్తి సాగేది. ఉత్పత్తిదారులే వినిమయదారులు గూడా 'పని విభజన' ఆ తరువాత వచ్చింది. అది పరిణామం చెందే కొలది వర్గాలను సృష్టించింది. 'నాగరికతతో బానిసత్వం పరిపూర్ణంగా అభివృద్ధి చెందింది. అప్పటికి దోపిడీదారులు, దోపిడీకి గురయ్యేదారుగా సమాజం మొట్టమొదటిసారిగా బాగా అబివృద్ధి చెందింది.[17] మానవాళి ఉనికిలో ఆ తరువాతకాలంలో పరిణామం చెందిన దశలో వర్గాలు ---- వర్గపోరాటాలు ఆ విధంగా అదనపు విలువను సృష్టించగలస్థాయి. ఆ అదనపు విలువను ఉత్పత్తి చేసేందుకు నిర్బంధించగల అవకాశం, అలా ఉత్పత్తి అయిన అదనపు విలువను దోపిడీవర్గాలు స్వాధీనం చేసుకోగల పరిస్థితి అనే పరిణామం ఏర్పడిన సమయం అదే.

మానవసమాజంలో వర్గ విభజన ప్రారంభం గురించిన ఈ నిర్ణయాత్మక వివరణ, విశదీకరణ రావడంతో ప్రణాళికలోని వాక్యం మార్చవలసిన అవసరం ఏర్పడింది. 'ఇంతవరకూ ఉనికిలో వున్న సమాజం' అనే పదసంచయం లిఖిత చరిత్ర అని మార్చవలసి వచ్చింది. ఏంగెల్స్ 1888 ఇంగ్లీషు ముద్రణలో ఒకనోట్‌ను ప్రవేశపెట్టవలసి వచ్చింది. ఆటవికత బర్బరత దశలు దాటిన తర్వాతనే చరిత్రలో రాత అనేది ప్రారంభమైంది. అందువల్ల ఏంగెల్స్ సూచించిన ఈ జాగ్రత్తఎంతో సముచితమైంది. అయితే రాతపూర్వక చరిత్రకు ముందుకాలమంతటినీ (ఈనాడు చరిత్ర పూర్వదశ అంటున్నదశ) అంతా విడిచివేయాలని ఏంగెల్స్ భావించలేదు. ఆయన రాసిన నోట్ ఆ విషయం స్పష్టం చేస్తుంది. ఆయన వదిలివేయదలచుకున్న కాలం 'ఆదిమ కమ్యూనిస్టు సమాజం' మాత్రమే. ఆ దశలో అత్యంత తక్కువస్థాయి ఉత్పత్తి వుండేది. సమిష్టి నిర్మాణం వుండేది. అందువల్ల వర్గాలు లేవు. ఆదిమ సమాజ దశ నశించిన తరువాతనే 'విభజింపబడిన, తుదకు శత్రువర్గాలు' రంగంలో ప్రత్యక్షమైంది.

## IV

ది జర్మన్ ఐడియాలజీ విషయం ముందే పేర్కొన్నాను. దానిని ఆధునిక సమాజ పూర్వవర్గాల వివరణ ప్రయత్నం చాలా సుదీర్ఘంగా సాగింది అయితే వాటిని సంక్షిప్తంగానే వర్ణించిన ప్రణాళికలో ఆ ప్రయత్నాన్నే అనుసరించారు. ఆ వివరణ ప్రధానంగా ఐరోపా చరిత్ర ఆధారంగా సాగింది[18] అదిప్రత్యేకించి రెండు ప్రాముఖ్యం గల విషయాలను నొక్కి చెప్పింది. ఆధునికపూర్వ యుగాలన్నీ వర్గపోరాట స్వభావానికి సంబంధించినవే ఆ రెండు విషయాలు.

మొదటిది : వర్గపోరాటం 'నిరాటంకంగా' సాగేదే. అయితే 'ఒకప్పుడు బహిరంగంగా, మరొకసారి గుప్తంగా' సాగుతుంది. మరొక విధంగా చెప్పాలంటే వర్గ ప్రయోజనాలు ఎల్లప్పుడూ

---

17 ఏంగెల్స్ పై పుస్తకం - మాస్కో - 1948 పేజీ 247-50 మొదటి ప్రచురణ 13614 పేజీలలో గల ఉపోద్ఘాతంతో కలిపి చదువుకోవాలి

18. ప్రణాళికలోని భాగాలను దిజర్మన్ ఐడియాలజీలలోని ఆస్తి సంబంధాలు, అందుకు అనుగుణ్యమైన వర్గాల సుదీర్ఘ వివరణతో పోల్చి చదువుకోవచ్చు మనం ది జర్మన్ ఐడియాలజీ, కలెక్టెడ్ వర్క్స్

వైరుధ్యపూరితమే గనుక, వర్గ ఘర్షణ ఎప్పుడూ వుంటుంది. అయితే పోరాడే అయితే పోరాడేవారి చైతన్యంలో తాము సాగించేది. వర్గపోరాటమనే అవగాహనలో తేడావుంటుంది. ఒకప్పుడు బహిరంగంగా, మరొకసారిగుప్తంగా అనే పదాలను చక్కగా అర్థం చేసుకునేమార్గం ఇదే. ప్రణాళికలో ఆశ్చర్యం కలిగించేంత సంక్షిప్తంగా పేర్కొన్న విషయాన్నిది జర్మన్ ఐడియాలజీ మరింత విశదంగా భవిష్యత్ వివరణ యిస్తుందో ఈ క్రింది భాగం చదివితే తెలుస్తుంది.

ప్రజాస్వామ్యానికి, నిరంకుశత్వానిక, రాజరికానికి మధ్య, ఓటింగ్ హక్కుకోసం, ఇలా అనేక విషయాలపై రాజ్యంలో అంతర్గతంగా జరిగే పోరాటాలన్నీ కేవలం భ్రమాజనితమైన పోరాటరూపాలే – సమిష్టి ప్రయోజనాల రూపంలో వ్యక్తమయ్యే సాధారణ ప్రయోజనాలన్నీ సమిష్టి ప్రయోజనాల భ్రమాపూరిత రూపం మాత్రమే. అయితే ఈ భ్రమపూరిత రూపం వెనుక జరిగేది విభిన్న వర్గాలు ఒకదానితో ఒకటి సాగించే వాస్తవ పోరాటమే.[19]

ఇదివరలో చరిత్రను గురించి రాసిన రాతలు వాటంతట అవే గతంలో జరిగిన వర్గపోరాటాలను ప్రత్యక్షంగానూ స్పష్టంగానూ వివరించగలవని ఆశించలేము. పై మాటల మరొక అర్థం అదే. ఒకరు తనను గురించి తాను చెప్పేమాటలను బట్టి ఆవ్యక్తులపై అభిప్రాయాలను ఏర్పర్చుకోలేము. అదే విధంగా స్వీయ చైతన్యాన్ని బట్టి సామాజిక పరివర్తనా కాలాన్ని గురించి కూడా నిర్ధారణకు రాలేము అన్నారు కారల్‌మార్క్స్. ఏ కంట్రీబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానిమీ ఉపోద్ఘాతంలో ఈ విషయం పేర్కొన్నారు.[20] పెట్టుబడిదారీ విధానం తలెత్తడంతో అంతకుముందు కాలం కన్నాఒక ప్రధానమైన మార్పు వచ్చింది. ఆ విధానంలో దోపిడీకి గురయ్యేవర్గం, కార్మికవర్గం, తను ఒక వర్గంగా మనుగడ సాగిస్తున్న విషయంలో అంతకంతకూ చైతన్యవంతమవుతున్నది. తనకు, పెట్టుబడి యాజమానులకు గల మౌలిక వైరుధ్యం గురించిన చైతన్యం పెంచుకుంటున్నది.

పెట్టుబడిదారీ పూర్వ సమాజ నిర్మాణాలలో పీడితప్రజల చైతన్యంలో వర్గపోరాట భావం ఎందువల్ల నిద్రాణమైవుంటుంది? ఈ రెండవ లక్షణాన్ని ప్రణాళికలో ప్రస్తావించారు. అంతకుముందు గల వర్గవ్యవస్థ నిర్మాణంలో గల సంక్లిష్టతే అందుకు కారణం.

చరిత్రలోని ప్రథమ యుగాలలో సమాజం విభిన్నస్థాయిలలో అత్యంత సంక్లిష్టంగా ఏర్పాటు అయివుండటం ప్రతిచోటా ఎదురవుతోంది. సామాజిక స్థాయిలో ఎన్నో అంతస్తులు కనిపిస్తాయి. పురాతన రోమ్‌లో సామంతుడు, వర్తక నిపుణులు, సామాన్యులు, బానిసలు, మధ్యయుగాలలో ఫ్యూడల్ భూస్వాములు, సేలీనౌకర్లు, వృత్తి యజమానులు, వృత్తి పనివారు, అప్రెంటిస్‌లు, అర్థబానిసలు కనిపిస్తారు. భూస్వాములు, మధ్యయుగాలో కనిపించే అలాంటి సంక్లిష్టతలు వర్గపోరాట అభివృద్ధికి ఎలా అవరోధంగా నిలిచాయో ది జర్మన్ ఐడియాలజీలో అప్పటికే వివరించారు.[21] ఆ రచనలో మరొక ప్రాముఖ్యమైన విషయం గూడా పేర్కొన్నారు.

---

19. కలెక్టెడ్ వర్క్స్ వి 46–47 రైజనస్కా అనువాదం పేజి 45

20. అదే పుస్తకం

21 కలెక్టెడ్ వర్క్స్ పేజీ 64–66

మానవ సంబంధాలతో కేవలం మారకపు సంబంధాలపై మాత్రమే ఆధారపడని సమాజాలలో అలాంటి సంక్లిష్టత వుంటుందని భావించవచ్చు. కేవలం మారకపు సంబంధాలేగాక, ఆచారాలు, ఇతర సామాజిక వ్యవస్థలు గూడా (వ్యక్తి సంబంధాలు) మానవ సంబంధాలను నిర్ధారించే సమాజాలలో ఈ సంక్లిష్టత కనిపిస్తుంది. అయితే ఈ పరిస్థితులు మారుతాయి. ఒకరినుండి ఒకరు విడిపోయి మారకపు విలువ మాత్రమే వారి మధ్య సంబంధాల బందమై వుండే ఆధునిక బూర్జువా సమాజంలో ఇవి మారుతాయి. 'భారీస్థాయి పరిశ్రమలు' ఏర్పడిన పరిస్థితులు వుండే ఈ సమాజంలో శ్రమే ( ఆ తరువాత శ్రమశక్తి అని మార్క్స్ అంటారు) ఒక సరుకు అవుతుంది. వర్గ వైరుధ్యాలు అన్నిటికన్నా ప్రాధాన్యత సంతరించుకుని పదునెక్కుతాయి. [22]

ప్రణాళికలో ఈ భావాలన్నీమరింత ఉత్తేజకరమైన భాషలో వివరించారు.

అయితే మనయుగంలో – బూర్జువాయుగంలో – ఒక విలక్షణత వుంది. అది వర్గ వైరుధ్యాలను సులభతరంగా అవగాహన చేసుకునేలా చేసింది. ఒకరితో ఒకరు తలపడే రెండు మహావర్గాలు – బూర్జువా, కార్మికవర్గాలుగా అంతకంతకూ ఎక్కువగా సమాజమంతా విభజన చెందుతుంది.

సామాజిక విషయాలలో ప్రణాళిక రచననాటికి మార్క్స్-ఏంగెల్స్‌ల అవగాహన ఎక్కువభాగం ఐరోపాకు పరిమితమైంది. అందువల్ల ఆ రచనలో వర్గ వ్యవస్థ పోరాటాల స్వభావాలకు సంబంధించిన భాగాలు ఐరోపా అనుభవాలే. 1850లో మార్క్స్ భారతదేశంగురించి విస్తృతంగా అధ్యయనం ప్రారంభించారు. ఐరోపాలో బూర్జువా పూర్వ సమాజాల నిండా సంక్లిష్టరూపంలో అంతరాలు కనిపించేవి. అలాంటి సంక్లిష్టమైన అంతరాల మరొకరూపం కులవ్యవస్థగా ఆయనకు కనిపించింది. పారంపర్యంగా వచ్చే శ్రమ విభజనలోనే కులవ్యవస్థ పునాదులు వున్నట్లు ఆయన భావించారు. దీనిని 1853రచనలో ఆయన పేర్కొన్నారు. శ్రమలో అతి స్వల్పభాగానికి జీవితమంతా కట్టిపడేసే వృత్తిగా తుదికంటా ఈ విభజనను కొనసాగించడమే కులవ్యవస్థగా ఆ తరువాతకాలంలో ఆయన గమనించారు. కులాలు, వాటి విచ్ఛిన్నకర రూపంలో 'భారత ప్రగతికి భారత శక్తికి నిర్ణయాత్మక అవధులు'అయినాయి. ప్రణాళికలో అభివర్ణించిన ఆధునిక పూర్వపు అంతరాల వలెనే, ఈ విభజనలు సహితం బూర్జువా పరిస్థితులు ప్రవేశంతో ఎదిరించి నిలవలేవు. ఆధునిక రైల్వేవ్యవస్థ ప్రవేశంతో భారత కుల వ్యవస్థకు ఆధారభూతంగా వుండే పారంపర్య పని విభజన కరిగిపోతుంది.[23]

మార్క్స్ ఇక్కడ ఆశావాదిగా కనిపించవచ్చు. కులతత్వాన్ని అలాగే నిలబెట్టగల సైద్ధాంతిక వెనుకబాటుతనం కొనసాగింపుకు అవకాశం గమనించలేదు. శ్రమ విభజనరూపంలో దాని ప్రధానమైన ఆర్థిక పునాది తొలగింపబడిన తరువాత గూడా లేదా కుదించబడిన తరువాత కూడా సైద్ధాంతిక వెనుకబాటుతనం ఆ వ్యవస్థ కొనసాగింపుకు అవకాశం కలిగించే స్థితిని పరిగణించలేదు. అయితే మనకు ముఖ్యమైన విషయం మరొకటి. ప్రణాళికను రచించిన ఐదు సంవత్సరాలునిండీ నిండకముందే భారతదేశంలో సహితం ఒక చారిత్రక క్రమం యొక్క

---

22 పై పుస్తకం 63-64 పేజీలు రైజానిస్కీ అనువాదంలో ఈ భాగంలేదు

23. ది ఫ్యూచర్ రిజల్ట్స్ ఆఫ్ బ్రిటిష్ రూల్ ఇన్ -ఇండియా (న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ 8 ఆగస్టు 1853) పనిలో అతిచిన్న విభజన కాపిటల్ -1 పేజీ 331లో వుంది

అవకాశాలను ప్రధానంగా ఆయన గుర్తించడం. ఐరోపాలో పెట్టుబడిదారీ సంబంధాల ఆవిర్భావంతో అత్యంత సంక్లిష్టమైనవర్గ అంతరాలు అత్యంత సరళం చేయబడుతున్నాయి. భారతదేశంలోనూ అలాంటి పరిణామానికి గల అవకాశాలను గుర్తించడం అనేది ఎంతో ప్రాముఖ్యతగల అంశం. అందువల్ల ఐరోపాకు ఆవలిభాగాలలో ఏదో మినహాయింపు వుంటుందని మార్క్స్ ఆశించలేదు అనేందుకు ఇది నిదర్శనం.

ప్రణాళిక రచనలో ఇంకా ఉత్పత్తి విధానము అనే పదం ఉపయోగించలేదు. ఇది గమనించదగిన అంశం. గ్రుండీస్సె రచనలోనే దాని స్థిరపరిచిన అర్థంలో ఈ పదాన్ని వాడారు.ఆ రచన 1857-58 సంవత్సరాలలో మార్క్స్ తయారు చేసుకున్న విస్తృతమైన రాతనోట్స్ [24] దాని భావస్పష్టతతో సహా ఈ పదం మొదటసారి చూసేందుకు ఈ పుస్తకాలు చూడొచ్చు) ఈ రచన తరువాత 1859లో ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అనే పుస్తకాన్ని మార్క్స్ ఉపోద్ఘాతం రాశారు. అందులో ఈ పదాన్ని స్పష్టంగా గమనించవచ్చు. ఈ ఉపోద్ఘాతంలో ఉత్పత్తి సంబంధాల మొత్తం కలగలుపుగా 'ఉత్పత్తి విధానం' అనే పదాన్ని వాడారు. ఇందులో పునాది 'చట్టానికి, రాజకీయాలకు సంబంధించిన సంస్థలు. దానికి అనుగుణ్యమైన 'సామాజిక చైతన్యరూపాలు' కలిసి ఉత్పత్తి విధానంగా అభివర్ణించారు. ఒక 'ఉత్పత్తి విధానం' దాని శక్తి కోల్పోయిన తరువాత స్వీయ వైరుధ్యాలు మూలంగానే కృశించిపోతుంది. దాంతో సామాజిక విప్లవయుగం ప్రారంభమవుతుంది. 'ఉన్నత ఉత్పత్తి సంబంధాల ఆవిర్భావానికి దారితీస్తుంది. అందువల్లనే మార్క్స్ స్థూల రేఖాచిత్రంగా ఏశియాటిక్, పురాతన, ఫ్యూడల్ బూర్జువా ఉత్పత్తి విధానాలను ఒకదానితో నొకటి అనుసరించిన సామాజిక రూపాలుగా [25] ప్రత్యేకించి చెప్పగలిగారు.

పురాతన, ఫ్యూడల్, బూర్జువా విధానాలను, బానిస, అర్థబానిస, వేతన-కూలి అనేవి ఆయా సమయాలలో గల మౌలిక ఉత్పత్తి సంబంధాల రూపాలని, ఇవి వరుసగా ఏర్పడే సామాజిక రూపాలనే భావం ప్రణాళికలో (అంతకుముందే జర్మన్ ఐడియాలజీ) లోనూ అంతర్భాగంగా వున్నాయి. ఈ విషయం ముందే వివరించాను. ఈ ఉపోద్ఘాతంలో చేసిందేమిటి? ఈ వివరణను మరింతగా సానబట్టిన సిద్ధాంతపు చట్రంలో ఇమడ్చటం. సామాజిక చరిత్రకు గతితార్కిక పద్ధతిని స్పష్టంగా అన్వయించడం ద్వారా ఈ కృషి జరిగింది.

ఏసియాటిక్ ఉత్పత్తి విధానమనేది ప్రణాళికలోగానీ, అంతకుముందు రచనలలో గాని లేదు. ఈ పదం ఒక్కటే ఉపోద్ఘాతంలో అదనంగా వాడారు. 1853 తరువాత మొదటిసారిగా యూరోప్ వెలుపలి ఆర్థిక నిర్మాణాల పట్ల మార్క్స్, ఏంగెల్స్ ఆసక్తి పెరిగినట్లు కనిపిస్తుంది. భారత (ఏషియాటిక్) జాతిపట్ల, ఆ జాతులను దోపిడీ చేసుకునేందుకు తలెత్తిన నిరంకుశ రాజ్యాలపట్ల 1857-58లోని గుండ్రిస్సేలో ఎంతో వివేచన కనిపిస్తుంది.[26] 'ఏషియాటిక్' ఉత్పత్తి

24. మార్టిన్ నికోలాస్ అనువదించిన రచన చూడండి - హార్మన్స్‌వర్త్ 1973 - పేజీ 495 (మార్క్స్ రచన ప్రీకాపిటలిస్టు ఫార్మేషన్స్ - జాక్ కోహెన్ అనువాదం - ఇ.జె హాబ్స్ వమ్స్ సంపాదకత్వం - పేజీ 94-95)

25.పై పుస్తకం పేజీలు 20-22

26.పై పుస్తకం పేజి 473-86- ప్రీకాపిటలిస్ట్ ఫార్మేషన్స్ పేజీ నెం. 70-82

విధానాన్ని పురాతన ఫ్యూడల్ ఉత్పత్తి విధానాలకన్నా పూర్వపు ఉత్పత్తి విధానంగా పేర్కొన్నారు మార్క్స్. అయితే ఆ విధానాన్ని ఒక భూభాగానికి సంబంధించి గాక, యూరోప్‌కన్నా ఎక్కువకాలం ఆసియాలో మనుగడ సాగించిన 'తెగల ఆస్థి'కి సంబంధించిన పదంగానే ఆయన బహుశా వాడివుండాలి. గుండ్రెస్సీలో ఈ క్రింది ఆయన మాటలను బట్టి అది స్పష్టమవుతుంది "తెగల విధానం ఆధారంగా ఆ తరువాత అభివృద్ధి చెందిన ఆస్తి రూపాలే బానిసత్వం, అర్థబానిసత్వం. ఆ తరువాత కాలంలో ఏర్పడిన రూపాలన్నిటినీ తప్పక రూపుమార్చాయి (మోడిఫైడ్) ఏసియాటిక్ రూపంలో అవి అతి తక్కువ మార్పులనే తేగలిగాయి.[27]

ఒకటొకటి వెంటగా వచ్చిన ఈ 'విధానాలలో' 'ఏషియాటిక్' చొరబడడం వల్ల తలెత్తిన సమస్యలు లేకపోలేదు. ఏషియాటిక్ విధానం అలాగే కొనసాగితే ఏర్పడే సమస్య ముఖ్యమైనది. మార్క్స్ 1853లో అజాగ్రత్తగానన్నట్లు ఇలా అనడం ఈ సమస్యకు ఉదాహరణ.

"భారత సమాజానికి ఎలాంటి చరిత్రా, కనీసం మనకు తెలిసిన చరిత్రగా లేదు ఏమాత్రం ప్రతిఘటించని, మార్పులేని సమాజం ఆధారంగా ఒకరివెంట ఒకరు చొరబాటుదార్లు దేశం ఆక్రమించి, సామ్రాజ్యాలు స్థాపించిన చరిత్రనే మనం చరిత్ర అనిపిలుస్తాం." [28]

జాతిలో అంతర్భాగంగా వ్యక్తిగత చిన్న ఉత్పత్తి ఆవిర్భవించింది. మార్కెట్‌కు తరలించగల అదనపు ఉత్పత్తి జరిగింది అవిధంగా సహజసిద్ధమైందిగా భావించబడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సరుకురంగం కనిపిస్తుంది. నిరంకుశ అధికారం ఏర్పడడం, కౌలు, పన్నుల రూపంలో లబ్ధిపొందుతున్న తీరు వుంది. ఈ క్రమాన్ని అంతా రూపొందుతున్నదని, అదీ ఏషియాటిక్ విధానంలోనే ఈ క్రమం జరుగుతోందని మార్క్స్ స్వయంగా గుర్తించారు. (ఆసియా రీతికి-భారతదేశమే ఆయనకు ఉదాహరణ) అలాంటపుడు ఆసియా ఖండం లేదా భారతదేశం చరిత్రాలేనివి కాజాలవు.[29] అంతేగాదు. భారతదేశానికి చరిత్రలేదని 1853లో అన్నతరువాత మార్క్స్, మరెక్కడా మరొకసారి అనేలేదనే విషయం మనం గమనించాలి. ప్రణాళికలోగల వర్గపోరాటాల చరిత్ర' అనే సూత్రానికి 1888లో ఏంగెల్స్ కొంత మార్పును సూచించారు. ఆదిమ కమ్యూనిస్టు దశకు అవకాశం కలిగించేందుకే ఈ మార్పును ఆయన ప్రతిపాదించారు. అయినా చరిత్రలేని ఆసియా తరహా గూడా అవకాశం కలిగించే విధంగా ఆయన ఎలాంటి మార్పును సూచించలేదు. అందువల్ల ఒకవర్గం మరొకవర్గం దోపిడీ చేయబడే అదృష్టానికి నోచుకున్న అన్ని సమాజాలకు వర్గపోరాటం గురించిన ప్రణాళిక ప్రధానంగా ఆవిష్కరించిన వర్గసిద్ధాంతాన్ని, అది విశ్వవ్యాపితమనే విషయాన్ని ప్రణాళికా రచయితలు నిరంతరం పేర్కొంటూనే వున్నారనే విషయం

---

27 పై పుస్తకాలు వరుసగా 493 పేజీ -91 పేజీ

28. కలోనియలిజం పేజీ 81

29. ఈ సందర్భంలో ఎస్సేస్ ఇన్ హిస్టరీ - టువర్డ్స్ ఎ మార్క్సిస్టు పెర్‌సెప్షన్ - న్యూఢిల్లీ -1995 అనే నా పుస్తకంలో 'మార్క్స్ పెర్‌సెప్షన్ ఆఫ్ ఇండియా' అనే నా వ్యాసంలో (పేజీ 16-35) 'ఏషియాటిక్' మోడ్ గురించి మార్క్స్ భావాలలో వచ్చిన మార్పులను చర్చించాను ఆ వ్యాసం చూడవలసిందిగా కోరుతున్నాను.

నిస్సందేహం. (ఆసియా విధానంలో సహితం నిరంకుశరూపంలో అలాంటి దోపిడీ వున్నది) ఆవిధంగా వర్గపోరాట సిద్ధాంతం ఆసియా ఉత్పత్తి విధానానికీ అన్వయిస్తుంది. ఈ సాధారణ సూత్రానికి ఎలాంటి మినహాయింపు లేదు.[30]

## VI

బూర్జువావర్గ ఆవిర్భావం, అభివృద్ధిని గురించిన చారిత్రక క్రమాన్ని ప్రణాళిక రేఖాచిత్రంగా చూపుతుంది మధ్యయుగాల 'అర్ధబానిస రైతాంగం' ప్రారంభమైంది. ఈ చారిత్రక పరిణామం. ఆ అర్ధబానిసలనుండి 'అంగీకారం పొందిన వ్యాపారులు' పుట్టుకొచ్చారు. వారినుండి 'బూర్జువా వర్గపు ప్రారంభశక్తులు' వచ్చారు. బూర్జువా పెట్టుబడిదారీ అన పదాలను ఒకదానికొకటి పర్యాయపదాలుగా మార్క్స్ ఉపయోగించలేదు. బూర్జువా అనేపదం విస్తృత అర్థంలో వాడారు. పెట్టుబడి గ్రంధంలో పెట్టుబడిదారు అనే పదాన్ని పెట్టుబడిపై యాజమాన్యం కలిగి, ఆధునిక పరిశ్రమలో వేతన-కూలీలను నియమించే వారికి 'పెట్టుబడిదారు'లు అనేపదం మార్క్స్ వాడారు. బూర్జువా అనేపదం వారికి పరిమితంకాలేదు. పెట్టుబడిదారుల కన్నా ముందే ఏర్పడిన విస్తృత వర్గాన్ని వివరించేందుకు వాడారు. అందులో వ్యాపారులు, పారిశ్రామిక పూర్వ ఉత్పత్తిదారులు కూడా కలిసివున్నారు. ఈ పూర్వ ఉత్పత్తి దారులనుండే 'ఆధునిక బూర్జువా' నిజమైన పారిశ్రామిక పెట్టుబడిదారులు ఆవిర్భవించారు.

బూర్జువా వర్గం తలెత్తేందుకు, పెట్టుబడిదారీవిధానం ఆవిష్కరించేందుకు రెండు ప్రధాన అంశాలను <u>ప్రణాళిక</u> పేర్కొంటుంది. మొదటి మార్కెట్ పెరగడం అమెరికాను కనుక్కోవడం. కేప్ ఆఫ్ గుడ్‌హోప్‌ను చుట్టి రావడం, వాటి ఫలితంగా 'తూర్పు ఇండియా - చైనా మార్కెట్లు, అమెరికాను వలస రాజ్యంగా మార్చడం (మరియు) వలసలతో వాణిజ్యం...' యూరోప్‌కు మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్కెట్లకు భారీగా ఉత్పత్తులు అవసరమైనాయి. అంతటి భారీ ఉత్పత్తులు సాగించేందుకు ఫ్యూడల్ గిల్డ్ విధానం నిరుపయోగమైంది. అందువల్ల భారీ వర్క్‌షాపులను ఏర్పాటుచేయవలసి వచ్చింది. దానికి అనుగుణ్యంగా గతంలో లాగా గిల్డుల మధ్యగాక ప్రతి ఒక్క వర్క్‌షాప్‌లోనూ "శ్రమవిభజన" ఏర్పడింది. ఇది కార్ఖానా ఉత్పత్తి విధానానికి పునాది. యంత్రాలమూలంగా ఆధునిక, పారిశ్రామిక విధానంగా పరివర్తన చెంది 'కార్ఖానా ఉత్పత్తి' రద్దయింది.

ఆనాటివరకు మార్క్స్, ఎంగెల్స్‌లు ఆర్థిక, చరిత్ర అధ్యయనాల పునాదిగా ఈ వివరణనిచ్చారు ఉత్పత్తికి-మార్కెట్‌కు గల సంబంధంపై ఏర్పడిన వివాదమే వ్యాపార సిద్ధాంతవేత్తలకు (మెర్కెంటలిస్టు)వారి ప్రత్యర్థులకు ఏర్పడిన వివాదానికి పునాది. ఆ వివాదంనుండే రాజకీయ అర్థశాస్త్రం ప్రారంభమైంది. వర్క్‌షాప్‌లో శ్రమవిభజన ఫలితంగా

---

30. 'ఆసియా సమాజం' ' ఇంకా వర్గ సమాజంకాదని, లేదా అది ఒకవేళ వర్గ సమాజమే అయినా అత్యంత ఆదిమ లేదా ప్రారంభరూపంలో మాత్రమే వుందని, మార్క్స్ భావించినట్లు హాబ్స్‌వామ్ ప్రీకాపిటలిస్ట్ ఎకనిక్ ఫార్మేషన్స్‌కు రాసిన ఉపోద్ఘాతంలో పేజీలో పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు కలిగివున్నట్లు చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు

పెరిగిన ఉత్పాదకతను తాను 1821లో రాసిన గ్రంథంలో ఆడం స్మిత్ నొక్కిచెప్పారు.[31] యంత్రాలు తెచ్చిన పరివర్తనను ప్రత్యేకించి అధ్యయనం చేశారు రికార్డో. 1821లో తన పుస్తకంలో ఈ విషయాన్ని మరొక నూతన అధ్యాయంగా చేర్చారు.[32] మార్క్స్ (1847)లో పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ అనే తన రచనలో మార్కెట్ల విషయం చర్చించారు. గుడ్‌హోప్ ద్వారా వాణిజ్యం ఈస్టిండీస్‌లో ప్రవేశించగానే మార్పిడిలోకి వచ్చిన సరకులు పెరిగాయి. వలసవిధానం సముద్ర వ్యాపారాభివృద్ధి, కార్ఖానా ఉత్పత్తి విధానపు వర్క్‌షాప్, శ్రమవిభజనలో యంత్రాలు తెచ్చిన పరివర్తన–వీటిని మార్క్స్ తన రచనలో పేర్కొన్నారు. అందులోని ముఖ్యమైన అంశాలను ప్రణాళికలో పేర్కొన్నారు.[33]

బూర్జువా ఉత్పత్తి సంబంధాల అభివృద్ధికి సంబంధించి సంప్రదాయ రాజకీయ అర్థశాస్త్రం గురించి తాము అప్పటికే చేసిన నిర్ధారణలను ప్రణాళికలో సంగ్రహీకరించి వివరించారు. అయితే పెట్టుబడిదారీ విధాన చరిత్రకు సంబంధించి మార్క్స్ చేసిన మహత్తర పరిశోధనగా అందరూ భావించే విషయం అందులో పొందుపరచలేదు. సనాతన లేదా ప్రాథమిక పెట్టుబడి సమీకరణ సిద్ధాంతం ప్రణాళికలో అంతర్భాగంకాలేదు. పెట్టుబడి మొదటి సమీకరణ విషయమై 1857-58 గ్రుండెస్సేలో మార్క్స్ కొన్ని ప్రాధాన్యతగల అంశాలను ప్రస్తావించారు. అయితే డబ్బుకాక, సామాజిక మార్పులే, అలాంటి సమీకరణకు తోడ్పడ్డాయి. అనే విషయం చూపేందుకే ప్రధానంగా ఆ ప్రస్తావనలు వుద్దేశించారు.[34] పెట్టుబడి మొదటి సంపుటి దిసో కాల్డ్ ప్రిమిటివ్ అక్యూమలేషన్ అనే 8వ అధ్యాయంలో సంపూర్ణంగా అభివృద్ధి చెందిన రూపంలో ప్రధాన సిద్ధాంతం ప్రవేశ పెట్టారు. గ్రుండెస్సే లోని ప్రస్తావనలు ఈ సిద్ధాంతం ఆవిష్కరణకు దోహదకారులుగా భావించలేము.[35]

పెట్టుబడి కలిగివున్నవారు– స్వేచ్ఛాయుత కార్మికులు ముఖా ముఖి కలిసివున్నపుడే పెట్టుబడి దారీ ఉత్పత్తి యొక్క ప్రాథమిక మార్పిడి ప్రారంభమౌతుంది. అనే విషయాన్ని పేర్కొనడంతో మార్క్స్ తన సిద్ధాంతాన్ని ఇక్కడ ప్రారంభిస్తారు. పెట్టుబడిదారీ విధానానికి

---

31. యాన్ ఎన్‌క్వైరీ ఇన్ టు నేచర్ అండ్ కాజ్ ఆఫ్ వెల్త్ ఆఫ్ నేషన్స్–1–లండన్ 1910 పేజి 4–11

32 డేవిడ్ డికార్డో–ది ప్రిన్సిపల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అండ్ టాక్సేషన్–లండన్ 1911, పేజి *263–71 (31వ అధ్యాయం అనే మెషినరి'*

33 కలెక్టెడ్ వర్క్స్ 20 – పేజి 184–87 , పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ మాస్కో – తేదీ లేదు – పేజి 151–57

34 పై పుస్తకం 259, 506–10 పేజీలు

*35.* పెట్టుబడి *1వ సంపుటి* పేజి *736–800* పెట్టుబడి 1వ సంపుటిని ఈడెన్ అండ్ సెడార్ పాల్‌లు అనువదించారు. వారు 'ఆదిమ' అనిగాక 'ప్రాథమిక' అని వాడారు అవే సరైన పదంగా భావించవచ్చు. కాని 'ఆదిమ' అనే పదానిని ఏంగెల్స్ అనుమతి వుంది ఆయనే మూర్ – అవెలింగ్‌ల అనువాదాన్ని అజమాయిషీచేశారు అంతేగాదు ఆపదమే సాధారణ ఉపయోగంలో వుంది అందువల్ల ఆ పదాన్నే వాడటం మంచిది అనిపిస్తోంది.

ముందే, ఆ విధానం వెలుపలే పెట్టుబడి యజమానులు సంపద సమీకరించుకుని వుండాలి. కార్మికులు చిన్న ఉత్పత్తిదారులుగా తాము కలిగివుండిన ఉత్పత్తి సాధనాలనుండి స్వేచ్ఛ పొందివుండాలి. ఈ రెండూ జరిగివుంటేనే వారిద్దరూ ముఖాముఖి ఎదుర్కోవడం సాధ్యం. అందువల్ల పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రారంభం కాగలగడానికి ముందే ఒక వర్గాన్ని మరొకవర్గం 'కాజేసే' క్రమం అమలులో వుండాలి. ఈ క్రమమే 'ఆదిమ సమీకరణ'[36]

ఆదిమ సమీకరణ రెండు ప్రధాన రూపాలు లేదా క్రమాన్ని మార్క్స్ అభివర్ణించారు. ఒకటి అంతర్గతం. మరొకటి బహిర్‌క్రమం. ఇంగ్లండును ఒక స్పష్టమైన వుదాహరణగా తీసుకుని ఈ వివరణ యిచ్చారు. ట్యూడార్ కంచెలు వేయడం నుండి ఆ తరువాత 18వ శతాబ్దంలో ప్రైవేట్, పార్లమెంటరీ చర్యల ద్వారా పూనుకున్న కంచెల విధానం ఆయన వివరించారు. ఈ చర్యలన్నీ ఇంగ్లీషు రైతును భూమిలేనివాడుగా చేశాయని వర్ణించారు.[37] ఆదిమ సమీకరణ ఇక్కడ మృగప్రాయమైన అధికార బలప్రయోగం జరిగింది.

గొప్ప ప్రజా సమూహాలు, అకస్మాత్తుగా, బలవంతంగా వారి బ్రతుకు సాధనాలనుండి తుంచి వెయబడ్డారు. శ్రామికుల మార్కెట్లో స్వేచ్ఛాయుత, ఏ బంధమూలేని కార్మికులుగా నెట్టివేయబడ్డారు. వ్యవసాయ ఉత్పత్తిదారును, భూమినుండి, కాజేయడమే ఈ మొత్తం క్రమానికి పునాది [38] అని దాని శక్తివంతమైన ప్రధాన గమనాన్ని వర్ణించారు.

ఇక రెండవ క్రమం. వలసదేశాలు ప్రజలను నిలువుదోపిడీ చేసి కాజేయడం బహిర్గత క్రమంగా ఆయన తెలియజేశారు.

అమెరికాలో బంగారు, వెండి కనుక్కున్నారు. (అమెరికన్) ఆదిమజాతులను సమూలంగా నాశనం చేసి గనులలో వారి సమాధులను కట్టారు. ఈస్టిండీస్‌ను జయించి, నిలువు దోపిడీ చేశారు. ఆఫ్రికాను నల్లజాతుల వేటకు స్వంతకమతంగా మార్చుకున్నారు. ఈ మార్పులే పెట్టుబడిదారీ ఉత్పత్తి యుగానికి ఆనంద కరోదయానికి నాందీ పలికాయి.[39]

వలస దేశాలలో ఏర్పర్చిన భయంకర పరిపాలన భారతదేశపు నిలువుదోపిడీ అమెరికన్ ఇండియన్ ప్రజల హత్యాకాండ, ఆఫ్రికా బానిస వ్యాపారాలను పేర్కొంటూ మార్క్స్, ఈ క్రమాలను నిలదీసి ప్రశిస్తూ వివరించారు.[40] పెట్టుబడిదారీ విధానం గురించిన ఈ చిత్రణ, ప్రణాళికలో ఇచ్చిన చిత్రానికి పూర్తిగా భిన్నమైనది. కేవలం వాణిజ్య విస్తరణ, ఉత్పత్తిలో వచ్చిన అదనపు ప్రయోజనాలతో వ్యాపారవేత్తలు ఆధునిక బూర్జువా వర్గంగా పరిణితి చెందినట్లు అందులోని చిత్రం. (వేతన కూలీలపై దోపిడీని క్రమేపీ విస్తరించడం ద్వారా, తదనుగుణ్యమైన సమీకరణ ద్వారా గిల్డు-యజమానులు, చేతివృత్తులవారు పూర్తిగా వికసించిన పెట్టుబడిదారీ ఉత్పత్తి అభివృద్ధికి ఆధారమైతే, ఆ అబివృద్ధి 'నత్తనడకగా' సాగివుండేదని కొట్టిపారేశారు.[41] ఆదిమ

36 'పెట్టుబడి 1 పేజీలు 736-39

37. పెట్టుబడి 1వ సంపుటి 740-757 పేజీలు

38 అదే పుస్తకం పేజీ 739

39 పై పుస్తకం పేజీ 775

40 అదే పుస్తకం పేజీ 775-78, 784-785

సమీకరణ, బలవంతపు దోపిడీ అనే అంతర్గత, బహిర్గత కారణాలు మాత్రమే పెట్టుబడి సమీకరణ సాధించిన మొత్తంస్థాయి, పుంజుకున్న వేగాన్ని సంతరించి పెట్టగలవు. ఈ క్రమం అంతటికీ కీలకం. దౌర్జన్యం 'నూతన సమాజాన్ని గర్భధారణ చేసివున్న పాత సమాజం ప్రతిదానికీ శక్తే (ఫోర్సు) మంత్రసాని. దానంతట అదే ఒక ఆర్థికశక్తి.[42] అనే విషయానికి ఆదిమ సమీకరణ క్రమమంతా నిజమని రుజువుగా నిలుస్తుంది.

అందువల్ల ప్రణాళికలో పెట్టుబడిదారీ విధానపు ఆవిర్భావ చిత్రణ పూర్తిగా అసంపూర్ణం అనే విషయం గమనించాలి. (గ్రామీణ, వలసమార్కెట్ల ఆక్రమణను చాలా సరళతరంగా వివరించిన దానికి భిన్నంగా) దౌర్జన్యంగా రైతాంగాన్ని భూమి కాజేసి తొలగించడం, వలసప్రజలను నిలువునా దోపిడీ చేయడం అనే విషయాలు ప్రణాళికలో లేవు. అత్యంత అపఖ్యాతి చెందిన ట్రాన్స్ అట్లాంటిక్ బానిసవ్యాపారం గూడా అందులో పేర్కొనలేదు. శ్రమవిభజన రీతులవల్ల, మార్కెట్ విస్తరణ మూలంగా ఉత్పత్తి పెరిగిందని, అర్థశాస్త్రం అప్పటివరకు నేర్పిన విషయాలను ప్రణాళిక మౌలికంగా ఆమోదించింది. ఇదే ఆ రచనలో పై పేర్కొన్న బలహీనతకు అసంపూర్ణత్వానికి కారణం. మార్క్స్ ఆ తరువాత కాలంలో చారిత్రక విషయాలను కనుగొన్నారు ఆడంస్మిత్, రికార్డోల వారసత్వంతో నిర్ణయాత్మక తెగతెంపులకు ఇది మార్గం వేసింది. ఈ దర్శనం (అదనపు విలువ రంగంలో ఆయన దర్శనంతో సమానంగా భావించవచ్చు.)

## VII

ఇంగ్లండ్ పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడిదారీ యేతర దేశాల చేతివృత్తుల పైన, ఉద్యోగ వసతులపైన కలిగించిన ప్రభావం ఏమిటో ప్రణాళికా రచన నాటికి మార్క్సుకు తెలుసు. 1845-46లో రచించిన <u>ది జర్మన్ ఐడియాలజీ</u> లోనే మార్క్స్- ఏంగెల్స్‌లు ఈ విషయం పేర్కొన్నారు.'ఇంగ్లండ్‌లో ఒక యంత్రం కనిపెట్టబడితే (అది) భారత, చైనాలలో అసంఖ్యాక శ్రామికుల నోటి దగ్గర కూడు తీస్తుంది' అని వివరించారు.[43] ఒక సంవత్సరం తరువాత <u>పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ</u> లో 'అభివృద్ధి'ని గురించి ఆర్థికశాస్త్ర వేత్తల ఆశాభావాన్ని ఆయన ప్రస్తావించారు. వారి ఆశాభావాన్ని హేళనచేస్తూ ఇలా ప్రశ్నించారు. ఇంగ్లండ్ (జౌళి) పరిశ్రమల్లో పనిచేసే 15 లక్షల మందికి పది సంవత్సరాలు, మూడుసంవత్సరాలు మాత్రమే సౌభాగ్యం సమకూర్చేందుకు ఈస్టిండీస్‌లో నశించిపోతున్న కోట్లాది కార్మికుల సంగతి వీరు ఆలోచిస్తున్నారా?' అని అవహేళనగా ప్రశ్నించారు.[44]

పురాతనంగా ఏర్పడిన జాతీయ పరిశ్రమలన్నీ నాశనం చేశారు లేదా చేస్తున్నారు' ' అని ప్రణాళికలో పేర్కొన్నా పైన పేర్కొన్న భావాలేవీ ఆ రచనలో పునశ్చరణ చేయలేదు. ఈ

---

41. పైపుస్తకం 774పేజీ

42 పై పుస్తకం 776 పేజీ

43 కలెక్టెడ్ వర్క్స్ V పేజీకి 51, రైజన్‌స్కీ అనువాదం పేజి 60

44. కలెక్టెడ్ వర్క్స్ VI పేజి 160- పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ పేజీ 113

విషయం రాసినప్పుడు వలసదేశాల చేతివృత్తులుకూడా రచయితల మనసులో ఉండివుండవచ్చు. ఆ వెంటనే పెట్టుబడిదారీవిధానం మిగతా ప్రపంచంపై ఎలా పరాధీనతను రుద్దుతున్నదో వివరించారు.

"అది (బూర్జువావర్గం) గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలపై ఆధారపడేలా చేసింది. అలాగే అనాగరిక అర్థ అనాగరిక దేశాలు నాగరిక దేశాలపైన, రైతాంగదేశాలను బూర్జువావర్గ దేశాలపైన, తూర్పు దేశాలను పశ్చిమదేశాలపైన ఆధారపడేలా చేసింది."

ప్రణాళిక ప్రస్తావించిన ఈ పరాధీనత ఆర్థిక అంశాలకు చెందినదే తప్ప రాజకీయమైనదికాదు, ఈ విషయం గుర్తించాలి. కొన్ని వాక్యాలముందు ఇలా రాశారు. 'తన సరకుల ధరలు బూర్జువావర్గం చేతిలో పేలుతున్న మందుగుండు. వాటితో అది చైనాగోడలవంటి అవరోధాలను కూలదోస్తుంది. అనాగరిక ప్రజలలో విదేశీయుల పట్లగల పట్టువదలని తీవ్రమైన ద్వేషాన్ని కూల్చి వారు లొంగిపోయేలా చేస్తుంది.' అయినా తన నల్లమందు ఇతర వస్తువుల వ్యాపారానికి మార్కెట్ కవాటాలు తెరిచేలోగా, చైనాను లొంగదీసుకున్నది చౌకధరలతోకాదు. అపఖ్యాతికరమైన 1840 మొదటి నల్లమందు యుద్ధంలో పేలిన తుపాకీగుండ్లతోనే ఈ విషయాన్ని మార్క్స్ ఆ తరువాతకాలంలో స్వయంగా గమనించారు.[45]

1859లో మార్క్స్ అత్యంత ప్రాముఖ్యంగల మరొక వ్యాసం రాశారు. (అది ఒక విధంగా విస్మరించబడింది.) బ్రిటిష్ ఎగుమతులద్వారా చైనా వస్తువులను బ్రిటన్ తొలగించలేకపోయింది. ఇండియాలో చేయగలిగింది. చైనా గ్రామీణ ఉత్పత్తిదారులను నిర్వీర్యం చేసేందుకు అవసరమైన రాజకీయ అధికారం అప్పటికి బ్రిటన్‌కు లేకపోవడమే ఇందుకు కారణంగా ఆ వ్యాసంలో ఆయన గుర్తించారు.[46] భారతదేశం విషయంలో తమ నిశితమైన దాతృత్వానికి లొంగివుండేలా చేసేందుకు స్వేచ్ఛా వ్యాపారులు మొదట దానిని జయించాల్సివచ్చింది. ('దానిని స్వాధీనం చేసుకునేందుకు') [47] అని 1853లోనే రాశారు. అంతేకాదు 1859లో 'మాంచెస్టర్ స్వేచ్ఛా వ్యాపారులకు భారత మార్కెట్ గుత్తాధిపత్యం కట్టిపెట్టేందుకు', 1857 తిరుగుబాటు తరువాత భారతదేశాన్ని 'మహత్తర'ంగా పునర్జయించేందుకు ఇంగ్లండ్ భరించవలసివచ్చిన ఆర్థికభారాలను గురించి ఆయన వ్యాఖ్యానించారు.[48] 1953లో సరిగా వంద సంవత్సరాల తరువాత గల్లాఘర్, రాబిన్‌సన్‌లు తాము రాసిన వ్యాసంలో స్వేచ్ఛా వాణిజ్య సామ్రాజ్యవాదం అనే నూతన భావాన్ని ప్రవేశపెట్టారు.[49]

---

45. 'చైనాపై నల్లమందు బలవంతంగా రుద్దుతున్న బ్రిటిష్ శతఘ్నుల గురించి మార్క్స్ 1853లో చెప్పారు న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ 14 జూన్ 1853, ఆన్ కలోనియం పేజి 19

46. న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ 3, డిసెంబర్ 1859 కలెక్టెడ్ వర్క్స్ పేజి 539, ఏ కారణంవల్లనో ఈ వ్యాసం ఆన్ కలోనియలిజంలో చేర్చలేదు

47 ఆన్ కలోనియలిజం–పేజి 49

48 న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ 30 ఏప్రిల్ 1859 కలెక్టెడ్ వర్క్స్ పేజి 286 కలోనియలిజంలో చేర్చలేదు

49 జాన్ గెల్‌ఘర్, రోనాల్డ్ రాబిన్‌సన్ 'ది ఇంపీరియలిజం ఆఫ్ ఫ్రీట్రేడ్ ఎకనామిక్ హిస్టరీ రివ్యూ, సెకండ్ సిరీస్ 1953 పేజీలు 1-15

అలాంటి భావంవైపు మార్క్సు ఆనాడు పయనిస్తున్నట్లు తోస్తుంది. వలసవాదం గురించి ఎక్కువ చదివేకొద్దీ, దానిపట్ల ఆయన అభిప్రాయాలు కఠినతరంగా మారాయని కనిపిస్తూనేవుంది. 1850లో న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్‌లో ఆయన వ్యాసాలు చదివితే వలసవాద ఖండనలో ఎంత కఠినమైన, రాజీలేని ఖండనకు ఆయన పూనుకోగలరో అర్థమౌతుంది.[50] మన యూరోపియన్ అభివృద్ధి నిరోధకులు అనివార్యంగా రాబోతున్న వారి ఆసియా యాత్రలో చిట్టచివరకు చైనాగోడదగ్గరకు చేరేసరికి, చైనా రిపబ్లిక్–స్వేచ్ఛా, సమానత్వం, సహోదరత్వం అని రాసివున్న శిలాఫలకం వారికి ఎదురుకాదని ఎవరు చెప్పగలరు.[51]

మూడు సంవత్సరాల అనంతరం హిందువులు (భారతీయులు) తగినంత శక్తి సంతరించుకొని ఇంగ్లీషు నాగటిని మొత్తంగా కూలదోసే ఘటనకోసం ఎదురుచూడసాగారు.[52]

కమ్యూనిస్టు ప్రణాళిక ఒక ముఖ్య ప్రయోజనం కోసం చేసిన రచన. కమ్యూనిజం యొక్క ప్రధాన సూత్రాలను సంక్షిప్తంగా రచించే కర్తవ్యం అది. ఆ కర్తవ్యం అత్యంత ప్రతిభావంతంగా నిర్వహించారు. అత్యంత సక్రమంగా ప్రధాన భావాలను ఉత్సాహపరిచే భాషలో వ్యక్తం చేశారు. 1848లో యూరోప్‌లో తలెత్తిన విప్లవకర తిరుగుబాట్లకుముందు కార్మికవర్గానికి ఒక గైడ్‌గా ప్రణాళిక రచించారు. అయినా ఈనాటికి దాని విలువ మరింత పెరిగింది. గత దశాబ్దంగా ప్రపంచవ్యాప్తంగా సోషలిజం వెనుకపట్టుపట్టింది. అటువంటి సమయంలో సోషలిజం సాధనా కర్తవ్యానికి అన్నిదేశాల కార్మికవర్గాన్ని సమీకరించాలి. ఈ కర్తవ్యం-అత్యవసరంగా చేపట్టాలి. మరింత పట్టుదలగా ఆ కృషి సాగించాలి. ఈ పరిస్థితులు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సన్నిహితంగా, నిశితంగా విమర్శనాయుతంగా అర్థం చేసుకోవలసిన అవసరాన్ని ముందుకుతెస్తున్నాయి. అది రాసినకాలంలో మార్క్సిజం పరిణితి చెందిన స్థాయినుండి-ప్రణాళికలోని విషయాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలి. ప్రణాళిక ప్రచురణ తరువాత-చారిత్రిక పరిణామపు భావజాలాన్ని, ప్రత్యేకించి పెట్టుబడిదారీ విధానపు పరిణామాల గురించి మన అవగాహనను మార్క్సు, ఏంగెల్స్‌లు ఎంతో సంపన్నవంతం చేశారు. ప్రణాళికా రచయితలు తరువాతకాలంలో కనుగొన్న విషయాలు, ప్రదర్శించిన ఆలోచనా లోతులనుండి విషయాలను గ్రహించి ఏ భాగాలలో మన సైద్ధాంతిక పరిధిని సంపన్నవంతం చేసుకోవాలో సూచించే ప్రయత్నమే ఈ వ్యాసం. ఈ విషయాలను మనసులో ఉంచుకొని ప్రణాళికను చదవడం అది నిర్దేశించిన కర్తవ్యాలను మరింత చక్కగా నిర్వహించడంలో భాగస్వాములు కావడానికి తప్పక తోడ్పడుతుంది.

---

50 ఈ వ్యాసంలో ఈ విషయంలో రెండు సంకలనాలలో గల వ్యాసాలను వినియోగించుకున్నాను. ఒకటి ఆన్‌కలోనియలిజం. రెండవది ష్లోమో అవినెరీ సంపాదకత్వాన వెలువడిన కారల్‌మార్క్సు ఆన్ కలోనియలిజం అండ్ మోడరనైజేషన్ అనే సంకలనం న్యూయార్క్ 1969 రెండవ సంకలనంలో ఎక్కువ వ్యాసాలు ఉన్నాయి కలెక్టెడ్ వర్క్సు సంపుటాలు అత్యంత సంపూర్ణమైనవేగాక, వాటిలో అత్యంత సరియైన విషయాలు కూడా ఉన్నాయి.

51 న్యూ రెయినిష్ గెజిట్ నెంబరు 2 (1850) ఆన్ కలోనియలిజం పేజీ 18

52 న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ 8 ఆగస్టు 1853 – ఆన్ కలోనియలిజం పేజీ 85

## ప్రభాత్ పట్నాయక్

# 150 సంవత్సరాల అనంతరం కమ్యూనిస్టు ప్రణాళిక

మార్క్సిస్టు ప్రపంచ దృక్పథాన్ని స్పష్టంగా బహిర్గతపరచేందుకు, ప్రచురణ రూపంలో జరిగిన మొట్టమొదటి క్రమబద్ధమైన ప్రయత్నమే కమ్యూనిస్టు ప్రణాళిక. మార్క్స్, ఏంగెల్స్‌లు ఇద్దరూ కొన్ని సంవత్సరాలుగా ఈ దృక్పథాన్ని అభివృద్ధి చేసే దిశగా భిన్నమార్గాలలో సాగుతుండినారు. మార్క్స్ కంట్రీబ్యూషన్ టుది క్రిటిక్ ఆఫ్ హెగెల్స్ ఫిలాసఫీ ఆఫ్ లా (1843. 1927లో మొదటిసారి ప్రచురణ అయింది.) అనే పుస్తకపు రాతప్రతి ద్వారా పయనం సాగించారు. ఏంగెల్స్ ది కండిషన్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇండియా అని 1844 (1845) రాసిన తన పుస్తకం ద్వారా మరొక వైపు నుండి ప్రారంభించారు. 1845 నాటికి తమ సమిష్టిరచన జర్మన్ ఐడియాలజీ ద్వారా ప్రాథమిక రూపాన్ని పొందుపరిచారు. అయితే ఈ పుస్తకం వారి జీవిత కాలంలో ప్రచురించబడలేదు. కమ్యూనిస్టు ప్రణాళికకు కొద్ది నెలల ముందుగా ప్రచురించిన ది పావర్టీ ఆఫ్ ఫిలసఫీ అనే పుస్తకంలో వారు చేసిన నిర్ధారణలలో కొన్ని వున్నాయి. అయితే అది ప్రాథాన్ వాదనలను ఎదుర్కొనేందుకు చేసిన వాద ప్రతివాదాల రచన. అందువల్ల తమ స్వంత భావాల క్రమబద్ధ వ్యక్తీకరణ కాదు. అ విధంగా కమ్యూనిస్టు ప్రణాళిక వారి ప్రపంచ దృక్పధాన్ని బహిరంగపరచిన మొదటి రచన. అందువల్ల సంక్షిప్తంగా మౌలికంగా ఆచరణకు ఉద్దేశింపబడే విధంగా విషయ రచన సాగవలసి వచ్చింది. అందువల్ల దాని ప్రభావం మరింత శక్తి వంతమైంది.

ప్రణాళిక అన్నింటినీ మించి చరిత్రకు సంబంధించిన భౌతికవాద దృక్పథాన్ని వివరించింది. ప్రణాళికలో అది వివరించిన తీరులో నాలుగు విభిన్నమైన లక్షణాలు వున్నాయి. మొదటిది. చరిత్రలో అంతర్గతంగా వున్న చలన సూత్రాలను అది గుర్తించింది. సాంఘిక ఉత్పత్తి శక్తుల, సాంఘిక ఉత్పత్తి సంబంధాల మధ్య పరస్పరం గతితార్కికంగా ప్రభావితం చేసుకోవడమే (చరిత్రలో) ఈ గమనానికి మూలమని కనుగొన్నారు. ఉత్పత్తి సంబంధాలలో నిర్ణయాత్మక భాగం ఆస్తి సంబంధాలు. రెండవది. సామాజిక వర్గాల ద్వారా వర్గపోరాటాల ద్వారా ఈ గతితర్కం సాధింపబడుతుందో చూపింది. మూడవది పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానపు చారిత్రక పరిణామంలో ఈ గతితర్కంలో ఎలా స్పష్టంగా కనిపిస్తుందో సంక్షిప్తంగానేనైనా, పరిపూర్ణ రూపంలో వివరిస్తుంది. చివర విషయం. పెట్టుబడిదారీ విధానమే శత్రు వైరుధ్యాలతో

నిండిన చివరి ఉత్పత్తి విధానమో వివరించింది. పెట్టుబడిదారీ విధానాన్ని మాత్రమే కాక, అన్ని తరహాల వర్గ దోపిడీలను అంతం చేసే విధంగా ఆ ఉత్పత్తి విధానాన్ని పరివర్తన చేసే ప్రత్యేక చారిత్రక సాధనాన్ని – కార్మికవర్గాన్ని – చారిత్రక – పూర్వదశ' నుండి 'చరిత్ర' లోకి నడిపిస్తుందో గూడా వివరించింది

మార్క్స్ ఏంగెల్స్ భావాలకు ముందు అలాంటి భావాలు లేవని మనం భావించరాదు. కమ్యూనిస్టు ప్రణాళిక 1848 ఫిబ్రవరిలో మొదటి ప్రచురింపబడే నాటికీ ' కమ్యూనిస్టు భూతం' యూరోప్‌ను 'వెంటాడు' తున్న విషయం మనం గుర్తుంచుకోవాలి. అందులోని భావాలు, బీజరూపంలో అప్పటికే వ్యాప్తిలో ఉన్నాయి. ప్రణాళికకు అర్ధ శతాబ్ది ముందే బాబూఫ్ కమ్యూనిజం గురించి మాట్లాడాడు. ఇదొక ఉదాహరణ. సెయింట్ – సైమన్ సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. స్కాటిష్ హిస్టారికల్ స్కూలు ( ఫెర్గూసర్, మిల్లర్) చారిత్రిక భౌతిక వాదానికి సంబంధించిన కొన్ని ప్రాథమిక భావాలను ముందుంచింది. ఆధునిక సమాజంలో కార్మికవర్గం కార్మికవర్గం ప్రధాన చారిత్రిక శక్తిఅనే దృక్పధాన్ని లారెంజ్‌వన్‌సైమన్ ప్రకటించారు. ఈ భావాలకు తామే ప్రారంభకులం కామని మార్క్స్ – ఏంగెల్స్ స్వయం ఒప్పుకొన్నారు కూడా.

అయితే మూడు కారణాల వల్ల ప్రణాళిక వీటికి భిన్నమైనది. ఈ ప్రత్యేక దృష్టులను ఈ యువ రచయితలు కండ్లు మిరిమిల్లుగొలిపే ఒక సైద్ధాంతిక చట్రంలో ఇమిడ్చారు. అలా చేయడం ద్వారా ఈ ప్రత్యేక పరిశీలన దృష్టిలన్నింటికీ అత్యంత స్పష్టత బలోపేతమైన శక్తి సమకూర్చడమేగాక ముఖ్యంగా చారిత్రక భౌతికవాద భావాన్ని అత్యంత శక్తి వంతంగా అందించారు. ఆ విధంగా చరిత్ర ఘటనల, వ్యక్తుల కథల దొంతరగా గాక, అది విశ్లేషించదగిన విషయంగా మారింది. ఆ విధంగా మార్క్స్ అందించిన తీరు నిజంగా మన మనసులను ఆకట్టుకుంటుంది.రెండవది. చరిత్ర ఆధారంగా వర్గపోరాట వీరగాధకు గల ప్రాధాన్యతను ఆవిష్కరించారు. సామాజిక విప్లవం రూపంలో ఈ వీరగాథ వ్యక్తమౌతుంది. అలాంటి విప్లవం ద్వారా అన్నిరకాల వర్గపాలనలకు చరమ గీతం పాడేందుకు కార్మికవర్గం తనను తానే పాలకవర్గంగా నిర్మాణయుతం చేసుకుంటుంది. ( దీనినే ఆ తరువాత కాలంలో 'కార్మికవర్గ నియంతృత్వం'గా పేర్కొన్నారు) మూడవది చాల ముఖ్యమైనది. బూర్జువా సమాజంలో అంతర్గతంగా అనూశ్రితంగా వుండే స్వంత సూత్రాల అమలు మూలంగానే ఈ ఆవిష్కరణకు భౌతిక పరిస్థితులను అ సమాజమే ఏర్పరుస్తుంది. అని వారు భావించారు మానవజాతి చరిత్రలో మొదటిసారిగా ఒక నూతన పరిస్థితిని ఏర్పరుస్తుంది ఆ నూతన పరిస్థితి వల్ల ప్రధానంగా 'దోపిడీకి గురయ్యే వర్గం నిరంతరం' అత్యంత విప్లవకరంగా, శక్తివంతమైన వర్గంగా రూపొందడమేగాక దోపిడీకి గురవుతున్న ఇతర వర్గాలకు వ్యతిరేకంగా తనకంటూ దానికి ఎలాంటి నిర్దిష్ట స్వప్రయోజనమూ వుండదు. అంతకుముందు దోపిడీవర్గాలకు, దోపిడీకి గురయ్యే వర్గాలకు మధ్య జరిగిన వర్గ పోరాటాలు అన్నీ నూతనంగా శత్రువర్గాలుండే విధానాలను ఏర్పర్చగా, బూర్జువా సమాజంలో జరిగే వర్గపోరాటం శత్రువైరుధ్యాలను అంతం చేసే నాందీ గీతమౌతుంది.

బూర్జువా సమాజంలో అమలులో వుండే రెండు విలక్షణ ధోరణులు ఇందుకు కారణం. మొదటిది అన్నిరకాలైన ఉత్పత్తి విధానాలను నాశనం చేయడం ద్వారా తనను తాను విశ్వవ్యాప్తం చేసుకునే వైపు సాగేధోరణి. బూర్జువావర్గంలోనే గల కొన్ని సెక్షన్లతో సహా అన్ని ఇతరవర్గాలను కార్మికవర్గస్థాయికి తగ్గించడం ఈ లక్షణంలో భాగమే. రెండవ లక్షణం ఆధునిక పరిశ్రమ అభివృద్ధి ద్వారా అంతకంతకూ ఎక్కువగా కార్మికవర్గాన్ని ఒకే చోట కేంద్రీకరించడం, సమిష్టి కార్యాచరణ శక్తి ఏర్పడేందుకు అవసరమైన భౌతిక పరిస్థితులను సృష్టించడం. ఒకసారి బూర్జువా సమాజం స్థిరీకరింపబడిన తరువాత, దానిదాడికి లక్ష్యాలైన వారు, కార్మికులు, స్వీయ చైతన్యం, నిండిన పీడితుల పాత్రను సంతరించుకొని, ఆ పాత్రలో ఇంతవరకు మెలిగిన చరిత్రకు మంగళగీతం పాడటమే చరిత్ర పురోగమనానికి గల ఏకైక మార్గం.

ఈ భవిష్యత్ దృష్టి ప్రణాళికకు ఎనలేని ఆదరణను తెచ్చి పెట్టింది. అంతకుముందు వచ్చిన అనేక సిద్ధాంతాలు, వర్గ దోపిడీ లేని సమాజాల 'నైతిక వ్యవస్థ' ను కలగన్నాయి. మార్క్స్, ఏంగెల్స్‌లు అలాంటి నైతిక వ్యవస్థ వర్గరహిత సమాజం చారిత్రకంగా అనివార్యమని స్పష్టం చేయడంతోపాటు, అలాంటి చారిత్రక పరివర్తనకు అవసరమైన భౌతిక వరిస్థితి ఆసన్నమైందని వాదించారు. మరొక విధంగా చెప్పాలంటే ప్రణాళిక విప్లవాన్ని వాస్తవీకరించింది. ఈనాటి నుండి 'విప్లవపు మొదటి అడుగు' వరకు మనలను నడిపే దారిని రూపొందించింది. అదే ' కార్మికవర్గం పాలకవర్గ స్థానానికి పెంపొందడం' ఆ తరువాత కర్తవ్యాలను స్పష్టం చేసింది. దీని అర్థం అన్ని రూపాల ఊహాజనిత సోషలిజంలతో నిర్దయాత్మకంగా తెగతెంపులు చేసుకోవడం. సోషలిజాన్ని తక్షణమే సాధించ వీలైన చారిత్రక పథంగా మార్చి సోషలిజం యొక్క ఆకర్షణను విపరీతంగా పెంచింది. అది సోషలిజం యొక్క నైతిక పునాదులను విసర్జించలేదు. ఆవిష్కరణ వైపు సాగుతున్న చారిత్రక క్రమంలోనే ఆ నైతిక పునాదుల స్థానాన్ని వారు ఎత్తి చూపారు.

## VII

ప్రణాళిక' రచన నాటికి ఐరోపాలో విప్లవకర పరిస్థితి ఉంది. అందువల్ల ఆ రచనలో తక్షణం ఎదురౌతున్న పరిస్థితి ప్రతి రూపాలు చోటు చేసుకున్నాయి. దాని ప్రబోధాలు కొద్దిమంది శ్రోతలకే పరిమితం. అది ఆవిష్కరిస్తున్న విప్లవం కేవలం కార్మిక విప్లవమే. ఉత్పత్తి విధానంపై దాని విశ్లేషణ పెట్టుబడిదారీ విదానంపై కేంద్రీకృతమైంది. అది విశ్లేషించిన పెట్టుబడిదారీ విధానం 'తనలోని ఇమిడిపోయి వున్న ' విధానం. అందులో వలసలు, సామ్రాజ్యాలు కనిపించవు. యూరప్‌లో అనేక కార్మిక తిరుగుబాట్లు జరుగుతున్నాయి. (ప్రణాళిక ప్రచురించిన కొద్దిరోజులకే ఒక తిరుగుబాటు వచ్చింది) మార్క్స్, ఏంగెల్స్ రాస్తున్నది ఉద్గ్రంధ భాగం కాదు, రానున్నదని భావిస్తున్న విప్లవానికి సన్నద్ధం చేసేందుకు అవసరమైన ప్రణాళికను తాను ప్రవచిస్తున్న మహత్తర సిద్ధాంతానికి ఇప్పుడున్న నిర్దిష్ట నమూనాకు మధ్య ఐక్యతను.

ప్రణాళిక సాధించింది. ఈ ఐక్యతా సాధనే దాని ఆకర్షణాశక్తిని బలవత్తరం చేసింది. అయితే తక్షణమే రానున్న విప్లవం గురించిన విధానం ఈ ఐక్యతా సాధనా రూపాన్ని నిర్ణయించింది. అదే ధాని పరిమితిగా నిలిచింది.

ప్రణాళిక నిర్దిష్ట ఆసక్తి ఒక పరిమిత ప్రాంతాన్ని మాత్రమే పరిశీలించింది. అందువల్ల అది మొదటి అడుగు మాత్రమే. ఆ అడుగు అత్యంత ప్రాధాన్యత గల ఫలితాలను ఇచ్చింది. అయినా దాని పరిమితి వాస్తవం. ప్రణాళికను ఆమోదించేందుకు లండన్‌లో సమావేశమైన 'వివిధ జాతుల కమ్యూనిస్టులు' దానిని 'ఇంగ్లీష్, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, ఫ్లెమిష్, డేనిష్ బాషలలో ప్రచురించాలని అనుకున్నారు ప్రణాళికలో అమెరికాకు సంబంధించి ఒకసారి పేర్కొన్నా ప్రధానంగా ఐరోపాకే తన ప్రబోధం సాగించింది. అంతేగాదు, అది యూరోప్ అంతటికీ కూడా ప్రభోధం సాగించలేదు. నాలుగు పెద్దదేశాలు, జర్మనీ,ఇంగ్లండ్, ఫ్రాన్స్,ఇటలీలతో కూడిన పశ్చిమ యూరోప్‌కే పరిమితం. అనుకున్న పథకం ప్రకారం ప్రతిపాదించిన భాషలన్నింటి అనువాదాలు ప్రచురించడం గూడ ఆచరణలోకి రాలేదు. ఉదాహరణకు ఆంగ్లాను వాదాలు మొదటి రచన తరువాత 40 సంవత్సరాలు 1888 వరకు ఆగవలసి వచ్చింది. అలాగే ప్రణాళిక ఆసక్తి కూడా చాలా ఇరుకైనదే. వలసలు, అర్థవలసలు, రక్షితప్రదేశాలు, ( డిపెండెన్సీస్), ఇతర 'మూడవ ప్రపంచ' దేశాల గురించి కాకున్నా కనీసం రష్యా వరకు కూడా దృష్టి సారించలేదు.

ఇరుకైన ఆసక్తి రెండు విషయాలలో ప్రతిబింబించింది. మార్క్సు పూర్వఉత్పత్తి విధానాలతోగాని, లేదా రష్యాలో లాగ వెనుకబడిన పెట్టుబడిదారీ విధానంగా దాని రూపంతో గాని పెట్టుబడిదారీ విధానపు ప్రతిస్పందన (ఇంటారెక్షన్) అంశం వరకు ఆ విశ్లేషణ సాగలేదు. ఆ విధంగా ఆ పరస్పర ప్రతిస్పందనలను సైద్ధాంతికంగా అవగాహనకు రాగల వరకు సాగలేదు. రెండు – పై పరిమిత విశ్లేషణల ఫలితంగా ప్రణాళికలోని విప్లవ భావం కేవలం (ప్యూర్) కార్మికవర్గ విప్లవానికే, అదీ అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితమైంది. (ఆ విప్లవం విభిన్నమార్గాల ద్వారా సాధింపబడుతుందనే విషయంలో సందేహం లేదు). మరొక విధంగా చెప్పాలంటే మార్క్సు ఆ తరువాత మార్క్సిస్టుల విషయం ప్రస్తావించకపోయినా, ఆ తరువాత కొద్దికాలానికే సిద్ధాంతానికి కలిగించిన, విస్మృతి సంతరించిన లోతులను ఆనాటికి ఇంకా సాధించవలసి వుంది. 1853 నాటికి ప్రణాళిక ప్రచురించిన ఐదు సంవత్సరాలకే, భారతదేశంలోని వలస పరిస్థితిని అవగాహన చేసుకుంటున్నారు. న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ పత్రిక వ్యాసాల ద్వారా. గ్రేట్ బ్రిటన్‌లో 'ఇప్పటి పాలకవర్గాలు' స్థానం' పారిశ్రామిక కార్మికవర్గం ఆక్రమించే' పరిస్థితి ఏర్పడేందుకు ముందుగానే 'హిందువులు వారంతటవారే' ఇంగ్లీష్ గుదిబండను పూర్తిగా విసిరివేసేంత శక్తివంతులు' కాగల పరిస్థితిని ఊహించారు. పెట్టుబడి మొదటి సంపుటం రష్యన్ భాషలో 1870లో ప్రచురించారు. ఆ తరువాత రష్యాలో మార్క్సిస్టు భావాలు చాలావేగంగా వ్యాప్తి చెందాయి. 1870 చివరలో రష్యాలో విప్లవం వస్తుందనే ఆశలను మార్క్సు- ఏంగెల్స్‌లు పెంచుకున్నారు. పశ్చిమ యూరోప్ సోషలిస్టు విప్లవపు మద్దతు

పొందితే, రష్యాకు గ్రామీణ కమ్యూనిటీ, పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి ద్వారా రద్దు కాకుండానే సోషలిజంలోనికి పరివర్తన చెందేందుకు పునాది కాగలదనే అభిప్రాయం వైపు మార్క్సు మొగ్గుచూపారు. 1881లో వేరా జాసులిచ్ కి రాసిన ప్రఖ్యాత ఉత్తరంలో తన ఈ వైఖరిని మార్క్సు సమర్థించుకున్నారు. రష్యన్ మార్క్సిస్టులు దానిని నిరాకరించారు. ఏంగెల్స్ తరువాత ఈ అభిప్రాయం నుండి ఉపసంహరించుకున్నారు. అయితే రష్యన్ విప్లవం పట్ల తన ఆశను కొనసాగించారు. ఆ రష్యన్ విప్లవం 'పశ్చిమదేశాల్లో కార్మిక విప్లవానికి ప్రారంభ సంకేతం కాగలదని భావించారు. మార్క్సు రష్యా, ఐరోపా ఏతర సమాజాల పట్ల ఆసక్తి కనబరచడం ప్రారంభించారు అది పెట్టుబడిదారీ విధానాన్ని గురించిన ఆయన విశ్లేషణను సుసంపన్నం చేసింది. అంతేకాదు చారిత్రక భౌతికవాదాన్ని అధిగమించిన భూభాగం కూడా విస్తరించింది.

అలాగే ప్రణాళికలో బూర్జువా సమాజాన్ని ' తనలోనే ఇమిడివుండే' సమాజంగా చూశారు. వలసల నుండి సామ్రాజ్యవాదం నుండి అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థ నుండి (పెట్టుబడిదారీ సంబంధాల పరస్పరతతో సహా) వేరు చేసి ఆ సమాజాన్ని విశ్లేషించారు. ఇది రచయితల తక్షణ పథకం దృష్టి నుండి వివరించవచ్చు. అయితే వారు ఆశించిన కార్మికవర్గ విప్లవం విఫలమైంది. ప్రణాళిక ఏ అంశాల పట్ల నిశ్శబ్దత వహించిందో ఆ అంశాలే ఆ వైఫల్యానికి కారణాలు. పెట్టుబడిదారీ విదానం అంతర్జాతీయ సంబంధాలతో కూడుకొని ఉంది. అసంబంధాలే ఐరోపాలో కార్మికవర్గ విప్లవం గురించిన ప్రణాళిక ఊహలను వమ్ము చేశాయి. 19వ శతాబ్దపు మధ్య బాగం నుండి మొదటి ప్రపంచ యుద్ధం వరకు (హాబ్స్‌వామ్ దీనినే ' సుదీర్ఘ పందొమ్మిదివ శతాబ్దం' అంతమైంది అని పేర్కొన్నారు.) [1] గల కాలమంతా మంచి సంపన్నకాలం.. అలాంటి కాలంలో ఐరోపా కార్మికవర్గం తనజీవన ప్రమాణాలలో కొంత (అవి హీనంగానే కొనసాగినా) మెరుగుదల సాధించుకున్నాయి. భారతదేశం వంటి వలసల నుంచి అదనపు ఆదాయాన్ని 'ప్రవాహం' ఆ వలసల మార్కెట్ 'కోరినప్పుడు' అందుబాటులో వుండటమే' అంత దీర్ఘకాల ఉత్పత్తి పెరుగుదల సాధ్యమైంది. ఇవి రెండూ గోల్డ్ స్టాండర్డ్‌ను స్థిరీకరించడంలో ఎంతో ముఖ్యమైన పాత్ర వహించాయి. అలాగే ఆస్ట్రేలియా, కెనడా, యునైటెడ్ స్టేట్స్‌లోని ఐరోపాల నుంచి వలస వెళ్ళిన వారికి బ్రిటిష్ పెట్టుబడి ఎగుమతులకు అవసరమైన నిధులను అందుబాటులోని తేవటంలోనూ ప్రముఖపాత్ర వహించాయి.[2] పెట్టుబడి ఎగుమతులతోపాటు ఈ ప్రాంతాలకు ఐరోపా కార్మికులు

---

1 ఇ.జె హాబ్స్‌వామ్' ది ఏజ్ ఆఫ్ ఎక్స్ట్రీమ్స్ లండన్ –1995

2. ఈ విషయంలో ఎస్ బి సాల్ రచన స్టడీస్ ఇన్ బ్రిటిష్ ఓవర్సీస్ ట్రేడ్ లివర్‌పూల్ 1970, ఎంతో సమాచారాన్ని అందిస్తుంది. అలాగే 1972 ఆగస్టులో ప్రచురించిన ఎకానమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వార్షిక సంచికలో ఎ కె బాగ్చీ వ్యాసం 'సమ్ ఇంటర్ నేషనల్ ఫౌండేషన్స్ ఆఫ్ కాపిటలిస్టు గ్రోత్ అండ్ అండర్ డెవలప్‌మెంట్' నా పుస్తకం అక్యూమలేషన్ అండ్ స్టెబిలిటీ అండర్ క్యాపిటలిజం, ఆక్స్‌ఫర్డ్ 1997 చాప్టర్ 11లో ఈ వాదనను కొంతవరకు పరిశీలించా

సామూహికంగా వలసలు వెళ్ళారు. (19వ శతాబ్దంలో దాదాపు ఐదుకోట్ల మంది కార్మికులు ఇలా వలస పోయారు) ఈ విధంగా 'ఖాళీ ప్రదేశాలు' అని వారు పిలిచిన ఈ దేశాలకు వలసలు సాగటంతో, నిరుద్యోగం పెరుగుదల ఫలితంగా మార్క్స్ రాగలదని ఊహించిన సామాజిక తిరుగుబాటు అవకాశాలను తగ్గించింది.

ఈ విషయాన్ని మార్క్స్-ఏంగెల్స్‌లు అతిత్వరగానే గ్రహించారు. ముందే పేర్కొన్నట్లు, 1850లలో మార్క్స్ భారతదేశంలో వలసవాదాన్ని గురించి రాయడమేగాక, బ్రిటన్‌లో కార్మిక విప్లవానికి ముందే భారతదేశంలో తిరుగుబాటుకు గల అవకాశాలను ఊహించసాగారు. 1858 నాటికి, అంటే ప్రణాళిక ప్రకటించిన 10 సంవత్సరాలలోనే ఏంగెల్స్ మొత్తం ప్రపంచాన్ని బ్రిటిష్ దోపిడీ చేస్తున్న విషయానికి 'ఇంగ్లీషు కార్మికవర్గం అంతకంతకూ బూర్జువాగా' తయారు కావడానికి మధ్యగల సంబంధాన్ని చూడగలిగారు. అయితే ఈ ఆలోచనలేవీ ప్రణాళికలో ప్రతిబింబించలేదు. అందువల్ల ప్రణాళికలో గల సమగ్ర సిద్ధాంతం (నమూనా గురించిన దాని ఆలోచనతో సహా) విప్లవ ఫలితాల దృష్ట్యా చూచినపుడు నిష్ఫలమైంది. అర్థశతాబ్ది అనంతరం లెనిన్ తిరుగా రూపొందించిన సమగ్ర సిద్ధాంతం విప్లవ పురోగమనానికి కొత్త పునాదిని ఏర్పరిచింది. లెనిన్ తన సిద్ధాంతంలో పెట్టుబడిదారీ విధానపు పూర్తి నూతన దశను ప్రతిబింబిస్తూ సామ్రాజ్యవాదాన్ని తన విశ్లేషణా కేంద్రం చేశారు.

## III

విప్లవాన్ని విశ్వవ్యాపితం చేయడం లెనిన్ రూపొందించిన సమగ్ర సిద్ధాంతపు దృష్టి. అది దాని ప్రత్యేకత. అది పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గానికిగాను, వలసలలోని కార్మిక-కర్షకులకు గాని ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వలేదు. ప్రధాన పెట్టుబడిదారీ దేశాల మధ్య ప్రపంచం విభజింపబడడం పూర్తి కావడంతో సామ్రాజ్యవాదం తలెత్తుతుంది. అందువల్ల ఒక విధంగా ప్రపంచమంతా ఒకదానికొకటి కలిపి కుట్టినట్లు అవుతుంది. ఏ భాగంలో కలిగే మార్పులైనా ఇతర భాగాలన్నిటిలో మార్పులను ప్రభావితం చేస్తాయి. ఈ వాస్తవం నుండి 'బలహీనపులింకు' అనే తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించేందుకు లెనిన్‌కు అవకాశం కలిగించింది. వెనుకబడిన ఆర్థిక సమాజాలలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గ పోరాటాలను గత తార్కికంగా అనుసంధానించారు. సామ్రాజ్యవాదం అజెండాలోకి తెచ్చిన విప్లవ పరివర్తనా యుగం ఆ గొలుసులో అత్యంత బలహీనమైన లింకు వద్దపేల్చవచ్చు. ఈ ఆలోచనా క్రమం గల లెనిన్ జర్మనీలో విప్లవం గురించిన ఆశలు వెనుకపట్టుపట్టడంతో అంతకంతకూ తూర్పుదేశాలవైపు తన దృష్టి సారించారు. ఆయన రాసిన ఒకానొక చివరివ్యాసంలో ఇలా అన్నారు :

"రష్యా, ఇండియా, చైనా వగైరాల ప్రజలు ప్రపంచ జనాభాలో అత్యధికులు. ఈ వాస్తవమే చివరి విశ్లేషణలో రానున్న పోరాటాల ఫలితాలను నిర్ణయిస్తుంది. గత కొద్ది సంవత్సరాల చరిత్రను పరిశీలిస్తే ఈ మెజారిటీ ప్రజలే అసాధారణమైన వేగంతో విముక్తి పోరాటాల వైపు

ఆకర్షింపబడుతున్నారు. అందువల్ల ప్రపంచ పోరాటపు తుది ఫలితం ఏమిటనే విషయంలో అణుమాత్రం సందేహం వుండదు. ఈ అర్థంలో సోషలిజపు విజయానికి పూర్తిగాను, సంపూర్ణంగానూ హామీ ఏర్పడింది.

ప్రణాళిక ఊహించిన దానిని మించి ప్రపంచ విప్లవ క్రమపు భావాన్ని సంపన్నవంతం చేయడమేగాక, ప్రపంచ విప్లవ దశల భావాన్ని సహితం అదే సమయంలో సంపన్నవంతం చేయబడింది పశ్చిమ యూరోప్‌లో కూడా గల వైవిధ్యాలను అప్పటికే ప్రణాళిక నొక్కి చెప్పింది. కార్మికవర్గ విప్లవ పరివర్తనకు వివిధ దేశాలకు, వివిధ మార్గాలు వుంటాయనే వాస్తవాన్ని ప్రణాళిక ఊహించింది. ఉదాహరణకు జర్మనీ. "బూర్జువా విప్లవ ప్రాంగణంలో వున్నట్లు" అనుకున్నారు. అయితే 18వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో, 17వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో వున్న కార్మికవర్గం కన్నా అభివృద్ధి చెందిన కార్మికవర్గం ఏర్పడిన జర్మనీలో ఈ బూర్జువా విప్లవం వస్తుంది. ఫలితంగా జర్మనీలో బూర్జువా విప్లవం వెంటనే వచ్చే కార్మికవర్గ విప్లవానికి ముందు చర్యగా వుంటుందని అనుకున్నారు. మరొకరకంగా చెప్పాలంటే, వివిధ దేశాలు పట్టే విప్లవమార్గం ఏదైనా, అన్నీ తప్పనిసరిగా కార్మికవర్గం విప్లవానికి దారితీస్తాయి అని చెప్పడమే. విప్లవంలో రైతాంగ పాత్రపై ప్రణాళికలో దాదాపు ఏమీ ప్రస్తావనలేదు. రైతాంగం గణనీయమైన సామాజికశక్తిగా వున్న చోట్ల కార్మికవర్గ విప్లవానికి పరివర్తన మరింత దీర్ఘకాలం కొనసాగవలసి వుంటుంది. ఈ వాస్తవాన్ని గూడా ఆ రచన ప్రస్తావించలేదు. అలాంటి పరిస్థితులలో ప్రణాళిక జర్మనీ విషయంలో ఊహించినట్లు, బూర్జువా విప్లవం తాత్కాలికంగానో, కేవలం పరివర్తనా చర్యగాకాక ఇంచుమించు చాలాకాలం కొనసాగే దశలుగా వుంటుంది. అంతేగాదు, బూర్జువావర్గం తనంతట తానే బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని తదికంటా కొనసాగించలేకపోవచ్చు. అటువంటి సందర్భంలో కార్మికవర్గ విప్లవం అనేది అజెండాలోకి రాని చాలాకాలం ముందుగానే రైతాంగంతో కలిసి బూర్జువా వర్గ విప్లవాన్ని తుదికంటా సాగించే కర్తవ్యాన్ని కార్మికవర్గమే చేపట్టవలసి వుంటుంది. పశ్చిమ యూరప్ దేశాల పరిస్థితిలో ఈ సమస్యలు ప్రాధాన్యత సంతరించుకోలేదు. కానీ "బలహీనలింక్'గా వుండే ప్రపంచంలో ఏ భాగంగాని విప్లవానికి అవకాశాలను ఏర్పరుస్తుంది అనే సూత్రం దృష్ట్యా ప్రపంచాన్ని పరిశీలించాల్సిరాగానే ఈ సమస్యలకు కీలక ప్రాధాన్యత ఏర్పడింది.

విప్లవదశల గురించిన భావనా సముదాయాన్ని సంపన్నవంతం చేయడం అనే సమాంతర పరిణామం ఏంగెల్స్ రచించిన ది పెజంట్ వార్ ఇన్ జర్మనీతో ప్రారంభమైంది. అయితే దీనిని లెనిన్ (టూటాక్‌టిక్స్ ఆఫ్ సోషల్ డెమోక్రసీ ఇన్ ది డెమోక్రటిక్ రెవల్యూషన్) రచన ద్వారా మావో (న్యూడెమోక్రసీ) రచనలు, కమ్యూనిస్టు ఉద్యమం, ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల కమ్యూనిస్టు ఉద్యమాలు, సాగించిన గణనీయమైన సిద్ధాంత కార్యక్రమాలు ఈ భావనను బాగా ముందుకు తీసుకెళ్ళాయి.

అయితే సైద్ధాంతికంగా ఆ తరువాతకాలంలో వచ్చిన పరిణామాలన్ని ప్రణాళిక నుండే ప్రారంభమైనాయి. ఉదాహరణకు వర్గపోరాటం, చారిత్రక భౌతికవాదాలను లెనిన్ పునఃపరిశోధన చేయనవసరం లేకుండాపోయింది. ప్రణాళిక రచన సాగిన ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఏర్పడిన పరిణామాలను మనం గుర్తించాలి. కాని ఆ రచన విప్లవ సిద్ధాంత, ఆచరణలకు సంబంధించిన నూతన ప్రపంచాన్ని ఆవిష్కరించింది. ఈ వాస్తవాన్ని దృష్టిలో వుంచుకున్నప్పుడు, కమ్యూనిస్టు ఉద్యమం ఆ తరువాత కాలంలో ఎంతదూరం పయనించిందో, ఆ పయనమంతా ప్రణాళికకు నీరాజనమే అవుతుంది.

ప్రణాళికలో ప్రదర్శితమైన నూతన దృక్పధాలను మరింతగా విశదీకరించడమే ఆ తరువాత కాలంలో మార్క్సిస్టు సిద్ధాంతంలో సాధించిన అభివృద్ధి అనుకోడం పొరపాటు. అలాగే ప్రణాళిక అంతా యూరోప్ కేంద్రంగా మాత్రమే సాగిన రచన అని అందువల్ల దానికి చారిత్రక ప్రాధాన్యత మినహా మరేమీ లేదని కొట్టిపారవేయడమూ అంతేతప్పు. ప్రణాళికకు ఆ తరువాత మార్క్సిస్టు సిద్ధాంతంలో సాధించిన పురోగమనానికి మధ్య సంబంధాన్ని మనం అన్వయించాలి. అలాంటి ప్రయత్నం ఇక్కడ చేయడం బాగుంటుంది.

చారిత్రక గమనాన్ని మొత్తంగా సైద్ధాంతికంగా అవగాహన చేసుకునే స్థాయికి తమను తాము అభివృద్ధి చేసుకున్న బూర్జువా సిద్ధాంత వేత్తలను గురించి ప్రణాళిక పేర్కొంటుంది. రెండు దృగ్గోచర విషయాలు ఒక సందర్భంలో జరిగిన విషయం లెనిన్ పేర్కొంటారు. ఒకటి విప్లవకర కార్మికవర్గ ఆవిర్భావం. రెండు చారిత్రక భౌతికవాద సూత్రాల పరిశోధన. అవి రెండూ చారిత్రక భౌతికవాద సూత్రాల పరిశోధన. అవి రెండూ క లిసి మానవాళిని చారిత్రక పూర్వదశనుండి, చారిత్రక దశకు పరివర్తనం చెందించేందుకు అవసరమైన నిర్ణయాత్మక శక్తిగా రూపొందడం సాధ్యమైంది. చారిత్రక క్రమం గురించిన సైద్ధాంతిక అవగాహన ఒకేసారి తుదిగా జరిగే ప్రక్రియ అని దాన్ని బట్టి తీసుకోవచ్చు. ఆ ప్రక్రియ ఒకసారి సాధింపబడితే అక్కడనుండి సాగే చారిత్రక గమనాన్ని అవగాహన చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. సిద్ధాంతానికి, నమూనా రూపకల్పనకు మధ్య రద్దుకాని సమైక్యత ఏర్పడుతుంది. ఆ సమైక్యత అప్పటినుండి మానవాళిని చైతన్యయుతంగా ముందుకు నడుపుతుంది. పైన పేర్కొన్న వాటిమూలంగా ఇలాంటి అభిప్రాయాలు ఏర్పడే అవకాశం వుంది.

కానీ అలాంటి అభిప్రాయాలు తప్పు. చారిత్రక క్రమాన్ని సైద్ధాంతికంగా అవగాహన చేసుకోవడం 'మత బోధ' కాదు. 'జ్ఞాన సాధన' కాదు. చారిత్రక క్రమం ఏనాడూ పూర్తికాదు. దానిని అర్థం చేసుకోవడం నిరంతరం సాగవలసిన కృషి. ఇందుకు అనేక కారణాలు వున్నాయి. మొదటిది. అంతవరకు పరిణామం చెందిన సిద్ధాంతం ఆశించని నూతన మార్గాలలో చారిత్రక క్రమమే మారుతుంటుంది రెండవది. సిద్ధాంతానికి అనుగుణ్యంగానే చారిత్రక క్రమం వ్యక్తమైనా, అలా వ్యక్తీకరణను వివరించి, వ్యాఖ్యానించవలసిన కర్తవ్యం చేపట్టవలసి వుంటుంది. మూడవది.

గతానికి సంబంధించి కూడా ఈనాడు మార్క్సిస్టు విశ్లేషణ అసంపూర్ణంగా వుంది. వర్తమాన, భవిష్యత్‌ల సంగతి ప్రత్యేకంగా పేర్కొనవలసిన అవసరం లేదు. అసంపూర్ణత గురించిన ఆఖరి అంశం మార్క్సిస్టు సిద్ధాంతప్రవంతికి కేవలం అదనపు అంశాలను చేర్చడానికి సంబంధించినది కాదు. ఎప్పటికప్పుడు పెరిగిపెద్దవయ్యే మొత్తం పరిస్థితులను పరిగణించి సిద్ధాంతాన్నే పునర్నిర్మించాల్సిన విషయంలోనూ అసంపూర్ణతవుంది.

మరొక విధంగా చెప్పాలంటేమార్క్సిస్టు సిద్ధాంతం ఇలా పునరభివృద్ధి క్రమంలో నిరంతరం సాగుతున్నా, ప్రతిసందర్భంలోనూ సిద్ధాంతం పరిపూర్ణమైనట్లు దీని అర్థంకాదు. గణనీయమైన అసంపూర్ణత కొనసాగుతూనేవుంటుంది. ఈ అసంపూర్ణత ఎక్కువ కాలంగూడా కొనసాగవచ్చు. ఒక ఉదాహరణ ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. అనేక పునర్నిర్మాణాల అనంతరం గూడా సామ్రాజ్యవాద సిద్ధాంతానికి సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతంలో అసంపూర్ణత కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది లెనిన్ వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి తేడాను ఆవిష్కరించారు. సామ్రాజ్యవాదాన్ని పెట్టుబడిదారీ విధానపు గుత్తాధిపత్యదశగా అభివర్ణించారు. ఆనాటికేగల వలస సంబంధాలను ఉపయోగించుకుని వాటిపైనే ఈ సామ్రాజ్యవాద సంబంధాలను ప్రతిష్టిస్తున్నారని వివరించారు. అయితే లెనిన్ కూడా ఈ వలస వాద సంబంధాల స్వతఃసిద్ధ స్వభావాన్ని పరిశీలించలేదు. పెట్టుబడి పునరుత్పత్తిలో వాటి పాత్రను అంచనావేయలేదు ప్రణాళికలో మాత్రమేగాక, పెట్టుబడిలో సహితం మార్క్స్ విశ్లేషణ ప్రధానంగా పెట్టుబడిదారీవిధానం విషయంలో ఆసక్తి ప్రదర్శించింది. పెట్టుబడిదారీవిధానానికి - వలసలకు మధ్య సంబంధాల విషయం మార్క్సిస్టు సిద్ధాంతపు (రోజాలగ్జంబర్గ్ అసంపూర్ణంగా చేసిన ఒక్క ప్రయత్నం తప్ప) నిశ్శబ్ద ప్రాంతాలలో ఒకటిగా మిగిలిపోయింది. ఇక్కడ మనకు ఎదురయ్యే సమస్య చరిత్రలో ఏమి జరిగిందని కాదు. నిజానికి మార్క్సిస్టు సిద్ధాంత వేత్తలు, ముఖ్యంగా మూడవప్రపంచానికి చెందినవారు. ఈ సమస్యపై వెలుగులు ప్రసరింపచేసేందుకు విలువకట్టలేనంత కృషి చేశారనేది వాస్తవం. దానిని మార్క్సిస్టు సిద్ధాంతంలో ఇమడ్చమనేది మనకు ఎదురయ్యే సమస్య.,

అలా ఇమడ్చడమన్నది కేవలం 'కలుపుకుంటూపోవడం' కాదు. ఎందువల్లనంటే ఈనాడున్న రూపంలో సిద్ధాంతంలో అలా 'కలుపుకుంటూ పోయేందుకు' అవకాశంలేదు. తనలో తాను ముడుచుకుని వున్న విధానంగా పెట్టుబడిదారీ విధానాన్ని గురించి ఆలోచించడం ఏదో పొరపాటు జరిగిందని కాదు. లేదా నిర్ధారణలను సులభతరం చేసే ప్రయత్నమూ కాదు. ప్రత్యక్ష ఉత్పత్తిదారులనుండి అదనపు విలువను కాజేయడమనే దృష్ట్యా ఒక 'ఉత్పత్తి విధానాన్ని' గురించి ఆలోచించి నిర్ధారణలకు వచ్చాక, పెట్టుబడిదారీ విధానపు సారాంశంగా వున్నదని పెట్టుబడి - కూలీశ్రమ సంబంధాలను బహిర్గతపరిచిన తరువాత, పెట్టుబడిదారీ చలన సూత్రాలలో వలసలకు, పెట్టుబడిదారీ పూర్వ భాగాలకు గానీ ప్రాథమిక పెట్టుబడి సమీకరణ ప్రథమ దశలో గల పాత్ర మినహా ఎలాంటి సైద్ధాంతిక పాత్ర వుండదనేది స్పష్టం. వాటినుండి

వచ్చిన 'ప్రవాహం'అందుబాటులో గల అదనపు విలువకు తోడు అవుతుంది అంతేతప్ప అది ముఖ్యంకాదు. పెట్టుబడిదారీ పూర్వమార్కెట్లు సంక్షోభాన్ని తగ్గించేందుకు తోడ్పడవచ్చు. ఉత్పత్తిరంగం నుండి మొత్తం ఆదాయవనరు (రియలైజేషన్)లనుండి వేరు చేసి చూస్తే పెట్టుబడిదారీ విధానం అసంపూర్ణ వ్యవస్థ అవుతుందని విశ్వసిస్తే తప్పు (మార్క్స్ ఈ విషయం విశ్వసించలేదు. ఈ సమస్య మరిన్ని సైద్ధాంతిక సమస్యలను సృష్టిస్తుంది) వలసలకు ఒక పాత్ర వుండవలసిన అవసరంలేదు.

వలస సమస్యను దృష్టిలోకి తీసుకుంటే తప్ప మార్క్సిస్టు సిద్ధాంతం సంపూర్ణంకాదని అనివాదించేందుకు కాదు నేను ఈ వివరణ యివ్వడం. అది ఎప్పటికప్పుడు పరిపూర్ణత చెందే క్రమం నిరంతరం కొనసాగవలసిన అవసరం వుందని చెప్పేందుకే. (కార్మికవర్గ రిజర్వు ఆర్మీతో పాటు రిజర్వు మార్కెట్లు ముడిసరుకుల వనరుల రిజర్వులను గూడా కలపాలనే వైపు నా మొగ్గు) అలాంటి పునర్నిర్మాణం ఒక కీలకమూలం చుట్టూతానే జరుగుతుంది. ఆ కీలక మూలం ప్రణాళిక.

ఈ విధంగా చెప్పడమంటే మార్క్సిస్టు ఆలోచనలో ద్వైదీతత్వం వుందని కాదు. ఎన్నటికీ మార్పులేని ఒక కీలక భాగం. మార్క్సిజం పునర్నిర్మాణం జరిగినపుడల్లా మారేకీలకం కాని మరొకభాగం వుండాలని బావించరాదు. పునర్నిర్మాణ ప్రభావం కీలకమని ఎవరైనా భావించేదానిపైనా వుంటుంది. ఎంత స్వల్పంగానైనాసరే దాన్ని అభివృద్ధి చేసి మరోరూపంలోకి మార్చి మార్పుతెస్తుంది. అయితే పునర్నిర్మాణాలన్నీ కొన్ని అతవ్యసర కేటగిరీల పునాదిగా, వాటిమధ్యగల సంబంధాల గుర్తింపుద్వారా జరుగుతాయి. కేటగిరిలు మార్క్సిజంలో ప్రత్యేక అంశాలు. అలాంటి ప్రాధాన్యతగల విషయాలతో సంబంధం లేకుండా జరిగే ఏ పునర్నిర్మాణంగానీ మార్క్సిజంగా గుర్తించాలనే హక్కు కోల్పోతుంది. అలాంటి కేటగిరీలు ప్రణాళికలో మొదటిసారిగా దర్శనమిస్తాయి. ఆ విధంగా పునర్నిర్మాణంకోసం తరువాత జరిగే ప్రయత్నాలకన్నింటికీ ఆరచన కీలకాన్ని అందిస్తుంది. ఎప్పుడైనా సరే చేపట్టిన పునర్నిర్మాణపు సంబద్ధతనుండి (వెలిడిటీ) మార్క్సిజపు శక్తి నిర్ధారణ అవుతుంది.

ఈనాడున్న అసంపూర్ణతను అధిగమించేందుకు, మనముందే వ్యక్తమవుతున్న చరిత్రను అర్థంచేసుకునేందుకు, నిరంతరం మార్క్సిజాన్ని పునర్నిర్మించడం అత్యవసరం. అంతేకాదు ఈకాలమంతటా జరుగుతున్న వాస్తవమది. అలా జరగకుండా వుండివుంటే మార్క్సిజం ఈసరికి ఒక మృతసిద్ధాంతంగా మిగిలేది. ఉదాహరణకు మనదేశంలోనే ఈమధ్యకాలంలో కమ్యూనిస్టు ఉద్యమం ఎంతో ఆలోచనా పూరితంగా ప్రవేశపెట్టిన వికేంద్రీకరణ,పంచాయతీ వ్యవస్థ మార్క్సిజాన్ని పునర్నిర్మించడమే. నిజానికి అలాంటి పునర్నిర్మాణం స్పష్టంగా లేకుండా దాచబడే సాగుతుంది. అది మార్క్స్ మాటలను ఉల్లేఖించడం రూపంలో ఆయన అనుమతితో జరిగే రీతి, పద్ధతి తీసుకుంటుంది. ఆ విధంగా మార్క్సిజం పునర్నిర్మాణానికి మార్క్స్ అనుమతి పొందినట్లు వుంటుంది. ఏమైనప్పటికీ అదినిజం

వాస్తవాలను అవగాహన చేసుకోవడం మార్క్సిస్టు పద్ధతి. మార్క్సిజంను అమలు

జరిపే వారనేకులు ఆ పద్ధతినే తాము అనుసరిస్తున్నట్లు చెప్పుకుంటారు. మరికొందరు నిజంగానే తాము ఆ పద్ధతిని అనుసరిస్తున్నట్లు చైతన్యయుతంగా నమ్ముతారుగూడా. మార్క్స్ రచనలతో 'విజ్ఞానం' పొందడం ద్వారా ఎవరూ వాస్తవాలను అర్థం చేసుకోలేదు. నిజానికి మార్క్సిజంను పునర్నిర్మించడం ద్వారానే అలాంటి పునర్నిర్మాణానికి వేళ్ళూ మార్క్స్ రచనలలో కనుగొనడం ద్వారానే వాస్తవాన్ని గ్రహించి, అవగాహన చేసుకోగలం. అయితే అవగాహన అనేది ఒకరు చేపట్టే సాధారణ వైఖరిని బట్టి వుంటుంది. ఉదాహరణకు మార్క్సునుండిపొందినచారిత్రక భౌతికవాదం. అయితే అది ఉప నిర్మాణ వ్యవస్థ స్థాయిలో వుంటుంది.

క్రమబద్ధమైన ప్రవాహంలాసాగే పునర్నిర్మాణాలలో ఈ కొన్ని శిఖరాగ్ర స్థాయికి చేరుకుంటాయి. అది 'సిద్ధాంతం ఆచరణ'గా బద్దలు అయ్యే దశకు, చారిత్రక క్రమాన్ని సిద్ధాంతం రీత్యా అవగాహన చేసుకునే స్థాయికి చేరుకుంటుంది. (సిద్ధాంతం ఆచరణగా బద్దలుకావడమనే పదం జార్జి లూకాక్స్ వాడారు. - జార్జి లూకాక్స్ -లెనిన్ -లండన్- 1970) లెనిన్ కార్యకలాపాలు అలాంటి ఉచ్ఛదశ అనేది చాలా స్పష్టం. చారిత్రక పరిణామాల అవగాహన ఒక సంపూర్ణత్వం సంతరించుకున్నప్పుడు, భౌతికవాద తత్వశాస్త్ర సాధారణ సమస్యలనుండి తక్షణ ఆచరణకు సంబంధించిన నిర్దిష్ట సమస్యల వరకు గల దూరాన్ని అధిగమించేంత సమగ్రత, సమైక్యత ఏర్పడితే సిద్ధాంతం ఆచరణగా బద్దలు అవుతుంది అని లెనిన్ కార్యకలాపాల సందర్భంలో లూకాక్స్ అన్నారు.

అయితే మార్క్సిస్టు సిద్ధాంత నిర్మాణ, పునర్నిర్మాణ క్రమంలో ఉచ్ఛదశ అలాంటి సిద్ధాంత అవగాహనస్థాయి (పైన పేర్కొన్న సమగ్ర సమైక్య సిద్ధాంతం) చరిత్ర గమనంలో ఒక ఘటనగా కొన్ని అంచనాలను ఊహించిన సందర్భాలలో సాధింపబడుతుంది. ప్రణాళిక అలాంటి ఉచ్ఛదశ. మరొక రకంగా చెప్పాలంటే ప్రణాళిక రచనా సమయంలో ఒక స్థాయిలో 'సమగ్ర సమైక్య సిద్ధాంతం' మరొక స్థాయిలో (మార్పుకొనవీలయ్యే హద్దులలో) ఆ తరువాత కాలంలో జరిగినమార్క్సిస్టు సిద్ధాంతీకరణకంతా కీలకమైన రచన.

## V

గత దశాబ్దంలో కమ్యూనిస్టు ఉద్యమం కొన్ని నష్టాలను పొందింది. దీనితో మార్క్సిస్టు ప్రపంచ దృక్పధానికి కాలం చెల్లించని కేరింతలు కొట్టే వైఖరి బూర్జువా వర్గాలలో తలెత్తింది. అయితే ఈనాడు ఆ ఆనందోత్సాహాలు గాలిలో కలిశాయి. రష్యాలో, తూర్పుయూరప్‌లో ప్రజల పరిస్థితి అత్యంత హీనంగా మారింది. జీవన ప్రమాణాల తరుగుదలతో అనేకమంది ఆయు: ప్రమాణం కుదించబడింది. అలాంటి వారిని గూడా కలుపుకుంటే స్వేచ్ఛా మార్కెట్‌కు కోట్లాదిమంది బలైనారు. పశ్చిమయూరప్‌లో నిరుద్యోగుల సంఖ్య రెండు అంకెల నిష్పత్తిలో కొనసాగుతోంది. యుద్ధానంతరం కాలంలో అత్యంత విజయవంతమైన పెట్టుబడిదారీ దేశం జపాన్. ఆదేశం సంక్షోభపుబోనులో చిక్కుకుపోయింది. ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో ఉత్పత్తి స్థబ్దత మొండిగా కొనసాగుతోంది. 1980లలో తలసరి ఆదాయం ఎక్కువగా దిగజారింది.

మరింత దిగజారుడు అరికట్టబడినా, స్తబ్దత కొనసాగుతూనే వుంది. బ్రెజిల్ వంటి దేశాలలో ఈ దిగజారుడు ఎప్పుడైనా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటన్నిటినీ మించి, తూర్పు ఆగ్నేయాసియాల అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెరుగుదల కూలిపోయింది. నిజానికి అమెరికా, బ్రిటన్‌లు తప్ప పెట్టుబడిదారీ ప్రపంచమంతా ఉత్పత్తి స్తబ్దత చాలా ఎక్కువగా వున్న మరింత పెరుగుతున్న నిరుద్యోగంతో వేగిపోతున్నది

ఈ సంక్షోభం మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచంలో సార్వత్రిక రూపం పొందే తీవ్రమైన అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్‌లతో సహా పెట్టుబడిదారీ ప్రపంచం ఉత్పత్తి మాంద్యం (డిప్రెషన్)లో కూరుకుపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ అవకాశాలు క్రింది కారణం మూలంగా తలెత్తుతున్నాయి. పెట్టుబడిదారీ ప్రపంచంలో ఉన్నతస్థాయి ఉత్పత్తి కార్యకలాపాలు సాగుతున్న ప్రతి సందర్భంలో మనకు ఒక సాధారణ అంశం కనిపిస్తుంది. ఆయా సందర్భాలలో అగ్రస్థానంలో వున్న పెట్టుబడిదారీ దేశం ఇతర ప్రధాన పెట్టుబడిదారీ దేశాలతో తనవిదేశీ చెల్లింపు లావాదేవీల్లో లోటు కలిగి వుంటుంది. మరొక విధంగా చెప్పాలంటే పెట్టుబడిదారీ ఉత్పత్తిలో ఉచ్ఛదశలో (బూమ్) అగ్రస్థానంలో వున్న పెట్టుబడిదారీ దేశం తన పోటీదారులకు తన సరిహద్దులలో మార్కెట్‌ను సంతరించిపెడుతుంది ఆవిధంగా వలస దేశాలతో గానీ, తనప్రభుత్వానికే గానీ అమ్ముకోవడం ద్వారా తనస్వంత మార్కెట్ సమాఖ్యను పరిష్కరించుకుంటుంది. ఈ క్రమమే ఉత్పత్తిలో ఏర్పడే ఉచ్ఛదశను కొనసాగించుకుంటుంది. 19వ శబ్దపు మధ్యభాగంనుండి, మొదటి ప్రపంచయుద్ధకాలం వరకు పెట్టుబడిదారీ ప్రపంచం ఒక దీర్ఘకాల ఉత్పత్తిలో ఉచ్ఛదశను అనుభవించింది. ఆ కాలంలో బ్రిటన్ నాయకత్వస్థానంలో వుంది.

ఆనాడు ఐరోపా పారిశ్రామికవంతమవుతున్నది. అలా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఐరోపాకు బ్రిటన్ తనదేశంలో మార్కెట్‌ను ఏర్పరిచింది. ఇండియా, చైనా వంటి దేశాలలో తన మార్కెట్ కార్యకలాపాలను అంతకంతకూ ఎక్కువగా సాగించింది. ఇదే ఆనాటి ఉత్పత్తి దశ కొనసాగించేందుకు తోడ్పడింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో అమెరికా నాయకత్వ స్థానంలోకి వచ్చింది. తన వ్యాపార లావాదేవీలలోని లోటును డాలర్లు అచ్చువేసి పూడ్చుకుంది. (అది ఆనాడు రిజర్వు కరెన్సీ 'బంగారంతో సమానం'గా డాలర్‌ను భావించేవారు) తన స్వంత మార్కెట్‌ను లోటు బడ్జెట్‌తో సంపాదించుకుంది. నిజానికి మొత్తం పెట్టుబడిదారీవిధానం విస్తరించడానికి అనువుగా అలాంటి ద్రవ్యలోటును నిర్వహించడంలోని నాయకత్వ పాత్ర స్పష్టమవుతుంది. ఇందుకు విరుద్ధంగా నాయకుడు ఈ పాత్రను నిర్వహించేందుకు విముఖత చూపడంతోనే ఉత్పత్తి మాంద్యాలకు దారితీస్తుంది. అమెరికా ఈమధ్యకాలంలో తనద్రవ్యలోటును తగ్గించుకుంటున్నది. (అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి తలెత్తడంతో ముడిబడివున్న కారణాన్ని తరువాత వివరిస్తాను) అందువల్ల గత దశాబ్దంగా నిజవిలువలో ద్రవ్యలోటు విస్తరించడంలేదు. ఆ విధంగా ఉత్పత్తి మాంద్యానికి పరిస్థితులు పరిపక్వ మవుతున్నాయి.

పెట్టుబడిదారీ విధానంపట్ల అంతకంతకూ భ్రమలు తగ్గిపోతున్న ఈ సమయంలో సోషలిజం వెనుకపట్టు పట్టింది. అనూర్జితంగా వున్న బూర్జువా రాజకీయ నిర్మాణాలకు వ్యతిరేకంగా ఏర్పడుతున్న ఖాళీని విప్లవ ప్రతీఘాత, మతమౌఢ్యపు భావాలు పూడ్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. సోషలిజం వెనుక పట్టుబడటమే ఇందుకు కారణం. యూరోప్‌లో నిరుద్యోగం బహిరంగ, విషపూరిత జాతి విద్వేషాలకు దారితీసింది. ప్రపంచపెట్టుబడిదారీ విధానంలో మమేకం చెందడంతో మూడవ ప్రపంచంలో బాధ, అవమానాలకుప్రతిస్పందనే మతమౌఢ్యం. (అయితే అన్ని మత మౌఢ్యాలు సామ్రాజ్యవాద వ్యతిరేకం కాదు. ఉదాహరణకు ప్రత్యేకించి మనదేశంలో స్వదేశీపేరుతో పెంపొందింపబడే మతమౌఢ్యం సామ్రాజ్యవాద వ్యతిరేకం కాదు) అయితే అవి అక్కరకు రావు.విముక్తి కార్యక్రమం కాకున్నా కనీసం వాటికి సమగ్రమూ, ఆచరణ యుతమూ అయిన కార్యక్రమం లేదు. అయితే అవిప్రజలకు మాత్రం బాధలను కలిగిస్తాయి.

మనకు ఎదురవుతున్న ప్రశ్న సోషలిస్టు పథకం పునర్జీవం పొందుతుందా అనేది కాదు. ఎప్పుడు అనేదే మనప్రశ్న. పెట్టుబడిదారీ విధానంలో సార్వత్రిక ఉత్పత్తి మాంద్యం పెంపొందించేందుకు అనువుగా లోతైన సంక్షోభం ఎదురవుతున్నది. అంతమాత్రాన సోషలిజం దానంతట అదే తక్షణ పునర్జీవం పొందేందుకు దారితీయదు. యూరోప్ అనుభవాన్ని మనం గమనిస్తే సోషలిస్టు పార్టీలుగా తమనుతాము చెప్పుకునే పార్టీలు, సంక్షోభ ఫలితంగా సోషలిజం నుండి మరింత దూరమైన విషయం గమనించగలం. (ఇందుకు కారణాలను తరువాత వివరిస్తాను) ఇలా దూరంకావడం శాశ్వతం కాదనేది నిజం. అయితే అంతర్జాతీయ స్థాయిలో సోషలిజం పునర్జీవనం ఒక తక్షణ ఫలితంగా జరగదు. అది చాలాకాలం కొనసాగేక్రమంనుండి ఆవిర్భవిస్తుంది. అయితే సమగ్ర, సమైక్య సైద్ధాంతిక అవగాహనను మరొకసారి ఏర్పర్చినప్పుడే ఆక్రమం ఫలవంతమవుతుంది. అలాంటి సిద్ధాంతం ఆచరణకు దారితీయాలి. పునర్నిరితమార్క్సిజం నూతన శిఖరాలను అధిరోహించాలి. అలాంటి ప్రయత్నానికి మొదటి అడుగుగా రూపొందగలిగేవిధంగా, వర్తమాన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని కొన్ని పరిణామాలను, శోధనకు అనుగుణ్యంగా ఇక్కడ పేర్కొంటున్నాను.

## VI

వర్తనమాన ప్రపంచ ఆర్థికరంగంలో నూతన రూపంలోఆవిర్భవించిన అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ఒక ముఖ్యమైన లక్షణం. లెనిన్ రాసిన ఫైనాన్స్ పెట్టుబడికి ఈ నాటి ఫైనాన్స్ పెట్టుబడికి మూడురూపాల్లో భిన్నమమైంది. మొదటిది లెనిన్‌కాలంలో. ఆయన విశ్లేషించిన ఫైనాన్స్ కాపిటల్ ఒక దేశానికి చెందినది. అందువల్ల ఆ దేశపుప్రభుత్వ అండ దానికి వుండేది. కాని ఈనాడున్న ఫైనాన్స్ కాపిటల్ ఒక పెద్ద అంతర్జాతీయ బ్లాక్‌గా ఏర్పడివుంది. కొన్ని ప్రత్యేకదేశాలనుండి సమీకరించబడుతుంది.అది ఏ ఒక్క దేశానికో చెందదు కనుక, అవి ఏ దేశంనుండి సమీకరించబడినా, ఆదేశాల ప్రయోజనాలను పట్టించుకొనకుండా, ఎక్కడ తక్షణ లాభాలు వచ్చేందుకు వీలుందో ఆ ప్రత్యేక ప్రాంతాలకు తరలించబడుతున్నది. ప్రపంచ

పెట్టుబడిదారీ విధానపు ఫైనాన్స్ కేంద్రం ఇక్కడ ఏర్పడాలి అనే విషయంలో అభివృద్ధి చెందిన దేశాల మధ్య పోటీ వున్న విషయం వాస్తవం. (ఆ పోటీ స్వరూపమే యూరో అభివృద్ధి) అయితే ఈ పోటీ దేశాల ప్రాతిపదికగా విభజింపబడి వుండిన ఫైనాన్స్ పెట్టుబడి మధ్య వుండిన పోటీ ఒకే రకం పోటీ కాదు. రెండవది : లెనిన్ ఆలోచనలలో వున్న ఫైనాన్స్ పెట్టుబడి బ్యాంకుల అజమాయిషీలో, పరిశ్రమలలో వినియోగించింది. ఈనాడున్న కేవలం చట్ట వ్యాపారంలో మునిగితేలుతున్న ఫైనాన్స్‌తో పోలిస్తే, లెనిన్ కాలంలో వర్ణించిన ఫైనాన్స్ - పరిశ్రమల మధ్య వుండే సమ్మేళనం ఈనాడు చాలా తక్కువ ప్రాధాన్యత గల అంశం. ఈనాటి ఫైనాన్స్ పెట్టుబడి ప్రధాన రూపం. తక్షణ లాభాల వెంపర్లాటలో మునిగితేలే 'హాట్‌మని' మూడవది. ఈ ఫైనాన్స్ పెట్టుబడి, పెట్టుబడిదారీ దేశాల మధ్య (వైరుధ్యాలు వున్నా) సాపేక్షికంగా ఐక్యత ఏర్పడి వున్న తరుణంలో తన కార్యకలాపాలను సాగిస్తూ, తన కార్యకలాపాల ద్వారా ఆ ఐక్యతకు దోహదం చేస్తుంది.

చివరి అంశాన్ని పరిశీలిద్దాం. ఈనాటి ఫైనాన్స్ పెట్టుబడి అన్ని దేశాల నుండి సమీకరించబడుతున్నది. లాభదాయక ప్రాంతాలు ఎక్కడున్నా వినియోగించబడుతున్నది. ఇలాంటి కార్యకలాపాల వల్ల ఏర్పడిన ఫైనాన్స్ పెట్టుబడి ఐక్యతకు సామ్రాజ్యవాద దేశాల మధ్య ఘర్షణ ఏర్పడితే ఒక సామ్రాజ్యవాద దేశం, మరొక సామ్రాజ్యవాద దేశపు పెట్టుబడి పట్ల వివక్షతకు కారణమవుతుంది. ఘర్షణ ఆ రూపంలో వ్యక్తమవుతుంది. ప్రపంచమంతటా, ఎలాంటి అవరోధాలు లేకుండా తన కార్యకలాపాలు సాగించాలనేది ఈనాటి ఫైనాన్స్ ధోరణి. వివక్షత అందుకు అవరోధమవుతుంది. అవరోధాలు లేని ఫైనాన్స్ పెట్టుబడి కార్యకలాపాలకు అవకాశం కలిగించడమే బ్రిటన్‌వుడ్ సంస్థలు ప్రవచించే మూడవ ప్రపంచ దేశాలపై రుద్దుతున్న 'ఉదారవాద, వ్యవస్థీకృత సర్దుబాటు' విధానాల కీలక ప్రయోజనం. అలాంటి విధానాల ప్రబోధానికి ఇదొక్కటే ఉద్దేశం కాదు. అనేక కారణాలు వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 'పెట్టుబడి కేంద్రీకరణ'కు తోడ్పడ్డం వాటి విధానం. ఫైనాన్స్ పెట్టుబడికి మూడవ ప్రపంచదేశాల ద్వారాలను బార్లా తెరిపించడం, ఆ కేంద్రీకరణకు తోడ్పడే మార్గంగా భావించడం, అలా తెరిపించే యత్నం ఆ సంస్థల ఉద్దేశ్యాలతో ఒకటి. అలాంటి ప్రయత్నం జరుగుతున్న పూర్వరంగం ఒకటి వుంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో అభివృద్ధి మందగిస్తున్నది. ఉష్ణ దేశాల నుండి ప్రాథమిక సరకులు, ముడి వస్తువులు చౌకగా కాజేయాల్సిన అవసరం, అయితే అత్యంత ప్రాముఖ్యం గల ఉద్దేశ్యం అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడికి మూడవ ప్రపంచాన్ని తెరిపించే కర్తవ్యం. తద్వారా పెట్టుబడి స్టాక్ ఎక్స్ఛేంజి పెరుగుదల, ప్రకృతి వనరులను కొనివేయడం, మంచి భూమి ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కాజేయడం ద్వారా అవధిలేని లాభాలను కాజేసే అవకాశాలను పొందుతుంది. ఇలా ఎలాంటి అవధులు లేకుండా ఫైనాన్స్ పెట్టుబడి తన కార్యకలాపాలను సాగించేందుకు ప్రపంచం విరోధ దేశాలు విభజింపబడిన ప్రదేశంగా వుండటం అవాంఛనీయం. ఈ వాస్తవమే వాటి ఘర్షణలను అదుపు చేస్తుంది.

రెండవ ప్రపంచయుద్ధ అనంతర పరిణామాలలో ఫైనాన్స్ పెట్టుబడికి సాధారణ రూపంలో అవరోధం ఏర్పడింది. కీన్స్ సిద్ధాంతం విజయవంతమైంది. 'పరాన్నభుక్కుల మరణానికి' అది పిలుపునిచ్చింది. ప్రభుత్వ జోక్యం వుండాలని వాదించింది. 'చౌక డబ్బు' అభివృద్ధికి మార్గంగా అది పెట్టుబడిదారీ విధానపు జబ్బుకు వైద్యంగా చెప్పింది. ఈ వాదనకి, ఫైనాన్స్ పెట్టుబడికి ఏర్పడిన అవరోధానికి అద్దం పట్టాయి. ఈ స్థితి నుండి ఫైనాన్స్ పెట్టుబడి ఎలా పుంజుకుంది, తన ఆధిక్యతను ఎలా సంపాదించుకుంది. ప్రపంచవ్యాప్త స్వభావం ఎలా సంతరించుకున్నది అనే విషయాలతో మనం ఇక్కడ ఆగక్కరలేదు. అయితే కొత్తగా సంతరించుకున్న ఈ అధిక్యత ఫలితాలలో కనీసం మూడు ఫలితాలు మన చర్చకు ముఖ్యం.

ప్రపంచీకరింపబడిన ఫైనాన్స్ పెట్టుబడి కీన్స్ సిద్ధాంతం ప్రబోధించిన (వస్తు) డిమాండ్ నిర్వహణే కాదు, ఏ రూపంలోనైనా ప్రభుత్వం గణనీయంగా జోక్యం చేసుకునే అవకాశాలను కూడా దాదాపు వమ్ము చేసింది. వెనకడుగు వేసింది ఆ సిద్ధాంతం మాత్రమే కాదు. సోషల్ డెమోక్రసీ, సంక్షేమ పెట్టుబడిదారీ విధానం కూడా వెనుకపట్టుపట్టాయి. మూడవ ప్రపంచపు జాతీయ వాదం, వివిధ రూపాలలో వున్న ప్రణాళికా భావం అంతా, దానంతట అదిగా పెరిగే పెట్టుబడిదారీ అభివృద్ధిలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వాన్ని ఉపయోగించుకోవాలని కోరే అన్ని 'ఇజం'లు కూడా వెనుకపట్టు పట్టాయి. అలాగే సోవియట్ – తరహా సోషలిజం కూలిపోవడం, ఫైనాన్స్ పెట్టుబడి ఆధిక్యతతో సంబంధంలేని విషయం కాదు. సోవియట్ తరహా సమాజంలో వైరుధ్యాలు తలెత్తాయి. వాటిని సవరించి, సోషలిస్టు చట్రంలోనే ఆ వైరుధ్యాలను పరిష్కరించడం సాధ్యం కాలేదు. సోవియట్ పాలన చివరి రోజులలో ఫైనాన్స్ బయటికి పోవడం పెరిగింది. కొంత అదుపు వున్న ప్రభుత్వ రంగ సంస్థలలోకి కూడా వాటి ప్రవాహం కొనసాగి ఆ ఆర్థిక వ్యవస్థని కూలిపోయే స్థితికి తెచ్చిపెట్టింది. సంస్కరణల అజెండాలు అన్నిటికీ అమలు జరిపే యంత్రాంగం ప్రభుత్వం పైనే ఆధారపడుతున్నాయి. అయితే ఆ ప్రభుత్వం శక్తివంతంగా పనిచేయాలంటే, దాని మాట అమలు జరిగే 'అజమాయిషీ ప్రాంతం' అంటూ వుండాలి. ఒకానొక దేశానికి, ఇతర ప్రపంచ దేశాలకు మధ్య వాస్తవంగా పెట్టుబడి మార్పిడి వుంటే (అది చట్టబద్ధమైనా, కాకున్నా) ఆ మార్పిడి "అజమాయిషీకి లోబడి వుండే ప్రాంతాన్ని" శక్తి హీనం చేస్తుంది.

రెండవది – ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి స్తంభనకు, సంక్షోభానికి ప్రధాన కారణం. ప్రపంచీకరించిన ఫైనాన్స్ పెట్టుబడి. సంక్షోభానికి గల కారణాలకు దోహదం చేసిన వివిధ అంశాలను వివిధ రచయితలు పేర్కొంటున్నారు. నూతన పరిశోధనలు కొరవడటం, కాండ్రేవ్ టౌన్ సైజింగ్ సూత్రణ, లాభాల రేటు పడిపోయే ధోరణికి ప్రతిస్పందన అంటూ వివిధ అంశాలను పేర్కొంటున్నారు. వీటికి తోడు, దానిని స్పష్టంగా వేరుచేసి చూడటం, అది ఏర్పడిన సమయానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలు వున్నాయి. అయితే నీవు సంక్షోభాన్ని ఎలావేరు చేసిచూచినా, అది దాని ప్రారంభ సమయంగా ఎప్పుడు నిర్ణయించినా, ఇతర అంశాలు

అందులో ఇమిడి వున్నా, ప్రపంచీకరణ చెందిన ఫైనాన్స్ అనేది సంక్షోభానికి దోహదం చేసిన ఒక కారణం. అది కనీసం మూడు విధాల దోహదం చేసింది. డిమాండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించినకొన్ని విధానాలు అమలు జరపడం ఆయాదేశాలకు అసాధ్యమైంది. దానితో ప్రభుత్వాలు సంక్షోభాన్ని ఎదుర్కోగల చర్యలుచేపట్టలేవు. ఇది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది. ప్రపంచీకరణ చెందినఫైనాన్స్ ప్రపంచం, డిఫ్లేషన్ వైపు నడిచే సాధారణ ధోరణికలిగివుండే ప్రపంచం. ఫైనాన్స్ ప్రైవేటీకరణ సామ్రాజ్యవాద అంతర్గత ఘర్షణలను అదుపులో పెట్టిందని పైనే పేర్కొన్నారు. అత్యంత విచిత్రంగా కనిపించినా మరొక విషయంకూడా వాస్తవమే. ఇతర దేశాలకంటే తమ దేశంలో పెట్టుబడి పెట్టేందుకుగల వాతావరణం హీనంగా వుండరాదని ఏదేశానికి, ఆదేశం చేసే ప్రయత్నం ఫలితంగా దేశాలమధ్య పోటీ తీవ్రతరమౌతుంది. దేశాల మధ్య గల ఈపోటీలో డిఫ్లేషనరీ ధోరణులు పుంజుకుంటాయి. బడ్జెట్‌లో మొత్తం ద్రవ్యలోటు (ఫిసికల్ డెఫిసిట్) సాధారణంగా తగ్గించబడతాయి. విధాన లక్ష్యాలలో ద్రవ్యోల్బణం లేకుండా చేయడానికి ప్రథమస్థానం ఏర్పడుతుంది. అది పెరుగుదలకు నష్టకరమౌతుంది. మూడవది ఈవిధంగా పోటీపడి డిఫ్లేషన్ విధానాలన్నీ అనుసరించడంతో నాయకత్వ స్థానంలో వుండే పెట్టుబడిదారీ దేశమే దెబ్బతింటుంది. ఆదేశం అభివృద్ధి విస్తరణ విధానాలను చురుకుగా అవలంభించాలి. తన విస్తరణ మిగతా అభివృద్ధి చెందిన దేశాలకు తరలించి పంచుకోగలగాలి. నాయకత్వ దేశం ఆరెండు కర్తవ్యాలను నిర్వహించకపోతే ప్రపంచ పెట్టుబడి దారీ విధానంలో అత్యున్నత కార్యకలాపాలు చిక్కులు ఎదుర్కొంటాయి (తనకు ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు మధ్యగల పెట్టుబడి చెల్లింపు లావాదేవీలలో నాయకత్వ ధేశం లోటును కొనసాగించితేనే పైరెండు కర్తవ్యాలను నిర్వహించగలదు) అందువల్ల ప్రపంచీకరణ చెందిన ఫైనాన్స్ గనుక పైచేయి సంపాదించుకుంటే, పైకారణాల మూలంగా, పెట్టుబడిదారీ ప్రపంచంలో సంక్షోభాన్ని అది రగల్చకున్నా, సంక్షోభం తీవ్రతరం కావడానికి, అది అలాగే కొనసాగడానికి మాత్రం తప్పక దోహదం చేస్తుంది.

ప్రపంచీకరణ చెందిన ఫైనాన్స్ యొక్క మూడవఫలితమే మూడవ ప్రపంచంలో అన్ని రంగాలలో తీవ్రమైన సంక్షోభం. ఫైనాన్స్ రాకపోకలు అన్ని స్థాయిలలో కార్యకలాపాలపైనా ప్రభావం కలిగిస్తుంది. ప్రపంచీకరించబడిన ఫైనాన్స్‌కు, ఏదేశంనుండి నిధులు పోగవుతున్నాయనేది పట్టదు. అందువల్ల అభివృద్ధి చెందిన, వెనుకబడిన పెట్టుబడిదారీ దేశాల మధ్య ఏర్పడే దూరం అనే అర్థంలో సామ్రాజ్య వాదం అనే భావనను ఫైనాన్స్‌పెట్టుబడి, కాలం చెల్లిన భావంగా మారుస్తుంది అని కొందరు భావిస్తున్నారు. ఇంతకు మించిన అసత్యం మరొకటి లేదు. ప్రపంచీకరణ చెందిన ఫైనాన్స్‌తో జతకూడినపెట్టుబడిదారీ సంక్షోభం మూడవ ప్రపంచ దేశాలను తీవ్రంగా కాటేస్తుంది. ఏ పెట్టుబడిదారీ సంక్షోభంలో లాగానే చిన్న పెట్టుబడులు కూలిపోతాయి. పెట్టుబడి కేంద్రీకరణకు దారి తీస్తాయి. అదే విధంగా ఏప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభంలోనైనా మూడవ ప్రపంచ పెట్టుబడులు, సాధారణంగా మూడవ ప్రపంచ ఉత్పత్తి

దారులు కూలిపోతారు. ప్రపంచ వ్యాపిత కేంద్రీకరణకు దారి ఏర్పడుతుంది. బ్రిటన్ వుడ్ సంస్థలు ( ఈమధ్యకాలంలో డబ్ల్యు.టి.ఒ.ల) ప్రవచించి, అమలు జర్గపమని వత్తిడి చేస్తున్న స్వేచ్ఛా వాణిజ్య విధానంలో అలాంటి అవకాశాలనుండి ఏమేరకైనా రక్షణ కలిగించే సదుపాయాలుకూడా తొలగించబడుతున్నాయి.

అయితేమూడవ ప్రపంచం సంక్షోభ దశకు దిగజార్చబడటం కేవలం ఆర్థిక రంగపు హ్రస్వ విషయాలకు మాత్రమే పరిమితంకాదు. స్థానిక ప్రజల డిమాండ్లు గాక, అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి దారుల హుకుంలకు ప్రాధాన్యత పెరుగుతుంది. (ఆర్థిక రంగంలో వారి 'విశ్వాసస్థాయి' అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటుంది గదా) ఆ ప్రాధాన్యత కేవలం ఆర్థిక విధానాన్ని మాత్రమే కాక, మొత్తం అన్ని రంగాలలో విధానాలను నిర్ణయిస్తుంది. ఫలితంగా ఈ దేశాల సార్వభౌమాధికారం నష్టపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. సార్వభౌమాధికారం క్రమంగా తగ్గిపోవడం, ప్రజాస్వామ్యం ముక్కలు కావడానికిదారితీస్తుంది. ప్రజల డిమాండ్లకు భిన్నంగానే వున్నా అంతర్జాతీయ ఫైనాన్స్ 'విశ్వాసాన్ని' నిలబెట్టుకునేందుకు లేదా మరింత పెంచుకునేందుకు అవసరమైన విధానాలను అమలు చేయాలంటే ప్రజాభిప్రాయం ప్రభుత్వ ఏర్పాటులో పాత్ర రద్దుకావాలి. ప్రజాస్వామ్యాన్ని శక్తివంతంగా కుదించగలిగితేనే ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేని, అంతర్జాతీయ ఫైనాన్షియర్ల అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వం ఏర్పడుతుంది.

ప్రజాస్వామ్యం కుదింపు అనేక మార్గాలలో సాగుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఒక ప్రహసనంగా మార్చడం లేదా దాని సారాన్ని బాగా తగ్గించే సంస్థాగత 'సంస్కరణలను' ప్రవేశపెట్టడం అన్నింటినీ మించిన మొదటి పద్ధతి అనేది స్పష్టమే. ఉదాహరణకు భారత దేశంలో అధ్యక్ష తరహా పాలన' ప్రవేశపెట్టాలనే నినాదం (ఆర్థికాభివృద్ధి ప్రయోజనాలకు అనుగుణ్యంగా') పార్లమెంట్ కాలవ్యవధిని నిర్ణయించాలనే డిమాండ్ ఇలాంటివే. రెండవది బూర్జువా సోషల్ డెమోక్రటిక్ పార్టీలు కూడా ఒకే విధమైన ఆర్థిక కార్యక్రమాలను ప్రబోధిస్తున్నాయి. (అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి అజెండాకు అలంకార ప్రాయమైన పదంగా మారిన) 'సంస్కరణలు' అమలుకు ప్రమాణాలు చేస్తున్నారు. అలాంటప్పుడు ప్రజాస్వామిక ఎన్నికల చట్రంలో తమదంటూ ఎన్నుకోగల మార్గం ప్రజలకు లేకుండా పోతున్నది. ఉదాహరణకు అర్జంటీనా చూడండి. కారలోసీ మెనయ్ మొదట పేదవాళ్ళ అభ్యున్నతి పేర అధ్యక్షుడిగా ఎన్నికైనాడు. కార్మిక వర్గ మద్దతు ఆయన గెలుపుకు పునాది. కాని అధికారంలోకి రాగానే అంతర్జాతీయ ఫైనాన్షియర్స్‌ను సంతృప్తి పరచేందుకు కార్మికవర్గ వ్యతిరేక విధానాలను అమలు జరిపాడు. పెరూలో ఫిజుమెరీ చేసిందీ అదే. భారత దేశంలో వరుసగా ఏర్పడిన మూడు ప్రభుత్వాలు అదే విధానాలను అనుసరించాయి. వాటిలో చివరన ఏర్పడిన బి.జె.పి. నాయకత్వాన ఏర్పడిన ప్రభుత్వం తన ఎన్నికలకు ముందు కార్యక్రమానికి పూర్తిగా భిన్నమైన విధానాలను అనుసరించింది. ఇదేదోకొన్ని పార్టీల నమ్మక ద్రోహానికి సంబంధించిన సమస్యకాదు.

అవి 'ఉదార వాద' ఆర్థిక విధానం విధించే ప్రత్యక్ష అవరోధాల వల్లే ఏర్పడుతున్నాయి. అంతర్జాతీయ ఫైనాన్షియర్స్‌ను తృప్తి పరచకపోతే పెట్టుబడులు దేశంనుండి తరలిపోతాయి. అలా వెళ్ళడం ప్రజలకు యిబ్బందులు కలిగిస్తుంది. అయితే దానిని తృప్తిపరచడం కూడా ప్రజలను యిబ్బందుల పాలే చేస్తుంది. మరొకరకంగా చెప్పాలంటే, ప్రపంచ ఫైనాన్స్ వలలో చిక్కుకోడమే అసలు సమస్య. బూర్జువా, సోషల్ డెమొక్రటిక్ పార్టీలకు అవలనుండి తప్పించుకోవాలనే దీక్షలేదు. (అలా తప్పించుకోవడం వల్ల కొంత పరివర్తన కాలంలో కొన్ని యిబ్బందులు ఎదురవుతాయి) అందువల్ల 'ఉదారవాద' ఆర్థిక విధానంలో వారు ప్రత్యామ్నాయం చూపలేరు. అందువల్ల వారిలో ఎవరిని ఎన్నుకున్నా ప్రజాస్వామ్యాన్నిముక్క చెక్కలుచేయడమే అవుతుంది. మూడవ ప్రపంచపు 'ఉదార వాద' ఆర్థిక రంగం ఉత్పత్తి స్తంభన, తీవ్రతర మౌతున్న నిరుద్యోగంతోపాటు, వేర్పాటు వాదం, మతతత్వం, జాతి ఘర్షణల రూపంలో విచ్ఛిన్న వాదాలు గూడా చవిచూస్తున్నది. ఇది సమాజంలో చర్చనీయాంశాలలో పెద్దమార్పుకు దారితీసింది. ఆర్థిక కార్యక్రమాలకు భిన్నమైన రీతుల్లో రాజకీయ సమీకరణలకు దారితీసింది. ప్రపంచీకరణ చెందిన ఫైనాన్స్ మంటల్లో చిక్కుకున్న మూడవ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, ఆర్థిక సంక్షోభం, ప్రజలను చీలదీసే విధంగా సామాజిక ఘర్షణలు, సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం రద్దుకావడం వంటి అనుభవాలు ఎదుర్కొంటున్నాయి. ఈ సందర్భంగానే సోషలిస్టు పథకం పునరుద్ధరణ ఒకటే, ప్రగతి మార్గంగా సోషలిస్టు శక్తులు ప్రతిపాదిస్తున్నాయి. అలాంటి అవకాశం, నిజం చెప్పాలంటే అనివార్యంగా, ఏదిఏమైనా భూగోళంలో ఈ భాగంలో తలెత్తుతుంది అని ఆ శక్తులుభావిస్తున్నాయి. అలాంటి కర్తవ్యాలకు తగిన కొత్త సమగ్ర, సమైక్య సిద్ధాంతాన్ని అలాంటి సోషలిస్టు పథకపు పునర్జీవం సమకూర్చగలుగుతుంది. అలాంటి కొత్త సైద్ధాంతిక ఐక్యతను సాధించే కృషికి ప్రణాళికలో గల ప్రకాశవంతమైన భావ సముదాయం తప్పక తోడ్పడుతుంది.

# కారల్‌మార్క్స్
# ఫ్రెడరిక్ ఎంగెల్స్

# కమ్యూనిస్టుపార్టీ ప్రణాళిక

# 1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ముందుమాట

'కమ్యూనిస్టు ప్రణాళిక' కమ్యూనిస్టు లీగు[1] యొక్క వేదికగా వెలువడింది. కమ్యూనిస్టు లీగు మొదట కేవలం జర్మన్ కార్మికుల సంఘంగా వుండి, తరువాత అంతర్జాతీయ సంఘంగా యేర్పడి, 1848కి పూర్వం యూరోపియన్ భూఖండం (continent) లో వుండిన రాజకీయ పరిస్థితులలో రహస్య సంస్థగా వుండక తప్పలేదు. 1847 నవంబర్‌లో లండన్‌లో జరిగిన లీగు మహాసభ, సిద్ధాంతగతమూ ఆచరణాత్మకమూ ఐన సంపూర్ణ పార్టీ కార్యక్రమాన్ని ప్రచురణార్థం సిద్ధంచేసేపనిని మార్క్సు ఎంగెల్సులకు అప్పగించింది. 1848 జనవరిలో జర్మన్ భాషలో రాసిన 'ప్రణాళిక' రాతప్రతి ఫిబ్రవరి 24న జరిగిన ఫ్రెంచి విప్లవానికి కొద్దివారాలు ముందుగా లండన్‌లోని ముద్రాపకునికి పంపించాము. 1848 జూన్‌లో జరిగిన తిరుగుబాటుకు కొద్దికాలం ముందుగా పారిస్‌లో ఒక ఫ్రెంచి అనువాదం వెలువడింది. మిస్ హెలెన్ మెక్‌ఫర్లేన్ చేసిన మొదటి ఇంగ్లీషు అనువాదం జార్జి జూలియన్ హార్నీ గారి *Red Republican* అనే లండన్ పత్రికలో 1850లో వచ్చింది. డేనిష్ భాషలోనూ, పోలిష్ భాషలోనూ కూడా రెండు కూర్పులు ప్రచురితమయ్యాయి.

1848 జూన్‌లో జరిగిన పారిస్ తిరుగుబాటు-కార్మికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య సాగిన మొట్టమొదటి మహాయుద్ధం - ఓడిపోవడంతో యూరోపియన్ కార్మికవర్గం యొక్క సాంఘిక రాజకీయ ఆకాంక్షలు మళ్ళీ కొంతకాలంపాటు మరుగున పడ్డాయి. అప్పటినుండి మళ్ళీ అధికారం కొరకు జరిగే పోరాటం, ఫిబ్రవరి విప్లవానికి పూర్వం జరిగినట్లే, కేవలం ఆస్తిపరవర్గంలోని వివిధ భాగాలమధ్య మాత్రమే జరిగింది. కార్మికవర్గం రాజకీయ రంగంలో ఆచరణ స్వేచ్ఛకొరకే పోరాటం చేయవలసివచ్చింది; అది మధ్యతరగతి అతివాదుల (radicals) పార్టీలో ఒక అత్యంత అతివాద బృందంగా వుండే స్థితికి పడిపోయింది. స్వతంత్ర కార్మికోద్యమాలు ఇంకా సజీవంగా వున్న లక్షణాలు ఎక్కడ కనపడినా ఆ ఉద్యమాలను క్రూరంగా వేటాడి అణచివేశారు. ఆ రోజుల్లో కొలోన్‌లో వున్న కమ్యూనిస్టు లీగుయొక్క కేంద్ర కమిటీని ప్రష్యన్ పోలీసులు వేటాడి, సభ్యులను అరెస్టు చేసి, 18 మాసాల నిర్బంధం తర్వాత 1852 అక్టోబర్‌లో వాళ్ళమీద విచారణ జరిపారు. ప్రసిద్ధమైన ఈ కొలోన్ కమ్యూనిస్టుల విచారణ అక్టోబర్ 4 నుండి

నవంబర్ 12వరకు జరిగింది. ఏడుగురికి మూడేండ్ల నుండి ఆరేండ్లవరకు కోటలో జైలుశిక్ష పడింది. శిక్షపడిన వెనువెంటనే తక్కిన సభ్యులు లీగును లాంఛనంగా రద్దు చేశారు. ఇక 'ప్రణాళిక' విస్మృతిలో పడక తప్పదని అనిపించింది.

యూరోపియన్ కార్మికవర్గం కోలుకొని పాలకవర్గాలమీద మళ్ళీ దాడి చేయడానికి తగిన బలం పొందినప్పుడు 'అంతర్జాతీయ కార్మిక సంఘం' (మొదటి ఇంటర్నేషనల్) ఉద్భవించింది. కానీ, మొత్తం యూరప్ అమెరికాల సమరశీల కార్మికవర్గ మంతటినీ ఒకే సంస్థగా ఐక్యం చేసే స్పష్టమైన ఉద్దేశంతో పుట్టిన ఈ సంఘం 'ప్రణాళిక'లోని సూత్రాలను వెంటనే ఉద్ఘాటించలేకపోయింది. ఇంగ్లీషు ట్రేడ్ యూనియన్లకూ, ఫ్రాన్స్, బెల్జియం, ఇటలీ, స్పెయిన్‌లలోని ప్రూధన్ అనుచరులకూ, జర్మనీలోని లాసాల్ * అనుచరులకూ ఆమోదయోగ్యంగా వుండేటంత విశాలమైన కార్యక్రమం 'ఇంటర్నేషనల్'కు తప్పక వుండవలసి వచ్చింది. అన్ని పార్టీలకూ సంతృప్తికరంగా వుండేలా కార్యక్రమాన్ని తయారుచేసిన మార్క్స్ సంయుక్త చర్యల ద్వారానూ, పరస్పర చర్చల ద్వారానూ కార్మికవర్గ మేధా సంపద తప్పక అభివృద్ధి చెందగలదని పూర్తిగా విశ్వసించాడు. పెట్టుబడికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సంభవించే ఘటనలూ, ఎగుడుదిగుడులే - విజయాలకంటే ఎక్కువగా అపజయాలే - తమకు ప్రీతికరమైన వివిధ చిట్కాలు పూర్తి ఫలితాలు ఇవ్వలేవనే విషయాన్ని మనుషుల మనసుల్లోకి ఎక్కేటట్లు చేసి, కార్మికవర్గ విమోచనకు గల అసలు నియమాలను సంపూర్ణంగా అవగాహన చేసుకోవడానికి దారితీయక తప్పదు. మార్క్స్ అనుకున్నది నిజమైంది. 1874లో ఇంటర్నేషనల్ విచ్ఛిన్నమైనప్పుడు కార్మికులు 1864లో - దానిని స్థాపించినప్పటి కంటే చాలా భిన్నంగా వున్నారు. ఫ్రాన్స్‌లో ప్రూధనిజం, జర్మనీలో లాసాలియనిజం అంత్య ఘడియల్లో వున్నాయి; మితవాదులైన ఇంగ్లీష్ ట్రేడ్ యూనియన్లు కూడా, వాటిలో చాలా భాగం చాలా కాలం నుండి ఇంటర్నేషనల్‌తో సంబంధాలు తెంచుకొన్నప్పటికీ, యెంతవరకు అభివృద్ధి చెందినాయంటే, వాటి అధ్యక్షుడు గత సంవత్సరం స్వాన్‌సీలో వాటి తరపున మాట్లాడుతూ "యూరోపియన్ భూఖండంలోని సోషలిజం మమ్మల్నిక భయపెట్టదు," అన్నాడు. నిజానికి 'ప్రణాళికా' సూత్రాలు సకల దేశాల కార్మికుల్లోనూ గణనీయంగా చొచ్చుకొని పోయాయి.

ఆవిధంగా 'కమ్యూనిస్టు ప్రణాళికే' మళ్ళీ ముందుకు వచ్చింది. 1850 నుండి జర్మన్ పాఠం స్విట్జర్లండు, ఇంగ్లండు, అమెరికాలలో అనేక ముద్రణలు పొందింది. 1872లో న్యూయార్కులో ఇంగ్లీషులోకి అనువాదమై, ఆ అనువాదం *(Woodhull and Claflin's Weekly)* లో ప్రచురితమైంది. ఇంగ్లీషు పాఠంనుండి చేసిన ఒక ఫ్రెంచి అనువాదం న్యూయార్కులో *(Le Socialiste)* పత్రికలో వెలువడింది. అప్పటినుండి

---

**తాను మార్క్సు శిష్యుణ్ణని లాసాల్ స్వయంగా మాతో ఎల్లప్పుడూ చెప్పేవాడు. ఆవిధంగానే 'ప్రణాళిక'కు కట్టుబడే వాడు. కానీ 1862-1864నాటి తన బహిరంగ ఆందోళనలో ప్రభుత్వ ఋణాల తోడ్పాటుతో సహకార కర్మాగారాలు ఏర్పరచాలని తప్ప అంతకుమించి యేమీ డిమాండు చేయలేదు.*

*(ఎంగెల్స్ వివరణ)*

కనీసం రెండు ఇంగ్లీషు అనువాదాలు, రెండూ అంతో యిథతో వికృతరూపంతో అమెరికాలో వెలువడినాయి. వాటిలో ఒకటి ఇంగ్లండులో పునర్ముద్రణ పొందింది. మొదటి రష్యన్ అనువాదం, బకూనిన్ చేసింది, 1863 ప్రాంతంలో జెనీవాలో గెర్ట్సెన్‌కు చెందిన 'కోలొకోల్' పత్రిక ఆఫీసులో ప్రచురితమైంది. వీరవనిత వేరా జసూలిచ్* చేసిన రెండవ రష్యన్ అనువాదం కూడా జెనీవాలోనే 1882లో వెలువడింది. ఒక కొత్త డేనిష్ కూర్పు 1885లో కోపెన్‌హాగెన్‌లోని *Social Democratic Bibliothek* వచ్చింది. ఒక కొత్త ఫ్రెంచి అనువాదం 1885లో *Le Socialiste* అనే పారిస్ పత్రికలో వచ్చింది. దీనినుండి ఒక స్పానిష్ పాఠం తయారై 1886లో మాడ్రిడ్‌లో ప్రచురితమైంది. జర్మన్ పునర్ముద్రణలు లెక్క పెట్టలేము. అవి అన్నీ కలసి కనీసం పన్నెండైనా వుంటాయి. కొన్ని మాసాల క్రితం కాన్‌స్టంటినోపుల్‌లో అచ్చు కావలసిన ఒక ఆర్మీనియన్ అనువాదం అచ్చుకాలేదనీ, దానికి కారణం యేమంటే మార్క్సు పేరుగల పుస్తకాన్ని ప్రచురించడానికి ప్రచురణకర్త భయపడినాడని, అనువాదకుడు అది తన స్వంత రచనగా చెప్పుకోవడానికి నిరాకరించాడనీ విన్నాను. ఇంకా యితర భాషల్లోకి అనువాదాలు జరిగినట్లువిన్నాను గానీ, వాటిని నేను చూడలేదు. ఈ విధంగా 'కమ్యూనిస్టు ప్రణాళిక' చరిత్ర చాలావరకు ఆధునిక కార్మికవర్గ ఉద్యమ చరిత్రను ప్రతిబింబిస్తుంది. ఈనాడు నిస్సందేహంగా యిది సోషలిస్టు సాహిత్యంలోకెల్ల అత్యంత వ్యాప్తిగలిగి, అత్యంత అంతర్జాతీయమైన గ్రంథం; సైబీరియానుండి కాలిఫోర్నియావరకూ లక్షోపలక్షల శ్రామిక జనం తమ సమష్టి వేదికగా అంగీకరించిన గ్రంథం.

కానీ, దీన్ని రచించినప్పుడు మేము దీన్ని సోషలిస్టు ప్రణాళిక అని అనగలిగి వుండేవాళ్ళం కాదు. 1847లో సోషలిస్టులంటే ఒకవైపున వివిధ ఊహాస్వర్గ సిద్ధాంతాలను అనుసరించేవాళ్ళు: అనగా ఇంగ్లండులో ఓవెన్ అనుయాయులూ, ఫ్రాన్సులో ఫోరియర్ అనుయాయులూ - యీ ఉభయులూ అనాటికే కేవలం ముఠాల (Sects) స్థితికి దిగజారి క్రమక్రమంగా అంతరించి పోతూ వున్నారు; మరొకవైపున నానా రకాల సామాజిక దొంగవైద్యులూ - వీళ్లు పెట్టుబడికీ, పెట్టుబడిదార్ల లాభాలకూ యేమీ ప్రమాదం లేకుండా, రకరకాల చిట్కాలతో అన్ని రకాల సామాజిక బాధలూ తీరుస్తామని చెప్పుకునేవాళ్లు. ఈ ఉభయవర్గాల వాళ్లూ కార్మికవర్గ ఉద్యమంతో సంబంధం లేకుండా వుంటూ, "విద్యావంతుల" తోడ్పాటు కొరకే మొగ్గు చూపించేవాళ్లు. కేవలం రాజకీయ విప్లవాలు పూర్తి ఫలదాయకాలుకావని దృఢంగా విశ్వసించి సంపూర్ణ సామాజిక మార్పు అవసరమని ఉద్ఘాటించేవాళ్ళు కార్మికవర్గంలో ఎవరైతే ఉన్నారో వాళ్ళంతా కమ్యూనిస్టులమని చెప్పుకునేవాళ్ళు. అది స్పష్టమైన రూపము పొందనిదీ, మోటుదీ, కేవలం సహజాతమూ అయిన (Instinctive) కమ్యూనిజం వంటిది; ఐనా అది కీలకమైన అంశాన్ని స్పృశించి, కార్మికవర్గంలో యెంత బలీయంగా వుందంటే, దాని

---

* *తరువాతి కాలంలో ఎంగెల్సే స్వయంగా (Internationales aus dem Volksstaat) (1871-1875) అనే బెర్లిన్ పత్రికలో ప్రచురించిన 'రష్యాలో సామాజిక సంబంధాలు' అనే వ్యాసానికి తుదిపలుకు రాస్తూ, దీని నిజమైన అనువాదకుడు జి.వి.ప్లెహనావ్ అని సరిగా పేర్కొన్నాడు. - సం.*

ప్రభావంతో ఫ్రాన్సులో కాబెట్, జర్మనీలో వైట్లింగ్‌లు ఊహాస్వర్గ కమ్యూనిజాన్ని సృష్టించగలిగారు. ఆ విధంగా 1847లో సోషలిజం మధ్యతరగతి ఉద్యమంగానూ, కమ్యూనిజం కార్మికవర్గ ఉద్యమంగానూ వున్నాయి. కనీసం యూరోపియన్ భూఖండంలోనైనా సోషలిజం "గౌరవనీయం"గా వుండేది, కమ్యూనిజం అందుకు పూర్తి విరుద్ధంగా వుంది. మొట్టమొదటినుండి "కార్మికవర్గ విమోచన కార్మికవర్గమే సాధించవలసిన కార్యం," అనేది మా అభిప్రాయం గనుక, యీ రెండు పేర్లలో మేము దేన్ని స్వీకరించాలనే విషయంలో యెట్టి సందేహమూ వుండజాలదు. అంతే గాక, ఆనాటినుండి "కమ్యూనిజం" అనే పేరును మేము యెప్పుడూ నిరాకరించదలచు కోలేదు.

ఈ 'ప్రణాళిక'మా సంయుక్త రచన గనుక, దీని వెన్నెముకవంటిదైన మూల ప్రతిపాదన మార్క్సుదని చెప్పడం నావిధి. ఆ ప్రతిపాదన యేదంటే, ప్రతి చారిత్రక యుగంలోనూ ఆనాడు అమల్లో వున్న ఆర్థిక ఉత్పత్తి, మారకపు విధానమూ, దానినుండి విధిగా ఉద్భవించే సామాజిక వ్యవస్థా అనేవి పునాదిగా వుంటూ, ఆ పునాదిపైన ఆ యుగంయొక్క రాజకీయ, బౌద్ధిక (Intellectual) చరిత్ర నిర్మాణమౌతుంది - ఆ పునాదిద్వారా మాత్రమే ఆ రాజకీయ, బౌద్ధిక చరిత్రను వివరించడం సాధ్యమౌతుంది, దీని పర్యవసానంగా మానవజాతి చరిత్ర అంతా (భూమిమీద సమష్టి స్వామ్యం వుండే ఆదిమ గణసమాజం విచ్ఛిత్తి పొందినప్పటినుండి) వర్గ పోరాటాల చరిత్రగా - పీడక, పీడిత వర్గాలమధ్య, పాలక, అణగారినవర్గాల మధ్య జరిగే పోరాటాల చరిత్రగా - వుంది. కొన్ని పరిణామాల పరంపర ఐన యీ వర్గపోరాటాల చరిత్ర యీనాడు యేదశకు చేరిందంటే, యీనాడు పీడిత అణగారినవర్గమైన కార్మికవర్గం పీడక పాలకవర్గమైన బూర్జువావర్గపు పెత్తనంనుండి తాను విముక్తి పొందాలంటే అదే సమయంలో మొత్తం సమాజాన్ని సమస్త దోపిడీనుండీ, సమస్త వర్గ భేదాలనుండీ, సమస్త వర్గ పోరాటాల నుండీ శాశ్వతంగా విముక్తి చేయక తప్పదు.

డార్విన్ సిద్ధాంతం జీవ శాస్త్రానికి యేమి చేసిందో అదే యీ ప్రతిపాదన చరిత్రకు చేసి తీరుతుందని నా అభిప్రాయం. అటువంటి యీ ప్రతిపాదనవైపు 1845కు పూర్వం కొన్ని సంవత్సరాలుగా మేము ఉభయులమూ పయనిస్తూ, క్రమక్రమంగా దీన్ని సమీపిస్తూ వున్నాము. స్వతంత్రంగా నేను దీనివైపు యెంతవరకు పురోగమించిందీ నేను రాసిన 'ఇంగ్లండులో కార్మికవర్గస్థితి' అనే గ్రంథంద్వారా చాలా బాగా తెలుస్తుంది. కానీ, 1845 వసంతంలో, బ్రసెల్స్‌లో నేను మార్క్సును మళ్లీ కలుసుకున్నప్పుడు, అప్పటికి తాను సిద్ధంగా తయారుచేసిన యీ ప్రతిపాదనను, నేను యిక్కడ యెంత స్పష్టమైన మాటల్లో చెప్పానో దాదాపు అంత స్పష్టమైన మాటల్లో, ఆయన నా ముందు వుంచాడు.

1872 నాటి జర్మన్ కూర్పుకు మేమిద్దరమూ కలిసి రాసిన ముందుమాటలనుండి యీ కిందిభాగం యిస్తున్నాను.

"గత యిరవై ఐదు సంవత్సరాల్లో పరిస్థితులు యెంత మారినప్పటికీ, యీ 'ప్రణాళిక'లో చెప్పిన సూత్రాలు, మొత్తంమీద, యెప్పటిలాగే సరిగా వున్నాయి. అక్కడక్కడా యేదైనా ఒక వివరాన్ని మెరుగుపరచవచ్చు. సూత్రాలను ఆచరణలో

పెట్టడమనేది, యీ 'ప్రణాళిక' లోనే చెప్పినట్లు, సర్వే సర్వత్రా, ఆనాటి చారిత్రక పరిస్థితులమీద ఆధారపడుతుంది; అందువల్ల 2వ ప్రకరణం చివర ప్రతిపాదించిన విప్లవ చర్యలకు ప్రత్యేక ప్రాముఖ్యం యివ్వలేదు. ఆ ఘట్టం యీనాడు రాయవలసివస్తే, అనేక సందర్భాలలో వేరుగా రాయవలసి వుంటుంది. 1848నుండి ఆధునిక పరిశ్రమ సాధించిన బ్రహ్మాండమైన పురోగతి దృష్ట్యానూ, దానితోపాటు కార్మికవర్గ నిర్మాణం అభివృద్ధిచెంది విస్తరించిన దృష్ట్యానూ* మొదట ఫిబ్రవరి విప్లవంలోనూ, తరువాత రెండు పూర్తి మాసాల కాలం కార్మికవర్గం రాజకీయాధికారం వహించిన పారిస్ కమ్యూన్‌లో మరింత యెక్కువగా గడించిన అనుభవం దృష్ట్యానూ, యీ కార్యక్రమంలోని కొన్ని వివరాలకూ కాలదోషం పట్టింది. ముఖ్యంగా ఒక విషయం పారిస్ కమ్యూన్‌లో రుజువైంది:

అదేమిటంటే 'అప్పటికే సిద్ధంగా వున్న రాజ్య యంత్రాన్ని (State Machinery) కార్మికవర్గం పూరక స్వాధీనం చేసుకొని తన సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోజాలదు'. (ఈ విషయం The Civil War in France, Address of the General Council of the International Working Men's Association, London, Truelove, 1871, పుట 15 లో విపులంగా వుంది.)** అంతేగాక, సోషలిస్టు సాహిత్యంమీద చేసిన విమర్శ యీనాడు అసమగ్రమని తెలుస్తూనే వుంది; యెందుకంటే, ఆ విమర్శ 1847 వరకు మాత్రమే వర్తిస్తుంది. వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరిని గురించి చెప్పిన అభిప్రాయాలు (4వ ప్రకరణం) కూడా, సిద్ధాంతరీత్యా యిప్పటికీ సరైనవే ఐనప్పటికీ, ఆచరణలో వాటికి కాలదోషం పట్టిందని తెలుస్తూనే వుంది. ఎందుకంటే రాజకీయ సన్నివేశం పూర్తిగా మారిపోయి, మేము పేర్కొన్న రాజకీయ పార్టీలలో అధిక భాగాన్ని భూమండలంనుండి ఊడ్చి పారవేసింది చారిత్రక పురోగతి.

"కానీ, యీ 'ప్రణాళిక' ఒక చారిత్రక పత్రం అయింది. దీన్ని మార్చడానికి మాకిక యేలాటి హక్కూ లేదు."

ఈ అనువాదం శామ్యూల్ మూర్‌ది. మార్క్సు రాసిన 'కాపిటల్'లో అధిక భాగాన్ని అనువాదం చేసినవాడే యీ మూర్. మేమిద్దరమూ కలిసి దీన్ని సవరించాము. చారిత్రక విశేషాలకు కొద్ది వివరణలను నేను చేర్చాను.

*ఫ్రెడరిక్ ఎంగెల్స్*

*లండన్, జనవరి 30, 1888*

---

**1872 నాటి జర్మన్ మూలంలో యీ వాక్యం వేరుగా వుంది '1848 నుండి' అన్నదానికి బదులుగా "గత ఇరవై ఐదు సంవత్సరాలలోను" అని వుంది. నిర్మాణం అభివృద్ధి చెంది విస్తరించిన అన్న దానికి బదులుగా "పార్టీ నిర్మాణం అభివృద్ధి చెంది విస్తరించిన" అని వుంది.*

*** K. Marx and F. Engels, Selected Works, in three Volumes, Vol.2, Moscow 1973, పుటలు 178-245*

"మహా మేధావులకు సహజమైన స్పష్టతతోనూ, ప్రజ్ఞతోనూ యీ గ్రంథం నూతన ప్రపంచ దృక్పథాన్ని స్థూల రేఖల్లో చిత్రిస్తుంది. ఈ నూతన ప్రపంచ దృక్పథంలో యే మినహాయింపులూ లేని భౌతికవాదం, సాంఘిక జీవితానికి కూడా వర్తించేది వుంది; గతి తర్కం అనే అత్యంత సమగ్రమైన, అత్యంత గంభీరమైన అభివృద్ధి సిద్ధాంతం వుంది; వర్గ పోరాటాన్ని, నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టికర్త ఐన కార్మికవర్గం యొక్క ప్రపంచ చరిత్రాత్మక విప్లవ పాత్రనూ ప్రకటించే సిద్ధాంతం వుంది.

లెనిన్

# కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక

యూరప్‌ను ఒక భూతం ఆవహించింది - కమ్యూనిజం అనే భూతం. ఈ భూతాన్ని ఉచ్చాటన చేయడానికి అటుపోపూ[2] యిటు జార్,[3] అటు మెటర్నిక్[4] యిటు గీజో,[5] అటు ఫ్రెంచి రాడికల్ పార్టీ వాళ్ళూ,[6] యిటు జర్మన్ పోలీసు గూఢచారులూ - పురాతన యూరప్‌లోని అధికార శక్తులన్నీ - ఒక పవిత్ర కూటమిగా యేర్పడినాయి.

అధికారంలో వున్న పార్టీ చేత కమ్యూనిస్టులని తిట్లు తినని ప్రతిపక్ష పార్టీ యెక్కడైనా వుందా ? ప్రతిపక్షంలో వున్న పార్టీ అదే తిట్లను తనకంటే పురోగాములైన యితర ప్రతిపక్ష పార్టీలమీదా, ప్రగతి వ్యతిరేకులైన తన శత్రువుల మీదా విసరకుండా యెక్కడైనా వుందా ?

దీన్ని బట్టి రెండు విషయాలు స్పష్టమౌతున్నాయి.

1. కమ్యూనిజమే స్వయంగా ఒక శక్తి అని యిప్పటికే యూరోపియన్ శక్తులన్నీ గుర్తించాయి.

2. కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలనూ, తమ లక్ష్యాలనూ, తమ ధోరణులనూ బాహాటంగా యావత్ ప్రపంచం యెదుటా ప్రకటించి, కమ్యూనిస్టు భూతమనే యీ కట్టు కథను తమ పార్టీ ప్రణాళికతోనే యెదుర్కోవలసిన సమయం ఆసన్నమైంది.

ఈ ఉద్దేశంతో వివిధ జాతుల కమ్యూనిస్టులు లండన్‌లో సమావేశమై, ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, ఇటాలియన్, ఫ్లెమిష్, డేనిష్ భాషల్లో ప్రచురించడానికి యీ 'ప్రణాళిక'ను రూపొందించారు.

# I

## బూర్జువాలూ - కార్మికులూ[7]

ఇంత వరకు నడచిన సమాజపు చరిత్ర[8] అంతా వర్గ పోరాటాల చరిత్రే.

[పురాతన కాలపు] స్వతంత్ర పౌరుడూ, బానిసా - [రోమన్ కాలపు] పాలక వర్గీయుడూ, సామాన్యుడూ - [ఫ్యూడల్ యుగపు] భూస్వామ్య ప్రభువూ, దాసుడూ - [మధ్య యుగాల నాటి] వృత్తి సంఘ సభ్యుడూ,[9] వృత్తి సంఘ కార్మికుడూ - ఒక్క మాటలో చెప్పాలంటే పీడకుడూ, పీడితుడూ యెల్లప్పుడూ పరస్పర శత్రువులుగా నిలబడి, ఒకప్పుడు ప్రచ్ఛన్నంగానూ, మరొకప్పుడు బాహాటంగానూ, నిరంతరాయంగా పోరాటం చేస్తూ వచ్చారు ; ఈ పోరాటపు పర్యవసానంగా ఒకోసారి మొత్తం సమాజం విప్లవాత్మక పునర్నిర్మాణానికి లోనయ్యేది, ఒకోసారి ప్రత్యర్థి వర్గాలు రెండూ నాశనమయ్యేవి.

చరిత్ర మొదటి యుగాల్లో దాదాపు ప్రతిచోటా మానవ సమాజం వివిధ తరగతులుగా, తరతమ భేదాలుగల అనేక సాంఘిక అంతస్తులుగా, క్లిష్టమైన పద్ధతిలో విభజితమై వుండేది. పురాతన రోమ్‌లో పాలక వర్గీయులూ, వీరవర్గమూ, సామాన్యులూ, బానిసలూ వున్నారు ; మధ్య యుగాలలో ఫ్యూడల్ ప్రభువులూ, పరాధీన రైతులూ, వృత్తి సంఘ సభ్యులూ, వృత్తి సంఘ కార్మికులూ, అప్రెంటిస్‌లూ, ఫ్యూడల్ దాసులూ వున్నారు ; దాదాపు ప్రతివర్గంలోనూ మళ్ళీ తరతమ భేదాలు వున్నాయి.

ఫ్యూడల్ సమాజపు శిధిలాల నుండి ఉద్భవించిన ఆధునిక బూర్జువా సమాజం వర్గ వైరుధ్యాలను నిర్మూలించలేదు. అది చేసిందల్లా పాత వర్గాలకు బదులు కొత్త వర్గాలనూ, పాత దమన పద్ధతులకు బదులు కొత్త దమన పద్ధతులనూ, పాత పోరాట రూపాలకు బదులు కొత్త పోరాట రూపాలను నెలకొల్పడం మాత్రమే.

కానీ, బూర్జువా యుగం అంటున్న యీ మన యుగానికి ఒక విశిష్టమైన లక్షణం వుంది : అది వర్గ వైరుధ్యాలలోని సంకీర్ణతను తొలగించింది. అంతకంతకూ మొత్తం సమాజమంతా బూర్జువావర్గం, కార్మికవర్గం అనే రెండు మహత్తర శత్రు శిబిరాలుగా, పరస్పరాభిముఖాలైన రెండు మహా వర్గాలుగా చీలిపోతున్నది.

మధ్య యుగాల్లోని ఫ్యూడల్ దాసుల నుండి తొలి పట్టణాలలోని శాసనరక్షిత స్వతంత్ర పౌరులు[10] ఉద్భవించారు. ఈ స్వతంత్ర పౌరులనుండే తొలి బూర్జువాలు అభివృద్ధి చెందారు.

అమెరికా ఖండ అవిష్కరణతోనూ, ఆఫ్రికా ఖండాన్ని చుట్టుకొనిపోయే సముద్ర మార్గాన్ని కనిపెట్టడంతోనూ అప్పుడప్పుడే తల యెత్తుతున్న బూర్జువావర్గానికి మంచి అవకాశాలు లభించాయి. హిందూ మహాసముద్రంలోని దేశాలలోనూ, చైనాలోనూ వున్న మార్కెట్లూ, అమెరికాలో తెల్లవాళ్ళు స్థిరపడడమూ, వలస దేశాలతో వర్తకమూ, మొత్తం సరుకులూ డబ్బూ యెక్కువ కావడమూ, యివన్నీ వాణిజ్యానికి, సముద్రయానానికీ, పరిశ్రమలకూ కనీవిని యెరగని వూపును యిచ్చాయి. తత్ఫలితంగా పతనోన్ముఖమైన ఫ్యూడల్ సమాజంలోని విప్లవ శక్తులు వేగంగా అభివృద్ధి చెందాయి.

ఫ్యూడల్ పారిశ్రామిక వ్యవస్థలో, కొత్త వాళ్ళకు ప్రవేశంలేని వృత్తి సంఘాలకు పారిశ్రామిక ఉత్పత్తి మీద గుత్తాధిపత్యం వుండేది ; కొత్త మార్కెట్ల యొక్క పెరుగుతున్న అవసరాలను ఆ వ్యవస్థ యిక యెంత మాత్రం తీర్చలేకపోయింది. దాని స్థానంలో కర్మాగార వ్యవస్థ[11] వచ్చింది. కర్మాగారాల ద్వారా ఉత్పత్తి సాగించే మధ్యతరగతి వచ్చి వృత్తి సంఘ సభ్యులను పక్కకు నెట్టివేసింది ; ప్రతి కర్మాగారంలోనూ శ్రమ విభజన ప్రవేశించడంతో వివిధ వృత్తి సంఘాల మధ్య వుండిన శ్రమ విభజన అంతరించింది.

ఈలోగా మార్కెట్లు విస్తరిస్తూనే వున్నాయి. సరుకులకు గిరాకీ పెరుగుతూనే వుంది. కర్మాగారాల ఉత్పత్తి కూడా చాలలేదు. అప్పుడు ఆవిరి యింజన్లూ, యంత్రాలూ వచ్చి పారిశ్రామిక ఉత్పత్తిలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చాయి. కర్మాగారాలు పోయి వాటి స్థానంలో బ్రహ్మాండమైన ఆధునిక పరిశ్రమలు వచ్చాయి ; పారిశ్రామిక మధ్య తరగతి పోయి వాళ్ళ స్థానంలో పారిశ్రామిక కోటీశ్వరులు - కార్మిక సైన్యాల మీద అధిపతులు - ఆధునిక బూర్జువాలు - వచ్చారు.

ఆధునిక పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌ను స్థాపించింది ; దీనికి అమెరికా ఆవిష్కరణ బాట వేసింది. ఈ ప్రపంచ మార్కెట్ ద్వారా వాణిజ్యమూ, సముద్రయానమూ, భూమార్గాలూ అపారంగా అభివృద్ధి ఐనాయి. వీటి అభివృద్ధి తిరిగి పరిశ్రమల విస్తరణకు కారణమయింది. ఈ విధంగా పరిశ్రమలూ, వాణిజ్యమూ, సముద్రయానమూ, రైల్వేలూ విస్తరించే కొద్దీ, అదే నిష్పత్తిలో బూర్జువావర్గమూ అభివృద్ధి అయింది, దాని పెట్టుబడీ పెరిగింది, మధ్య యుగాల నుండి వచ్చిన ప్రతి వర్గమూ వెనక్కి నెట్టివేయబడింది.

కాబట్టి, ఆధునిక బూర్జువావర్గ మనేదే దీర్ఘ కాలిక అభివృద్ధి ఫలితంగా యేర్పడిందనీ, ఉత్పత్తి విధానాల్లోనూ మారకపు విధానాల్లోనూ జరిగిన అనేక విప్లవాల పర్యవసానమనీ మనకు అర్థమౌతున్నది.

బూర్జువావర్గం అభివృద్ధి ఐనప్పుడు అది అడుగడుగునా రాజకీయంగా కూడా పురోగమించింది. ఒకప్పుడు ఫ్యూడల్ పెత్తనంకింద అణగారినవర్గంగా వుండిన బూర్జువా వర్గం - తరువాత మధ్య యుగపు కమ్యూన్లలో[12] సాయుధ స్వయం పరిపాలక సంఘాలుగా వుండిన బూర్జువావర్గం - అటు తర్వాత (ఇటలీలోనూ, జర్మనీలోనూ వున్నట్లు) స్వతంత్ర నగర రిపబ్లిక్కులుగానో, లేక (ఫ్రాన్సులో వున్నట్లు) రాచరిక

ప్రభుత్వం క్రింద పన్నులు చెల్లించే "మూడవ అంతస్తు"[13] గానో వుండిన బూర్జువావర్గం - ఆ తర్వాత, కర్మాగారాలు స్థిరపడిన కాలంలో, ప్రభువర్గానికి వ్యతిరేకంగా అర్థ ఫ్యూడల్ రాచరికాలకూ నిరంకుశ రాచరికాలకూ తోడ్పడుతూ, వాస్తవానికి పెద్దపెద్ద రాచరికాల కన్నిటికీ మూలస్తంభంగా వుండిన బూర్జువావర్గం - ఆ బూర్జువావర్గమే చివర కీనాడు, ఆధునిక పరిశ్రమలూ ప్రపంచ మార్కెట్టూ యేర్పడినప్పటి నుండీ, అధునిక ప్రజా ప్రాతినిధ్యపు రాజ్యంలో రాజకీయ గుత్తాధికారం సాధించుకొంది. ఆధునిక రాజ్యంలో ప్రభుత్వం అనేది మొత్తం బూర్జువా వర్గపు సమష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీ మాత్రమే.

చారిత్రకంగా బూర్జువావర్గం అత్యంత విప్లవకరమైన పాత్ర నిర్వహించింది

బూర్జువా వర్గానిది పై చేయి అయిన చోటల్లా అది సకల ఫ్యూడల్ సంబంధాలనూ, సకల పితృస్వామిక సంబంధాలనూ, సకల నిష్కపట గ్రామీణ సంబంధాలనూ నిర్మూలించింది. మానవుణ్ణి "జన్మతః తనకంటె అధికులైనవాళ్ళ"కు ముడివేసిన కలగాపులగపు ఫ్యూడల్ సంబంధాలను బూర్జువావర్గం నిర్దయగా పటాపంచలు చేసి, మనిషికీ మనిషికీ మధ్య నగ్నమైన స్వలాభం తప్ప, కిరాతకమైన డబ్బు లావాదేవీ తప్ప, యిక యే సంబంధాన్నీ మిగులనివ్వలేదు. మతావేశం వల్లా, రణోత్సాహం వల్లా, మూర్ఖపు మమకారం వల్లా కలిగే అలౌకిక ఆనందాలన్నింటినీ అది స్వలాభమనే కత్తితో ఖండించి వేసింది. అది మనిషి విలువను రూపాయల్లోకి మార్చింది , రాజ శాసనాలు ప్రసాదించిన అసంఖ్యాకమైన సుస్థిర స్వాతంత్ర్యాలను అంతమొందించి, వాటికి బదులు"వ్యాపార స్వాతంత్ర్యం"అనే ఏకైక ముష్కర స్వాతంత్ర్యాన్ని నెలకొల్పింది. ఒక్క మాటలో చెప్పాలంటే, బూర్జువావర్గం మత రాజకీయ భ్రమల ముసుగుచాటున జరిగే దోపిడీని తొలగించి, దాని స్థానంలో నగ్న, లజ్జారహిత, ప్రత్యక్ష, పాశవిక దోపిడీని నిలిపింది.

గతంలో ప్రజల భక్తి గౌరవాలకు పాత్రమైన వృత్తులనన్నిటినీ బూర్జువావర్గం నీచస్థాయికి తీసుకువచ్చింది. వైద్యులనూ, న్యాయవాదులనూ, కవులనూ, శాస్త్రవేత్తలనూ అది తనకింద కూలికి పనిచేసే నౌకర్లుగా మార్చివేసింది.

బూర్జువావర్గం కుటుంబ వ్యవస్థ మీద వున్న మమకారపు మేలి ముసుగును లాగిపారవేసి, కుటుంబ సంబంధాలను కేవలం ఆర్థిక సంబంధాలుగా దిగజార్చింది.

మధ్య యుగాల నాటి పశుప్రాయమైన కార్యోత్సాహం సనాతనవాదుల ప్రశంసలు పొందవచ్చుగానీ, దానివెంట, దానికి సరిగ్గా తగిన అనుబంధంగా, పరమ సోమరితనపు నిష్క్రియాపరత్వం కూడా యే విధంగా వున్నదీ బూర్జువావర్గం వెల్లడి చేసింది. అది మానవుని కార్యశీలత యెంతెంత పనులు సాధించగలిగేదీ మొట్టమొదటిసారిగా వెల్లడించింది ఈజిప్టు పిరమిడ్లనూ,[14] రోమన్ కాలువలనూ,[15] గాథిక్[16] దేవాలయాలనూ తలదన్నే అద్భుత కార్యాలు అది సాధించింది; అదిమ జాతుల సామూహిక వలస ప్రయాణాలనూ,[17] మత దండ యాత్రలనూ[18], మరపించే మహాయాత్రలు అది నిర్వహించింది.

ఉత్పత్తి సాధనాలలో[19] నిరంతరం విప్లవం లేకుండా బూర్జువావర్గం జీవించలేదు; ఆ విప్లవ ఫలితంగా ఉత్పత్తి సంబంధాలలోనూ, తన్మూలంగా యావత్తు సామాజిక సంబంధాలలోనూ నిరంతరం విప్లవం లేకుండా బూర్జువావర్గం జీవించలేదు.ఇందుకు భిన్నంగా, పాత ఉత్పత్తి విధానాలను చెక్కుచెదరకుండా కాపాడుకోవడమే పూర్వ యుగాలలోని సకల పారిశ్రామిక వర్గాలకూ బతకడానికి మొదటి షరతు. ఉత్పత్తిలో నిత్య విప్లవమూ, సాంఘిక పరిస్థితులలో నిరంతర కల్లోలమూ, అనంతమైన అనిశ్చితత్వమూ, ఆందోళనా- ఈ గుణాల వల్ల బూర్జువా యుగం ఇతర యుగాల కంటే విలక్షణంగా వుంది. స్థిరపడి ఘనీభవించిన సంబంధాలు అన్నీ, వాటిని అంటిపెట్టుకొని వుండే పురాతన పూజ్య అభిప్రాయ దురభిప్రాయాలు అన్నీ కొట్టుకుపోయాయి; కొత్తగా ఏర్పడే సంబంధాలు, స్థిరపడకముందేపాతబడి పనికిమాలిన వైపోతున్నాయి. గట్టి దనుకున్నదంతా కరిగి గాలిలో కలిసిపోతున్నది, పవిత్ర మనుకున్నదంతా మైలపడిపోతున్నది. చివరకు మానవుడు భ్రమలు తొలగించుకొని తన నిజమైన జీవన పరిస్థితులనూ, తోటి మానవులతో తనకు గల సంబంధాలనూ ఎదుర్కోకతప్పలేదు.

బూర్జువావర్గం ఉత్పత్తిచేసే సరుకులకు నిత్యం విస్తరించే మార్కెట్ కావాలి గనుక, ఆ అవసరం ఆ వర్గాన్ని ప్రపంచపు నలుమూలలకూ తరుముతుంది.ఆ వర్గం అన్నిచోట్లా గూడు కట్టుకోవాలి, అన్నిచోట్లా స్థిరనివాసం ఏర్పరచుకోవాలి, అన్నిచోట్లా సంబంధాలు నెలకొల్పుకోవాలి.

బూర్జువావర్గం ప్రపంచ మంతటిని తన మార్కెట్‌గా చేసుకోవడం ద్వారా ప్రతి దేశంలోనూ సరుకుల ఉత్పత్తికీ, సరుకుల వినియోగానికీ జాతి మతాతీత స్వభావం కల్పించింది. సనాతన వాదులకు మనఃక్షోభ కలిగేటట్లుగా అది పరిశ్రమల కాళ్ళకింది జాతీయ పునాదిని తొలగించివేసింది. పురాతన కాలంలో స్థాపించిన జాతీయ పరిశ్రమలన్నీ నాశనమైనాయి; ఇంకా ఏమైనా మిగిలివుంటే అవి రోజురోజుకూ నాశనమౌతున్నాయి.వాటి స్థానంలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి, సకల నాగరిక జాతులకూ జీవన్మరణ సమస్యగా మారిన యీ పరిశ్రమలు, దేశీయ ముడిపదార్థాలపై ఆధారపడి ఎంతో కాలం పనిచేయలేక సుదూర ప్రాంతాల ముడి పదార్థాలను వినియోగించుకోసాగాయి. ఈ పరిశ్రమలలో ఉత్పత్తి అయ్యే సరుకులు స్వదేశంలోనే గాక ప్రపంచపు నలుమూలలా వినియోగంలోకి వచ్చాయి. పాతకాలపు అవసరాలు స్వదేశపు ఉత్పత్తులతోనే తీరేవి; వాటి స్థానంలో కొత్త అవసరాలు వచ్చి దేశాంతర ఖండాంతర వస్తువులు అవసరమైనాయి. గతంలో వివిధ ప్రాంతాలూ, వివిధ జాతులూ దేనిపాటికది ఏకాంతంగా, స్వయం సమృద్ధంగా బతికేవి. ఇప్పుడాపరిస్థితి పోయి, నలువైపులా ఇచ్చి పుచ్చుకోవడమూ, సర్వత్రా వివిధజాతులు ఒకదానిపై ఒకటి ఆధారపడడమూ జరుగుతున్నది. భౌతిక వస్తువుల ఉత్పత్తిలో వున్న పరిస్థితే బౌద్ధిక

ఉత్పత్తికి 20 కూడా వర్తిస్తుంది వివిధ దేశాల బౌద్ధిక ఉత్పాదితాలు యావత్ ప్రపంచపు సమష్టి ఆస్తి ఔతున్నాయి. జాతీయ పాక్షికత, సంకుచిత మనస్తత్వమూ అంతకంతకు అసంభవమౌతున్నాయి. వివిధ జాతీయ ప్రాంతీయ సాహిత్యాల నుండి విశ్వసాహిత్యం ఉద్భవిస్తున్నది.

సమస్త ఉత్పత్తి సాధనాల సత్వరాభివృద్ధిద్వారానూ, వార్తా రవాణా సాధనాల అపారమైన అభివృద్ధిద్వారానూ బూర్జువావర్గం సకల జాతులనూ, అత్యంత అటవిక జాతులను సైతం నాగరికతలోకి లాగుతుంది. తాను ఉత్పత్తి చేసే సరుకుల చౌకధరలు అనే భారీ ఫిరంగులతో బూర్జువావర్గం ఎటువంటి కోటగోడలనైనా పడగొట్టుతుంది. విదేశీయుల పట్ల ఎంతటి మహా మొండి ద్వేషం గల ఆటవికులనైనా పాదాక్రాంతం చేసుకుంటుంది. దాని నిర్బంధం వల్ల సకల జాతులూ, మరణమే మార్గాంతరం గనుక, బూర్జువా ఉత్పత్తి విధానాన్ని అనుసరిస్తాయి దాని నిర్బంధం వల్ల, అది దేన్ని నాగరికత అంటుందో దాన్ని సకల జాతులూ స్వీకరిస్తాయి- అనగా తామే బూర్జువా జాతులు ఔతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, బూర్జువావర్గం తన్ను పోలిన ప్రపంచాన్ని సృష్టిస్తుంది.

బూర్జువావర్గం గ్రామసీమలను పట్టణాల పెత్తనం కిందికి తెచ్చింది అది బ్రహ్మాండమైన నగరాలను సృష్టించింది; గ్రామీణ జనాభాతో పోలిస్తే పట్టణ జనాభాను అపారంగా పెంచివేసింది; ఈ విధంగా జనాభాలో గణనీయమైన భాగాన్ని గ్రామ జీవితపు మూఢత్వం నుండి రక్షించింది. అది ఏ విధంగా పల్లెలను పట్టణాలపై ఆధారపడేటట్లు చేసిందో, అదే విధంగా ఆటవిక దేశాలూ, అర్ధ ఆటవిక దేశాలూ నాగరిక దేశాలపై ఆధారపడేటట్లు చేసింది; వ్యవసాయక జాతులు బూర్జువా జాతులపైనా, ప్రాచ్య ఖండం పాశ్చాత్య ఖండంపైనా ఆధారపడేటట్లు చేసింది

ప్రజలూ, ఉత్పత్తి సాధనాలూ, ఆస్తులూ, చెల్లాచెదురుగా వుండే పరిస్థితిని బూర్జువావర్గం దినదినానికి నిర్మూలిస్తూ వుంది. అది జనాభాను సమూహాలుగా చేర్చింది. ఉత్పత్తి సాధనాలను కేంద్రీకరించింది, ఆస్తిని కొద్దిమంది చేతుల్లో సాంద్రీకరించింది. దీని ఫలితంగా, విధిగా రాజకీయ కేంద్రీకరణ యేర్పడింది. సొంత ప్రయోజనాలు, సొంత శాసనాలూ, సొంత ప్రభుత్వాలూ, సొంత పన్నుల వ్యవస్థలూ గలిగి స్వంతంగా వుండిన రాష్ట్రాలు, లేదా పరస్పర సంబంధాలు దుర్బలంగా వుండిన రాష్ట్రాలు ఒకే ప్రభుత్వమూ, ఒకే శాసనావళీ, ఒకే జాతీయ వర్గ ప్రయోజనమూ, ఒకే (రాజకీయ) సరిహద్దూ, ఒకే కస్టమ్స్ వ్యవస్థా గల ఒకే జాతిగా ముద్ద గట్టాయి.

బూర్జువావర్గం, యింకా నూరేండ్లయినా నిండని తన పరిపాలనా కాలంలో, గడచిన తరాల మానవులందరూ కలిసి సృష్టించిన ఉత్పాదక శక్తుల[21] కంటే విస్తారమైన, బ్రహ్మాండమైన ఉత్పాదక శక్తులను సృష్టించింది మానవునికి దాస్యం చేసే ప్రకృతి శక్తులు, యంత్రాలు, పరిశ్రమలకూ వ్యవసాయానికీ ఊడిగం చేసే రసాయన శాస్త్రం, ఆవిరి ఓడలు, రైళ్ళు, టెలిగ్రాఫులు, వ్యవసాయం కోసం అడవులు నరికి మొత్తం

ఖండాలనే సాగులోకి తేవడం, నదీజలాలను కాలువలకు మళ్ళించడం, మంత్ర మహిమచే నేల యీనినట్లు జనాభా వృద్ధికావడం - యింతటి అద్భుతమైన ఉత్పాదక శక్తులు సాంఘిక శ్రమ గర్భంలో నిద్రాణమై వున్నాయని గతంలో యెప్పుడైనా యెవరికైనా లీలామాత్రంగానైనా తెలుసునా?

కాబట్టి మనకు తెలిసేదేమంటే. యే ఉత్పత్తి సాధనాలనూ, మారకపు సాధనాలనూ[22] పునాదిగా వినియోగించుకొని బూర్జువా వర్గం అభివృద్ధి చెందిందో ఆ సాధనాలు ఫ్యూడల్ సమాజంలో ఉద్భవించాయి. ఆ సాధనాలు క్రమంగా అభివృద్ధి చెందుతూ ఒకానొక దశకు చేరుకునేటప్పటికి, ఉత్పత్తికీ మారకానికీ చెందిన ఫ్యూడల్ సమాజపు నియమాలకు - అనగా ఫ్యూడల్ వ్యవసాయ వ్యవస్థకూ, ఫ్యూడల్ కర్మాగార పరిశ్రమల వ్యవస్థకూ - ఒక్క మాటలో చెప్పాలంటే, ఫ్యూడల్ ఆస్తి సంబంధాలకు - అప్పటికే అభివృద్ధి చెందిన ఉత్పాదక శక్తులతో యిక యేమాత్రం పొత్తు కుదరలేదు. ఆ ఆస్తి సంబంధాలు అన్నీ సంకెళ్ళుగా తయారైనాయి. వాటిని బ్రద్దలు కొట్టవలసి వచ్చింది; అవి బ్రద్దల కొట్టబడినాయి

వాటి స్థానంలో నిర్నిబంధ పోటీ [23] ప్రవేశించింది; దానివెంట దాని కనుగుణమైన సామాజిక వ్యవస్థా, రాజకీయ వ్యవస్థా వచ్చాయి; బూర్జువా వర్గ ఆర్థిక రాజకీయ పెత్తనమూ వచ్చింది

అటువంటి పరిణామమే మరొకటి యీనాడు మన కండ్ల యెదుట జరుగుతున్నది. బూర్జువా ఉత్పత్తి సంబంధాలూ, బూర్జువా మారకపు సంబంధాలూ, బూర్జువా ఆస్తి సంబంధాలూ గల యీనాటి బూర్జువా సమాజం - మంత్రశక్తితోవలె బ్రహ్మాండమైన ఉత్పత్తి సాధనాలనూ, మారకపు సాధనాలనూ సృష్టించిన యీ బూర్జువా సమాజం - తన మంత్రిశక్తిచే సృష్టించిన భూతాలను తానే అదుపులో పెట్టుకోలేని మాంత్రికుని దురవస్థలో పడింది ఇప్పటికి అనేక దశాబ్దాలుగా పరిశ్రమ, వాణిజ్యాల చరిత్ర అంతా ఆధునిక ఉత్పత్తి నియమాలమీద - అనగా బూర్జువావర్గమూ, దాని పెత్తనమూ బతకడానికి తప్పనిసరి ఐన బూర్జువా ఆస్తి సంబంధాలమీద - ఆధునిక ఉత్పాదక శక్తులు చేస్తున్న తిరుగుబాట్ల చరిత్రే. ఉదాహరణగా, అప్పుడప్పుడు వచ్చే వాణిజ్య సంక్షోభాలను పేర్కొంటే చాలు: అవి వచ్చినప్పుడల్లా, అంతకంతకు మరింత ప్రమాదకరంగా, మొత్తం బూర్జువా సమాజానికే చావు బతుకుల సమస్యను తెచ్చిపెడుతున్నాయి. ఈ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఉత్పత్తి ఐన సరుకుల్లోనేగాక, గతంలో సృష్టించిన ఉత్పాదక శక్తుల్లో కూడా పెద్ద భాగాన్ని నాశనం చేయటం జరుగుతుంది. గత యుగాల్లో అసంభవంగా కనిపించే ఒక అంటురోగం ఈ సంక్షోభ సయమాల్లో చెలరేగుతుంది - మితిమీరిన ఉత్పత్తి అనే అంటురోగం. హఠాత్తుగా మానవ సమాజం తాత్కాలిక ఆటవిక దశలో ప్రవేశించినట్లుంటుంది; కాటకమో, సర్వ విధ్వంసక ప్రపంచ యుద్ధమో వచ్చి సకల ప్రాణాధార వస్తువుల సరఫరానూ ఖండించినట్లుంటుంది; పరిశ్రమలూ, వాణిజ్యమూ ధ్వంసమైనట్లుంటుంది. కారణం యేమంటే మితిమీరిన నాగరికత, మితిమీరిన ప్రాణాధార వస్తుసంపద, మితిమీరిన

పరిశ్రమలు, మితిమీరిన వాణిజ్యం. సమాజం చేతిలోవున్న ఉత్పాదక శక్తులు యిక యెంతమాత్రమూ బూర్జువా అస్తి వ్యవస్థ అభివృద్ధికి అనుకూలంగా లేవు; అంతేగాక, తమకు శృంఖలాలుగా తయారైన ఆ అస్తి వ్యవస్థకంటె అవి బలీయమైనాయి; అవి ఆ శృంఖలాల నుండి బయటపడినప్పుడల్లా, వెంటనే మొత్తం బూర్జువా సమాజంలోకి అవ్యవస్థ ప్రవేశిస్తుంది, బూర్జువా ఆస్తి వ్యవస్థకే ప్రమాదం ఏర్పడుతుంది. బూర్జువా సమాజపు నియమాలు తాము సృష్టించిన సంపదను యిముడ్చుకోడానికి తామే యిరుకైనాయి. మరి ఈ సంక్షోభాలను బూర్జువా వర్గం యే విధంగా అధిగమిస్తుంది? ఒక వైపున ఉత్పాదక శక్తుల్లో కొంత భాగాన్ని విధిలేక ధ్వంసం చేయడం ద్వారానూ, మరొక వైపున కొత్త మార్కెట్లను జయించడం ద్వారానూ, పాత మార్కెట్లను మరింత కట్టుదిట్టంగా దోచుకోవడం ద్వారానూ, అంటే, మరింత విస్తృతమైన, మరింత విధ్వంసకమైన సంక్షోభాలకు బాట వేయడం ద్వారానూ, సంక్షోభ నివారణావకాశాలను తగ్గించడం ద్వారానూ అన్నమాట[24].

బూర్జువావర్గం యే అయుధాలతో ఫ్యూడలిజంను నేలకూల్చిందో ఆ ఆయుధాలు యిప్పుడు బూర్జువా వర్గం మీదికే ఎత్తబడినాయి.

కానీ బూర్జువావర్గం సృష్టించింది తన్నే నాశనం చేయగల అయుధాలను మాత్రమేకాదు, ఆ ఆయుధాలను ధరించే మనుషులను కూడా అది సృష్టించింది ఆ మనుషులే ఆధునిక కార్మికవర్గం.

బూర్జువావర్గం యే నిష్పత్తిలో అభివృద్ధి ఔతుందో, అంటే పెట్టుబడి యే నిష్పత్తిలో అభివృద్ధి ఔతుందో, ఆ నిష్పత్తిలోనే ఆధునిక కార్మికవర్గం అభివృద్ధి ఔతుంది-ఎన్నాళ్ళు పని దొరుకుతుందో అన్నాళ్ళు మాత్రమే జీవించే కార్మికులవర్గం-యెన్నాళ్ళు తమ శ్రమ పెట్టుబడిని వృద్ధి చేయగలదో అన్నాళ్ళు మాత్రమే పని దొరికే కార్మికుల వర్గం. తమ్మె తాము యే రోజుకారోజు అమ్ముకోవలసిన యీ కార్మికులు యితర వర్తకపు సరుకులన్నిటిలాగే తామూ ఒక సరుకు. అందువలన వాళ్ళు పోటీలోని ఎగుడుదిగుడులన్నిటికీ, ధరల హెచ్చుతగ్గులకన్నింటికీ గురి అవుతారు.

యంత్రాలు విస్తృతంగా ఉపయోగంలోకి రావడంవల్లా, శ్రమ విభజనవల్లా కార్మికుల శ్రమలో వ్యక్తిగత ప్రత్యేకత అనేది పూర్తిగా అంతరించింది. అందువలన కార్మికునికి పనిలో ఏ విధమైన అకర్షణా లేకుండా పోయింది. కార్మికుడు యంత్రానికి తోక అయినాడు. అతనికి వుండవలసిందల్లా పనిలో చాకచక్యం మాత్రమే - అత్యంత సరళమైందీ, గానుగెద్దు పనిలాగ అత్యంత విసుగు పుట్టించేదీ, అత్యంత సులభంగా అలవడేదీ అయిన చాకచక్యం మాత్రమే; కాబట్టి ఒక కార్మికుని ఉత్పత్తి చేయడానికి అయ్యే ఖర్చు దాదాపు ఆ కార్మికుడు పొట్ట పోసుకోవడానికీ, కార్మిక సంతతిని కనడానికి కావలసిన తిండితీర్థాలకు మాత్రమే పరిమితమౌతుంది. కాని ఒక సరుకు ఖరీదు దాని ఉత్పత్తి ఖర్చుకు సమానంగా వుంటుంది; అనగా (కార్మికుని) శ్రమ[25] ఖరీదు దాని ఉత్పత్తి ఖర్చుకు సమానంగా ఉంటుంది. కాబట్టి పని ఎంత అసహ్యంగా వుంటే అంతగా కూలి తగ్గిపోతుంది. అంతేకాదు యంత్రాలవాడకమూ, శ్రమవిభజనా పెరిగేకొద్దీ,

అదే నిష్పత్తిలో కార్మికునిమీద పడే శ్రమభారం కూడా పెరుగుతుంది. - పనిగంటలు పెంచడం, లేక అదేకాలంలో కార్మికునితో యెక్కువపని చేయించుకోవడం, లేక యంత్రాల వేగం యెక్కువ చేయడం మొదలైన పద్ధతులద్వారా కార్మికునిమీద పడే శ్రమ భారం పెరుగుతుంది.

ఆధునిక పరిశ్రమ వచ్చిన తర్వాత, పాతకాలపు పితృస్వామిక యజమానులు నడిపే చిన్న కార్ఖానాలు పోయి, వాటిస్థానంలో పారిశ్రామిక పెట్టుబడిదార్లు నడిపే బ్రహ్మాండమైన ఫ్యాక్టరీలు వచ్చాయి. గుంపులు గుంపులుగా ఫ్యాక్టరీ లోపల చేరిన కార్మిక సమూహాలను సైనిక దళాల మాదిరీ వ్యవస్థీకరిస్తారు. కార్మిక సైన్యంలోని యీ సిపాయిలమీద, అచ్చం సైన్యంలోలాగే, సార్జంట్లూ, కమాండర్లూ మొదలైన అధికార్లు తరతమ శ్రేణిలో వుంటారు. ఈ కార్మికులు కేవలం బూర్జువావర్గానికీ, బూర్జువా రాజ్యానికీ మాత్రమే బానిసలు కాదు; వీళ్ళు ప్రతిరోజు ప్రతిగంట యంత్రానికి బానిసలు, తనిఖీ చేసే మేస్త్రీకి బానిసలు; అన్నిటినీ మించి బూర్జువా యజమానికి బానిసలు. లాభమే తన ఏకైక లక్ష్యమని ఈ నిరంకుశత్వం యెంత బాహాటంగా ప్రకటించుకుంటుందో అంత నీచంగానూ, అంత ద్వేషపాత్రంగానూ, అంత కసి కలిగించేదిగానూ తయారౌతుంది.

ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి అయ్యే కొద్దీ కార్మికుని నైపుణ్యానికీ, శరీరబలానికీ ప్రాముఖ్యం తగ్గిపోతుంది; నైపుణ్యమూ, శరీరబలమూ అనవసరమయ్యే కొద్దీ యజమానులు పురుషులను తొలగించి స్త్రీలను పనిలో పెట్టుకుంటారు. సమాజంలో స్త్రీ పురుష భేదాన్ని బట్టీ, వయోభేదాన్నిబట్టే వుండే ప్రత్యేకతలు కార్మికవర్గానికి యిక యెంతమాత్రమూ అన్వయించవు. అందరూ పనిచేసే పరికరాలే; యే పరికరానికైనా ఖరీదు చెల్లించవలసిందే; వయోభేదాన్ని బట్టి, స్త్రీ పురుష భేదాన్నిబట్టీ ఆ ఖరీదులోతేడా వుంటుంది - అంతే.

పగలంతా ఫ్యాక్టరీ యజమాని దోపిడీకి గురయ్యే కార్మికునికి ఆ సాయంత్రంతోదోపిడీ అంతంకాదు. సాయంత్రం కూలిడబ్బులు చేతిలో పడినవెంటనే అతన్ని యితర బూర్జువా దోపిడీదార్లు-యింటి యజమానీ, అంగడివాడూ, వడ్డీ వ్యాపారస్తుడూ, మొదలైనవాళ్లు-ముట్టడిస్తారు.

మధ్యతరగతిలోని కిందివర్గంవాళ్లు - చిన్న చిన్న వ్యాపారస్తులూ, దుకాణదారులూ,రిటైరైన వర్తకులూ, చేతిపనివాళ్లూ, రైతులూ - వీళ్లందరూ క్రమక్రమంగా కార్మిక వర్గంలోకి దిగజారిపోతారు. దీనికి కొంత కారణం యేమంటే, వీళ్లదగ్గర వున్న స్వల్ప పెట్టుబడి ఆధునిక పరిశ్రమలు నడపడానికి చాలదు; పెద్ద పెట్టుబడిదార్లతో పోటీ పడలేక వీళ్లు దివాలా తీస్తారు. మరికొంత కారణం యేమంటే, కొత్త ఉత్పత్తి పద్ధతులు అమల్లోకి వచ్చినందువల్ల చేతిపనివాళ్ల ప్రత్యేక వృత్తినైపుణ్యం యెందుకూ కొరగాకుండా పోతుంది. ఈ విధంగా అన్ని తరగతుల ప్రజలనుండీ కొత్తవాళ్లు వచ్చి కార్మిక వర్గంలో కలుస్తుంటారు.

కార్మికవర్గ అభివృద్ధిలో వివిధ దశలున్నాయి. బూర్జువా వర్గంతో దాని పోరాటం పుట్టుకతోనే ప్రారంభమౌతుంది. మొదట కార్మికులు విడివిడిగా, యెవనిపాటికివాడు పోరాడుతారు; తరువాత ఒక ఫ్యాక్టరీలోని వాళ్లందరూ కలిసి పోరాడుతారు; ఆ తరువాత ఒకే స్థలంలో ఒకే రకమైన ఫ్యాక్టరీలలో పనిచేసే వాళ్ళందరూ కలసి పోరాడుతారు. ఈ పోరాటాలన్నీ తమను ప్రత్యక్షంగా దోపిడీ చేసే బూర్జువా యజయానులు అనే వ్యక్తులమీద జరుగుతాయి. బూర్జువా ఉత్పత్తి నియమాలమీద గాక, ఉత్పత్తి సాధనాలమీదనే కార్మికులు దాడి చేస్తారు; తమ శ్రమతో పోటీచేసే విదేశీ సరుకులను ధ్వంసం చేస్తారు, యంత్రాలను ముక్కలు ముక్కలు చేస్తారు, ఫ్యాక్టరీలను దగ్ధం చేస్తారు, యెప్పుడో అంతరించి పోయిన మధ్యయుగాల నాటి వృత్తిపనివాని హోదాను పునరుద్ధరించడానికి బలప్రయోగంతో ప్రయత్నంచేస్తారు.

ఈ దశలో కార్మికులు ఒకరికొకరికి సంబంధం లేకుండా దేశమంతటా వెదజల్లినట్లు వుంటారు; తమలో తమకు గల పోటీ మూలంగా యెక్కడికక్కడ చీలి వుంటారు. ఎక్కడైనా వాళ్లు ఐక్యమై కొంతవరకు సంఘటితమైన బృందాలుగా యేర్పడితే, అది వాళ్లలో పుట్టిన ఐకమత్యంవల్ల కలిగిందేమీకాదు, బూర్జువావర్గంలోని ఐకమత్యంవల్ల కలిగిందే; బూర్జువావర్గం తన రాజకీయ స్వప్రయోజనాలు సాధించుకోవడానికి మొత్తం శ్రామిక వర్గాన్ని కదిలించవలసి వుంటుంది; యీ దశలో, కొంతకాలంపాటు, దాని కలా కదిలించే శక్తి వుంటుంది కూడా. అనగా, యీ దశలో కార్మికులు పోరాడేది తమ శత్రువులతో కాదు, తమ శత్రువుల శత్రువులతో - నిరంకుశ రాచరికపు అవశేషాలతోనూ, భూస్వాములతోనూ, పారిశ్రామికులుగాని బూర్జువాలతోనూ, పెటీ బూర్జువాలతోనూ, యీ విధంగా, యీ దశలో మొత్తం చరిత్ర గతి అంతా బూర్జువావర్గం చేతుల్లో కేంద్రీకృతమై వుంటుంది; యీ పోరాటంలో లభించే ప్రతి విజయమూ బూర్జువావర్గానికి విజయంగా వుంటుంది.

కానీ, పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ కార్మికుల సంఖ్య పెరగడమే గాక, కొన్ని స్థలాలలో వాళ్లు విశేషంగా కేంద్రీకృతమౌతారు; వాళ్ల బలం పెరుగుతుంది, ఆ బలం వాళ్లకు మరింతగా అనుభూతమౌతుంది. యంత్రాలు వచ్చి కార్మికుల పనిల్లోని విలక్షణాలన్నిటినీ రూపుమాపే కొద్దీ, దాదాపు ప్రతిచోటా కార్మికుల వేతనాలను ఒకే హీనస్థాయికి దిగలాగే కొద్దీ, కార్మికులలోని భిన్న ప్రయోజనాలూ, భిన్న జీవన పరిస్థితులూ అంతకంతకూ సమాన మౌతాయి. బూర్జువాలలో పోటీలు పెరగడంవల్లా, తత్ఫలితంగా యేర్పడే వాణిజ్య సంక్షోభాలవల్లా కార్మికుల వేతనాలు మరింత యెగుడు దిగుడులకు గురౌతాయి. యంత్రాలలో అంతకంతకూ వేగంగా జరిగే నిరంతరాభివృద్ధి వల్ల వాళ్ల జీవనాధారాలు అంతకంతకూ నమ్మకంలేని వౌతాయి. కార్మికులకూ బూర్జువాలకూ మధ్య వ్యక్తిగతంగా జరిగే ఘర్షణలు రానురాను రెండు వర్గాలమధ్య జరిగే పోరాటాలుగా

పరిణమిస్తాయి. అప్పుడు బూర్జువాలకు వ్యతిరేకంగా కార్మికులు ట్రేడ్ యూనియన్ల సమ్మేళనాలు యేర్పరచుకోవడం ప్రారంభిస్తారు, తమ వేతనాల స్థాయిని నిలబెట్టుకోడానికి అందరూ యేకమౌతారు, అప్పుడప్పుడు జరిగే యీ తిరుగుబాట్లకు ముందుగానే సంసిద్ధంగా వుండడానికి శాశ్వత సంఘాలు యేర్పరచుకుంటారు. ఈ పోరాటాలు అక్కడక్కడా కొట్లాటలుగా పరిణమిస్తాయి.

అప్పుడప్పుడు కార్మికులకు విజయం లభిస్తుంది, కానీ అది తాత్కాలికమే, ఆ యుద్ధాల వల్ల వాళ్లకు కలిగే నిజమైన లాభం తక్షణ ఫలితాలలో లేదు, నిత్యం విస్తరించే కార్మికవర్గ ఐక్యతే నిజమైన లాభం. ఆధునిక పరిశ్రమలు సృష్టించిన వార్తా రవాణా సాధనాలు వివిధ ప్రాంతాలలోని కార్మికులకు పరస్పర సంబంధాలు కల్పించి, యీ కార్మికవర్గ ఐక్యతకు తోడ్పడతాయి. ఏక స్వభావం కలిగిన అసంఖ్యాక స్థానిక పోరాటాల నన్నిటినీ కలిపి రెండు వర్గాలమధ్య జరిగే ఏకైక దేశవ్యాప్త పోరాటంగా రూపొందించడానికి సరిగా యీ పరస్పర సంబంధమే కావలసి వుంది. కానీ, ప్రతి వర్గ పోరాటమూ ఒక రాజకీయ పోరాటమే. ఇక ఆ ఐక్యత- దరిద్రపు రహదారులు గల మధ్య యుగాల్లో పట్టణ పౌరులు (Burghers) సాధించడానికి కొన్ని శతాబ్దాలు పట్టిన ఆ ఐక్యత - ఆధునిక కార్మికులు రైల్వేల మూలంగా కొద్ది సంవత్సరాలలో సాధిస్తారు.

కార్మికులు ఒక వర్గంగా సంఘటిత పడడమూ, తత్పర్యవసానంగా ఒక రాజకీయ పార్టీగా సంఘటితమవడమూ అనేది కార్మికులకు వాళ్లలో వాళ్లకే వున్న పోటీవల్ల నిరంతరం తలక్రిందులౌతూ వుంటుంది. కానీ, అది మళ్లీ పైకి లేస్తుంది; మరింత బలంగా, మరింత స్థిరంగా, మరింత ప్రచండంగా ముందుకు సాగుతుంది. బూర్జువావర్గంలోని చీలికలను ఉపయోగించుకొని అది కార్మికుల ప్రత్యేక ప్రయోజనాలను ప్రభుత్వ శాసనాలను గుర్తించేటట్లు చేస్తుంది ఈ విధంగా ఇంగ్లండులో పది గంటల పని బిల్లు[27] పాసయింది.

మొత్తంమీద పాత సమాజంలోని వర్గాలమధ్య జరిగే సంఘర్షణలు అనేక విధాలుగా కార్మికవర్గ అభివృద్ధికి తోడ్పడతాయి. బూర్జువావర్గం నిరంతర యుద్ధంలో చిక్కుకొని వుంటుంది - మొదట ఫ్యూడల్ ప్రభువర్గంతో యుద్ధం, తరువాత బూర్జువావర్గంలోనే పరిశ్రమల అభివృద్ధి వలన నష్టపడేవాళ్ళతో[28] యుద్ధం, మొదటినుండీ చివరదాకా విదేశ బూర్జువావర్గాలతో యుద్ధం. ఈ యుద్ధాలన్నిటిలోనూ కార్మికవర్గ సహాయం అర్థించకతప్పదని బూర్జువా వర్గం గుర్తిస్తుంది. ఈ విధంగా అది కార్మికవర్గాన్ని రాజకీయ రంగంలోకి లాగుతుంది. తన్మూలంగా బూర్జువావర్గమే తన రాజకీయ విద్యనూ, సాధారణ విద్యనూ కార్మికవర్గానికి నేర్పుతుంది. అనగా, బూర్జువావర్గంతో యుద్ధం చేయడానికి కావలసిన ఆయుధాలను కార్మికవర్గానికి బూర్జువావర్గమే అందిస్తుంది.

అంతేకాదు, యింతకుముందే చెప్పినట్లు పరిశ్రమలు పురోగమించేకొద్దీ, పాలక వర్గంలోని మొత్తం విభాగాలు కార్మికవర్గంలో విధిగా చేరిపోతాయి; లేదా కనీసం, ఆ విభాగాల జీవిత విధానానికి ప్రమాదకర పరిస్థితి ఎదురవుతుంది. ఈ విభాగాలు కూడా కార్మికవర్గానికి నూతన విజ్ఞానాన్ని, నూతన ప్రగతి లక్షణాలనూ సరఫరా చేస్తాయి.

చివరి అంశం యేమంటే : వర్గ పోరాటం అటో యిటో తేలిపోయే గడియ సమీపించినప్పుడు, పాలకవర్గంలో సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ - నిజానికి పాత సమాజం అంతటా సాగుతున్న విచ్ఛిత్తి ప్రక్రియ - యెంత స్పష్టమైన, యెంత ప్రచండమైన రూపం ధరిస్తుందంటే, పాలకవర్గంలోనే కొద్దిమంది తమ వర్గంతో సంబంధాలు తెంచుకొని వచ్చి విప్లవ వర్గంతో కలుస్తారు - భవిష్యత్తును శాసించే విప్లవ వర్గంతో. అనగా, గతంలో యే విధంగా ఫ్యూడల్ ప్రభువర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి వచ్చి బూర్జువా వర్గంతో కలిసిందో, అదే విధంగా యిప్పుడు బూర్జువావర్గానికి చెందిన ఒక భాగం విడిపోయి వచ్చి కార్మికవర్గంతో కలుస్తుంది - ముఖ్యంగా మొత్తం చారిత్రక గతి నంతటినీ సిద్ధాంత రీత్యా అవగాహన చేసుకోగల స్థాయికి చేరుకున్న బూర్జువా సిద్ధాంతవేత్తలలో ఒక భాగం.

ఈనాడు బూర్జువావర్గానికి ముఖాముఖిగా నిలబడిన వర్గాలన్నిటిలోకీ కార్మికవర్గం ఒక్కటే నిజమైన విప్లవ వర్గం. తక్కిన వర్గాలు ఆధునిక పరిశ్రమల ప్రభావంవల్ల క్షీణించి, క్షీణించి చివరకు అదృశ్యమౌతాయి. కార్మికవర్గం ఆధునిక పరిశ్రమల ప్రత్యేక సృష్టి, ఆధునిక పరిశ్రమల అతిముఖ్య సృష్టి.

మధ్యతరగతిలో కిందివర్గంవాళ్లు - చిన్న చిన్న పరిశ్రమల యజమానులూ, దుకాణదారులూ, చేతిపనివాళ్లూ, రైతులూ - వీళ్లందరూ బూర్జువావర్గంతో పోరాడుతారు. కానీ వీళ్ల పోరాటమంతా మధ్యతరగతిలో భాగాలుగా తమ వునికిని కాపాడుకోవటం కోసమే. కనుక వీళ్లు విప్లవకారులు కాదు, యథాస్థితివాదులు అంతేకాదు, ప్రగతి వ్యతిరేకులు కూడా; యెందుకంటే వీళ్లు చరిత్ర గతిని వెనక్కు తిప్పడానికి ప్రయత్నిస్తారు. ఒకవేళ వీళ్లు యెప్పుడైనా విప్లవకరంగా వున్నారంటే, త్వరలోనే తాము కార్మికవర్గంలో కలిసిపోనున్న దృష్ట్యానే అలా వుంటారు; అనగా వీళ్లు తమ ప్రస్తుత ప్రయోజనాలకొరకు కాక, భవిష్యత్ ప్రయోజనాలకొరకు పోరాడుతారు - తమ సొంత దృక్పథం వదలిపెట్టి కార్మికవర్గ దృక్పథం స్వీకరిస్తారు.

"ప్రమాదకర వర్గం"[29] - అనగా సమాజ ప్రవాహంమీది తెట్టె - పాత సమాజ ప్రవాహపు అట్టడుగు పొరలనుండి వెలికివచ్చి ఒడ్డున నిర్జీవంగా కుళ్లిపోతున్న పదార్థం - అక్కడక్కడా కార్మికవర్గ విప్లవంవల్ల మళ్లీ సమాజ ప్రవాహంలోకి కొట్టుకరావచ్చు; కానీ దాని జీవిత విధానాన్ని బట్టి ఆ వర్గం ప్రగతి నిరోధకుల దగ్గర లంచాలు తిని వాళ్ల కుతంత్రాలు నెరవేర్చే కూలిబంటుగా వుండటానికే యెక్కువ అవకాశాలు వున్నాయి

కార్మికవర్గ జీవిత విధానంకింద పాత సమాజపు జీవిత విధానం యిప్పటికె దాదాపు పూర్తిగా అణగారి పోయింది. కార్మికునికి ఆస్తి అనేది లేదు; అతనికి భార్యా బిడ్డలతో గల సంబంధానికీ, బూర్జువా కుటుంబాలలో వుండే సంబంధాలకూ యిక యెక్కడా పోలికలేదు. ఆధునిక పరిశ్రమల శ్రమ విధానం - అనగా పెట్టుబడికి లోబడి వుండే ఆధునిక దాస్యం - యిది ఫ్రాన్సులో ఎంతో ఇంగ్లండులోనూ అంతే, జర్మనీలో యెంతో అమెరికాలోనూ అంతే - కార్మికునికి జాతీయ స్వభావం అనేది మచ్చుకు కూడా లేకుండా తొలగించివేసింది. న్యాయశాస్త్రం, నీతి, మతం అనేవి అన్నీ బూర్జువా గుడ్డి నమ్మకాలనీ, ఒక్కొక్కదాని చాటున ఒక్కొక్క బూర్జువా స్వార్థం పొంచి వుందనీ కార్మికుని భావన.

గతంలో అధికారంలోకి వచ్చిన వర్గాలు అన్నీ సమాజ మంతటిమీదా తమ ఆస్తి సంపాదనా పద్ధతిని రుద్దడం ద్వారా సమాజంలో అప్పటికే తమకున్న స్థానాన్ని భద్రపరచుకోడానికి ప్రయత్నించాయి. కార్మికులు తమ పాత ఆస్తి సంపాదనా పద్ధతిని రద్దు చేస్తే తప్ప, తన్మూలంగా ప్రతి యితర పాత ఆస్తి సంపాదనా పద్ధతినీ రద్దుచేస్తే తప్ప, సమాజపు ఉత్పాదక శక్తులకు యజమానులు కాలేరు. కార్మికులకు భద్రపరచుకోడానికీ పదిలపరచుకోడానికీ యేమీ లేదు; వాళ్ల జీవిత లక్ష్యం సొంత ఆస్తికి గతంలో వున్న సకల భద్రతలనూ, సకల రక్షణలనూ ధ్వంసం చేయడమే.

చరిత్రలో యింతవరకు జరిగిన ఉద్యమాలన్నీ అల్ప సంఖ్యాకుల ఉద్యమాలు, లేదా అల్ప సంఖ్యాకుల ప్రయోజనాలకొరకు జరిగిన ఉద్యమాలు. ఈనాటి కార్మికవర్గ ఉద్యమం అత్యధిక సంఖ్యాకుల ప్రయోజనాలకొరకు అత్యధిక సంఖ్యాకులు బుద్ధిపూర్వకంగా, స్వతంత్రంగా నడిపే ఉద్యమం. సమాజంలో అట్టడుగు పొరఅయిన కార్మికవర్గం కదలాలంటే, లేచి నిలబడాలంటే, తనమీద వున్న అధికార సమాజపు పైపొరలనన్నింటినీ మొత్తంగా ఆకాశంలోకి యెగమీటక తప్పదు.

కార్మిక వర్గం బూర్జువా వర్గంతో చేసే పోరాటం, మొదటిదశలో, స్వభావంలో కాకపోయినా స్వరూపంలో, జాతీయ పోరాటంగా వుంటుంది. ఏ దేశపు కార్మికవర్గమైనా మొదట తన దేశపు బూర్జువావర్గంతోనే వ్యవహారాలు తేల్చుకోవడం అవసరమే.

ఇంతవరకు కార్మికవర్గం అభివృద్ధిలోని సర్వ సాధారణ దశలు చిత్రించాము. ఆ చిత్రణలో, ప్రస్తుత సమాజంలో మొత్తంమీద ప్రచ్ఛన్నంగా రగులుతున్న అంతర్యుద్ధం బహిరంగ విప్లవంగా ప్రజ్వలించే దశవరకూ, బూర్జువావర్గాన్ని బలప్రయోగంతో కూలదోయడం ద్వారా కార్మికవర్గ అధికారానికి పునాదులుపడే దశవరకూ చిత్రించాము.

గత చరిత్రలో, మనం యిప్పటికే గమనించినట్లు, ప్రతిసమాజమూ పీడిత పీడక వర్గాల వైరుధ్యంమీద ఆధారపడింది. కానీ, ఒక వర్గాన్ని పీడించాలంటే, ఆ పీడితవర్గం కనీసం తన బానిస బతుకును యథాస్థితిలో కొనసాగించడానికైనా కొన్ని పరిస్థితులు నమ్మకంగా ఉండాలి. ఫ్యూడల్ యుగంలోని ఫ్యూడల్ దాసులు కమ్యూన్‌లో[30]

సభ్యత్వం పొందే స్థితికి అభివృద్ధి చెందారు; ఫ్యూడల్ నిరంకుశ పెత్తనంకింది పెటీ బూర్జువాలు బూర్జువాలుగా అభివృద్ధి చెందారు. కానీ, ఆధునిక కార్మికుడు పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ పైకిరాకుండా యింకా కిందికి పోతున్నాడు; కార్మిక జీవన విధానానికి కూడా అంటిపెట్టుకోలేక దినదినానికి యింకా అడుక్కు, యింకా లోతుకు పోతున్నాడు. కార్మికుడు బుక్కాపకీరవుతున్నాడు మరి యీ బుక్కాపకీరుతనం జనసంఖ్య కంటే వేగంగా, దేశ సంపద కంటే వేగంగా పెరుగుతున్నది. కాబట్టి ఒక విషయం స్పష్టపడుతున్నది: సమాజంలో పాలకవర్గంగా వుండడానికి బూర్జువావర్గానికిక ఎంతమాత్రమూ యోగ్యతలేదు; తన జీవిత విధానాన్ని, అత్యున్నత శాసనంగా, సమాజంమీద నిర్బంధించడానికి దానికిక ఎంతమాత్రమూ అర్హతలేదు. సమాజాన్ని పాలించడానికి అది అనర్హం : ఎందుకంటే, తన బానిసకు బానిస బతుకునైనా నమ్మకంగా చూపించగల సామర్థ్యం లేదు దానికి; తన బానిస బిచ్చమెత్తుకోవలసిన దుస్థితికి దిగజారిపోతే, బానిస శ్రమమీద తాను బతకడానికి బదులు తన బిచ్చంమీద బానిస బతకవలసిన దుస్థితి సంభవిస్తే, ఏమి చేయడానికీ సామర్థ్యం లేదు దానికి. ఈ బూర్జువావర్గంకింద సమాజమిక ఎంతమాత్రమూ మనలేదు. అనగా, సమాజానికీ బూర్జువావర్గం ఉనికికీ ఇక ఎంతమాత్రం పొత్తు కుదరదు.

బూర్జువావర్గమూ, బూర్జువావర్గ పరిపాలనా వుండాలంటే మొట్టమొదట విధిగా జరగవలసింది పెట్టుబడి యేర్పడడమూ, వృద్ధి కావడమూ. పెట్టుబడి వుండాలంటే విధిగా కావలసింది కూలికి పనిచేసే కార్మికులు. కూలికి పనిచేయడం అనేది కార్మికులలో కార్మికులకు వుండే పోటీమీదనే సంపూర్ణంగా ఆధారపడుతుంది. కానీ, బూర్జువావర్గపు అనుద్దిష్ట కార్యంగా పరిశ్రమల పురోగమనం సాగుతుంది; పరిశ్రమల పురోగమనం మూలంగా కార్మికులలో పరస్పర పోటీవల్ల యేర్పడే అనైక్యత పోయి, పరస్పర సాహచర్య ఫలితమైన విప్లవకర సమ్మేళనం వస్తుంది. అనగా, యే పునాదులమీద బూర్జువావర్గం వస్తుసంపదను ఉత్పత్తి చేసి సొంతపరచుకుంటున్నదో ఆ పునాదులనే ఆధునిక పరిశ్రమాభివృద్ధి కూల్చివేస్తుంది. కాబట్టి బూర్జువావర్గం ఉత్పత్తి చేసే వాటిలోకెల్లా ముఖ్యమైనదేదంటే తనకే మారకులైనవాళ్ళు. బూర్జువావర్గ పతనమూ అనివార్యమే, కార్మికవర్గ విజయమూ అనివార్యమే.

# II

## కార్మికులూ - కమ్యూనిస్టులూ

మొత్తం కార్మికవర్గంతో కమ్యూనిస్టుల సంబంధం యే విధంగా వుంటుంది?

కమ్యూనిస్టులు యితర కార్మికవర్గ పార్టీలకు వ్యతిరేకమైన మరొక ప్రత్యేక పార్టీగా ఏర్పడరు.

కార్మికవర్గ సమష్టి ప్రయోజనాలకు భిన్నంగా, విడిగా కమ్యూనిస్టులకే ప్రయోజనాలూ లేవు.

వాళ్ళు కార్మికవర్గ ఉద్యమాన్ని తమకు నచ్చిన మూసలో పోతపోయడానికి యే సొంత సంకుచిత సూత్రాలనూ రూపొందించరు.

కమ్యూనిస్టులకూ యితర కార్మికవర్గ పార్టీలకూ గల భేదం ఇంత మాత్రమే · 1 వివిధ దేశాల కార్మికులు చేసే జాతీయ పోరాటాలలో, జాతి యేదైనప్పటికీ సమస్త కార్మిక వర్గానికీ గల సమష్టి ప్రయోజనాలను కమ్యూనిస్టులు గుర్తుచేసి, వాటికి ప్రాధాన్యం ఇస్తారు. 2 బూర్జువావర్గంతో కార్మికవర్గం చేసే పోరాటం వివిధ దశలుగా అభివృద్ధి చెందుతుంది, ఆ అన్ని దశల్లోనూ కమ్యూనిస్టులు సర్వే సర్వత్రా మొత్తం ఉద్యమ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు.

కాబట్టి కమ్యూనిస్టులు ఒకవైపున, ఆచరణరీత్యా ప్రతి దేశంలోనూ వున్న కార్మికవర్గ పార్టీలన్నిటిలోకీ అత్యంత పురోగామి, అత్యంత దీక్షాపూరితమైన భాగంగానూ, యితర భాగాలన్నిటినీ ముందుకు తోసే భాగంగానూ వుంటారు; మరొకవైపున, సిద్ధాంత రీత్యా, కార్మికోద్యమం పయనించే మార్గమూ, దాని నియమాలూ, దాని సాధారణ అంతిమఫలితాలూ స్పష్టంగా అర్థం చేసుకుంటారు గనుక, ఆ విషయంలో బహుసంఖ్యాక కార్మిక జనసామాన్యానికి లేని సౌకర్యం కలిగి వుంటారు.

కమ్యూనిస్టుల తక్షణ లక్ష్యం యితర కార్మికవర్గ పార్టీలకున్నదే: కార్మికులు ఒక వర్గంగా రూపొందడం, బూర్జువా ఆధిపత్యాన్ని కూలదోయడం, కార్మికవర్గం రాజకీయాధికారాన్ని గెలుచుకోవడం.

జగత్తునంతటినీ సంస్కరించదలచిన ఏ మహానుభావుడో సృష్టించో, ఆవిష్కరించో యిచ్చిన భావాలమీదనో, సూత్రాలమీదనో ఆధారపడవు కమ్యూనిస్టుల సిద్ధాంత నిర్ణయాలు. ఈ నిర్ణయాలు ప్రస్తుత వర్గపోరాటాలనుండి, సాక్షాత్తుగా మన కండ్లముందు జరుగుతున్న ఒక చారిత్రక పరిణామంనుండి, ఉత్పన్నమౌతున్న వాస్తవ సంబంధాలను స్థూలంగా వ్యక్తపరుస్తాయి అంతే. అమల్లో వున్న ఆస్తి సంబంధాలను రద్దుచేయడమనేది కమ్యూనిజం ప్రత్యేక లక్షణమేమీ కాదు.



సుందరయ్య గ్రంథాలయ సంఘ
A C No. 83332

చారిత్రక పరిస్థితులలో వచ్చిన మార్పుల ఫలితంగా, గతంలో కూడా ఆస్తి సంబంధాలన్నీ నిరంతరం మారుతూనే వచ్చాయి.

ఉదాహరణకు, ఫ్రెంచి విప్లవం ఫ్యూడల్ ఆస్తిని రద్దుచేసి, బూర్జువా ఆస్తిని నిలబెట్టింది.

కమ్యూనిజం ప్రత్యేక లక్షణం ఏ ఆస్తినైనా రద్దుచేయడం కాదు, బూర్జువా ఆస్తిని రద్దుచేయడం. కానీ, వర్గ వైరుధ్యాలమీదా, అధిక సంఖ్యాకులను అల్ప సంఖ్యాకులు చేసే దోపిడీమీదా ఆధారపడి ఉత్పాదితాలను ఉత్పత్తి చేసి సొంతపరచుకొనే వ్యవస్థ యొక్క రూపాలలోకెల్లా ఆధునిక బూర్జువా సొంత ఆస్తి అనేది ఆఖరిదీ, అత్యంత పరిపూర్ణమైనదీ.

ఈ అర్థంలో కమ్యూనిస్టుల సిద్ధాంతాన్ని ఒక్క వాక్యంలో చెప్పవచ్చు : సొంత ఆస్తిని రద్దుచేయడం.

మనుషులు స్వయంకృషిచేత స్వయంగా ఆస్తి సంపాయించుకునే హక్కును రద్దు చేయదలచుకున్నామని కమ్యూనిస్టులమైన మామీద నిందలు వేస్తున్నారు, మనుషుల సకలవిధ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకూ, సకలవిధ కార్యకలాపాలకూ అటువంటి ఆస్తే మూలాధారమని అంటున్నారు.

కష్టపడి సంపాయించిన ఆస్తి అట! స్వయంగా సంపాయించిన ఆస్తి అట! బూర్జువా ఆస్తి అనేది రాకపూర్వమే చిన్నరైతులూ, చిల్లర చేతిపనులవాళ్ళూ సంపాయిస్తూ వున్న ఆస్తిని గురించేనా మీరనేది? అదే ఐతే, దాన్ని రద్దుచేయవలసిన అవసరం లేదు; పరిశ్రమల అభివృద్ధివల్ల అది ఇప్పటికే చాలావరకు నాశనమైంది. తక్కింది రోజూ నాశనమౌతూనే వుంది.

లేక, మీరనేది ఆధునిక బూర్జువా సొంత ఆస్తిని గురించా?

ఐతే, కూలిపనివల్ల కార్మికునికి ఆస్తి యేమైనా కలుగుతున్నదా? లేదు, అణుమాత్రం కూడా లేదు. కూలిపని పెట్టుబడిని సృష్టిస్తుంది. పెట్టుబడి అంటే కూలిపనిని దోపిడీ చేసేటట్టువంటి ఆస్తి. కొత్తగా దోపిడీ చేయడానికి కొత్త కార్మికులను సృష్టిస్తే తప్ప వృద్ధికాలేని ఆస్తి. ఈనాడు అమల్లో వున్న ఆస్తి పెట్టుబడికీ కూలిపనికీ గల వైరుధ్యంమీద ఆధారపడి వుంది. ఈ వైరుధ్యంయొక్క ఇరుపక్షాలనూ పరిశీలించుదాం.

పెట్టుబడిదారుడుగా వుండడమంటే ఉత్పత్తిలో కేవలం వ్యక్తిగత హోదాయేగాక, ఒక సామాజిక హోదా కూడా కలిగి వుండడమన్నమాట. పెట్టుబడి అనేది సమష్టి ఉత్పాదితం. అనేకమంది కలిసి చేసే సమైక్య కృషివల్లనే ఇంకా చెప్పాలంటే, సమాజంలోని సభ్యులందరూ కలిసి చేసే సమైక్య కృషి వల్లనే పెట్టుబడి సచేతనంగా వుంటుంది.

కాబట్టి పెట్టుబడి అనేది వ్యక్తియొక్క శక్తి కాదు, అది ఒక సామాజిక శక్తి.

కాబట్టి పెట్టుబడిని సమష్టి ఆస్తిగా మార్చినప్పుడు, సమాజంలోని సభ్యులందరి ఆస్తిగా మార్చినప్పుడు, అందుమూలంగా వ్యక్తిగత ఆస్తి సామాజిక ఆస్తిగా మారడంలేదు. ఆస్తియొక్క సామాజిక స్వభావంలో మాత్రమే మార్పు వస్తుంది. ఆస్తి తన వర్గ స్వభావం కోల్పోతుంది.

ఇక కూలిపనిని పరిశీలిద్దాం.

కూలిపని సగటు ఖరీదు ఎంతంటే కార్మికునికిచ్చే కనీసవేతనం. అంటే, కార్మికుడు కార్మికుడుగా బతకాలంటే తప్పనిసరిగా కావలసిన తిండి తీర్థాల ఖరీదు. కాబట్టి కూలిపని చేసే కార్మికుడు తన శ్రమద్వారా సంపాయించేది కేవలం శరీరాన్ని నిలుపుకోడానికి, కేవలం శరీరాన్ని నిలుపుకునే సంతానాన్ని కనడానికి బొటాబొటిగా సరిపోతుంది. శ్రమ ఫలితమైన యీ సొంత సంపాదన- కేవలం శరీర నిర్వహణకూ, వంశవృద్ధికే సరిపోయే సొంత సంపాదన - అందులో కొంత మిగిలించుకొని ఆ మిగులు డబ్బును పెట్టుబడిగా మార్చి ఇతరులను కూలివాళ్లుగా ఉపయోగించుకోడానికి యే మాత్రమూ వీలులేని సొంత సంపాదన - దీన్ని రద్దుచేయడం ఎంత మాత్రమూ మా ఉద్దేశంకాదు మేము రద్దు చేయదలచుకున్నదల్లా యీ ఆస్తి సంపాదనా విధానంలోని యే దౌర్భాగ్య స్వభావంవలన కార్మికుడు పెట్టుబడిని వృద్ధి చేయడానికి మాత్రమే బతుకుతాడో, యే దౌర్భాగ్య స్వభావంవలన పాలకవర్గం తనకు లాభకరంగా వున్నంతవరకు మాత్రమే కార్మికుని బతకనిస్తుందో, ఆ దౌర్భాగ్య స్వభావాన్ని మాత్రమే.

బూర్జువా సమాజంలో, ప్రాణంగల శ్రమ[31] కూడబెట్టిన శ్రమను[32] వృద్ధి చేసే సాధనం మాత్రమే. కమ్యూనిస్టు సమాజంలో కూడబెట్టిన శ్రమ శ్రమపడేవాని జీవితాన్ని విస్తృతపరచడానికీ, సంపన్నం చేయడానికీ, ప్రోత్సహించడానికీ సాధనం మాత్రమే.

కాబట్టి, బూర్జువా సమాజంలో గతం వర్తమానాన్ని శాసిస్తుంది. కమ్యూనిస్టు సమాజంలో వర్తమానం గతాన్ని శాసిస్తుంది. బూర్జువా సమాజంలో పెట్టుబడికి స్వాతంత్ర్యమూ, వ్యక్తిత్వమూ వుంటాయి గానీ, ప్రాణంగల మనిషికి స్వాతంత్ర్యమూ వుండదు, వ్యక్తిత్వమూ వుండదు.

ఈ స్థితినే మేము రద్దు చేయాలనేది. దీన్ని రద్దు చేయడమే వ్యక్తిత్వాన్ని రద్దు చేయడమనీ, స్వేచ్ఛను రద్దు చేయడమనీ బూర్జువాలు అంటారు! నిజమే మరి. నిస్సంశయంగా మా లక్ష్యం బూర్జువా వ్యక్తిత్వాన్నీ, బూర్జువా స్వాతంత్ర్యాన్నీ, బూర్జువా స్వేచ్ఛనూ రద్దు చేయడమే.

ప్రస్తుత బూర్జువా ఉత్పత్తి వ్యవస్థలో స్వేచ్ఛ అంటే వ్యాపారానికి స్వేచ్ఛ, క్రయ విక్రయాలకు స్వేచ్ఛ.

కానీ క్రయ విక్రయాలే అంతరించినప్పుడు క్రయ విక్రయాల స్వేచ్ఛ కూడా అంతరిస్తుంది. క్రయ విక్రయాల స్వేచ్ఛను గురించి మాట్లాడే యీ మాటలకూ, యింకా సామాన్య వాచకమైన స్వేచ్ఛను గురించి మన బూర్జువాలు చేసే "గంభీరోపన్యాసా"లకూ యేమైనా అర్థం వుంటే మధ్య యుగాలనాటి వర్తకులమీద వుండిన నిర్బంధాలతోనూ, వాళ్ళ క్రయ విక్రయాలమీద వుండిన పరిమితులతోనూ పోల్చి చూసినప్పుడు మాత్రమే అర్థం వుందనవచ్చు. కానీ, క్రయ విక్రయాలనే రద్దు చేయాలనీ, బూర్జువా ఉత్పత్తి వ్యవస్థనే రద్దు చేయాలనీ, అసలు బూర్జువావర్గాన్నే రద్దు చేయాలనీ చెప్పే కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని వ్యతిరేకించేటప్పుడు ఆ మాటలకు అర్థమే లేదు.

సొంత ఆస్తిని మేము రద్దు చేయాలనడం మీకు ఎంతో వెలపరం పుట్టిస్తున్నది. కాని యిప్పుడున్న మీ సమాజంలో నూటికి తొంభైమందికి సొంత ఆస్తి యిప్పటికే రద్దయిపోయింది; నూటికి తొంభైమందికి లేదు గనుకనే తక్కిన కొద్దిమందికీ వుండగలుగుతున్నది. అనగా, సమాజంలో అత్యధిక సంఖ్యాకులకు యే విధమైన ఆస్తీ లేనప్పుడు మాత్రమే బతకగల ఆస్తి వ్యవస్థను మేము రద్దు చేయదలచుకున్నందుకు మీరు మమ్మల్ని నిందిస్తున్నారన్నమాట.

ఒక్క మాటలో చెప్పాలంటే, మీ ఆస్తిని రద్దు చేయదలచుకున్నామని మమ్మల్ని మీరు నిందిస్తున్నారు. ఔను, సరిగ్గా అదే మేము చేయదలచుకున్నది.

కార్మిక శ్రమను పెట్టుబడిగానూ, డబ్బుగానూ, కౌలుగానూ మార్చడం ఎప్పుడు సాధ్యం కాదో, కార్మిక శ్రమను గుత్తగొనగల సామాజిక శక్తిగా[33] మార్చడం ఎప్పుడు సాధ్యం కాదో, అనగా వ్యక్తిగత ఆస్తిని బూర్జువా ఆస్తిగా, పెట్టుబడిగా మార్చడం ఎప్పుడు సాధ్యం కాదో, అప్పుడు ఆ క్షణంనుండే, వ్యక్తుల వ్యక్తిత్వం అదృశ్యమౌతుందని మీ వాదన.

అనగా, మీ అవగాహనలో "వ్యక్తి" అంటే బూర్జువా వ్యక్తేనన్నమాట, మధ్యతరగతి[34]. ఆస్తిపరుడు తప్ప మరెవ్వరూ కాదన్నమాట ఈ విషయం మీరుఒప్పుకోక తప్పదు. అయితే, ఆ వ్యక్తిని తప్పక యీడ్చి పారవేయవలసిందే, ఆ వ్యక్తి వుండడానికే వీలు లేకుండా చేయవలసిందే.

కమ్యూనిజం యే వ్యక్తికీ సమాజ ఉత్పాదితాలను సొంతపరచుకునే హక్కు లేకుండా చేయదు. అలా సొంతపరచుకోవడంద్వారా యితరులను కూలివాళ్ళుగా మార్చే హక్కును మాత్రమే అది తొలగిస్తుంది.

సొంత ఆస్తి రద్దయితే పని చేయడం అనేదే ఆగిపోతుందనీ, ప్రపంచమంతా సోమరితనం అలముకొంటుందనీ మరొక ఆక్షేపణ వుంది.

ఈ వాదం నిజమే ఐతే, వట్టి సోమరితనంతో బూర్జువా సమాజం యేనాడో భ్రష్టుపట్టి పోయివుండేది; ఈ సమాజంలో పనిచేసేవాళ్ళు యేమీ సంపాదించుకో లేకపోవడమూ, యేమైనా సంపాదించుకునేవాళ్ళు పనిచేయక పోవడమూ మనం చూస్తున్నదే కదా. పెట్టుబడి రద్దయినప్పుడు కూలిపని అనేదికూడా రద్దౌతుంది అనే చర్విత చర్వణాన్నే యింకో రూపంలో వల్లించడం తప్ప యీ ఆక్షేపణలో పస యేమీలేదు[35].

భౌతిక ఉత్పాదితాలను కమ్యూనిస్టు పద్ధతిలో ఉత్పత్తిచేయడంమీదా, సొంతపరచుకోవడంమీదా యే ఆక్షేపణలు చేస్తున్నారో, ఆ ఆక్షేపణలే బౌద్ధిక ఉత్పాదితాలను కమ్యూనిస్టు పద్ధతిలో ఉత్పత్తి చేయడంమీదా, సొంతపరచుకోవడంమీదా కూడా చేస్తున్నారు. బూర్జువా దృష్టికి యే విధంగా వర్గ ఆస్తి అదృశ్యం కావడం అసలు ఉత్పత్తే అదృశ్యం కావడంగా కనిపిస్తుందో, అదేవిధంగా ఆ దృష్టికి వర్గ సంస్కృతి అదృశ్యం కావడం మొత్తం సంస్కృతి అంతా అదృశ్యం కావడంగా కనిపిస్తుంది.

ఏ సంస్కృతి పోతుందని బూర్జువా విలపిస్తున్నాడో ఆ సంస్కృతి సమాజంలో అధికాధిక సంఖ్యాకులకు యంత్రాలలాగా పనిచేసే శిక్షణ మాత్రమే.

స్వేచ్ఛ, సంస్కృతి, న్యాయశాస్త్రం మొదలైన వాటిని గురించి మీకున్న మీ బూర్జువా అభిప్రాయాలనే ప్రమాణాలుగా చేసి, బూర్జువా అస్తిని రద్దుచేయాలనే మా ఉద్దేశాన్ని ఆ ప్రమాణాలతో కొలిచేటట్లయితే, మీరు మాతో కీచులాడకండి. అసలు మీ భావాలే మీ బూర్జువా ఉత్పత్తి వ్యవస్థనుండీ, మీ బూర్జువా అస్తి వ్యవస్థనుండీ ఉద్భవించినవి. అదే విధంగా మీ న్యాయశాస్త్రం కూడా మీ వర్గంయొక్క ఇచ్ఛే. మీ వర్గంయొక్క ఇచ్ఛ సమస్త జనులూ అనుసరించవలసిన చట్టంగా రూపొంది న్యాయశాస్త్రమైంది. ఆ యిచ్ఛయొక్క సారాంశమూ, గమ్యమూ మీ వర్గం బతకడానికి అవసరమైన ఆర్థిక నియమాలచేత నిర్ణయమవుతున్నాయి.

మీ ప్రస్తుత ఉత్పత్తి విధానమూ, మీ ప్రస్తుత ఆస్తి వ్యవస్థా ఉత్పత్తి పురోగతిలో ఒకానొక దశలో ఉద్భవించి అంతరించిపోయే చారిత్రక సంబంధాలు మాత్రమే. వాటినుండి ఉత్పన్నమైన సామాజిక రూపాలను ప్రకృతి సిద్ధమూ తర్కబద్ధమూ ఐన నిత్య సత్యాలుగా మార్చాలనుకోవడం మీ స్వార్థపూరిత దురవగాహన ఫలితమే. ఈ దురవగాహన చరిత్రలో మీరు రాకముందు కూడా ప్రతి పాలకవర్గానికీ వున్నదే. ప్రాచీన ఆస్తి ఇ. విషయంలో మీరు దేన్ని స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతున్నారో, ఫ్యూడల్ ఆస్తి విషయంలో మీరు దేన్ని అంగీకరిస్తున్నారో, దాన్నే మీ సొంత బూర్జువా ఆస్తి విషయంలో మీరు ఒప్పుకోలేకపోవడం సహజమే.

కుటుంబం రద్దు! కమ్యూనిస్టులు చేసే యీ దారుణమైన ప్రతిపాదనమీద అత్యంత అతివాదులు కూడా మండిపడుతున్నారు.

ఈనాటి కుటుంబం-అనగా బూర్జువా కుటుంబం- యే పునాదులమీద నిలబడివుంది? పెట్టుబడిమీద, వ్యక్తిగత లాభంమీద. ఈ కుటుంబ పరిపూర్ణ రూపం బూర్జువాలలో మాత్రమే వుంది. కానీ యీ స్థితికి అనుబంధంగా రెండు అంశాలువున్నాయి. కార్మికుల్లో కుటుంబం అనేది ఆచరణలో లేకపోవడమూ, బహిరంగంగా సాగే సానివృత్తి.

బూర్జువా కుటుంబంయొక్క యీ అనుబంధ అంశాలు అంతరించినప్పుడు బూర్జువా కుటుంబం దానంతట అదే అంతరిస్తుంది; పెట్టుబడి అంతరించినప్పుడు రెండూ అంతరిస్తాయి. తల్లిదండ్రులు తమ పిల్లలమీద సాగించే దోపిడీని మేము అంతం చేయాలనుకున్నామని మీరుమమ్మల్ని నిందిస్తున్నారా? ఈ విషయంలో మేము నేరస్తులమే. కానీ, యింటివద్ద చెప్పే విద్యకు బదులు సామాజిక విద్య ప్రవేశపెట్టడద్వారా మేము అత్యంత పవిత్రమైన సంబంధాలు ధ్వంసం చేస్తున్నామని మీరు అంటారు.

మరి మీ విద్యో? అది కూడా సామాజిక విద్య కాదా? పాఠశాలలు మొదలైన వాటి ద్వారా సమాజం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విద్యలో జోక్యం కలిగించుకోవడం లేదా? తద్వారా దాన్ని సామాజిక పరిస్థితులు నిర్ణయించడం లేదా? విద్యలో సమాజ జోక్యం అనేది కమ్యూనిస్టులు సృష్టించిందికాదు. అయితే కమ్యూనిస్టులు ఆ జోక్యంయొక్క స్వభావాన్ని మార్చాలంటారు, పాలకవర్గ ప్రభావంలో చిక్కుకున్న విద్యను రక్షించాలంటారు.

కుటుంబం గురించీ, విద్యను గురించీ, తల్లిదండ్రులకూ పిల్లలకూ గల పవిత్ర అనుబంధాలను గురించీ మీరు చెప్పేవన్నీ వట్టి బూర్జువా కబుర్లు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ మూలంగా కార్మికుల కుటుంబ సంబంధాలన్నీ తునాతునకలయ్యేకొద్దీ, కార్మికుల బిడ్డలు వట్టి వ్యాపార వస్తువులుగానూ కూలిపనిచేసే సాధనాలుగానూ మారేకొద్దీ, మీ బూర్జువా కబుర్లు మరీ రోత పుట్టిస్తాయి.

కమ్యూనిస్టులు స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారో అని బూర్జువా లందరూ ఒకే గొంతుకతో పొలికేకలు పెడుతున్నారు.

బూర్జువాకు తన భార్య కేవలం ఉత్పత్తి సాధనంగా మాత్రమే కనపడుతుంది. ఉత్పత్తి సాధానాలను సమష్టిగా ఉపయోగించుకుంటారని అతని చెవులబడుతూనే, స్త్రీలకు కూడా అదే గతి సంభవిస్తుందని అతను నిర్ణయించుకుంటాడు. బూర్జువా బుద్ధికి అంతకు మించిన ఆలోచన యెలా వస్తుంది!

స్త్రీలు కేవలం ఉత్పత్తి సాధనాలుగా వుండే యీ దుస్థితిని రద్దుచేయడమే మా అసలు లక్ష్యమని బూర్జువాకు కించిత్తు అనుమానమైనా రాదు.

కమ్యూనిస్టులు బహిరంగంగా శాసనరీత్యా స్త్రీలను సమష్టి ఆస్తిగా చేస్తారని తామే కల్పించి, ఆ కల్పనమీద ధర్మైక పరాయణుల మాదిరి ఆగ్రహోదగ్రులయ్యే యీ బూర్జువాల ప్రవర్తనకంటె అపహాస్యకరమైనది మరొకటివుండదు. కమ్యూనిస్టులు కొత్తగా స్త్రీలను సమష్టి ఆస్తిగా చేయవలసిన అవసరమేమీ లేదు; అది దాదాపు అనాది కాలంనుండి సమాజంలో వుంటూనే వుంది.

మన బూర్జువాలు, బజారు వేశ్యలమాట అటుంచి, తమ చేతికింద కార్మికుల పెండ్లాలూ కూతుర్లూ తమ అభీష్టానువర్తులయ్యేది చాలక, ఒకరి పెండ్లాల నొకరు చెరచడంలో అపారమైన ఆనందం పొందుతున్నారు

బూర్జువా వివాహవ్యవస్థే నిజానికి సమష్టి పెండ్లాల వ్యవస్థ. కాబట్టి కమ్యూనిస్టుల మీద బూర్జువాలు నింద వేయదలచుకుంటే, మహా ఐతే, బూర్జువాలు ప్రచ్ఛన్నంగా సాగించే కపట నాటకాన్ని కమ్యూనిస్టులు బహిరంగంగా చట్టబద్ధంగా చేస్తారని మాత్రమే నింద వేయగలరు. ఇక చెప్పవలసిందేమంటే : ప్రస్తుత ఉత్పత్తి వ్యవస్థ రద్దు కావడం తోనే యిందులోనుండి ఉత్పన్నమైన సమష్టి భార్యా వ్యవస్థ కూడా - అనగా బహిరంగ వేశ్యావృత్తీ, ప్రచ్ఛన్న వేశ్యావృత్తీ-రద్దు ఔతుందనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది.

కమ్యూనిస్టులు దేశాలనూ, జాతులనూ రద్దుచేయగోరుతున్నారని మరొక నింద కూడా వుంది.

కార్మికులకు దేశం అనేది లేదు[37] కాబట్టి వాళ్ళకు లేనిదాన్ని యెవరూ లాక్కోలేరు. కార్మికవర్గం ప్రప్రథమంగా రాజకీయ ఆధిపత్యం సంపాయించుకొని, తన జాతిలో తాను ప్రధాన వర్గంగా అభివృద్ధి చెంది, జాతి అంటే తానే అనే స్థితికి రాకతప్పదు గనుక, ఆ మేరకు కార్మికవర్గమే జాతీయమైనది. - కానీ, ఆ మాటకు బూర్జువాలు చెప్పే అర్థంలో కాదు.

బూర్జువావర్గ అభివృద్ధి మూలంగానూ, స్వేచ్ఛా వాణిజ్యం మూలంగానూ, ప్రపంచ మార్కెట్ మూలంగానూ, ఉత్పత్తి విధానంలోనూ దాన్ని అనుసరించి వుండే జీవిత విధానంలోనూ వచ్చే ఏకత్వం మూలంగానూ, దినదినానికీ వివిధ జాతులమధ్య వుండే జాతీయ విభేదాలూ, జాతీయ వైరుధ్యాలు అంతరించిపోతున్నాయి.

కార్మికవర్గ ఆధిపత్యంలో అవి యింకా వేగంగా అంతరించిపోతాయి. కార్మికవర్గ విమోచనకుగల ఒక ముఖ్య షరతుయేమంటే వివిధ దేశాలు సమైక్యంగా కృషి చేయడం- కనీసం ప్రముఖ నాగరిక దేశాలు సమైక్యంగా కృషి చేయడం.

ఒక వ్యక్తిమీద మరొక వ్యక్తి చేసే దోపిడీ యే మేరకు అంతమౌతుందో ఆ మేరకు ఒక జాతిమీద మరొకజాతి చేసే దోపిడీ కూడా అంతమౌతుంది. ఒక జాతిలోని భిన్న వర్గాల మధ్య వైరుధ్యం యే మేరకు అంతరిస్తుందో ఆ మేరకు జాతికీ జాతికీ మధ్య వుండే శత్రుత్వం కూడా అంతరిస్తుంది.

ఇక మతదృష్ట్యానో, తత్వశాస్త్రదృష్ట్యానో లేక యేదో ఒక సిద్ధాంతదృష్ట్యానో కమ్యూనిజంమీద వేసే ఆరోపణలు అంత శ్రద్ధగా పరిశీలించ దగినవి కావు.

మానవుని భౌతిక జీవిత పరిస్థితులలోనూ, అతని సాంఘిక సంబంధాలలోనూ, అతని సాంఘిక జీవితంలోనూ మార్పు వచ్చినప్పుడల్లా అతని ఊహలూ, అభిప్రాయాలూ, భావాలూ, ఒక్కమాటలో చెప్పాలంటే, అతని చైతన్యం మారుతుందని గ్రహించడానికి అంత పెద్ద అతీంద్రియ జ్ఞానం అవసరం లేదు కదా?

మానవ భావాల చరిత్ర రుజువు చేస్తున్న దేమిటి? భౌతిక వస్తూత్పత్తి యే మేరకు మారుతుందో ఆ మేరకు బౌద్ధిక ఉత్పత్తుల స్వభావంలో కూడా మార్పు వస్తుందని కాకపోతే మరేమిటి? ప్రతి యుగంలోనూ ప్రజలను పాలించే భావాలు ఆనాటి పాలకవర్గ భావాలే.

సమాజంలో విప్లవం తెచ్చే భావాలు అని యెవరైనా అన్నప్పుడు, పాత సమాజంలోపల కొత్త సమాజపు బీజాలు నాటుకొన్నాయనీ, పాత జీవితవిధానం యే మేరకు క్షీణిస్తే అదే మేరకు పాత భావాలు కూడా క్షీణిస్తాయనీ అనే వాస్తవాన్ని మాత్రమే ఆ మాటలు వ్యక్తం చేస్తాయి.

ప్రాచీన ప్రపంచం మరణవేదన పడేటప్పుడు ప్రాచీన మతాలను క్రైస్తవమతం ఓడించింది. 18వ శతాబ్దిలో క్రైస్తవ భావాలు హేతువాద భావాలకు ఓడిపోయినప్పుడు ఫ్యూడల్ సమాజం ఆనాటికి విప్లవకరమైన బూర్జువా వర్గంతో చావు బతుకుల పోరాటం చేసింది. మత స్వాతంత్ర్యమూ, అంతఃకరణ స్వాతంత్ర్యమూ అనే భావాలు యేమి వెల్లడిస్తాయంటే నిర్నిబంధ పోటీ అనే(బూర్జువా) సూత్రం జ్ఞాన రంగంలో కూడా రాజ్యం చేసిందని మాత్రమే వెల్లడిస్తాయి.

"మత విశ్వాసాలూ, నైతికాభిప్రాయాలు, తాత్వికాభిప్రాయాలూ, న్యాయశాస్త్ర భావాలూ చారిత్రక పురోగమనంలో మారిన మాట నిస్సందేహంగా నిజమే. కానీ మతం అనేదీ, నీతి అనేదీ, తత్వశాస్త్రం అనేదీ, రాజకీయశాస్త్రం అనేదీ, న్యాయశాస్త్రం అనేదీ ఆ మార్పులలో యెప్పుడూ నశించిపోకుండాబతికే వున్నాయిగదా," అని మీరు అనవచ్చు.

"అంతేకాక స్వేచ్ఛ, న్యాయం మొదలైన నిత్య సత్యాలు సమాజపు అన్ని దశల్లోనూ వుండేవి వున్నాయి. కానీ కమ్యూనిజం ఆ నిత్య సత్యాలనే రద్దుచేస్తుంది; మతాన్నీ, నీతినీ నూతన పునాదులపైన నిర్మించే బదులు సమస్త మతాన్నీ, సమస్త నీతినీ రద్దు చేస్తుంది. కాబట్టి కమ్యూనిజం గత చరిత్రలోని సమస్త అనుభవానికీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తుంది." అని మీరు అనవచ్చు

ఈ ఆరోపణయొక్క తాత్పర్యం యేమిటి? గత సమాజపు చరిత్ర అంతా వివిధ దశలలో వివిధ రూపాలు ధరించిన వర్గ వైరుధ్యాల అభివృద్ధే.

కానీ, ఆ వైరుధ్యాలు యే రూపం ధరించినప్పటికీ, ఒక విషయం మాత్రం గతించిన యుగాలన్నింటికీ సమానలక్షణంగా వుంది; యేదంటే, సమాజంలో ఒక భాగాన్ని మరొక భాగం దోపిడీ చేయడం. కాబట్టి గత యుగాల సామాజిక చైతన్యం యెంత బహుళత్వమూ, యెంత వైవిధ్యమూ ప్రదర్శించినా, అది కొన్ని సామాన్య రూపాలలోనే (common forms) లేదా కొన్ని సాధారణ భావాల (common ideas) మధ్యనే సంచరిస్తూ వుంటుంది; సమస్త వర్గ వైరుధ్యాలూ సమూలంగా అంతరించినప్పుడు తప్ప యీ రూపాలు, లేక భావాలు సంపూర్ణంగా అంతరించిపోవు. ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

కమ్యూనిస్టు విప్లవం అనేది సంప్రదాయక ఆస్తి సంబంధాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడం. కనుక కమ్యూనిస్టు విప్లవంయొక్క అభివృద్ధి సంప్రదాయక భావాలతో అత్యంత మౌలికంగా తెగతెంపులు చేసుకోవడంలో యిమిడి వుంది. ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

కమ్యూనిజంమీద బూర్జువాలకుగల ఆక్షేపణల గురించి యింతటితో చాలు.

కార్మికవర్గ విప్లవంలో మొదటి మెట్టు కార్మికవర్గం పాలకవర్గం కావడమనీ, ప్రజాస్వామ్యాన్ని గెలుచుకోవడమనీ పైన తెలుసుకున్నాం.

కార్మికవర్గం తన రాజకీయ ఆధిపత్యాన్ని ఉపయోగించి బూర్జువావర్గంనుండి సమస్త పెట్టుబడినీ క్రమక్రమంగా గుంజుకొని, ఉత్పత్తి సాధనాలన్నింటినీ రాజ్యం చేతుల్లో - అనగా పాలకవర్గంగా సంఘటితపడిన కార్మికవర్గం చేతుల్లో - కేంద్రీకరించి, మొత్తం ఉత్పాదకశక్తులను సాధ్యమైనంత వేగంగా వృద్ధి చేస్తుంది.

సహజంగానే ప్రారంభంలో ఆస్తి హక్కులమీదా, బూర్జువా ఉత్పత్తి విధానంమీదా నిరంకుశమైన దాడులు చేస్తే తప్ప యిది సాధ్యం కాదు. నిరంకుశమైనవి గనుక, యీ చర్యలు ఆర్థికంగా అరకొరగానూ, అసమర్థనీయంగానూ కనపడతాయి. కానీ యీ చర్యలు కాలక్రమాన యింకా పెద్దవౌతాయి. పాత సామాజిక వ్యవస్థమీద యింకా దాడులుచేయవలసిన అవసరాన్ని కలిగిస్తాయి, మొత్తం ఉత్పత్తి విధానాన్ని విప్లవాత్మకంగా మార్చడానికి అనివార్యమౌతాయి.

ఈ చర్యలు భిన్న దేశాల్లో భిన్న భిన్నంగా వుండడం సహజమే. ఐనప్పటికీ, అత్యంత పురోగామి దేశాలకు ఈ క్రిందివి సాధారణంగా వర్తిస్తాయి.

1. భూములమీద ఆస్తి హక్కు రద్దుచేసి, భూములమీద వచ్చే కౌలు డబ్బు అంతా సామాజిక కార్యాలకు వినియోగించడం.
2. క్రమప్రవర్ధమానంగా వుండే భారమైన ఆదాయపు పన్ను.
3. వారసత్వపు హక్కు సంపూర్ణంగా రద్దు.
4. దేశాంతరగతుల ఆస్తి, తిరుగుబాటుదార్ల ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం.
5. ప్రభుత్వ పెట్టుబడితో జాతీయ బాంకి ఏర్పరచి, పరపతి అంతా గుత్తాధికారంతో ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.
6. వార్తా రవాణా సాధనాలు ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించడం.
7. ప్రభుత్వ ఫ్యాక్టరీలూ, ఉత్పత్తి సాధనాలూ విస్తరింపజేయడం, బంజరుభూములు సాగుచేయడం, ఒక సమష్టి పథకం ప్రకారం భూములు సారవంతం చేయడం.
8. పనిచేసే బాధ్యత అందరికీ సమానంగా వుండడం, కార్మిక సైన్యాలు ఏర్పరచడం - ముఖ్యంగా వ్యవసాయం కొరకు .
9. వ్యవసాయాన్నీ పరిశ్రమలనూ సమ్మేళనం చేయడం, జనసంఖ్య విషయంలో వివిధ ప్రాంతాల అసమానతలు తగ్గించడం ద్వారా పట్టణాలకూ పల్లెలకూ గల భేదాన్ని క్రమక్రమంగా రద్దుచేయడం.
10. ప్రభుత్వపాఠశాలల్లో పిల్లలందరికీ ఉచిత విద్య. ఇప్పుడు చేస్తున్నట్లు పిల్లలు ప్యాక్టరీలలో పనిచేయడం రద్దు. విద్యను పారిశ్రామిక ఉత్పత్తితో మేళవించడం వగైరా, వగైరా.

సమాజ అభివృద్ధి క్రమంలో వర్గవిభేదాలు అంతరించి, ఒక విస్తారమైన సమాఖ్యగా రూపొందిన మొత్తం జాతి చేతిలో సమస్త ఉత్పత్తి కేంద్రీకృతమైనప్పుడు, ప్రభుత్వ అధికారం రాజకీయ స్వభావాన్ని కోల్పోతుంది. అసలు రాజకీయ అధికారమనేది, సరైన అర్థంలో, ఒక వర్గాన్ని పీడించడానికి మరొక వర్గం ఉపయోగించే సంఘటిత శక్తి మాత్రమే. కార్మికవర్గం, బూర్జువావర్గంతో తాను పోరాటం చేసే కాలంలో పరిస్థితుల ప్రాబల్యం వల్ల తానే ఒక వర్గంగా సంఘటితంకావలసి వస్తే, విప్లవం ద్వారా తానే పాలక వర్గ స్థానాన్ని అధిష్ఠిస్తే, తన్మూలంగా పాత ఉత్పత్తి విధానాన్ని బలవంతంగా వూడ్చి పారవేస్తే, అప్పుడు ఆవిధానంతోపాటు మొత్తం వర్గాలూ వర్గ విభేదాలూ బతకడానికి అవసరమైన పరిస్థితులను కూడా వూడ్చి పారవేసి వుంటుంది. తన్మూలంగా తన వర్గాధిపత్యాన్నే రద్దు చేసుకొని వుంటుంది.

వర్గాలతోనూ, వర్గవైషమ్యాలతోనూ కూడి వున్న పాతబూర్జువా సమాజం స్థానే యావన్మంది స్వేచ్ఛాభివృద్ధికీ, ప్రతి ఒక్కరి స్వేచ్ఛాభివృద్ధికీ అవసరమయ్యే సమాజం ఏర్పడుతుంది.

# III

# సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం

*1. ప్రగతి వ్యతిరేక సోషలిజం*

**అ. ఫ్యూడల్ సోషలిజం**

ఫ్రాన్సు, ఇంగ్లండులలోని ఫ్యూడల్ ప్రభువర్గాలకు, ఆనాడు వాళ్ళకున్న చారిత్రక స్థితిని బట్టి, ఆధునిక బూర్జువా సమాజానికి వ్యతిరేకంగా ప్రచారపత్రాలు రాయడం వృత్తి అయింది. 1830 జులై నాటి ఫ్రెంచి విప్లవంలోనూ,[38] సంస్కరణల కొరకు ఇంగ్లండులో జరిగిన ఉద్యమంలోనూ,[39] మళ్ళీ ఆ ప్రభువర్గాలు హఠాత్తుగా పైకి వచ్చిన ఆ నీచజాతివాళ్ళకు[40] ఓడిపోయారు. ఆ నాటి నుండి నిజమైన రాజకీయ పోరాటమనే ఆలోచనకే తావు లేదు. మిగిలిందల్లా సారస్వత యుద్ధం మాత్రమే. కానీ సారస్వత రంగంలో కూడా పునస్థాపన కాలం[41] నాటి పాత పాలికేకలు అసంభవమైపోయాయి.

ఇతరుల సానుభూతి సంపాయించుకొనే ఉద్దేశంతో ఫ్యూడల్ ప్రభువర్గం తమ సొంత ప్రయోజనాలను విస్మరించినట్లు కనపడుతూ, పీడిత కార్మికవర్గ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే బూర్జువా వర్గంమీద నేరారోపణ చేయవలసి వచ్చింది. ఆ విధంగా ఫ్యూడల్ ప్రభువర్గం తమ కొత్త యజమానిమీద ఎగతాళి పాటలు కట్టీ, మహోపద్రవం రానున్నదని యజమాని చెవిలో అశుభపు జోస్యాలు చెప్పీ, బూర్జువా వర్గం మీద కసి తీర్చుకున్నది.

ఈ విధంగా ఉత్పన్నమైంది ఫ్యూడల్ సోషలిజం. ఇది సగం ఏడుపూ, సగం వెక్కిరింత; సగం గత కాలపు ప్రతిధ్వనీ, సగం భవిష్యత్ కాలపు బెదిరింపూ; నిశితవ్యంగ్య విషపూరిత విమర్శలతో అప్పుడప్పుడు బూర్జువాల గుండెలు చీల్చింది; కానీ, ఆధునిక చరిత్ర గతిని అర్థం చేసుకొనే శక్తి బొత్తిగా లేకపోవడం వల్ల ఎప్పుడూ పరిహాసాస్పదంగానే వున్నది.

ప్రజలను తమ చుట్టూ సమీకరించుకోడానికి ఫ్యూడల్ ప్రభువులు కార్మికవర్గపు బిచ్చపుజోలెను పతాకగా తమ ముందరివైపు ఆడించారు.[42] కానీ, ప్రజలు వాళ్ళతో కలిసినప్పుడల్లా, వాళ్ళ పృష్ఠభాగాలమీద వున్న పాత ఫ్యూడల్ వంశ చిహ్నాలను చూసి వెటకారంగా విరగబడి నవ్వుతూ వాళ్ళను వదలివేసి వెళ్ళేవాళ్ళు.

ఫ్రెంచి లెజిటిమిస్టులలో[43] ఒక భాగమూ, "యంగ్ ఇంగ్లండ్" అనే సంస్థా[44] యీ దృశ్యాన్ని ప్రదర్శించాయి.

ఈ ఫ్యూడల్‌వాదులు తమ దోపిడీ విధానం బూర్జువా దోపిడీ విధానం కంటే భిన్నమైందని గుర్తు చేస్తారు కానీ, తాము దోపిడీ చేసిననాటి పరిస్థితులు చాలా భిన్నంగా వున్నాయనీ, అవి పాతబడి పనికిరాకుండా పోయాయనీ మరచిపోతారు. తాము పాలించే రోజుల్లో ఆధునిక కార్మికవర్గం లేనే లేదని రుజువు చేస్తారు కానీ, తమ సమాజ వ్యవస్థనుండే ఆధునిక బూర్జువావర్గం అనివార్యంగా జన్మించిందని వీళ్ళు మరచిపోతారు.

వీళ్ళు తమ విమర్శలలోని ప్రగతి వ్యతిరేక స్వభావాన్ని ఎంత బొత్తిగా దాచుకోలేరంటే, పాత సమాజ వ్యవస్థనంతటినీ సమూలంగా పెల్లగించివేయడానికే జన్మఎత్తిన ఒక వర్గం బూర్జువా పరిపాలనలో పెంపొందుతున్నదనేదే వీళ్ళు బూర్జువావర్గం మీద చేసే ప్రధాన అభియోగం యొక్క సారాంశం.

వీళ్ళు బూర్జువావర్గాన్ని నిందించేది అది కార్మికవర్గాన్ని సృష్టించినందుకు కాదు, విప్లవ కార్మికవర్గాన్ని సృష్టించినందుకు.

అందుచేత రాజకీయ ఆచరణలో వీళ్ళు కార్మికవర్గానికి వ్యతిరేకమైన దమన శాసనాలనన్నిటినీ బలపరుస్తారు. నిత్య జీవితంలో పైకి ఎంత బడాయిగా మాట్లాడినా, వీళ్ళు పరిశ్రమల చెట్టునుండి రాలిన బంగారు పండ్లను ఏరుకోవడానికి దిగజారుతూనే వుంటారు; ఉన్ని, చక్కెర, సారాయి లాంటి పరిశ్రమలలో లాభాలు పొందడానికి సత్యం, ప్రేమ, ఆత్మగౌరవం అన్నీ అమ్మివేస్తూ వుంటారు.[45]

ఫ్యూడల్ భూస్వామితో మత గురువు ఎల్లప్పుడూ చెట్టపట్టాలు వేసుకొని తిరిగినట్లే, ఫ్యూడల్ సోషలిజంతో క్రైస్తవ సోషలిజం ఎల్లప్పుడూ కలిసే వుంటుంది.

క్రైస్తవ వైరాగ్యానికి సోషలిస్టు రంగు పూయడం చాలా తేలిక. క్రైస్తవ మతం సొంత ఆస్తిని ఖండించలేదా? వివాహాన్ని ఖండించలేదా? రాజ్యాన్ని ఖండించలేదా? వీటికి బదులు దానం, పేదరికం, బ్రహ్మచర్యం, ఇంద్రియ దమనం, సన్యాసం, చర్చిసేవ వగైరాలను బోధించలేదా? ఫ్యూడల్ ప్రభువుల మనస్సులలోని ఈర్ష్యాసూయలను పవిత్రపరచడానికి మతగురువు వాడే మంత్రమే క్రైస్తవ సోషలిజం.

### ఆ. పెటీబూర్జువా సోషలిజం

బూర్జువావర్గం వల్ల నాశనమైంది ఒక్క ఫ్యూడల్ ప్రభువర్గమే కాదు; ఆధునిక బూర్జువా సమాజపు వాతావరణంలో కృశించి నశించింది ఒక్క ఫ్యూడల్ ప్రభువుల జీవిత విధానమే కాదు. మధ్యయుగాల పట్టణ స్వతంత్ర పౌరులూ, సొంతపొలం గల చిన్న రైతులూ ఆధునిక బూర్జువా వర్గానికి పూర్వీకులు. పరిశ్రమలూ, వాణిజ్యమూ యింకా సరిగా అభివృద్ధి కాని దేశాలలో యీ రెండు వర్గాలూ వర్ధమాన బూర్జువావర్గం పక్కనే నిర్జీవంగా బతుకుతూ వుంటాయి.

ఆధునిక నాగరికత పూర్తిగా అభివృద్ధి చెందిన దేశాలలో పెటీ బూర్జువావర్గం అనే ఒక కొత్తవర్గం ఏర్పడింది. ఇది కార్మికవర్గానికీ బూర్జువావర్గానికీ మధ్య అటూ యిటూ ఊగుతూ వుంటుంది. బూర్జువా సమాజపు అనుబంధంగా నిత్యం పునస్సృష్టి అవుతూ వుంటుంది. కానీ యీ వర్గంలో సభ్యులైన వ్యక్తులు, వ్యాపార పోటీ మూలంగా, కార్మికవర్గంలోకి నిత్యం దిగదోయబడుతూ వుంటారు ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి అయ్యేకొద్దీ ఆధునిక సమాజంలో ఒక స్వతంత్ర విభాగంగా తాము అంతరించిపోయే సమయం సమీపిస్తున్నదనీ, కర్మాగారాలలోనూ, వ్యవసాయంలోనూ, వర్తకంలోనూ తమకు బదులు మేస్త్రీలూ, మేనేజర్లూ, గుమాస్తాలూ వస్తారని కూడా గ్రహిస్తారు.

జనాభాలో సగంకంటే ఎక్కువమంది రైతులుగా వున్న ఫ్రాన్సు వంటి దేశాల్లో, బూర్జువావర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పక్షం వహించిన రచయితలు తాము బూర్జువా వ్యవస్థమీద చేసే విమర్శలలో రైతునూ, పెటీ బూర్జువానూ ప్రమాణంగా తీసుకొని, యీ మధ్య వర్గాల దృష్టితో కార్మిక వర్గం తరపున పోరాటానికి పూనుకోవడం సహజమే. ఈ విధంగా ఉద్భవించింది పెటీ బూర్జువా సోషలిజం. ఈ సిద్ధాంతానికి ఫ్రాన్సులోనే కాక ఇంగ్లండులో కూడా సిస్మొండీ నాయకుడు.

ఈ పెటీ బూర్జువా సోషలిజం ఆధునిక ఉత్పత్తి విధానంలోని వైరుధ్యాలను ఎంతో ప్రజ్ఞతో పరిశీలనచేసింది. అర్థశాస్త్రవేత్తల మోసపు సమర్థనలను అది బయట పెట్టింది. యంత్రాలవల్లా, శ్రమ విభజన వల్లా ఘోరమైన దుష్ఫలితాలు కలుగుతాయనీ, పెట్టుబడీ, భూమీ కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమౌతాయనీ, మితిమీరిన ఉత్పత్తి ఆర్థిక సంక్షోభాలూ కలుగుతాయనీ అది తిరుగులేని విధంగా రుజువు చేసింది. పెటీ బూర్జువాలూ, రైతులూ అనివార్యంగా పొందే సర్వనాశనాన్నీ, కార్మికవర్గ దైన్యస్థితినీ, ఉత్పత్తిలో అరాజకత్వాన్నీ, దేశ సంపద పంపకంలోని దారుణమైన అసమానతలనూ, దేశాల మధ్య జరిగే మరణాంతకమైన పారిశ్రామిక యుద్ధాలనూ, పాత నీతి బంధాలకూ పాత కుటుంబ సంబంధాలకూ, పాత జాతులకూ కలిగే విచ్ఛిత్తినీ అది వెల్లడి చేసింది.

కానీ, యీ సోషలిజానికి గల నిర్మాణాత్మక లక్ష్యాలు ఏమిటి? పాత ఉత్పత్తి సాధనాలనూ, పాత మారకపు సాధనాలనూ పునస్థాపించి, వాటితోపాటు పాత ఆస్తి సంబంధాలనూ, పాత సమాజాన్నీ పునస్థాపించడం; లేదా ఆధునిక ఉత్పత్తి సాధనాలచేతా, ఆధునిక మారకపు సాధనాలచేతా బద్దలైన, బద్దలు కాక తప్పని, పాత ఆస్తి సంబంధాల చట్రంలోనే యీ సాధనాలను బలవంతంగా యిరికించడం. ఈ రెండూ కూడా ప్రగతి నిరోధకాలే, ఊహాస్వర్గపు పథకాలే.

ఈ సోషలిజం వల్లించే తుదిపలుకులు ఏమంటే; పరిశ్రమల్లో వృత్తి సంఘాలు, వ్యవసాయంలో పితృస్వామిక సంబంధాలు.

చివరకు, కరకు చారిత్రక వాస్తవాల వల్ల ఆత్మవంచనచే కలిగిన మత్తు వదలినప్పుడు, యీ సోషలిజం బిక్కముఖం వేసుకుని కూర్చుంది.

ఇ. జర్మన్ సోషలిజం, లేక "అసలు" సోషలిజం

ఫ్రాన్సులో బూర్జువావర్గం అధికారంలో వున్నప్పుడు, బూర్జువావర్గ ప్రభుత్వపు భారం వల్ల, బూర్జువా ప్రభుత్వంమీద జరిగే పోరాటాన్ని వ్యక్తీకరిస్తూ, ఫ్రెంచి సోషలిస్టు, కమ్యూనిస్టు సారస్వతం ఉద్భవించింది. కానీ, జర్మనీలో బూర్జువావర్గం ఫ్యూడల్ నిరంకుశత్వంతో అప్పుడప్పుడే పోరాటం ప్రారంభించిన సమయంలో, ఈ సారస్వతం ఫ్రాన్సు నుండి జర్మనీలోకి దిగుమతి అయింది.

జర్మన్ తత్వవేత్తలూ, తత్వవేత్తలు కాదలచినవాళ్ళూ, జర్మన్ ప్రౌఢబుద్ధులూ యీ సారస్వతంమీదికి ఆత్రంగా ఎగబడ్డారు. కానీ యీ రచనలు ఫ్రాన్సునుండి జర్మనీలోకి దిగుమతి అయినప్పుడు వీటివెంట ఫ్రాన్సులోని సామాజిక పరిస్థితులు దిగుమతి కాలేదనే విషయాన్ని వాళ్ళు విస్మరించారు. జర్మన్ సామాజిక పరిస్థితుల సంపర్కంతో యీ సారస్వతం తక్షణ ఆచరణాత్మక ప్రాముఖ్యాన్ని కోల్పోయి, కేవల సారస్వత విషయంగా నిలిచింది. ఈ విధంగా, 18వ శతాబ్దపు జర్మన్ తత్వవేత్తల దృష్టిలో ప్రథమ ఫ్రెంచి విప్లవ డిమాండ్లు ధర్మ దేవత[46] యొక్క సాధారణ డిమాండ్లు మాత్రమే; విప్లవ ఫ్రెంచి బూర్జువా వర్గపు ఇచ్ఛలో వాళ్ళకు దర్శనమిచ్చింది ఇచ్ఛాదేవత[47] యొక్క అకళంకస్వరూపం, ఇచ్ఛాదేవత యొక్క అవశ్య స్వరూపం, సమస్త మానవాళినీ పాలించే ఇచ్ఛాదేవతయొక్క అసలైన స్వరూపం.

జర్మన్ పండితమ్మన్యులు చేసిన కృషి అంతా యేమిటంటే, తమ పురాతన తాత్విక అంతరాత్మకు ఆమోదయోగ్యంగా వుండేటట్లు యీ నూతన ఫ్రెంచి భావాలను రూపుదిద్దడం; లేదా, యింకా సత్య సమ్మతంగా చెప్పాలంటే, తమ సొంత తాత్విక దృష్టికి అనుకూలంగా ఫ్రెంచి భావాలను జీర్ణించుకోవడం.

ఒక విదేశీ భాషను యే విధంగా జీర్ణించుకుంటామో ఆ విధంగానే యీ సంగ్రహణం జరిగింది; అనగా అనువాదం ద్వారా.[48]

క్రైస్తవేతరులైన ఆదిమ జాతుల పురాణాలను లిఖించిన రాత పుస్తకాల మీద క్రైస్తవ సన్యాసులు యే విధంగా క్రైస్తవ భక్తుల వ్యర్థ జీవిత కథలు రాసిందీ అందరికీ తెలుసు[49] జర్మన్ పండితమ్మన్యులు ఐహిక ఫ్రెంచి సోషలిస్టు సారస్వత విషయంలో యిదే పద్ధతిని తలక్రిందులుగా అనుసరించారు. వీళ్ళు తమ తాత్విక చెత్తను ఫ్రెంచి సోషలిజం కిందరాశారు. ఉదాహరణకు, డబ్బుయొక్క ఆర్థిక విధుల గురించిన ఫ్రెంచి విమర్శకింద వాళ్లు "మానవజాతి అన్యధాకరణ[50] అని రాశారు; బూర్జువా రాజ్యం గురించిన ఫ్రెంచి విమర్శ క్రింద "సామాన్య వాచక సింహాసనచ్యుతి"[51] అని రాశారు. ఇంకా అనేకం యీ విధంగా చేశారు.

ఫ్రెంచి చారిత్రక విమర్శల వెనుక యీ తాత్విక పదాలు ప్రవేశపెట్టడాన్ని వాళ్ళు "క్రియాత్మక తత్వశాస్త్రం"అనీ, "అసలు సోషలిజం"అనీ, "జర్మన్ సోషలిస్టు శాస్త్రం" అనీ, "సోషలిజం యొక్క తాత్విక మూలం"అనీ నామకరణం చేశారు.

ఈ విధంగా ఫ్రెంచి సోషలిస్టు కమ్యూనిస్టు సారస్వతం సంపూర్ణంగా నిర్వీర్యమైంది. జర్మన్ల చేతుల్లో అది ఒక వర్గం మీద మరొక వర్గం చేసే పోరాటాన్ని వ్యక్తం చేయడం మానుకుంది గనుక, వాళ్ళు "ఫ్రెంచి పాక్షికత"ను అధిగమించినట్లూ, సత్యంగా కావలసిన అవసరాలను గాక, పరమ సత్యానికి కావలసిన అవసరాలను వెలిబుచ్చినట్లూ భావించారు; వాళ్ళు వెలిబుచ్చిన ప్రయోజనాలు కార్మికవర్గానివి గావు; మానవ ప్రకృతివి - యే వర్గానికీ చెందని, రూప నామ క్రియలు లేని, తాత్విక భ్రమాసంజనిత నభోమండలంలో తప్ప ఎక్కడా వుండని సాధారణ మానవుని ప్రయోజనాలు.

బడిపిల్లల రచనలాంటి తన రచనపట్ల అంత శ్రద్ధాసక్తులు కనబరిచిన యీ జర్మన్ సోషలిజం, తన నాసి సరుకును అంత సిగ్గు విడిచి తెగ పొగుడుకున్న యీ జర్మన్ సోషలిజం, యీలోగా క్రమక్రమంగా తన ఛాందస అమాయకత్వాన్ని కోల్పోయింది[52]

ఫ్యూడల్ ప్రభువర్గంతోనూ, నిరంకుశ రాజరికంతోనూ జర్మన్ బూర్జువావర్గం, ముఖ్యంగా ప్రష్యన్ బూర్జువావర్గం చేసే పోరాటం అనగా ఉదారవాద ఉద్యమం[53], మరింత శ్రద్ధగా పనిచేయసాగింది.

దీనితో ఎన్నాళ్ళనుండో ఎదురుచూస్తూ వున్న అవకాశం లభించింది "అసలు"సోషలిజానికి. వెంటనే అది రాజకీయ ఉద్యమాన్ని తనసోషలిస్టు డిమాండ్లతో ఎదుర్కొంది; ఉదారవాదం మీదా, ప్రజాప్రాతినిధ్యపు ప్రభుత్వం మీదా, బూర్జువా పోటీ మీదా, బూర్జువా పత్రికా స్వాతంత్ర్యంమీదా, బూర్జువా శాసన నిర్మాణంమీదా, బూర్జువా స్వేచ్ఛా సమానత్వాల మీద మామూలు శాపనార్థాలన్నీ కురిపించింది; బూర్జువా ఉద్యమం ద్వారా కలిగే లాభమేమీ లేదనీ, అంతా నష్టమేననీ సామాన్య ప్రజలకు ఉద్బోధించింది. కానీ, ఫ్రెంచి విమర్శకు అసందర్భపు ప్రతిధ్వని అయిన యీ జర్మన్ సోషలిజం సమయానికి ఒకటి మరిచిపోయింది. ఫ్రెంచి విమర్శ పుట్టిన నాటికి ఆధునిక బూర్జువా సమాజం అనేది వుంది, అది వుండడానికి తగిన ఆర్థిక విధానమూ వుంది. రాజకీయంగా తదనుగుణమైన రాజ్యాంగమూ వుంది; సరిగ్గా వీటిని సాధించడమే జర్మనీలో సాగుతున్న ఉద్యమ లక్ష్యం.

ఈ జర్మన్ సోషలిజాన్ని నిరంకుశ ప్రభుత్వాలూ, వాటి పరివారంలోని మతగురువులూ, ప్రొఫెసర్లూ, ఫ్యూడల్ ప్రభువులూ, రాజోద్యోగులూ తమకు ప్రమాదంగా పరిణమిస్తున్న బూర్జువా వర్గాన్ని బెదరగొట్టడానికి తగిన దిష్టిబొమ్మగా అప్యాయతతో ఉపయోగించుకున్నారు.

సరిగ్గా ఆ కాలంలోనే జర్మన్ కార్మికవర్గపు తిరుగుబాటు రోగానికి కొరడా దెబ్బలూ తుపాకీ కాల్పులూ అనే చేదు మాత్రలు ఇచ్చిన ఆ నిరంకుశ ప్రభుత్వాలే జర్మన్ సోషలిజాన్ని దిష్టి బొమ్మగా వాడుకోవడం చేదు మాత్రల తర్వాత నోటికి తీపి అందించినట్లు వుంది.

ఈ విధంగా యీ "అసలు" సోషలిజం ఒకవైపున జర్మన్ బూర్జువావర్గాన్ని దెబ్బతీయడానికి ఫ్యూడల్ ప్రభుత్వాల చేతిలో ఆయుధంగా ఉపయోగపడుతూ, మరొకవైపున ఒక ప్రగతి వ్యతిరేక ప్రయోజనానికి, జర్మన్ అల్పబుద్ధుల [54]. ప్రయోజనానికి, ప్రత్యక్ష ప్రాతినిధ్యం వహించింది. జర్మనీలో నేటి పరిస్థితికి నిజమైన సాంఘిక పునాది యేదంటే 16వ శతాబ్దపు అవశేషమై, ఆనాటినుండి నిరంతరం వివిధ రూపాల్లో తల ఎత్తుతున్న పెటీ బూర్జువావర్గం.

ఈ వర్గాన్ని అలాగే నిలుపుకోవడమంటే జర్మనీలో ప్రస్తుత పరిస్థితినే నిలుపుకోవడమన్నమాట. బూర్జువావర్గపు పారిశ్రామిక రాజకీయ ఆధిపత్యం వస్తే యీ పెటీ బూర్జువావర్గం నిస్సంశయంగా నాశనమౌతుంది - ఇటు పెట్టుబడి కేంద్రీకరణ మూలంగానూ, అటు విప్లవ కార్మికవర్గ జననం ద్వారానూ, "అసలు" సోషలిజం యీ రెండు పిట్టలనూ ఒకే దెబ్బతో చంపేటట్లు కనపడింది. అది మహమ్మారిలాగా వ్యాపించింది.

తాత్విక సాలెగూళ్ళ చీనాంబరాల మీద కావ్య భాషాలంకారాల జరీబుటాలు కుట్టి, వెక్కసపు మమతల తెలిమంచు తుంపరలో ముంచి - యీ దివ్యాంబరాలలో జర్మన్ సోషలిస్టులు ఎముకల గూడులాంటి తమ వికృతాకారపు " నిత్యసత్యా"లను అలంకరించారు.[55] ఈ అలంకరణతో వాళ్ళ సరుకు ఆ ప్రజలలో అద్భుతంగా అమ్ముడుపోయింది.

పెటీ బూర్జువా అల్పబుద్ధుల అర్భాటపు-ప్రతినిధిగా పనిచేయడమే తన వృత్తి అని జర్మన్ సోషలిజం అంతకంతకూ గుర్తించింది.

జర్మన్ జాతే ఆదర్శ జాతి అనీ, అల్పిష్టి జర్మన్ అల్పబుద్ధులే కల్తీలేని మానవులనీ అది ఉద్ఘాటించింది. ఈ ఆదర్శ మానవుల నీచపు క్రూరకర్మల కన్నిటికీ గూఢార్థాలు లాగి, వాటి నిజ స్వభానికి కేవలం విరుద్ధమైన విధంగా ఉదాత్త సోషలిస్టు వ్యాఖ్యానాలు కల్పించింది. అది కమ్యూనిజంలో "అమానుష విధ్వంసక"ధోరణి వున్నదంటూ, దాన్ని సూటిగా వ్యతిరేకించేటంత వరకూ పోయింది; పక్షపాతం సకలవర్గ పోరాటాల మీద సమానమైన ఏహ్యభావం వెలిగ్రక్కేటంత వరకూ పోయింది. ఈనాడు (1847) సోషలిస్టు కమ్యూనిస్టు గ్రంథాలుగా జర్మనీలో ప్రచారంలో వున్న వన్నీ, యే ఒకటో రెండో తప్ప, మనుషులను నిర్వీర్యపరిచే ఈ దుర్గంధభూయిష్టమైన జర్మన్ సారస్వతానికి సంబంధించినవే [56].

## 2. యథాస్థితివాద సోషలిజం, లేక బూర్జువా సోషలిజం

బూర్జువా సమాజాన్ని చిరస్థాయి చేసే ఉద్దేశంతో, సామాజిక ఇబ్బందులు తొలగించాలని బూర్జువావర్గంలో ఒక భాగం కోరుతుంది.

ఈ భాగంలో రకరకాల వాళ్ళు వున్నారు- అర్థశాస్త్రవేత్తలూ, దానశీలురూ, దయాపరులూ, కార్మికవర్గ సంక్షేమ కారులూ, ధర్మసంస్థా నిర్వాహకులు, జంతుహింసా నివారణ సంఘ సభ్యులూ, మితపాన ప్రచార పరవశులూ, ఇంకా అనంత రూపాల కుహనా సంస్కర్తలూ వున్నారు. అంతేగాక, ఈ రకం సోషలిజం కొన్ని సమగ్ర సిద్ధాంతాలుగా కూడా తయారైంది.

ఈ రకానికి ఉదాహరణగా ప్రూడన్ [67] రాసిన 'దారిద్ర్యం యొక్క తత్వశాస్త్రం' ను చెప్పవచ్చు.

సోషలిస్టు బూర్జువాలు ఆధునిక సాంఘిక పరిస్థితులు ఇచ్చే సౌకర్యాలన్నీ కావాలంటారు - కానీ వాటివెంట తప్పనిసరిగా వచ్చే పోరాటాలూ, ప్రమాదాలు మాత్రం లేకుండా. ప్రస్తుత సమాజంలోని విప్లవాంశాలూ, విచ్ఛేదకాంశాలూ లేకుండా ఈ సమాజమే వుండాలని వీళ్ళు కోరుకుంటారు. కార్మికవర్గం లేకుండా బూర్జువావర్గం వుండాలని వీళ్ళ కోరిక. బూర్జువావర్గం తనసర్వాధిపత్యం సాగే సమాజమే అత్యుత్తమమైనదని సహజంగా వూహిస్తుంది.ఈ ఆహ్లాదకరమైన ఊహనే బూర్జువా సోషలిజం వివిధ సిద్ధాంతాలుగా, ఇంచుమించు సమగ్ర రూపంలో తయారు చేస్తుంది. ఇటువంటి ఒక సిద్ధాంతాన్ని కార్మికవర్గం అమలు జరిపి, వెంటనే ఆ స్వర్గ సమాజంలోకి నేరుగా ప్రవేశించాలని కోరే ఈ సోషలిజం వాస్తవంలో కోరేదల్లా యేమిటంటే, కార్మికవర్గం ప్రస్తుత సమాజపు హద్దులలోనే వుండాలనీ, కానీ బూర్జువావర్గం గురించి తనకున్న అసహ్యమైన భావాలన్నీ విసర్జించాలనీ.

ఈ బూర్జువా సోషలిజంలోనే, యింతకంటే ఆచరణ దృష్టి కలది, కానీ యింతక్రమబద్ధం కానిది, మరొక రకం వుంది. ఇది కార్మికులకు కేవలం రాజకీయ సంస్కరణ వల్ల ఒరిగేదేమీ లేదని, భౌతిక జీవిత పరిస్థితులలో మార్పే, అనగా ఆర్థిక పరిస్థితులలో మార్పే, వాళ్ళ కేమైనా లాభకరంగా వుండగలదనీ నిరూపిస్తూ, తద్వారా ప్రతి విప్లవోద్యమాన్నీ పనికి మాలినదిగా కార్మికుల ముందు చిత్రించడానికి పూనుకుంది. కానీ యీ రకం సోషలిజం చెప్పే భౌతిక జీవిత పరిస్థితుల మార్పుకు అర్థం బూర్జువా ఉత్పత్తి సంబంధాల రద్దు కాదు, యే రద్దు విప్లవంద్వారా మాత్రమే సాధ్యమౌతుందో ఆ రద్దు కాదు. దాని అర్థం ఉత్పత్తి సంబంధాలు చెక్కు చెదరకుండా, వీటి మీదనే ఆధారపడిన పరిపాలనా సంస్కరణలు; అనగా పెట్టుబడికీ కూలిపనికీ మధ్యగల సంబంధాలను యేమాత్రమూ తాకని సంస్కరణలు; మహాఐతే, బూర్జువా ప్రభుత్వ పరిపాలనకయ్యే ఖర్చు తగ్గించి, పరిపాలన పనిని సులభతరం చేసే సంస్కరణలు.

"బూర్జువా సోషలిజం" అనే మాటలు కేవలం వ్యంగ్యంగా ఉపయోగించినప్పుడు, అప్పుడు మాత్రమే, ఆ మాటలకు తగిన అర్థం ఏర్పడుతుంది.

వ్యాపార స్వేచ్ఛ ఎందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు! రక్షణ సుంకాలు[3]. ఎందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు! జైళ్ళ సంస్కరణ యెందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు! ఇది బూర్జువా సోషలిజం చెప్పే చివరి మాట; ఇదొక్కటే బూర్జువా సోషలిజం మనస్ఫూర్తిగా చెప్పే మాట కూడా.

బూర్జువా సోషలిజాన్ని ఒక్కమాటలో క్రోడీకరించి చెప్పవచ్చు : బూర్జువా బూర్జువాగా వుండడం యెందుకంటే కార్మికవర్గ శ్రేయస్సు కొరకు.

### 3. విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజమూ, కమ్యూనిజమూ

ప్రతి ఆధునిక మహావిప్లవంలోనూ, బాబెఫ్[4], మొదలైన రచనల్లాగా సర్వదా కార్మికవర్గ డిమాండ్లను వ్యక్తీకరించిన సారస్వతం గురించి కాదు ఇప్పుడు చెప్తున్నది.

ఫ్యూడల్ సమాజాన్ని కూలదోస్తున్నకాలంలో, ఆ సార్వత్రిక ఉద్రిక్త పరిస్థితులలో, కార్మికవర్గం తన సొంత లక్ష్యాలు సాధించుకోడానికి ప్రప్రథమంగా ప్రత్యక్ష ప్రయత్నాలు చేసింది. కానీ, ఆనాటికి కార్మికవర్గం అభివృద్ధి కానందువల్లా, దాని విమోచనకు అవసరమైన ఆర్థిక పరిస్థితులు - యే పరిస్థితులు ఇంకా ఉత్పత్తి కావలసి వుందో, యే పరిస్థితులు ఆసన్న బూర్జువా యుగం వల్ల మాత్రమే ఉత్పత్తి కాగలవో ఆ పరిస్థితులు - ఆనాడు లేనందువల్లా, ఆ ప్రయత్నాలు విఫలం కాక తప్పలేదు. ఈ ప్రథమ ఉద్యమాలలో పుట్టిన విప్లవ సారస్వతానికి ప్రగతి నిరోధక స్వభావం విధిగా వుంది. ఆ సారస్వతం సార్వత్రిక సుఖ విముఖతనూ, అత్యంత మొరటు రూపంలో సాంఘిక సమానతనూ బోధించింది.

సరియైన అర్థంలో సమగ్ర సోషలిస్టు సిద్ధాంతాలూ సమగ్ర కమ్యూనిస్టు సిద్ధాంతాలూ అని అనదగినట్టివి - సెయింట్ సైమన్[5], ఫోరియర్,[6], ఓవెన్[7], మొదలైన వాళ్ళ సిద్ధాంతాలు - కార్మికవర్గానికీ, బూర్జువా వర్గానికి మధ్య జరిగే పోరాటం అభివృద్ధి కాని తొలి దశలో ఉద్భవిస్తాయి. (ఈ దశను గురించిన వర్ణన "బూర్జువాలూ, కార్మికులూ' అన్న మొదటి ప్రకరణంలో వుంది)[8]

ఈ సిద్ధాంతాల స్థాపకులు ఆనాటి సమాజంలోని వర్గ వైరుధ్యాలనూ, విధ్వంసకాంశాల చర్యనూ బాగానే గమనిస్తారు. కానీ, ఇంకా శైశవ దశలో వున్న కార్మికవర్గం యే విధంగానూ చరిత్రను మార్చే శక్తిగానీ, యే విధమైన స్వతంత్ర రాజకీయ ఉద్యమంగానీ లేని వర్గంగా వాళ్ళకు కనబడుతుంది. పరిశ్రమలు అభివృద్ధిఐనమేరకే వర్గవైరుధ్యాలూ అభివృద్ధి చెందుతాయి గనుక, వాళ్ళ కనుల ముందు వున్న ఆర్థిక సన్నివేశంలో కార్మికవర్గ విమోచనకు అవసరమైన భౌతిక పరిస్థితులు అప్పటికీ కనబడవు. కాబట్టి వాళ్ళు ఆ భౌతిక పరిస్థితులను సృష్టించగల నూతన సామాజిక శాస్త్రం కొరకు, నూతన సామాజిక నియమాల కొరకు అన్వేషిస్తారు

వీళ్ళ సొంత సృజనాత్మకమైన చర్య ముందర చారిత్రక చర్యకేమీ విలువ లేదు. వీళ్ళ అభూత కల్పిత పరిస్థితుల ముందర చారిత్రకంగా సృష్టిఅయ్యే విమోచన పరిస్థితుల కేమీ విలువ లేదు, ఈ సృష్టికర్తలు, ప్రత్యేకంగా తయారుచేసిన సామాజిక వ్యవస్థ ముందర క్రమక్రమంగా స్వయం కృతంగా జరిగే కార్మికుల వర్గ సమీకరణ కేమీ విలువ లేదు. వీళ్ళ దృష్టిలో వీళ్ళ సామాజిక పథకాలు ప్రచారం చేసి అమలు పరచడమే భావిచరిత్ర.

తమ పథకాలు తయారుచేయడంలో, అత్యంత బాధాతప్త వర్గమైన కార్మికవర్గపు ప్రయోజనాలపట్ల ప్రధానంగా శ్రద్ధ వహిస్తున్నామని వీళ్ళకు తెలుసు. వీళ్ళదృష్టిలో కార్మికవర్గానికి వున్న విలువ అంతా అది అత్యంత బాధాతప్త వర్గంగా వుండడమే.

వర్గపోరాటం అభివృద్ధి కాని స్థితిలో వుండడంవల్లా, తమ పరిసరాలను బట్టీ, యీ రకం సోషలిస్టులు తాము వర్గవైరుధ్యాలకన్నిటికీ ఎంతో అతీతంగా వున్నట్లు భావించుకుంటారు. సమాజంలో ప్రతివాని పరిస్థితినీ, అత్యంత ఉచ్ఛస్థితిలో వున్నవాని పరిస్థితిని సైతం, మెరుగుపరచాలని వీళ్ళ కోరిక. అందువల్ల వీళ్ళు వర్గవిభేదాలు విస్మరించి, మామూలుగా మొత్తం సమాజానికి విజ్ఞప్తులు చేస్తారు; కాదు - ముఖ్యంగా పాలక వర్గానికి విజ్ఞప్తులు చేస్తారు. తమ సిద్ధాంతం ఒక్కసారి ప్రజలకు అర్థమైతే, ఇక అదే అత్యుత్తమ సమాజానికి అత్యుత్తమ పథకమని వాళ్ళు గుర్తించకుండా వుండగలరా?

అందువల్ల వీళ్ళు సకల రాజకీయ కార్యకలాపాలనూ, మరీ ముఖ్యంగా సకల విప్లవ కార్యకలాపాలనూ నిరాకరిస్తారు; శాంతియుత పద్ధతుల ద్వారా తమ లక్ష్యాలు సాధించుకోవాలని కోరుతారు; విఫలం కాక తప్పని చిన్నచిన్న ప్రయోగాల ద్వారానూ, ఆదర్శప్రాయమైన చర్యలద్వారానూ తమ నూతన సామాజిక సుభాషితావళికి బాట వేయడానికి కృషి చేస్తారు.

కార్మికవర్గం ఇంకా బొత్తిగా అభివృద్ధి కాని దశలో, కార్మికవర్గానికి తన స్థానం గురించి తనకే అభూత కల్పన వంటి అభిప్రాయాలు వుండే దశలో, భవిష్యత్ సమాజం గురించి ఈ అభూత కల్పన వంటి చిత్రాలు చిత్రితమవుతాయి. సమాజమంతా పునర్నిర్మాణం కావాలని ఆ వర్గానికుండే మొదటి సహజాతమైన (Instinctive) వాంఛలకు అనుగుణంగా వుంటాయి ఈ చిత్రాలు.

కానీ ఆ సోషలిస్టు కమ్యూనిస్టు గ్రంథాలలో విమర్శ అనే అంశం కూడా వుంటుంది. ఇవి సమకాలీన సమాజ సూత్రాలన్నిటినీ ఖండిస్తాయి. అందువల్ల వాటిలో కార్మికవర్గానికి విజ్ఞానదాయకమైన అనేక అమూల్య విషయాలు వున్నాయి. వాటిలో ప్రతిపాదించిన చర్యలు - పట్టణాలకూ గ్రామాలకూ మధ్య గల భేదాన్ని రద్దు చేయడం, కుటుంబాన్ని రద్దు చేయడం, వ్యక్తుల లాభాల కొరకు పరిశ్రమలు నడిపే పద్ధతి రద్దు చేయడం, కూలి ఇచ్చే పద్ధతి రద్దు చేయడం, సామాజిక సామరస్యం ప్రకటించడం,

రాజ్యానికి ఉత్పత్తిమీద తనిఖీ చేసే పని మాత్రమే వుండటం - ఈ ప్రతిపాదనలన్నీ వర్గ వైరుధ్యాలు అంతరించి పోవాలని మాత్రమే సూచిస్తాయి. అప్పుడప్పుడు తల యెత్తుతున్న వర్గ వైరుధ్యాలు, తొలినాటి అస్పష్ట అనిర్దిష్ట రూపాలలో మాత్రమే ఆ గ్రంథాలలో గుర్తింపుపొందాయి. అందువల్ల ఆ గ్రంథాలలోని ప్రతిపాదనలు కేవలం ఊహాస్వర్గానికి సంబంధించినవిగా వున్నాయి.

విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజం, కమ్యూనిజం ప్రాముఖ్యానికీ చారిత్రకాభివృద్ధికీ విలోమ సంబంధం వుంటుంది. ఆధునిక వర్గ పోరాటం అభివృద్ధి అయ్యే కొద్దీ, పోరాటానికి దూరంగా వుండడమూ, పోరాటాన్నే ఖండించటమూ, అనే ఈ వైపరీత్యాలు అచరణరీత్యా విలువను కోల్పోతాయి, సిద్ధాంతరీత్యా అసమర్థనీయమూ ఔతాయి. అందువల్ల ఈ సిద్ధాంతాల మూల పురుషులు అనేక విషయాల్లో విప్లవకారులుగా వున్నప్పటికీ, వాళ్ళ శిష్యులు ప్రతిచోటా ప్రగతి నిరోధక మురాలుగా మాత్రమే వున్నారు. కార్మికవర్గం క్రమక్రమంగా చారిత్రకాభివృద్ధి చెందుతున్నప్పటికీ, అందుకు భిన్నంగా వీళ్ళు తమ గురువుల మూలాభిప్రాయాలనుగట్టిగా పట్టుకుంటారు. అందువల్ల వీళ్ళు వర్గపోరాటాన్ని నిర్వీర్యం చేయడానికీ, వర్గ వైరుధ్యాలకు రాజీ కుదిరించడానికి కృషి చేస్తారు- ఆ చేయడంలో యే మినహాయింపులు వుండవు కూడా. ప్రయోగాల ద్వారా తమ ఊహాస్వర్గ సమాజాన్ని సాధించాలని - ఏకాకి "ఫలాన్‌స్టీర్లు" స్థాపించాలనీ, "హోమ్ కాలనీలు" ప్రతిష్టించాలనీ, "చిట్టి ఇకేరియా" నెలకొల్పాలనీ - అన్ని బుల్లిబుల్లి స్వర్గాలు- వీళ్ళు ఇంకా కలలు కంటూనే వుంటారు". ఈ గాలి మేడలను నిజం చేయడానికి వీళ్ళు బూర్జువాల జాలి గుండెలకూ, బూర్జువాల డబ్బు సంచులకూ విన్నపాలు చేయక తప్పదు. క్రమక్రమంగా వీళ్ళు పైన వివరించిన ప్రగతి నిరోధక యధాస్థితి వాద సోషలిస్టుల స్థాయికి దిగజారిపోతారు; యధాస్థితివాద సోషలిస్టులకూ వీళ్ళకూ గల భేదమల్లా యేమిటంటే, వీళ్ళకు ఇంకా ఎక్కువ క్రమబద్ధమైన ఛాందస పాండిత్యం వుంటుంది, తమ సామాజిక శాస్త్రం అద్భుత ఫలితాలనిస్తుందని వీళ్ళకు మొండి మూఢ విశ్వాసం వుంటుంది.

అందువల్ల వీళ్ళు కార్మికవర్గం యొక్క రాజకీయ కార్యకలాపాలనన్నిటినీ తీవ్రంగా వ్యతిరేకిస్తారు; ఈ కార్యకలాపాలన్నీ తమ నూతన సుభాషితావళి మీద గల గుడ్డి అపనమ్మకం మూలంగానే కలుగుతున్నాయని అనుకుంటారు.

ఇంగ్లండులో ఓవెన్ అనుచరులు చార్టిస్టులను". వ్యతిరేకిస్తారు. ఫ్రాన్స్‌లో ఫోరియర్ అనుచరులు రెఫార్మిస్టులను". వ్యతిరేకిస్తారు.

# IV

## ఈనాటి వివిధ ప్రతిపక్ష పార్టీలపట్ల కమ్యూనిస్టుల వైఖరి

ఇంగ్లండులో చార్టిస్టులూ, అమెరికాలో భూసంస్కరణవాదులూ మొదలైన నేటి కార్మికవర్గ పార్టీలతో కమ్యూనిస్టులకు గల సంబంధాన్ని రెండవ ప్రకరణంలో స్పష్టంచేయటం జరిగింది.

కమ్యూనిస్టులు కార్మికవర్గం యొక్క తక్షణ లక్ష్యాలు సాధించడానికీ, తాత్కాలిక ప్రయోజనాలు అమలు పరచడానికీ పోరాటం చేస్తారు. కానీ వాళ్లు వర్తమాన ఉద్యమంలో ఉద్యమ భవిష్యత్తుకు కూడా ప్రాతినిధ్యం వహిస్తూ, ఆ భవిష్యత్తుపట్ల కూడా శ్రద్ధ వహిస్తారు. ఫ్రాన్సులో కమ్యూనిస్టులు యథాస్థితివాద బూర్జువాలకూ, అతివాద బూర్జువాలకూ వ్యతిరేకంగా సోషల్ డెమోక్రట్లతో [67] పొత్తు కలుస్తారు, కానీ, ఫ్రెంచి మహా విప్లవ కాలంనుండి సంప్రదాయికంగా వస్తున్న మాటలనూ, భ్రమలనూ విమర్శించే హక్కు మాత్రం ఉంచుకుంటారు.

స్విట్జర్లండులో కమ్యూనిస్టులు రాడికల్ పార్టీని బలపరుస్తారు, కానీ, ఆ పార్టీలో పరస్పర విరుద్ధమైన అంశాలు వున్నాయని - అతివాద బూర్జువాలు కొందరూ, ఫ్రాన్సులో వున్నట్టి డెమోక్రటిక్ సోషలిస్టులు కొందరూ వున్నారని - విస్మరించరు.

పోలండులో జాతీయ విమోచనకు వ్యవసాయ విప్లవం అవశ్య కర్తవ్యమని పట్టు బట్టే పార్టీని, 1846నాటి క్రాకోవ్ తిరుగుబాటును యే పార్టీ లేవదీసిందో ఆ పార్టీని, కమ్యూనిస్టులు బలపరుస్తారు[68]

జర్మనీలో బూర్జువావర్గం విప్లవకరంగా ప్రవర్తించినప్పుడల్లా, కమ్యూనిస్టులు ఆ బూర్జువావర్గంతో కలిసి నిరంకుశ రాజరికానికీ, ఫ్యూడల్ ప్రభువర్గానికీ, పెటీబూర్జువా వర్గానికీ వ్యతిరేకంగా పోరాటం చేస్తారు.

కానీ, బూర్జువావర్గానికి కార్మికవర్గానికీ గల శత్రుత్వాన్ని కార్మికులు సుస్పష్టంగా గుర్తించేటట్లు చేయడానికి కమ్యూనిస్టులు ఒక క్షణం కూడా విరామం లేకుండా కృషిచేస్తారు. ఈ కృషి యెందుకంటే, బూర్జువావర్గం తాను అధికారంలోకి వచ్చినప్పుడు ఆ అధికారం వెంట విధిగా ప్రవేశపెట్టే సాంఘిక రాజకీయ పరిస్థితులను జర్మన్ కార్మికులు వెనువెంటనే బూర్జువావర్గం మీద ఆయుధాలుగా ఉపయోగించేందుకూ,

జర్మనీలో ప్రగతి నిరోధక వర్గాలు పతనమైన తర్వాత ఆ క్షణంనుండి బూర్జువావర్గంతోనే పోరాటం ప్రారంభమయ్యేటందుకూ.

కమ్యూనిస్టులు ప్రధానంగా జర్మనీమీదికి దృష్టి మళ్లిస్తారు. ఎందుకంటే, ఆ దేశం బూర్జువా విప్లవ ప్రాంగణంలో వుంది గనుకనూ, 17వ శతాబ్దపు ఇంగ్లండులో కంటె, 18వ శతాబ్దపు ఫ్రాన్సులో కంటె బాగా అభివృద్ధి చెందిన కార్మికవర్గంతోనూ, గతంలో కంటె బాగా అభివృద్ధి చెందిన యూరోపియన్ నాగరికతా వాతావరణంలోనూ ఆ జర్మన్ బూర్జువా విప్లవం జరిగి తీరుతుంది గనుకనూ, ఆ బూర్జువా విప్లవం ఆ వెనువెంటనే వచ్చే కార్మికవర్గ విప్లవానికి ఉపోద్ఘాతంగా మాత్రమే వుంటుంది గనుకనూ.

ఒక్క మాటలో చెప్పాలంటే, కమ్యూనిస్టులు ప్రతిచోటా ఆనాటి సాంఘిక రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే ప్రతి విప్లవోద్యమాన్నీ బలపరుస్తారు.

ఈ సకల ఉద్యమాలలోనూ వాళ్లు ఆస్తి సమస్యను ప్రధాన సమస్యగా ముందుకు తెస్తారు - ఆ నాటికి ఆస్తి వ్యవస్థ యే మేరకు అభివృద్ధి చెంది వుండినా సరే.

చివరి విషయం · సకల దేశాల ప్రజాతంత్ర పార్టీల మధ్యా ఐకమత్యమూ, అభిప్రాయసామ్యమూ నెలకొల్పడానికి కమ్యూనిస్టులు కృషిచేస్తారు.

కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడమంటే అసహ్యం. సమస్త వర్తమాన సాంఘిక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్లు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవ మంటే పాలక వర్గాలు గజగజ వణకనీ. కార్మికులు పోగొట్టుకొనే దేమీ లేదు, తమ సంకెళ్ళు తప్ప, వారికి గెలవవలసిన ప్రపంచం వుంది. సకల దేశ కార్మికులారా, ఏకంకండి!

# వివరణలు

ఎంగెల్సు యిచ్చిన వివరణలు కాక తక్కిన వివరణలు అనువాదకునివి.

1. కమ్యూనిస్టు లీగు -కార్మికవర్గం యొక్క మొదటి అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ. దీని స్థాపనకు ముందు మార్క్సు, ఎంగెల్సులు వివిధ దేశాల సోషలిస్టులనూ, అగ్రగామి కార్మికులనూ సిద్ధాంత రీత్యానూ, సంస్థాగతంగానూ కూడగట్టడానికి గణనీయమైన సన్నాహక కృషి చేశారు. ఈ లక్ష్యంతో వాళ్లు 1846 తొలి భాగంలో బ్రసెల్స్‌లో కమ్యూనిస్టు కరస్పాండెన్స్ కమిటీని నిర్మించారు ఆ కాలంలో జర్మనీ, ఫ్రాన్సు, స్విట్జర్లండు, బ్రిటన్‌లలో "న్యాయాత్ముల సంఘం" అనేది వుంది-కార్మికులకూ, చేతిపనివాళ్లకూ చెందిన రహస్య సంఘం ఆ సంఘంయొక్క లండన్ నాయకత్వం మార్క్సు, ఎంగెల్సుల భావాలమీద విశ్వాసం కలిగి, వాళ్లను తమ సంఘంలో చేరడానికీ, దానిని పునర్వ్యవస్థీకరించడానికీ, తమ సూత్రాలకు అనుగుణంగా ఒక కార్యక్రమాన్ని తయారు చేయడానికి ఆహ్వానించింది. మార్క్సు, ఎంగెల్సులు అంగీకరించారు

   1847 జూన్ తొలి భాగంలో లండన్‌లో జరిగిన "న్యాయాత్ముల సంఘం" మహాసభలో ఎంగెల్సు పాల్గొన్నాడు. సంఘం పేరును "కమ్యూనిస్టు లీగు"గా మార్చారు. "సకల దేశ కార్మికులారా, యేకం కండి!" అనే సమరశీల అంతర్జాతీయతా నినాదం ఆమోదాన్ని పొందింది. ఆ మహాసభ కమ్యూనిస్టు లీగు ప్రధమ మహాసభగా చరిత్ర కెక్కింది. దాని రెండవ మహాసభ లండన్‌లో 1847 నవంబర్ 29 నుండి డిసెంబర్ 8 దాకా జరిగింది. మార్క్సు, ఎంగెల్సులు పాల్గొన్న ఆ మహాసభ, దీర్ఘ చర్చల అనంతరం, శాస్త్రీయ కమ్యూనిజం సూత్రాలను యేకగ్రీవంగా ఆమోదించింది. దాని అభ్యర్థనమీద మార్క్సు, ఎంగెల్సులు రాసినదే యీ "కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక".

   కొలోన్ కమ్యూనిస్టు కేసు తర్వాత, 1852 నవంబర్ 17న కమ్యూనిస్టు లీగు రద్దయింది.

2. పోపు (Pope)- క్రైస్తవ మతంలో ఒక తెగ ఐన కాథలిక్ మతాన్ని అనుసరించే వాళ్లందరికీ గురువు. రోమ్‌లో వుంటాడు ప్రపంచంలోని కాథలిక్ చర్చిలన్నీ అతని అధికారానికి లోబడినవే. కాథలిక్ చర్చిలకు సంబంధించిన పరిపాలన, క్రమశిక్షణ, పూజా విధానం, మతబోధ వగైరాలన్నీ నిర్ణయించేది అతనే. మతసంబంధమైన సిద్ధాంతాలనూ, సూత్రాలనూ వ్యాఖ్యానించే అధికారం అతనికి మాత్రమే వుంది. అతని వ్యాఖ్యానానికి కాథలిక్ ప్రపంచంలో తిరుగులేదు. వివాహమూ, విడాకులూ, కుటుంబ నియంత్రణా మొదలైన విషయాల్లో కూడా

ఈనాటికీ కాథలిక్కులకు పోపు చెప్పిందే వేదం- చరిత్రలో యే పోపూ యే ప్రగతి ఉద్యమాన్ని మంచిదనలేదు. ఫ్యూడలిజం వున్నన్నాళ్లూ ఫ్యూడలిజంనూ, అటు తర్వాత పెట్టుబడిదారీ విధానాన్నీ సమర్థించడమే పోపు చరిత్ర.

3. జారు (Czar)- రష్యా చక్రవర్తిని జారు అంటారు.

4. మెటర్నిక్ (Metternich, Clemens Wenzel) (1773-1859) - ఆస్ట్రియన్ రాజనీతిజ్ఞుడూ, దౌత్యనిపుణుడూ. చిన్నప్పుడు ఫ్రెంచి విప్లవానుభవంతో రాజకీయ మార్పు అంటేనే ద్వేషం పెంచుకున్నాడు. యూరప్‌లో విప్లవోద్యమాల నన్నిటినీ అణచి 'స్థిరత్వం' స్థాపించడానికి యూరోపియన్ ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచెయ్యాలనేది అతని రాజకీయ విధానంలోని ముఖ్య సూత్రం. సుమారు 30 యేండ్లు అస్ట్రియా సామ్రాజ్యానికి ప్రధానమంత్రి (ఛాన్సలర్)గా వుండి, 1848 మార్చి విప్లవంలో రాజీనామా యిచ్చి ప్రాణ భీతితో పారిపోయాడు.

5. గీజో (Guizot, Francois Pierre) (1787-1874) - ఫ్రెంచి చరిత్రకారుడూ, రాజనీతిజ్ఞుడూ. అనేక సంవత్సరాలు మంత్రిగా వుండి, 'కమ్యూనిస్టు ప్రణాళిక' రచనా కాలంనాడు (1847) ఫ్రెంచి ప్రధాన మంత్రిగా వున్నాడు. 1848 ఫిబ్రవరి విప్లవంలో అతనూ దిగిపోయాడు, అతని రాజూ ఇంగ్లండుకు పారిపోయాడు తన రచనలలో చరిత్రను వర్గ పోరాటం దృష్ట్యా పరిశీలించడానికి మొదటి ప్రయత్నాలు చేశాడు కానీ ఆ పరిశీలన బూర్జువావర్గ దృక్కోణం నుండి చేశాడు.

6. రాడికల్ పార్టీవాళ్ళు-రాడికల్ (radical) అంటే మౌలికమైన అని అర్థం. కాబట్టి మౌలికమైన మార్పులూ, తీవ్రమైన మార్పులూ కావాలనే వాళ్ళను రాడికల్స్ అంటారు. కానీ ఫ్రెంచి రాడికల్ పార్టీ వాళ్లు పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించడంలో మాత్రమే తీవ్రత్వం కనపరిచారు సోషలిజం వాసన కూడా వాళ్ళకు గిట్టదు. కనుక వాళ్లు కమ్యూనిస్టులనే గాక, సోషల్ డెమోక్రట్లను కూడా వ్యతిరేకించారు.

7. బూర్జువాలు అంటే సమాజపు ఉత్పత్తి సాధనాల సొంతదార్లూ, యితరుల చేత కూలిపని చేయించుకునే వాళ్లూ ఐన ఆధునిక పెట్టుబడిదార్లు. కార్మికులు అంటే సొంత ఉత్పత్తి సాధనాలు లేనందువల్ల, బతకడానికి తమ శ్రమ శక్తిని యితర్లకు అమ్ముకోవలసిన కూలివాళ్ళు (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ.)

"బూర్జువా" అనేది ఫ్రెంచి పదం. పెట్టుబడిదార్లూ, పెట్టుబడిదారీ విధానమూ పుట్టకముందే యీ పదం పుట్టింది. పట్టణ పౌరుడు అని వ్యుత్పత్తి అర్థం. ఫ్యూడల్ బాధ్యతలు లేకుండా పట్టణాలలో స్వతంత్రంగా బ్రతికే వర్తకులనూ, చేతిపనుల వాళ్ళనూ, వృత్తిసంఘ సభ్యులనూ బూర్జువాలని అనేవాళ్లు. ఫ్యూడల్ ప్రభువులు పైవర్గంగా వున్న ఫ్యూడల్ సమాజంలో బూర్జువాలను మధ్యతరగతిగా లెక్కించేవాళ్లు. ఉత్పత్తిలో యంత్రాలు ప్రవేశించేకొద్దీ క్రమక్రమంగా బూర్జువాలే పెట్టుబడిదార్లుగా అభివృద్ధి చెందారు. తరువాత డబ్బున్న భూస్వాములు కూడా పెట్టుబడిదార్లుగా మారారు ఫ్యూడల్ ప్రభువులు లేని యీ నాటి సమాజంలో బూర్జువావర్గమే పై తరగతి; కార్మికులూ, బూర్జువాలు కానివాళ్లు మధ్యతరగతి. 8. చరిత్ర అంటే

*లిఖిత* చరిత్ర మాత్రమే. నాగరికత పుట్టక పూర్వం ఆదిమ సమాజంలో ఆస్తీ లేదు, వర్గాలూ లేవు. 1847లో ఆదిమ మానవ చరిత్ర దాదాపు యేమీ తెలియదు. తరువాత 20 యేండ్ల లోపలనే అనేక పరిశోధనల ఫలితంగా ఆదిమ చరిత్ర బాగా వెల్లడైంది. వర్గ భేదాలు లేని ఆదిమ కమ్యూనిస్టు సమాజం నుండి కుటుంబం అనేదీ, ఆస్తి అనేదీ, రాజ్యం అనేదీ యే విధంగా పుట్టిందీ 'కుటుంబమూ, స్వంత ఆస్తీ, రాజ్యాల పుట్టుక' అనే గ్రంథంలో ఎంగెల్సు వివరించాడు. (1888 నాటి ఇంగ్లీషు కూర్పు 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో ఎంగెల్సు ఒక వివరణ కూడా యిచ్చాడు.)

9. వృత్తి సంఘ సభ్యుడు (guild-master) - వృత్తి సంఘంలో పూర్తి హక్కులు గల సభ్యుడు; వృత్తి సంఘంలోని ఒక యజమాని, కానీ దాని అధిపతి కాదు. (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ.)

ఒక పట్టణంలోని ఒకే వృత్తిచేసే చేతిపనివాళ్ళు అందరూ కలిసి ఒక సంఘంగా యేర్పడుతారు. అదే వృత్తి సంఘం. అందులో సభ్యులందరూ యజమానులే. ఇతరులకు ప్రవేశం ఉండదు. తరువాత గ్రామాలనుండి పారిపోయి వచ్చిన చేతిపనివాళ్లు ఆ యజమానుల క్రింద కూలివాళ్లుగా పని చేయవచ్చునేగాని, సంఘంలో సభ్యులు కాలేరు. ఆ కూలివాళ్లే వృత్తి సంఘ కార్మికులు.

10. పట్టణాలలోని చేతిపనివాళ్లూ, వర్తకులూ ఫ్యూడల్ ప్రభువుల పెత్తనానికి లోబడకుండా స్వతంత్రులుగా బతకవచ్చునని ఆ దేశపు రాజులు శాసనాలు చేసేవాళ్ళు. కాబట్టి వాళ్లు శాసనరక్షిత స్వతంత్ర పౌరులు (chartered burghers). ఫ్యూడల్ ప్రభువుల కింద దాసులుగా వున్నవాళ్లు పారిపోయి దూరపు పట్టణాలు చేరి, అనేక పోరాటాల తర్వాత యీ స్వాతంత్ర్యం సంపాదించుకొన్నారు ఆ పట్టణాలనే కమ్యూన్‌లు అనేవాళ్లు. పట్టణాలలోని సరుకుల ఉత్పత్తివల్లా, వర్తకంవల్లా రాజులకు ఆదాయం వచ్చేది. అంతేగాక రాజులకు, ఫ్యూడల్ ప్రభువులకూ రాజకీయ వైరుధ్యం వుండేది. ఈ కారణాలవల్లా, పట్టణ ప్రజల పోరాటాల ఫలితంగానూ పై రాజ శాసనాలు పుట్టేవి.

11. కర్మాగార వ్యవస్థ (manufacturing system) - పెట్టుబడిదార్ల కింద కార్మికులు పనిచేసే వ్యవస్థే. కానీ ఇంజన్లూ, ఇంజన్లతో నడిచే పెద్దయంత్రాలూ అనాటికి లేవు. మగ్గాలలాంటి సాధనాలు మాత్రం వున్నాయి. శ్రమ విభజన వుంది.

12. మధ్యయుగపు ఫ్రాన్సులో శైశవదశలో వున్న పట్టణాలకు కమ్యూన్‌లు అని పేరు. ఆ పట్టణాలు తమ యజమానులైన ఫ్యూడల్ ప్రభువులతో పోరాడి స్థానిక స్వపరిపాలనా, మూడవ అంతస్తుగా రాజకీయ హక్కులూ సంపాయించుకోక ముందే, వాటికి కమ్యూన్‌లు అనే పేరు వచ్చింది. స్థూలంగా, బూర్జువావర్గ ఆర్థిక అభివృద్ధికి ఇంగ్లండున్ను ఆదర్శ ప్రతినిధిగానూ, దాని రాజకీయ అభివృద్ధికి ఫ్రాన్సును ఆదర్శ ప్రతినిధిగానూ తీసుకున్నాము. (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ.)

ఇటలీ, ఫ్రాన్సుల పట్టణ ప్రజలు ఫ్యూడల్ ప్రభువులకు డబ్బు యిచ్చో, లేక పోరాటం ద్వారానో, స్వపరిపాలనకు సంబంధించిన మొదటి హక్కులు సంపాయించు కొన్న తర్వాత తమ పట్టణ సమాజాలకు కమ్యూన్‌లు అని పేరు పెట్టుకున్నారు. (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్సు వివరణ.)

13. "మూడవ అంతస్తు'— (Third Estate) - ఇంగ్లండులో మతగురువులు మొదటి అంతస్తు, ఫ్యూడల్ ప్రభువులు రెండవ అంతస్తు, కామన్స్‌సభ మూడవ అంతస్తు. ఫ్రాన్సులో ఫ్యూడల్ ప్రభువులు మొదటి అంతస్తు, మతగురువులు రెండవ అంతస్తు, ఫ్యూడల్ పెత్తనంకింద లేని కమ్యూన్‌లు మూడవ అంతస్తు.

14. ఈజిప్టు పిరమిడ్లు - పురాతన ఈజిప్టులో రాజుల సమాధుల మీద కట్టిన బ్రహ్మాండమైన కట్టడాలు వీటిలో అన్నిటికంటె పెద్దది క్రీ.పూ. 38 లో కట్టింది. నేలమీద దీని విస్తీర్ణం 13 యకరాలకు పైగా వుంటుంది. పైకి పోను పోను విస్తీర్ణం తగ్గుతుంది. దీని యెత్తు 482 అడుగులు, ప్రపంచపు ఏడు వింతల్లో ఇది ఒకటి.

15. రోమన్ కాలువలు - ఇవి తవ్వినవికావు, భూమి మీద కట్టినవి. రోమనులు గొప్పయింజనీర్లు, రోమ్ నగరానికి నీళ్ల సరఫరా కావడానికి అందమైన కమాన్లమీద, తొమ్మిది కాలువలు కట్టారు-అందులో అధికభాగం యిప్పటికీ నీళ్లు సరఫరా చేస్తున్నాయి

16. గాథిక్ అనేది వాస్తు శిల్పంలో ఒక శైలి. 12 - 15వ శతాబ్దాలలో కొన్ని యూరోపియన్ దేశాలలో ముఖ్యమైన వాస్తు శిల్ప శైలిగా వుంది.

17. 4-5వ శతాబ్దాలలో యూరప్ తూర్పునుండి పశ్చిమానికి సాగిన తెగల, ప్రజల సామూహిక వలస ప్రయాణాలకు ప్రస్తావన.

18. మత దండయాత్రలు (Crusades) -పశ్చిమ యూరప్ ఫ్యూడల్ ప్రభువులు పరదేశాలను దోచుకోవడమూ, భూములను ఆక్రమించుకోవడమూ అనే ఉద్దేశంతో 1096-1270లలో చేసిన దండయాత్రలు. ఈ దండయాత్రలు ముఖ్యంగా ముస్లింలమీద మధ్య ప్రాచ్యంలో జరిగాయి. తమ ఆక్రమణ లక్ష్యాలను దండయాత్రికులు మతం సాకుతో మరుగుపరిచారు. ఈ దండయాత్రలలో ముఖ్యమైన భాగస్వాములు క్రైస్తవ చర్చి, పశ్చిమ రాజులూ, ప్రభువులూ, ఇటాలియన్ వర్తకులూ,

19. ఉత్పత్తి సాధనాలు (Instruments of Production) - యంత్రాలూ, పనిముట్లూ, పంటలు పండే భూములూ, గనులూ - ఇవన్నీ ఉత్పత్తి సాధనాలు.

20. బౌద్ధిక ఉత్పత్తి (Intellectual Production) - బుద్ధితో (మెదడుతో) చేసే ఉత్పత్తి, సాహిత్యమూ, కళలూ, మతమూ, తత్వశాస్త్రమూ, విజ్ఞాన శాస్త్రాలూ, ఇలాంటివన్నీ బుద్ధితో ఉత్పత్తి అయ్యేవి.

21. ఉత్పాదక శక్తులు (Productive Forces) - ఉత్పత్తి సాధనాలూ, కార్మికులూ, రవాణా సాధనాలూ - ఈ అన్నిటినీ కలిపి ఉత్పాదక శక్తులు అంటారు ఈ నాడు శాస్త్ర విజ్ఞానం (సైన్సు) ఉత్పత్తిలో బాగా వినియోగపడుతున్నది గనుక, అది కూడా ఒక ఉత్పాదక శక్తే.

22. మారకపు సాధనాలు (Means of Exchange) - వస్తువులు మార్చుకోవడానికి ఉపయోగించే సాధనం. బూర్జువా సమాజంలో డబ్బే మారకపు సాధనం.

23. నిర్నిబంధ పోటీ (Free Competition) - బూర్జువా ఆర్థిక వ్యవస్థలో ప్రతివొకనికీ యే సరుకునైనా తన యిష్టం వచ్చిన ధరకు అమ్మడానికీ, కొనడానికీ స్వేచ్ఛ వుంది. దానినే వ్యాపార స్వేచ్ఛ అంటారు. అటువంటి వ్యాపారాన్ని స్వేచ్ఛా వ్యాపారం (Free Trade) అంటారు. కనుక సరుకులు అమ్మడంలోనూ, కొనడంలోనూ యే మినహాయింపులూ లేని పోటీ వుంటుంది.

24. మార్కెట్లు విస్తరించేకొద్దీ, మార్కెట్ల దోపిడీ తీవ్రమయ్యేకొద్దీ, ఉత్పాదక శక్తులు యింకా పెరుగుతాయి. అందువల్ల రానున్న సంక్షోభాలు యింకా తీవ్రంగా వుంటాయి.

25. శ్రమ (Labour) - మార్క్సు ఎంగెల్సులు తమ తర్వాతి రచనల్లో 'శ్రమ' అనే పదానికి బదులు 'శ్రమ శక్తి' (Labour Power) అనివాడారు. ఇప్పుడు 'శ్రమ శక్తి' అనే పదమే సర్వత్రా వాడుకలో వుంది. కార్మికుడు అమ్ముకునేది శ్రమ శక్తి.

26. పారిశ్రామికులుకాని బూర్జువాలు - వందల వేల ఎకరాల భూమిని పెట్టుబడిదారీ పద్ధతిలో సొంత వ్యవసాయం చేసేవాళ్లూ, పెద్ద వర్తకులూ, వడ్డీ వ్యాపారస్తులూ.

27. పదిగంటల పని బిల్లు (Tenhours Bill) - ఫాక్టరీ కార్మికులు రోజుకు పది గంటలు మాత్రమే పనిచేయాలనే శాసనం ఇంగ్లండులో 1847లో వచ్చింది. అంతకు పూర్వం కార్మికులతో యెన్ని గంటలు పనిచేయించుకున్నా అడిగే దిక్కు లేదు. ఈ శాసనం స్త్రీలకూ పిల్లలకూ మాత్రమే వర్తించేది. ఆచరణలో కొంతమంది పురుషులకు కూడా వర్తించేది.

అంతకు ముందు కార్మికులు యెన్నో యేండ్లు పోరాడినా పది గంటల పని బిల్లు పాసు కాలేదు. బూర్జువావర్గంలోని చీలికవల్ల 1847లో పాసయింది. విదేశాలనుండి దిగుమతి అయ్యే గోధుమలమీద 1815 నుండి ఇంగ్లండులో సుంకాలు విధించేవాళ్లు. అందువల్ల ఇంగ్లీషు భూస్వాముల గోధుమలకు మంచి ధర వచ్చేది. దీనికి వ్యతిరేకంగా కార్మికులూ, పారిశ్రామిక బూర్జువాలూ ఉద్యమం లేవదీసి ఆ సుంకాలు రద్దుచేయించారు. దీనికి ప్రతిక్రియగా భూస్వాములు, పారిశ్రామిక బూర్జువాలమీద కసితో, పది గంటల పని బిల్లుకు అనుకూలంగా పార్లమెంటులో ఓటుచేశారు.

28. ఒక సరుకు ఉత్పత్తి మీద గుత్తాధిపత్యం కలవాళ్లు ఆ సరుకును యితర్లు కూడా ఉత్పత్తి చేస్తే నష్టపడతారు. అలాగే, ఒక సరుకును విదేశాలనుండి దిగుమతిచేసి వర్తకంచేసే బూర్జువాలు ఆ సరుకు స్వదేశంలోనే ఉత్పత్తి ఐతే నష్టపడతారు. ఈ రెండు రకాల బూర్జువాలూ పరిశ్రమల అభివృద్ధి వల్ల నష్టపడేవాళ్లు.

29. ప్రమాదకర వర్గం (Dangerous Class) - అనగా లుంపెన్ ప్రొలిటేరియట్ - దొంగలూ, రౌడీలూ, జేబుదొంగలూ, జూదగాళ్లూ, మొదలైనవాళ్లు. వీళ్లు సమాజానికి అక్కరకొచ్చే పని యేదీ చేయరు. సమాజంలో యే వర్గానికీ చెందరు. సమాజంలోని మురికి అంతా కలిసి తెట్టెగా యీ "ప్రమాదకర వర్గ" మైంది.

30. కమ్యూన్ - వివరణ 12 చూడండి.

31 ప్రాణంగల శ్రమ - కార్మికుడు.

32. కూడబెట్టిన శ్రమ - పెట్టుబడి.

33. గుత్తగొనగల సామాజిక శక్తి (Social Power Capable of Being Monopolised) - ఒక ఫ్యాక్టరీ ఒకని ఆస్తి అంటే ఆ ఫ్యాక్టరీమీద వానికి మాత్రమే సర్వాధికారమూ వుంటుంది, అందులో యెవరికీ భాగం వుండదు. అదే గుత్తాధిపత్యం అంటే. సామాజిక శక్తి ఐన పెట్టుబడిమీద (సమాజంలోని అందరికీ అధికారం లేకుండా) కొంతమంది పెట్టుబడిదార్లకు మాత్రమే యాజమాన్యం వుండడం అని యిక్కడ అర్థం. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలోని గుత్త పెట్టుబడిదార్లను గురించి రాసిందిగాదు యిది - మామూలు పెట్టుబడిదార్లను గురించి రాసిందే.

34. మధ్యతరగతి (Middle -Class) - మార్క్సు కాలంనాటికి పెట్టుబడిదార్లనందరినీ మధ్యతరగతి అనే అనేవాళ్లు ఫ్యూడల్ యుగంలో పుట్టిన పదం గనుక యీ అర్థం వచ్చింది. ఫ్యూడల్ సమాజంలో ఫ్యూడల్ ప్రభువులూ, భూస్వాములూ పైవర్గం, బూర్జువావర్గమంతా మధ్యతరగతి.

35. కమ్యూనిస్టు సమాజంలో ఒకడు యజమాని అనీ, ఒకడు కూలివాడు అనీ భేదం వుండదు, పెట్టుబడీ వుండదు, కూలి పనీ వుండదు. నిజానికి పెట్టుబడీ, కూలి పనీ అనేవి విడదీయరానివి. ఒకటి వున్నప్పుడే మరొకటి వుంటుంది. ఒకటి లేకుండా మరొకటి వుండజాలదు. కాబట్టి పెట్టుబడిని రద్దుచేయడం అంటే కూలి పనిని కూడా రద్దు చేయడమే. కాబట్టి 'పెట్టుబడి రద్దయినప్పుడు కూలి పని కూడా రద్దౌతుంది' అనడం ఒక చర్విత చర్వణం (చెప్పిందే చెప్పడం). పెట్టుబడి రద్దయినప్పుడు పని చేయడమే ఆగిపోతుందని పెట్టుబడిదార్లు చెప్పేమాట యీ చర్విత చర్వణానికే మరోరూపం. అంతేగానీ, పని చేయడమేమీ ఆగిపోదు. ఆగిపోయేది కూలి పని మాత్రమే.

36. ప్రాచీన ఆస్తి-ఫ్యూడలిజం కంటె పూర్వమున్న ఆస్తి, బానిస యుగంలోని ఆస్తి.

37. కార్మికులకు సొంత ఆస్తి లేదు. కార్మికులకు రోజూ పని చూపించే హామీ యే దేశంలోనూ (పెట్టుబడిదారీ దేశాలలో) లేదు. కార్మికుడు ఫలానా దేశం

వాడైనందువల్ల ఒరిగే దేమీలేదు. ఏ దేశంలో ఐనా రెక్కల కష్టంతో బతక వలసిందే కనుక కార్మికులకు యే దేశమైనా ఒకటే.

పైన వివరించినట్లు, పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులలో జాతీయ లక్షణాలన్నీ నశించాయి, వాళ్లకు మిగిలిందల్లా కార్మిక లక్షణాలు మాత్రమే ఈ అర్థంలో కూడా కార్మికులకు దేశం అనేది లేదు.

అంతేగాక, కార్మిక విప్లవ విజయానికి ప్రపంచ కార్మిక సౌభ్రాతృత్వం అవసరం. 'నేను ఫలానా దేశం వాణ్ణి' అనే సంకుచిత భావం కార్మికులకు హానికరమైంది. ఈ అర్థంలో కూడా కార్మికులకు దేశం అనేది లేదు.

ఏ అర్థంలో అన్నా, ప్రపంచ కార్మిక విప్లవం దృష్ట్యానే యీ వాక్యానికి అర్థం వుంది- అనగా కార్మికవర్గం బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాడేటప్పుడు మాత్రమే. చారిత్రక పరిస్థితులను గమనించకుండా యే కమ్యూనిస్టూ నీతి సూత్రాలు వల్లించడు. భారతదేశంమీదికి శత్రువులు దండెత్తితే భారత కార్మికులకు దేశం అనేది లేదని యే కమ్యూనిస్టూ అనడు. భారతదేశం స్వాతంత్ర్యం కొరకు పోరాడేటప్పుడు బ్రిటిష్ కమ్యూనిస్టులు బ్రిటిష్ బూర్జువావర్గానికి వ్యతిరేకంగా భారతదేశపక్షం వహించడం చారిత్రక సత్యం. ఆ సందర్భంలో బ్రిటిష్ కార్మికులకు దేశం అనేది లేదని కమ్యూనిస్టులు అంటారు. కానీ జాతీయ విమోచన యుద్ధాలలో కార్మికులకు అగ్రస్థానం వుంటుంది. మార్క్సు, ఎంగెల్సులు జాతీయ విమోచన యుద్ధాలకూ, బూర్జువా విప్లవాలకూ అన్ని సందర్భాలలోనూ ప్రోత్సాహం ఇచ్చారు ఈ విషయం మీద లెనిన్ కూడా ఒక సందర్భంలో స్పష్టమైన వివరణ యిచ్చాడు. ఈ 'కమ్యూనిస్టు ప్రణాళిక'లోనే, 4వ ప్రకరణంలో, ఆయా చారిత్రక పరిస్థితులను బట్టి వివిధ దేశాల కమ్యూనిస్టులు యే యే పాత్ర వహించవలసిందీ మార్క్సు, ఎంగెల్సులే స్పష్టంగా చెప్పారు. జర్మన్ కమ్యూనిస్టులు ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా బూర్జువావర్గంతో సహకరించాలనీ, పోలిష్ కమ్యూనిస్టులు జాతీయ విమోచన కొరకూ, బూర్జువా విప్లవం కొరకూ ఏకకాలంలో కృషిచేయాలనీ స్పష్టంగా వుంది. ఆ చారిత్రక పరిస్థితులలో జర్మన్ కార్మికులకు దేశం అనేది లేదనీ, పోలిష్ కార్మికులకు దేశం అనేది లేదనీ మార్క్సు, ఎంగెల్సులే అనలేదు. ఏ కమ్యూనిస్టు సూత్రానికైనా చారిత్రక పరిస్థితులను బట్టి అర్థం వుంటుంది.

38. ఫ్రాన్సులో ఫ్యూడల్ ప్రభువులకు అనుకూలంగా వున్న 10వ చార్లెస్ రాజు ప్రభుత్వం 1830జులై విప్లవంలో పడిపోయింది. ఆ తర్వాత వచ్చిన లూయీ ఫిలిప్ ప్రభుత్వం బూర్జువాలకు (ముఖ్యంగా బడా బూర్జువాలకు) అనుకూలంగా వుంది.

39. 1832కు పూర్వం బ్రిటిష్ పార్లమెంటులో భూస్వాములకు యెక్కువస్థానాలు వుండేవి. నియోజక వర్గాల విభజన, వోటు హక్కుకు కావలసిన అర్హత మొదలైన నియమాలు అన్నీ భూస్వాములకు అనుకూలంగా వుండేవి. ఈ ఎన్నికల వ్యవస్థను మార్చడానికి బూర్జువాలు ఉద్యమం ప్రారంభించారు. తత్ఫలితంగా 1832లో బూర్జువాలకు అనుకూలంగా కొన్ని సంస్కరణలు జరిగాయి.

40. ఫ్యూడల్ ప్రభువులు తరతరాలుగా ఉన్నత వంశీయులు. వాళ్ల దృష్టిలో కొత్తగా ధనవంతులైన బూర్జువాలు "హఠాత్తుగా పైకి వచ్చిన నీచజాతివాళ్లు" (Upstarts)

41. 1660 -1689 మధ్య జరిగిన ఇంగ్లీషు పునస్థాపనకాదు. 1814-1830 మధ్య జరిగిన ఫ్రెంచి పునస్థాపన. (1888నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ) పునస్థాపన (Restoration) అంటే రాజులను మళ్లీ గద్దె యెక్కించడం, రాజులను ఉరితీసి కొన్నాళ్లు రిపబ్లిక్కులుగావున్న తర్వాత,1660లో ఇంగ్లండు లోనూ, 1814లో ఫ్రాన్సులోనూ మళ్లీ రాజులను తెచ్చి సింహాసనాలు అప్పగించారు.

42. కార్మికవర్గపు బిచ్చపు జోలెను పతాకగా ఆడించడమంటే పీడిత కార్మికుల దృక్కోణం నుండి బూర్జువాలను విమర్శించడం. ఆ విమర్శల వెనుక వుండే ఉద్దేశం ఫ్యూడల్ వ్యవస్థను పునస్థాపించడమే. వాళ్ల పృష్ఠ భాగాలమీద వున్న వంశ చిహ్నాలు అంటే ఆ ఫ్యూడల్ ఉద్దేశాలే.

43. 1814 నుండి 1830 వరకు ఫ్రాన్సులో బూర్బన్ రాజవంశం రాజ్యం చేసింది. ఈ రాజవంశం ఫ్యూడల్ ప్రభువులకు అనుకూలంగా వుంది. 1830 జులై విప్లవం ద్వారా ఆ వంశంలోనే ఒక శాఖ ఐన ఆర్లియన్స్ రాజవంశం సింహాసన మెక్కింది. ఇది బాంకర్లకూ, పెద్ద పెట్టుబడిదార్లకూ అనుకూలంగా వుంది. సింహాసన హక్కు న్యాయంగా బూర్బన్ వంశానిదే అని ఫ్యూడల్ ప్రభువులు వాదిస్తూ వచ్చారు. అందువల్ల వాళ్ళకు లెజిటిమిస్టులు (legitimists) అని పేరువచ్చింది. (legitimate- చట్టబద్ధమైన, న్యాయమైన.) వీళ్ళలో కొందరు కార్మికవర్గపక్షాన నిలబడినట్లు నటిస్తూ బూర్జువా దోపిడీని ఖండించారు.

44. భూస్వాముల ప్రయోజనాల రక్షణకు పాటుపడే టోరీ (Conservative) పార్టీలోని కొందరు రాజకీయవాదులు 1840 తర్వాత 'యంగ్ ఇంగ్లండ్' (Young England) అనే బృందంగా ఏర్పడ్డారు. రాజకీయంగా క్రమక్రమంగా బలపడిన బూర్జువావర్గానికి వ్యతిరేకంగా చేసే ప్రయత్నాలలో వీళ్ళు (ఫ్రెంచి లెజిటిమిస్టుల మాదిరే) సోషలిజం ప్రచారం చేశారు. ఈ సోషలిజమే ఫ్యూడల్ సోషలిజం

45. ఇది ప్రధానంగా జర్మనీకి వర్తిస్తుంది. జర్మన్ భూస్వాములూ, ఫ్యూడల్ ప్రభువులూ మేనేజర్లను పెట్టి తమ భూములలో విస్తారమైన భాగాలను సొంత వ్యవసాయం చేసుకుంటారు. అంతేకాక, బీట్‌రూటుతో చక్కెర, బంగాళా దుంపలతో సారాయి తయారు చేసే ఫ్యాక్టరీలు నడుపుతారు. వీళ్లకంటే ధనవంతులైన బ్రిటిష్ ప్రభువులు యింకా యీ స్థితికి దిగజారలేదు గానీ, వాళ్లు కూడా నమ్మదగని జాయింటుస్టాక్ కంపెనీలు తమ పేర్లు వినియోగించుకోడానికి అనుమతించి, తగ్గిపోతున్న తమ ఆదాయాలను తద్వారా భర్తీ చేసుకోవడం నేర్చుకున్నారు. (1888నాటి ఇంగ్లీషు కూర్పులో ఎంగెల్సు ఇచ్చిన వివరణ.)

46. జర్మన్ తత్వవేత్త కాంట్ (KANT, IMMANUEL) (1724 - 1804) సిద్ధాంతం ప్రకారం మానవులకు పుట్టుకతోనే శుద్ధ వివేకమూ (Pure Reason), వ్యవహార వివేకమూ (Practical Reason) అనేవి వున్నాయి రెండూ వేరువేరు కూడా కాదు. శుద్ధ వివేకమే నిత్య జీవితంలో వ్యవహార వివేకంగా పనిచేస్తుంది.
మన ఇంద్రియాలు బాహ్య జగత్తునుగురించి రంగు, రుచి, వాసన మొదలైన అనుభవాలను మాత్రమే యిస్తాయి. ఆ అనుభవాలను శుద్ధవివేకం తన సహజ లక్షణాలైన కాలం (Time), స్థలం (Space), కార్యకారణ సంబంధం (Causality) అనే మూసలలో పోసి జ్ఞానంగా మారుస్తుంది. కానీ దేవుడూ, ధర్మమూ, ఆత్మా మొదలైనవి యింద్రియాలకూ, తర్కానికీ అతీతమైనవి; కనుక అవి శుద్ధ వివేకానికి కూడా అతీతమైనవి. వాటిని గురించి మనకు నిశ్చితమైన విశ్వాసాలు కలిగించేది వ్యవహార వివేకం. కాంట్ సిద్ధాంతం ప్రకారం ఇది దేశ కాలాలతోనూ, వ్యక్తుల జీవితానుభవాలతోనూ నిమిత్తం లేకుండా సర్వ మానవులకూ సమంగా వర్తించే దైవికశక్తి లాంటిది మానవులకు ధర్మాధర్మ విచక్షణ యిచ్చేది వ్యవహార వివేకమే. (కనుక అంతరాత్మ అనవచ్చు ) ఇది మానవుల ఇచ్ఛను పాలిస్తుంది. అంటే బాహ్య శాసనాల ద్వారా కాదు ఇచ్ఛయొక్క స్వభావమే వ్యవహార వివేకం. ధర్మాధర్మ విచక్షణ యిచ్చేది గనుక, వ్యక్తి పరిమితం కాదు గనుక, మన సంప్రదాయం ప్రకారం దీన్ని ధర్మదేవత అనవచ్చు ఫ్రెంచి బూర్జువా విప్లవాన్ని పరిశీలించి కాంట్ దాని తాత్విక భావాలను భౌతిక ప్రయోజనాలనుండి వేరుచేశాడు. ఆ విప్లవంలో బూర్జువావర్గం తన వర్గ ప్రయోజనాల కోసం పోరాటం చేయడం కాక, అభౌతిక, శాశ్వత ధర్మాలు సాధించదలచుకుందని అన్నాడు.

47. జర్మన్ తత్వవేత్త షోపెన్‌హావర్ (Schopenhauer, Arthur) (1788 - 1860) సిద్ధాంతం ప్రకారం మానవుని నడిపించేది మనస్సూ కాదు, మేధా కాదు, చైతన్యమూకాదు - ఇచ్ఛ (will). మన కోర్కెలు హేతుబద్ధంగా వుండవు. కానీ మన కోర్కెలను సమర్థిస్తూ వాదాలూ, తర్కాలూ సృష్టిస్తుంది మన మేధ. కాబట్టి ఇచ్ఛకు బానిసే మానవ మేధ. ఇచ్ఛ మానవులనే కాదు పాలించేది - సకల జీవజాతులను పాలించేది అదే, సకల చరాచర సృష్టిని పాలించేదీ అదే. మానవాతీత శక్తిగా చిత్రించిన ఇచ్ఛను భారత సంప్రదాయం ప్రకారం ఇచ్ఛాదేవత అనవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం కూడా విప్లవాలను వర్గ పోరాటం వర్గ ప్రయోజనాల దృక్కోణంనుండి పరిశీలించడానికి బదులు ఇచ్ఛ అనే తాత్విక అభౌతిక భావ దృక్కోణంనుండి షోపెన్‌హావర్, కాంట్ పరిశీలించారు.

48. ఒక విదేశ భాషలోని భావాలు మనం గ్రహించాలంటే వాటిని మన భాషలోకి అనువదించుకుంటాం. జర్మన్ పండితులు చేసుకున్నదీ అనువాదమే, కానీ యిలాంటి అనువాదం కాదు. వాళ్ళు ఫ్రెంచి సోషలిస్టు భావాలను రాజకీయ పరిభాషలోనుండి తమ తాత్విక పరిభాషలోకి అనువదించుకున్నారు. (ధర్మదేవత, ఇచ్ఛాదేవత వగైరా.) ఆ అనువాదంతో సోషలిస్టు భావాలు తాత్విక భావాలుగా రూపాన్ని మార్చుకొన్నాయి.

49. పాలిమ్‌పెస్ట్స్ (Palimsests) అనే పూర్వకాలపు ఫలకాలపై రాతలను గురించి ఇక్కడ ప్రస్తావన. ఆదిమ జాతుల వీరగాథలు ఈ ఫలకాలపై లిఖితమై వున్నాయి. తరువాతి కాలంలో క్రైస్తవ సన్యాసులు ఈ పాతాలు చెరిపివేసి, వాటిపైన ఆయా నూతన శకాలకూ నూతన కాలాలకూ ఉచితమైన "నూతన పావనపురుషుల జీవితాలు రాశారు.

50. మానవ జాతి అన్యధాకరణ (Alienation of Humanity) - మానవులు మానవత్వం కోల్పోవడం ; మానవులు మానవుల్లాగా బతక లేకపోవడం.

మానవుని విలక్షణ గుణం శ్రమ. కానీ శ్రమ చేసే కార్మికుడు తనకోసం తాను ఉత్పత్తి చేయడంలేదు, యజమానికోసం చేస్తున్నాడు. అంతేగాక, ఫాక్టరీలో శ్రమచేసే కార్మికుడు మనిషిలాగా కాక, యంత్రంలాగా శ్రమ చేస్తున్నాడు, నిద్రాహారమైథునాల్లాంటి జంతు ధర్మాల్లో మాత్రమే మానవుడు స్వేచ్ఛగా, బుద్ధిపూర్వకంగా, సంతోషంతో వ్యవహరిస్తున్నాడు. శ్రమలో స్వేచ్ఛా, ఇష్టమూ, సంతోషమూ వుండడం లేదు. కనుక మానవుడు మానవత్వానికి దూరమౌతున్నాడు. లేక, తనకు తాను అన్యుడౌతున్నాడు (Self alienation of man) మానవ అన్యధాకరణ భావానికి యిది ఒక వ్యాఖ్య.

బూర్జువా సమాజంలో మానవుని శ్రమా, దాని ఫలితాలు - అనగా శ్రమనుండి ఉద్భవించిన ఉత్పాదితాలు, సొత్తు వగైరా - మానవునిపైన రాజ్యంచేసేటట్టీ, అతనికి అన్యమైనట్టీ శక్తిగా ఏర్పడతాయి.

మార్క్సిస్టు దృక్పథంనుండి అన్యధాకరణ సమస్యను విశ్లేషించినప్పుడు సామాజిక సంబంధాల విశ్లేషణ ప్రధానమైన విషయం. ఈ గ్రంథంలో యీ సందర్భంలో "మానవజాతి అన్యధాకరణ" అనే పదం జర్మన్ "అసలు" సోషలిజానికి ప్రతినిధులలో ఒకడైన హెస్ రచనలనుండి ఉటంకింపు. నిజమైన సామాజిక సంబంధాలను వాళ్లు విశ్లేషించక పోవడమే "అసలు" సోషలిస్టుల ప్రధానమైన పొరపాటు. తాను అవగాహన చేసుకోలేని విషయాలకు, హేగెల్‌నుండీ, ఫాయర్‌బాఖ్‌నుండీ తెచ్చుకున్న పారిభాషిక పదాలను అంటగట్టేవాళ్ళు. ఇందుకని మార్క్స్ "అసలు" సోషలిస్టులను విమర్శించాడు.

51. సామాన్య వాచక సింహాసనచ్యుతి (Dethronement of the Category of the General) అనే పదాన్ని కూడా వాళ్లు పైన వివరించిన విధంగానే వాడుతూ వుండేవాళ్లు. తత్వశాస్త్రంలో రెండు వాచకాలున్నాయి: సామాన్యమూ, నిర్దిష్టము. వీటికి పరస్పరం చాలా దగ్గర సంబంధం వుంది. నిర్దిష్టం అనగా : ప్రత్యేక రూపాల్లో బహిర్గతమవుతూన్న వాస్తవం. "రాముడు", "ఖాను"లు ప్రత్యేకమైన మనుషులు; "మానవుడు" అనేది వాళ్లిద్దరికీ వర్తించే సామాన్య వాచకము. ఇలాగే బానిస, ఫ్యూడల్, పెట్టుబడిదారీ సమాజాలు నిర్దిష్ట రూపాలు ఆ యా సమాజాల్లో వర్గాల మధ్య బానిస, బానిసయజమాని; ఫ్యూడల్ భూస్వామి, రైతుబానిస;

బూర్జువా, కార్మికుడూ - ప్రత్యేక సంబంధాలు వున్నాయి. ఈ సమాజాలన్నిటికీ వర్తించే సామాన్య వాచకం రాజ్యం. జీవితాన్ని విశ్లేషించేటప్పుడు దానిని రెండు వైపులనుండీ చూడాలి; ఎందుచేతంటే నిర్దిష్టంలోనే సామాన్యం బహిర్గతమవుతుంది. "అసలు" సోషలిస్టులు రాజ్యాల్ని విశ్లేషించినప్పుడు, వర్గాలమధ్య వుండే ప్రత్యేక ఆర్థిక సంబంధాల దృక్పథంనుండి విశ్లేషించలేదు. అందుచేతనే వాళ్లకు "రాజ్యం" అనేది కేవలం సామాన్య వాచకం (the Category of the General – హేగెలీయన్ తత్వశాస్త్రంనుండి తెచ్చుకున్న పదం) అయిపోయింది. ఈ "సామాన్య వాచకాన్ని (అనగా state) రద్దుచేయడం' జరగాలని వాళ్లు డిమాండు చేశారు. "అసలు" సోషలిస్టులు చేసిన ఈ వ్యాఖ్యానం కారణంగా మార్క్స్ వాళ్లను విమర్శించాడు.

52. సోషలిజం అనేది బూర్జువావర్గంమీద కార్మికవర్గం పోరాటం చేసే దశలో పుట్టుతుంది కానీ జర్మనీలో బూర్జువావర్గమే యింకా ఫ్యూడల్ వర్గంమీద పోరాటమే ప్రారంభించనిదశలో పుట్టింది జర్మన్ సోషలిజం జర్మన్ సోషలిస్టులకు ఆర్థిక రాజకీయ శాస్త్రాలలో ఓనమాలు కూడా తెలియవు. వాళ్లు కేవలం తత్వశాస్త్రాలు చదువుకొని తమ పిచ్చి వేదాంతానికే "జర్మన్ సోషలిజం" అని పేరు పెట్టుకున్నారు. అంతేగాక వాళ్లకు మాటలు తప్ప రాజకీయ కార్యకలాపాలేమీ లేవు ఆ మాటలు కూడా యెవరికీ అర్థంకావు. అందువల్ల వాళ్ల అజ్ఞానం ఛాందస అమాయకత్వంగా వర్ణితమైంది. కానీ, ఆ తర్వాత, జర్మన్ బూర్జువావర్గం ఫ్యూడల్ వ్యతిరేక పోరాటం ప్రారంభించినపుడు ఈ జర్మన్ సోషలిస్టులు బూర్జువాలను వ్యతిరేకించారు. దేశంలో రాజకీయాలే లేనప్పుడు అమాయకంగా వున్నవాళ్లు, రాజకీయాలలో ప్రవేశించి ఫ్యూడల్ వర్గానికి అనుకూలంగా పనిచేసినప్పుడు, వాళ్లను యింకా అమాయకులనీ, ఛాందసులనీ అనలేము గదా .

53. ఉదారవాద ఉద్యమం (Liberal movement) - ఫ్యూడల్ యుగంలో ప్రభుత్వం నిరంకుశంగా వుంటుంది. అలా నిరంకుశంగా వుండకుండా ప్రజలకు వోటు హక్కూ, వాక్స్వాతంత్ర్యమూ, మొదలైన హక్కులు కొన్ని కావాలనీ, పరిపాలన ఉదారంగా వుండాలనీ కోరేది ఉదారవాదం. ఫ్యూడలిజంమీద బూర్జువావర్గం చేసే రాజకీయ పోరాటపు తొలిదశలో ఉదారవాదం పుట్టుతుంది.

54. అల్పబుద్ధులు (Philistines) - చిల్లర వాంఛలు తప్ప కళలూ, రాజకీయాలూ, మొదలైన వాటికి సంబంధించిన యే అభిరుచులూ లేనివాళ్లు. డబ్బు సంపాయించడం తప్ప, మానసిక జీవితం (mental life) అనేది బొత్తిగా లేనివాళ్లు. ఇక్కడ జర్మన్ పెటీ బూర్జువావర్గాన్ని వర్ణిస్తుంది యీ పదం.

55. జర్మన్ తాత్వికుల భావజాలం సాలెగూళ్ళ వంటిది. వట్టి పనికిమాలిన బూజు, జర్మన్ తాత్వికులు తమ తాత్విక సిద్ధాంతాలను స్పష్టమైన భాషలో వివరించకుండా, అలంకార భూయిష్టమైన కావ్యభాషలో వర్ణించారు. అంతేగాక, వెక్కసపు మమతలు (sickly sentiments) జోడించారు.

56. 1848 నాటి విప్లవ తుఫాను యీ అసహ్యమైన ధోరణి నంతటినీ వూడ్చిపారవేసి, దీని ప్రచారకులకు సోషలిజంలో తల దూర్చాలని మళ్లీ కోరిక పుట్టకుండా చేసింది. హెర్ కార్ల్ గ్రూన్ యీ ధోరణికి ప్రధాన ప్రతినిధి, లాక్షణిక ఉదాహరణ (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్సు వివరణ.)

57. ప్రూడన్ (Proudhon, Pierre-Joseph) (1809-1865) ఫ్రెంచి పెటీ బూర్జువా సోషలిస్టు, అరాజకవాద సిద్ధాంతం సృష్టించాడు. 'ఆస్తి అంటే యేమిటి?, 'దారిద్ర్యం యొక్క తత్వశాస్త్రం', మొదలైన గ్రంథాలు రచించాడు. 'తత్వశాస్త్రదారిద్ర్యం' అనే గ్రంథంలో మార్క్సు అతని సిద్ధాంతాభిప్రాయాలను ఖండించాడు.

58. విదేశాలనుండి దిగుమతి అయ్యే సరుకులు చౌకగా వుంటే వాటితో స్వదేశీ ఉత్పత్తిదారులు పోటీ చెయ్యలేరు. వాటిమీద సుంకాలు విధిస్తే వాటి ధర పెరుగుతుంది. అప్పుడు స్వదేశీ సరుకులు వాటితో పోటీ చేయగలవు. స్వదేశీ సరుకుల రక్షణార్థం విదేశీ సరుకులమీద వేసే యీ సుంకాలే రక్షణ సుంకాలు (protective duties), ఇవి స్పష్టంగా పెట్టుబడిదార్ల సౌకర్యం కొరకే.

59. బాబెఫ్ (Babeuf, Francois - Noel) (1760-1797) - బీద కుటుంబంలో పుట్టిన ఫ్రెంచి విప్లవకారుడు. భూమి అంతా సమాజపరం కావాలనీ, దేశంలో ఉత్పత్తి అయ్యే సరుకులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అందరికీ సమానంగా పంచాలనీ యితని సిద్ధాంతం. 1794జూలైలో విప్లవజాకొబిన్ ప్రభుత్వాన్ని కూలదోసి బూర్జువా వర్గం అధికారంలోకి రావడం గమనించిన బాబెఫ్ బీదల నియంతృత్వం వుంటే తప్ప ధనికుల యెదురు దాడిని ఆపలేమని సూత్రీకరించాడు. బూర్జువా ప్రభుత్వాన్ని కూలదోయడానికి 1796లో కుట్రకు యేర్పాట్లు చేయడంలో పోలీసులకు చిక్కి 1797లో ఉరికంబమెక్కాడు. కార్మికవర్గం యింకా బీజ రూపంలోనే వుంది. కనుక, అతనికి కార్మికవర్గ చారిత్రక పాత్ర అర్థం కాలేదు. ఊహాస్వర్గ కమ్యూనిస్టు.

60. సెయింట్ సైమన్ (Saint - Simon, Henri) (1760 - 1825) - ఫ్రెంచి ఊహా స్వర్గ సోషలిస్టు. ధనిక కుటుంబంలో పుట్టి, 23వ యేట మంచి భవిష్యత్తుగల ఉన్నత మిలిటరీ ఉద్యోగానికి రాజీనామా యిచ్చి, మానవ విజ్ఞానమంతా ఏకసిద్ధాంతబద్ధం చేయడానికి కృషి చేశాడు. విజ్ఞాన శాస్త్రాలను సమగ్రంగా గ్రహించడానికి 40వ యేట ఒక సాంకేతికవిద్యాలయంలో విద్యార్థిగా చేరాడు. మానవ సమాజ పునర్నిర్మాణ కృషిలో తన సంపదనంతా వ్యయంచేశాడు. భార్య విడనాడినా, కటిక దరిద్రం చుట్టుకున్నా తన కృషి మానలేదు.

అతని సిద్ధాంతం ప్రకారం భావి సోషలిస్టు సమాజపు మౌలిక అంశాలు యివి: విధాయక శ్రమా, శాస్త్రవిజ్ఞాన పరిశ్రమల యేకత్వమూ, ఆర్థిక వ్యవస్థలో కేంద్రీకరణమూ, క్రమబద్ధతా , సొంత ఆస్తి రద్దుచేయకూడదు; శాస్త్రజ్ఞులూ, పెట్టుబడిదార్లూ సమాజానికి నాయకత్వం వహించాలి. తన సోషలిస్టు లక్ష్యం

విప్లవంద్వారా కాక, భావాల ప్రచారంద్వారా సాధ్యమౌతుందని అనుకున్నాడు. కార్మికులు బాధపడుతున్నారని గమనించాడు, కానీ కార్మికవర్గం సమాజాన్ని మార్చే చారిత్రక పాత్ర అతనికి అర్థం కాలేదు.

61. ఫోరియర్ (Fourier, Charles) (1772 –1837) - ఫ్రెంచి ఊహాస్వర్గ సోషలిస్టు ; వ్యాపారస్తుడు, వర్తకుల దురాచారాలను నగ్నంగా వెల్లడించాడు. పెట్టుబడిదారీ సమాజంలో భిన్న వ్యక్తుల ప్రయోజనాలు పరస్పర విరుద్ధంగా వుంటాయని చెప్పాడు. సమాజాన్ని సంస్కరించడానికి అతనొక పథకం తయారుచేశాడు. ఆ సమాజంలో మానవుని సామర్థ్యాలన్నీ వికసిస్తాయి. భావి కమ్యూనిస్టు సమాజం గురించి ప్రతిభావంతమైన జోస్యాలు చెప్పాడు. ఉత్పాదక శక్తుల అపార అభివృద్ధి గురించీ, పనిచేయడం మనిషియొక్క ప్రధానఅవసరం అనీ, శరీరశ్రమకు మానసిక శ్రమకు మధ్యా, పట్టణాలకు గ్రామాలకు మధ్యా భేదం తొలగించడం వగైరాల గురించీ. కానీ, తన పథకం సాధించడానికి విప్లవం అవసరం లేదనీ మనుషులను మార్చాలనీ అనుకున్నాడు. ఆ పథకం అమలు పరచడానికి డబ్బుకొరకు అతను నెపోలియన్‌కూ, అనేక ధన వంతులకూ జాబులు రాశాడు.

62. ఓవెన్ (Owen, Robert) (1771 1858) - ఇంగ్లీషు ఊహాస్వర్గ సోషలిస్టు. చిన్న పెట్టుబడిదారుగా వుండి కార్మికుల దైన్యస్థితిని బాగా గమనించాడు. 1817లో అతను సమాజ పునర్నిర్మాణానికి ఒక పథకం తయారు చేశాడు. భౌతిక పరిస్థితులవల్లా, విద్యవల్లా, శిక్షణవల్లా (అనగా, కేవలం భౌతిక కారణాలవల్లనే) మానవుని గుణాలు ఏర్పడుతాయని అతని విశ్వాసం. ఆ విశ్వాసంతో అతను అమెరికాలో కొంత భూమికొని, అక్కడ కమ్యూనిస్టు సూత్రాల మీద ఒక కొత్త సమాజం స్థాపించాడు. వర్గ పోరాటాన్ని నిరాకరించి, శాంతియుతంగా పెట్టుబడిదారీ సమాజాన్ని మార్చవచ్చునని ఊహించాడు.

63. ఈ బ్రాకెట్లు మూలంలోనివే.

64. " ఫలాన్‌స్టేర్లు" (Phalansteres) - ఫోరియర్ పథకంలోని సోషలిస్టు సమాజాల పేరు. దీనికి ఏకవచనం ఫలాంక్స్ ( Phalanx).

"హోమ్ కాలనీలు" (Home colonies) - ఓవెన్ అమెరికాలో స్థాపించిన కమ్యూనిస్టు సమాజాల పేరు.

"ఇకేరియా" (Icaria) - కాబెట్ (Cabet, Etienne) ( 1788-1856) ఊహాస్వర్గ పథకంలోని కమ్యూనిస్టు సమాజం పేరు. తరువాత అతను అమెరికాలో స్థాపించిన కమ్యూనిస్టు సమాజానికి కూడ అదే పేరు పెట్టాడు.

65. ప్రజలందరికీ ఓట్లు కావాలని ఇంగ్లండులో 1835 నుండి 1848 వరకు చార్టిస్టు ఉద్యమం జరిగింది. ఆ ఉద్యమకారులే చార్టిస్టులు (Chartists).

66. 1843, 1850ల మధ్య పారిస్‌లో La Reforme పెటీ బూర్జువా ప్రజాతంత్ర రిపబ్లికన్ పత్రిక వుండేది. సాంఘిక రాజకీయ సంస్కరణల కొరకు అది కృషి చేసింది. దాని అనుచరులు రెఫార్మిస్టులు (reformists).

67. సోషల్ డెమోక్రట్లు (social - democrats) - పార్లమెంటులో లెద్రూ - రోలిన్ ద్వారానూ, సాహిత్యంలో లూయీ బ్లాంక్ ద్వారానూ, దినపత్రికా ప్రపంచంలో La Reforme పత్రిక ద్వారానూ ప్రతిబింబించిన పార్టీ. డెమోక్రటిక్ లేక రిపబ్లికన్ పార్టీలో కొద్దో గొప్పో సోషలిస్టు భావాలు గల వాళ్ళకు సోషల్ డెమోక్రసీ అనే పేరు వర్తిస్తుందని ఆ పేరు పెట్టినవాళ్ళ విశ్వాసం. (1888 నాటి ఇంగ్లీషు కూర్పుకు ఎంగెల్సు వివరణ)

ఫ్రాన్స్‌లో సోషల్ డెమోక్రటిక్ పార్టీ అని పేరు పెట్టుకున్న పార్టీకి రాజకీయ రంగంలో లెద్రూ-రోలిన్ సాహిత్యంలో లూయీ బ్లాంక్ ప్రతినిధులు. కనుక దీనికీ నేటి జర్మన్ సోషల్ డెమోక్రసీకీ అనంతమైన భేదం వుంది. (1890 నాటి జర్మన్ కూర్పుకు ఎంగెల్సు వివరణ).

68. జర్మనీకి, ఆస్ట్రియాకూ, రష్యాకూ పోలండు లోబడి వుండేది. పోలిష్ జాతీయ స్వాతంత్ర్య పోరాటం విజయవంతం కావాలంటే, ఆ పోరాటంతో పాటు ఫ్యూడల్ వ్యవస్థ మీద బూర్జువా ప్రజాతంత్ర విప్లవం కూడా ఏకకాలంలో జరగాలని పోలిష్ డెమోక్రటిక్ పార్టీ విశ్వసించింది ఇక్కడ వ్యవసాయ విప్లవమంటే ఫ్యూడల్ వ్యవస్థ మీద విప్లవమే. పోలిష్ డెమోక్రటిక్ పార్టీ 1846 జనవరి 24న క్రాకోవ్ నగరంలో తిరుగుబాటు లేవదీసి దున్నేవానికి భూమి అని ప్రకటించింది. ఆ తిరుగుబాటు ఓడిపోయింది.

# భారతదేశంలో 'ప్రణాళిక' ప్రచురణ చరిత్ర

భారతదేశ భాషలలో కమ్యూనిస్టు ప్రణాళిక అందుబాటులోకి వచ్చిన కథ బాగా తెలియదు. 1920 అక్టోబర్ 17న తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టుపార్టీ స్థాపన జరిగింది. 1920ల ప్రారంభం నుండి కమ్యూనిస్టు గ్రూపులు దేశంలో వివిధ కేంద్రాలలో తమ కార్యకలాపాలను సాగించాయి. భారత విప్లవకారులకు ప్రణాళిక ఇంగ్లీషు ముద్రణలలోనే లభ్యమయేది. వీటిని విదేశాలనుండి చాటుగా చేరవేసేవారు.

1922లో రావ్‌ఛోడ్దాస్ భువన్ లోటేవాలా లిబర్టీ పబ్లికేషన్స్ పేరిట శాస్త్రీయ సోషలిజం గురించి వరుసగా కొన్ని కరపత్రాలు పుస్తకాలు అచ్చువేశారు. వాటిలో ప్రణాళిక గూడా వుంది. ఈ రచన భారతదేశంలో ప్రచురింపబడడం అదే మొదటిసారి. దాని ధర ఆరు అణాలు. బొంబాయిలో కమ్యూనిస్టుగ్రూపు వ్యవస్థాపకులు డాంగే. ఆయన చెప్పిన ప్రకారం లోట్‌వాలా ఈ వరుసలో ఆరు కరపత్రాలు ప్రచురించారు. ఏంగెల్స్ రచన వేజ్,లేబర్ కాపిటల్, లాఫర్గ్ రాసిన రెలిజియన్ ఆఫ్ కాపిటల్; రజనీ పామీదత్ రాసిన కమ్యూనిజం అనేవి వాటిలో వున్నాయి. డాంగే సంపాదకత్వాన వెలువడే సోషలిస్టు మాసపత్రిక 1923 మార్చి సంచికలో ఈ కరపత్రాల అడ్వర్‌టైజ్‌మెంట్ ప్రకటించారు. (డాక్యుమెంట్స్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ ది కమ్యూనిస్టు పార్టీ – వాల్యూం –2. 1923–25 జి అధికారి సంపాదకులు –న్యూఢిల్లీ 1974 పేజీ 191) ఆనాడు ఇంగ్లీషు చదువుకున్న మేధావులకు శాస్త్రీయ సోషలిజం గురించిన విజ్ఞానం అందించేందుకు గల అతికొద్ది వనరులలో ఈ కరపత్రాలు గూడా వున్నాయి. అని జి అధికారి రాశారు. (అదే పుస్తకం పేజి 193)

1921లో డాంగే "గాంధీ–లెనిన్" అనే పుస్తకం రాశారు. దానితో ప్రణాళిక ప్రచురించిన ఆర్.బి.లోట్‌వాలా డాంగే పట్ల ఆకర్షితులైనారు. ఆయనే సోషలిజం ప్రచారానికి 1922 డిసెంబర్‌లో లోట్‌వాలా ట్రస్ట్‌ను ప్రారంభించారు. (మహాదేవ్ సహా – వివరణ – కమ్యూనిజం ఇన్ ఇండియా – అనే పబ్లిష్డ్ డాక్యుమెంట్స్ ఫ్రం నేషనల్ ఆర్చీవ్స్ ఆఫ్ ఇండియా (1919–1924) సమీకరణ – సంపాదకత్వం సుబోధ్‌రాయ్ – కలకత్తా 1971 పేజీ 373)

ఆయన దేశభక్తుడైన వ్యాపారి. 1923లో లండన్ వెళ్ళారు. అక్కడ లేబర్ పార్టీలోని వామపక్ష నాయకులను కలిశారు. ఆయన తరువాత ప్రకటించిన మార్క్సిస్టు సాహిత్యం వారిద్దగ్గర సేకరించి వుండాలి. హిందూస్థాన్ ప్రెస్‌కు ఆయన యజమాని. ఈ కరపత్రాలు పుస్తకాలు అక్కడ ముద్రింపబడుతూండేవి. (అదే పుస్తకం పేజి 322)

## బెంగాలీ

ప్రణాళిక భారతీయ భాషలలో మొట్టమొదటగా బెంగాలీలో ప్రచురించారు. దానిని సౌమ్యేంద్రనాథ్ ఠాగూర్ అనువదించారు. గణవాణి (ప్రజావాణి)లో ప్రచురించారు. ఆ వారపత్రిక బెంగాల్ వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీది. దాని సంపాదకులు ముజఫర్ అహమ్మద్. బెంగాల్‌లో కమ్యూనిస్టు గ్రూపు వ్యవస్థాపకులు ఆయన. 1926 ఆగస్టు 21నుండి 1927 జులై 21 వరకు గణవాణి. ఆరు సంచికలలో ప్రణాళికను ప్రకటించారు. (గణవాణి ఒకటవ సంపుటి 1వ సంచిక (1926 ఆగస్టు 12), 23 సంచిక (ఆగస్టు 19) 3వ సంచిక (ఆగస్టు 26), 4వ సంచిక (సెప్టెంబర్ 2), 22వ సంచిక (1927 జులై 14) 23వ సంచిక (జులై 21) పత్రికలలో ప్రణాళికను ప్రకటించారు.

సౌమ్యేంద్రనాథ్ 1927 మేలో ఐరోపాకు వెళ్ళారు. జూన్‌లో జర్మనీ చేరుకున్నారు. చివరి రెండు భాగాల అనువాదాన్ని ఆయన జర్మనీనుండి పంపించారు. సౌమ్యేంద్రనాథ్ బెర్లిన్ నుండి ముజఫర్‌కు కలకత్తాకు ఒక జాబు రాశారు. దానిని బ్రిటిష్ సి.ఐ.డి.లు పట్టివేశారు. అదికలకత్తా పురాతన పుస్తకభండాగారంలో వుంది. 1927 జూన్ 14న రాసిన ఈ జాబులో ఇతర సంగతులతోపాటు ప్రణాళిక ప్రచురణ కొనసాగుతున్న విషయం ప్రస్తావనకూడా వుంది. ఆ జాబులో సౌమ్యేంద్రనాథ్ ఇలా రాశారు :

"కమ్యూనిస్టు ప్రణాళిక అనువాదం మిగతాభాగం పంపుతున్నాను. ఇది రెండవ అధ్యాయంతో ప్రారంభమవుతుంది. మొదటి అధ్యయనం అనువాదం గణవాణిలో ప్రచురించారని నేను భావిస్తున్నాను. ఈ మొత్తం రెండుసంచికలలో వచ్చేలాగా చూడండి. తరువాత పుస్తకంగా అచ్చువేయండి. డబ్బు ఏర్పాట్లు నేను చూస్తున్నాను --- గణవాణిలో నా అనువాదం ప్రచురించగానే అది త్వరలో పుస్తకరూపంలో అచ్చువేస్తున్నట్లు పత్రికలో అడ్వర్‌టైజ్‌మెంట్ వేయండి. ఇది గణవాణి వరుస కరపత్రాలలో మొదటిది అవుతుంది."

1930లో సౌమ్యేంద్రనాథ్ అనువాదం పుస్తకరూపంలో వెలువడింది. అయితే దాని కాపీ ఈనాడు లభ్యంకావడంలేదు.

ప్రణాళికను భారతీయ భాషలలో మొదట అనువదించిన సౌమేంద్రనాథ్ జీవనయాత్ర ఆసక్తికరమైనది. ఆయన రవీంద్రనాథ్ ఠాగూర్ మనుమడు. 1921 ప్రెసిడెన్సీ కాలేజీ నుండి అర్థశాస్త్రంలో డిగ్రీ సంపాదించుకున్నారు. తరువాత కాంగ్రెస్ నాయకత్వంలో సాగుతున్న జాతీయోద్యమంతో సంబంధం పెట్టుకున్నారు. ఆ అనుభవంతో భ్రమలు కోల్పోయారు. ఆనాడు తీవ్రవాద స్వరాజిస్టులు లేబర్ స్వరాజ్య పార్టీ పేరుతో బెంగాల్‌లో తమ ప్రత్యేక రాజకీయ

పార్టీని నిర్మించారు. ఈ పార్టీ వ్యవస్థాపకులలో విప్లవకవి నజ్రుల్ ఇస్లాం ఒకరు. 1926 జనవరిలో ముజఫర్ అహమ్మద్ ఆ పార్టీలో చేరారు. ఆయన ప్రభావంతో మరింత తీవ్రమైన కార్యక్రమంతో అదే నెలలో బెంగాల్ పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీగా స్వరాజ్యపార్టీ పునర్నిర్మాణమైంది. 1927 ఫిబ్రవరిలో జరిగిన రెండవ మహాసభలో ఆయన ప్రధాన కార్యదర్శిఅయినారు. ఆ తరువాత ఆయన సి.పి.ఐ. సభ్యులైనారు. 1927 మేలో యూరోప్‌కు వెళ్ళారు. 1928లో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆరవ కాంగ్రెస్‌లో సౌమ్యేంద్రనాథ్ పాల్గొన్నారు. అయితే ఆయన సి.పి.ఐ. అధికార ప్రతినిధికాదు. భారతదేశంతిరిగివచ్చాక 1934లో కమ్యూనిస్టు పార్టీ నుండి వైదొలిగారు ఆయన కమ్యూనిస్టు లీగ్ ఏర్పాటు చేశారు. ఆ పార్టీయే 1937లో రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ అయింది. ఈ ట్రాట్స్కీ అనుచరవర్గం పలుకుబడి చాలాపరిమితం. బెంగాలీలో రెండవదఫా డాక్టర్ చారూ సన్యాల్ అనువదించారు. ఆయన డాక్టర్, జల్పయగిరిలో కాంగ్రెస్ నాయకుడు. ఆ అనువాదం 1933లో ప్రచురించారు. ప్రఖ్యాత మార్క్సిస్టు చరిత్రకారులు శ్రీ సుశోధన్ చక్రవర్తి నేతృత్వంలో కొందరు పండితులు మరొక అనువాదం చేశారు. దీనిని (1944లో) నేషనల్ బుక్ ఏజెన్సీ ప్రకటించింది. ఎన్.బి.ఎ. చేసిన ఈ అనువాదాన్ని మాస్కోలో వుండిన బెంగాలీ రచయితలు అంగీకరించారు. 1968లో మాస్కో ప్రోగ్రెస్ పబ్లిషర్స్ తరఫున ప్రకటించారు.

## ఉర్దూ

ఆ తరువాత ప్రణాళిక ప్రచురింపబడిన భారతీయ భాష ఉర్దూ. గణవాణి ప్రచురించిన వెంటనే, ఉర్దూ ప్రచురణ వెలువడింది. కలకత్తా నుండే ప్రచురించబడే ఆల్ హిలాల్ అనే పత్రిక దీనిని ప్రకటించింది. గణవాణి వామపక్ష పత్రిక అందుకు భిన్నమైంది. అబ్దుల్ కలామ్ అజాద్ దాని వ్యవస్థాపకులు. ఆయన గొప్ప ఇస్లామిక్ పండితులు. కాంగ్రెస్ నాయకత్వాన సాగిన స్వాతంత్ర్యోద్యమ ప్రముఖ నాయకులు.

"అల్ హిలాల్" పత్రిక బూర్జువావర్గం – కార్మికులు. 'కమ్యూనిస్టులు – కార్మికులు' అనే మొదటి రెండు సెక్షన్లను ప్రచురించింది. ఈ రెండు సెక్షన్లలో ప్రణాళిక ప్రధాన విషయం వుంది. మిగతా సెక్షన్లు బూటకపు సోషలిజంలపై విమర్శ. యూరోప్ దేశాలలోకమ్యూనిస్టులు అనుసరించవలసిన ఎత్తుగడలకు సంబంధించినవి. ఉర్దూ పాఠకులకు ఈ చివరి అధ్యాయాలు ఆసక్తికరంగా వుండవనో, వారి అవసరాలకు అనుగుణ్యంకావనో భావించినట్లు వుంది.

అవి 1927 నవంబర్ 4, 11, 18 సంచికలలో వరుసగా ప్రకటించారు. జర్మనీలో ఒక ప్రచురణాలయం వరుసగా ప్రచురణలు ప్రారంభించిందని, రెండు సంపుటాలు ప్రచురించారని సంపాదకుల ముందుమాటలో రాశారు. మొదటిసంపుటంలో మార్క్స్ జీవిత చిత్రణ వివరంగా యిస్తూ ఆయన రచనలు కొన్ని ప్రచురించారని తెలియజేశారు. రష్యన్ విప్లవానంతరం కమ్యూనిజం ఒకవాస్తవంగా రూపొందిందని, ప్రతిదేశం రాజకీయంగానేగాక, మేధో అవసరాల దృష్ట్యా కూడా దానికి అధ్యయనం చేయడం, తద్వారా సరైనా, వివేకవంతమైన

అభిప్రాయాలు ఏర్పర్చుకోవడం అవసరమనీ ఆ ముందుమాటలో చెప్పారు. ఈ విప్లవం, రాజకీయ సమిష్టి విశ్వాసం గురించిన ఒక సరైన వివరణ యిచ్చే పుస్తకం ఉర్దూలోలేదుగనుక, మార్క్స్ రచించిన ఒక సంక్షిప్త రచన యిందుకు అనువైనదిగా భావించినట్లు సంపాదకులు పేర్కొన్నారు. అందుకోసం ఆల్ హిలాల్‌లో ప్రచురణకు మార్క్స్ రచనను ఒకదానిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అయితే సంపాదకులు రాసిన ముందుమాటగాని, వ్యాసం శీర్షికగానీ, ఈ రచన కమ్యూనిస్టు ప్రణాళికగా పేర్కొనలేదు. కమ్యూనిజం- దాని లక్ష్యాలు (కమ్యూనిజం జార్ ఉస్కే మాకాసిద్) అనే శీర్షికతో ఆ వ్యాసం ప్రచురించారు.

సంపాదకులు చాలా జాగ్రత్త ప్రదర్శించారు. ఉర్దూ పాఠకులకు అవసరమైన విషయం అందించేందుకు ఆ విషయం ప్రకటిస్తున్నామని, దాని అర్థం సంపాదకుడు లేదా పత్రిక ఆ సిద్ధాంతాన్ని ఆమోదించినట్లు అర్థం చేసుకోరాదని కోరారు.

'ఆధునిక పెట్టుబడిదారీ విధానపు అసమానతలకు కమ్యూనిస్టు స్వతసిద్ధ ప్రతిస్పందనగా మేము భావిస్తున్నాము. పెట్టుబడిదారీ విధానపు ఆధునిక నాగరికత ఒక అతి తీవ్ర రూపమైనట్లే, దానికి ప్రతిగా కమ్యూనిజం మరొక అతి తీవ్రరూపం, విశిష్టత, సత్యము, ఈ రెండూ అతి తీవ్ర సిద్ధాంతాల ద్వారా సాధించలేము. మధ్యే మార్గమే అందుకు సరియైనది'

ఈ అనువాద కర్త అబ్దుల్ రజాక్ మలిహాబాదిలాగ అనిపిస్తోంది. అయితే ఆ పత్రిక స్పష్టంగా పేర్కొనలేదు. మలిహాబాది కలకత్తాలో వుండేవారు. ఆయన ఆజాద్ అనుచరులు ప్రముఖ కాంగ్రెస్ వాది.

ఉర్దూలోనే మరొక అనువాదం అబ్దుల్ బారీ అనే వారు చేశారు. ఆయన 'ఇష్రాన్ అడీబ్' ('కమ్యూనిస్టు రైటర్') అనే పేరుతో అనువాదం చేశారు. 1930ల ప్రారంభంలో ఈ అనువాదం లాహోర్‌నుండి ప్రచురించారు.

అయితే అలీ అష్రాఫ్ అనేవారు ఒక ఖచ్చితమైన అనువాదం చేశారు. ఆయన బీహార్ నుండి వచ్చిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు. ఆనాటి పార్టీ ప్రధాన కార్యదర్శి పి.సి. జోషి అనువాదానికి ప్రోత్సహించారు. దానిని 1946లో లాహోర్‌నుండి క్వామీ దారుల్ ఇష్‌హాట్ (పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ శాఖ) ప్రచురించింది.

## మరాఠీ

ప్రణాళిక అనువాద ప్రచురణ వరుసలో తరువాతది మరాఠీ అనువాదం. గంగాధర్ మోరేశ్వర్ అధికారి 1928 డిసెంబర్‌లో జర్మనీ నుండి తిరిగివచ్చారు. ఆయన తరువాత సి.పి.ఐ.లో ప్రముఖ నాయకులైనారు. 1929 మార్చిలో ఆయనను మీరట్ కమ్యూనిస్టు కుట్ర కేసులో ఇరికించారు. 1930-31 మధ్య మీరట్ జైలులో ఆయన ప్రణాళికను అనువదించారు. ఆ తరువాత దానిని జగన్నాథ్ అధికారి, ఆర్.ఎం. జంభేకర్‌లు ఎడిట్ చేశారు. దానిని పరేల్ (ముంబై)లో వుండిన కామ్‌గార్ వాఙ్మయ ప్రసారక్ మండల్ 1931 అక్టోబర్‌లో ప్రచురించింది. మొదటి ముద్రణ 160 పేజీలు వుంది. ఎనిమిది అణాల ఖరీదు. కార్మికవర్గం కోసం మండల్ ప్రచురించిన పుస్తకాలలో ఇది మొదటిది. మండల్‌ను కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసింది.

ప్రణాళిక రెండవ మరాఠీ అనువాదాన్ని 1948లో కమ్యూనిస్టు పార్టీకి చెందిన పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ ప్రకటించింది.

**తమిళం**

మరాఠీలో ప్రణాళిక ప్రచురించిన నెలలోనే దాని తమిళ అనువాదం సీరియల్ రూపంలో వెలువడసాగింది. ఈ అనువాదం, ప్రచురణ గూడా అసంపూర్తిగా ముగిసినట్లు కనిపిస్తోంది. అయినా దీనివెనుక ఆసక్తికరమైన చరిత్ర వుంది. ఇ.వి. రామస్వామి (ఇ.వి.ఆర్.) గొప్ప ' సమాజ సంస్కర్త' బ్రాహ్మణేతర వుద్యమ నాయకుడు. పాత మద్రాసు. రాష్ట్రంలో తమిళం మాట్లాడే ప్రాంతాలలో ఆత్మగౌరవ ఉద్యమ నాయకుడు. ఆ ఉద్యమం కుడి అరుసు (రిపబ్లిక్) అనేవార పత్రికను ప్రచురించేది. ఈ అనువాదం ఆ పత్రికలో సీరియల్‌గా ప్రకటించారు. ఆ సీరియల్‌కు సమధర్మ అరిస్కై ('కమ్యూనిస్టు మేనిఫెస్టో') అనే శీర్షిక పెట్టారు. ఇ.వి.ఆర్. స్వంత పట్టణం ఈ రోడ్. ఆ వారపత్రిక అక్కడనుండే వెలువడేది. అందులో ('బూర్జువా వర్గమూ- కార్మికవర్గమూ') అనే మొదటి అధ్యాయాన్ని 1931 అక్టోబర్ 4వ తేదీ సంచికనుండి ఐదు సంచికలలో వరుసగా ఆ అనువాదాన్ని ప్రకటించారు. అనువాదకుని, లేదా అనువాదకుల పేర్లు ప్రచురించలేదు. అయితే సీరియల్ మొదటి భాగంలో ఇ.వి.ఆర్. రాసిన పరిచయ వాక్యాలు వున్నాయి.

ఈ పరిచయంలో ఇ.వి.ఆర్. ప్రణాళిక చరిత్ర గురించి క్లుప్తంగా పేర్కొన్నారు. అయితే కమ్యూనిస్టు భావాలను రష్యా (సోవియట్ యూనియన్) దేశం మొదట ఎందుకు ఆచరణలో పెట్టింది. అనే విషయం ఆయన వివరించారు. అయితే ఆయన ఇలా అన్నారు :

"రష్యా కన్నా ముందు భారతదేశంలో అలాంటి కమ్యూనిస్టు చైతన్యం రూపుదిద్దుకొని వుండవలసింది. ఇక్కడ జరిగిన అనేక కుట్రల మూలంగానే అలా జరగలేదు. భారత ప్రజలకు విజ్ఞానం కలగకుండా కుట్రదారులు చాలా జాగ్రత్త పడ్డారు. విద్యా విహీనులుగా, ప్రపంచాన్ని గురించి తెలియనీయకుండా, ఆత్మ గౌరవభావం లేకుండా జాగ్రత్తపడ్డారు. వారిని మృగప్రాయులుగా వుంచారు. అంతేగాక దేముడు, మతం పేరిట, బానిసత్వంలో మగ్గడం దైవ ఆజ్ఞ అని, అలా మగ్గడం ముక్తిమార్గమనే చైతన్యాన్ని వారికి రంగరించి పోశారు."

అయితే ఇ.వి.ఆర్. కేవలం కుట్ర సిద్ధాంతానికి మాత్రమే తన అభిప్రాయాలను పరిమితం చేసుకోలేదు. కమ్యూనిస్టు చైతన్యం పెరగకపోవడానికి వెనుకగల విస్తృత కారణాలను ఆయన పరిశీంచారు.

"ఇతర దేశాలలో పెట్టుబడిదారుడు-కార్మికుడు (సంపన్నులు-పేదలు) అనే ముఖ్యమైన అంశాన్ని పరిశీలిస్తున్నారు. భారత దేశంలో ఉన్నత-నిమ్నకులాల విభజన అనేది చాలా వికృతంగా వ్యాపించి, ప్రధాన అంశంగా వుంది. సంపన్నులు-పేదలు (పెట్టుబడిదారు) సిద్ధాంతానికి ఇది పెట్టని కోటగా వుంది. కమ్యూనిజానికి ఇక్కడ రెండు విధాల వ్యతిరేకతలు వున్నాయి. అందువల్లనే కమ్యూనిస్టు చైతన్యం పెరగలేదు."

ప్రణాళిక మొదటి అధ్యాయం అనువాదం ఐదు దఫాలుగా ప్రకటించారు. కుడి అరసు 1931 నవంబర్ 1ది సంచికలో చివరి భాగం ప్రకటించారు. అందులో మొదటి అధ్యాయం పూర్తి అయింది. తదుపరి అధ్యాయం ప్రచురింపబడుతుందని ప్రకటన వుంది. కాని వారపత్రిక ఆ తరువాత సంచికలలో ప్రణాళిక తదుపరి అధ్యాయాల అనువాదం ప్రకటించలేదు. అనువాదం పూర్తి అయినట్లు లేదు. నిజానికి మొదటి అధ్యాయం చివరి భాగం క్రటించిన ఒక నెల తరువాత (1931 డిసెంబర్ 13 సంచిక) కుడి అరసు పత్రికలో ఆరోజే ఇ.వి.ఆర్ యూరోప్ యాత్రకు బయలుదేరుతున్నట్లు ఒక సంపాదకీయం తెలియజేసింది. ఆయన సందర్శించిన దేశాలలో సోవియట్ యూనియన్ గూడా వుంది. ఆయన ఆ దేశంలో 1932 ఫిబ్రవరి 12 నుండి 17 మార్చి వరకు ఆరు వారాలు వున్నారు. సోవియట్ యూనియన్ సందర్శించనున్న సందర్భంలో ఈ మహత్తర సాంఘిక సంస్కర్త ప్రణాళిక తమిళ అనువాదం ప్రకటించడం, దానిని భారతదేశ పరిస్థితులకు అన్వయించే ఆలోచన చేయడం ప్రత్యేకంగా గమనించదగిన అంశం.

ప్రణాళిక పూర్తి తమిళ అనువాదం చాలాకాలం తరువాత 1948 ఏప్రిల్‌లో ప్రచురించారు. ఈ ప్రచురణ చెన్నైలోని సి.పి.ఐ. ప్రచురణాలయం జనశక్తి ప్రచురణాలయం ప్రకటించింది. ఎం ఇస్మత్‌బాషా దీనిని అనువదించారు. కమ్యూనిస్టు కచ్చియన్ అరిక్కై ('కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' అని దాని అర్థం) పేరిటగల ఈ 91 పేజీల పుస్తకానికి అనువాదకులు 16 పేజీల ఉపోద్ఘాతం రాశారు. దాని ధర 12 అణాలు (75 పైసలు).

ప్రణాళిక బెంగాలీ, ఉర్దూ, మరాఠీ, తమిళాలలో మొదట ప్రచురించబడడం ఎంతో అనువైన విషయం. ఈ భాషలు ప్రధానంగా వున్న ప్రాంతాలలోనే కమ్యూనిస్టు ఉద్యమం మొదట వెల్లూనుకున్నది ప్రధాన కమ్యూనిస్టు గ్రూపులు కలకత్తా, బొంబాయి, లాహోర్, మద్రాస్‌లలోనే ఏర్పడ్డాయి.

## మలయాళం

తమిళ అనువాదంతో దాదాపు సమానకాలంలో మలయాళ అనువాదం వెలువడింది. ఇడపల్లి కరుణాకర మీనన్ 1932 అనువాదం చేసి ప్రచురించారు. ఆయన వార్ అండ్ పీస్, క్రైం ఎండ్ పనిష్మెంట్ వంటి గొప్ప రచనలను గూడా అనువదించారు. సమిష్టివాద విజ్ఞాపనం' అనే శీర్షికతో దీనిని ప్రచురించారు. కేరళలో కమ్యూనిస్టుపార్టీ ఏర్పడడానికి నాలుగు సంవత్సరాల ముందుగా మలయాళ అనువాదం ప్రకటించారు.

1940 ప్రారంభంలో ఈ ఎం.ఎస్. నంబూద్రిపాద్, ఉన్ని రాజా, ఎం.ఎస్. దేవదాసులు కొన్ని మార్క్సిస్టు గ్రంథాలను అనువదించారు. అందులో ప్రణాళిక ఒకటి. 1948లో సవరించిన అనువాదం ప్రకటించారు. డి.ఎం. పొట్టేక్కాల్ అనువాదకుడుగా అందులో పేర్కొన్నారు. ఆ తరువాత కాలంలో ప్రభాత్ బుక్స్, ఇతర ప్రచురణలు అనేక దఫాలుగా దీనిని ముద్రించారు.

### తెలుగు

ఆంధ్రప్రదేశ్ లోనూ, దక్షిణ భారతదేశంలోనూ కమ్యూనిస్టు వ్యవస్థాపకులలో ఒకరైన పి. సుందరయ్య 1933లో ప్రణాళికను అనువదించారు. అయితే దీనిని అచ్చు తీయలేదు. సైక్లోస్టయిల్ చేసి పంచిపెట్టారు. మద్రాసు రాష్ట్ర కార్యదర్శి కేంద్ర కమిటీకి పంపిన లేఖలో ఆ సైక్లోస్టయిల్ ప్రతిని క్యాడర్ కంతా పంచిపెడుతున్నట్లు రాశారు. ప్రణాళికతోపాటు ఎంగెల్స్ రచన 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ కమ్యూనిజం' సహితం అనువదించడం అత్యంత ఆసక్తికరమైన విషయం. ఆ తరువాత ఆంధ్రలో సీనియర్ కమ్యూనిస్టులలో ఒకరైన కంభంపాటి సత్యనారాయణ ప్రణాళికను అనువదించారు. దానిని కమ్యూనిస్టుపార్టీ ప్రకటించింది. ప్రఖ్యాత విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి ప్రణాళికను అనువదించి ప్రకటించారు. మాస్కోలోని ప్రోగ్రెస్ పబ్లిషర్స్ దానిని పునర్ముద్రించడం కొనసాగించింది.

### హిందీ

హిందీలో ప్రణాళికను మొదటిసారిగా అనువదించి, ప్రచురించిన ఘనత అయోధ్య ప్రసాద్ గారిది. ఒక కమ్యూనిస్టుగా ఆయనను మీరట్ కుట్ర కేసుల్లో ఇరికించారు జైలులో ప్రణాళికను అనువదించారు. ఆయన 1933లో విడుదల అయిన తరువాత 1934 పుస్తకం ప్రచురించారు. దానిని మాతృభూమి ప్రింటింగ్ వర్క్స్ అనే ప్రచురణాలయం పేర ప్రకటించారు. అది ఝాన్సీలో వుండేది. బ్రిటీష్ ప్రభుత్వం దానిని నిషేధించింది.

### ఒరియా!

భగవతి పాణిగ్రాహి. ఒరియాలో ప్రణాళికను అనువదించి ప్రకటించారు. 'వైజ్ఞానిక్ సామ్యవాదే' ('సైంటిఫిక్ కమ్యూనిజం') అనే శీర్షికలో 1936లో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ ప్రకటించింది. ఒరిస్సాలో కమ్యూనిస్టుపార్టీ వ్యవస్థాపకులలో పాణిగ్రాహి ఒకరు. ఆయన ఒరిస్సాపార్టీ యూనిట్‌కు ప్రథమ కార్యదర్శి. అంతకుముందు ఒరిస్సాలో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీకి ఆయన కార్యదర్శి ఆయన అనేక కార్మిక-కర్షక ఉద్యమాలకు నాయకుడు. భగవతి సృజనాత్మక రచయిత. ఒరియాలో ప్రగతిశీల సాహిత్యోద్యమానికి ప్రారంభం చేశారు. ఆయన 1943లో కరువుకు సంబంధించిన సహాయ చర్యలలో పాల్గొంటూ 34 సంవత్సరాల పిన్న వయస్సులో డిసెంట్రీతో మరణించారు.

### పంజాబీ!

లాహోర్‌లోని ప్రోగ్రెసివ్ పబ్లిషర్స్ ప్రణాళిక పంజాబీ అనువాదాన్ని 1944లో మొదటిసారి ప్రచురించారు. 1950లో జలంధర్‌లోని సాదా యుగ్ పబ్లిషర్స్ రెండవముద్రణ ప్రచురించారు. 1959లో జలంధర్‌కు చెందిన పంజాబీ బుక్‌సెంటర్ వారు దానిని మెరుగుపర్చి మూడవ ప్రచురించారు. ప్రొఫెసర్ రణదీర్‌సింగ్ అనువాదకులు ఆయన మార్క్సిస్టు ప్రఖ్యాత రాజకీయ శాస్త్రజ్ఞుడు.

స్వాతంత్ర్యం సిద్ధివరకు భారతీయభాషలలో ప్రణాళిక ప్రచురణను రేఖామాత్రంగా చూపాము. ఏభైల తరువాత మాస్కోలోని ప్రోగ్రెస్ పబ్లిషర్స్ క్రమంగా వివిధ భారతీయ భాషలలో ప్రణాళికను ప్రచురించారు.



సుందరయ్య గ్రంథాలయం
A C No. 83332
హైద ... 044.

"మహా మేధావులకు ఉండే సహజమైన స్పష్టతతోనూ, ప్రజ్ఞతోనూ యీ గ్రంథం నూతన ప్రపంచ దృక్పథాన్ని స్థూల రేఖల్లో చిత్రిస్తుంది. ఈ నూతన ప్రపంచ దృక్పథంలో యే మినహాయింపులూ లేని భౌతికవాదం, సాంఘిక జీవితానికి కూడా వర్తించేది వుంది. గతి తర్కం అనే అత్యంత సమగ్రమైన, అత్యంత గంభీరమైన అభివృద్ధి సిద్ధాంతం వుంది. వర్గ పోరాటాన్ని, నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టి కర్త ఐన కార్మికవర్గం యొక్క ప్రపంచ చరిత్రాత్మక విప్లవ పాత్రనూ ప్రకటించే సిద్ధాంతం వుంది.

-లెనిన్.

ప్రజాశక్తి
బుక్ హౌస్